

ఈనాడు

విజయవాడ 7-8-2017 సోమవారం సిటీ సంపుటి 43 . సంచిక 359

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 14+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



చిరుత చివరి మజిలీ

మానవ చిరుత ఉసేన్ బోల్ట్ 100 మీ. పరుగు ఆఖరి రేసులో కాంస్యంతో నిష్క్రమించాడు..! ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పసిడితో ఘనంగా వీడ్కోలు పలుకుతాడని ఆశించిన అభిమానులకు కాస్త నిరాశ కలిగిస్తూ.. వంద మీటర్ల పరుగు నుంచి సెలవు తీసుకున్నాడు. కానీ క్రీడా లోకానికి జమైకా వీరుడి లేని పరుగును ఊహించడం కష్టంగానే ఉంది. బోల్ట్ లేకుండా అథ్లెటిక్సా? ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ?

అతను లేకపోతే అథ్లెటిక్స్‌కి వచ్చిన ఇబ్బందేంటి? ప్రపంచం ఆగిపోతుందా? ఒలింపిక్స్‌లు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు జరగకుండా పోతాయా? అన్నీ ఉంటాయి.. కొత్త అథ్లెట్లు వస్తూనే ఉంటారు.. పోటీలూ జరుగుతాయి! రికార్డులూ బద్దలవుతాయ్! కానీ ఆ ఉత్తేజం, ఆ ఉద్వేగం ఉంటాయా అన్నదే ప్రశ్న. నిన్నా మొన్నటి వరకు పరుగుతోనూ, తన హావభావాలతోనూ అభిమానులను ఉర్రూతలూగించిన దిగ్గజ ఆటగాడు.. తన ఆటతో అథ్లెటిక్స్‌కే వన్నె తెచ్చిన మొనగాడు నిష్క్రమించడం అభిమానులకు పెద్ద లోటే. అథ్లెటిక్స్‌కే ఆకర్షణ తెచ్చిన బోల్ట్.. స్ప్రింట్‌లో సాధించిన ఘనతలు ఎన్నో ఎన్నెన్నో. ఏ ఆటలో అయినా ఎందరో క్రీడాకారులు వస్తారు.. వెళతారు. కానీ కొంతమంది మాత్రమే గుర్తుండిపోతారు.. కానీ అతి కొద్ది మంది మాత్రమే అభిమానుల మనసుల్లో తిష్ట వేసుకుంటారు. అలాంటి వాళ్ల జాబితాలో బోల్ట్‌ది అగ్రస్థానం! సెకన్ల వ్యవధిలో ముగిసే పోటీలో ఇంత ఏకఛత్రాధిపత్యం చరిత్రలో లేదు.. ఇంతటి ఆధిపత్యం ఎవరూ చూపించలేదు.. అందుకే అతడు ఎప్పటికీ అభిమానుల హృదయ విజేత.

- ప్రత్యేక కథనం ఛాంపియన్‌లో

ఆఖరికి కాంస్యంతో..

100 మీ పరుగులో దశాబ్దానికి పైగా తిరుగులేని అథ్లెట్‌గా వెలిగిన జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ (9.95 సెకన్లు) కెరీర్‌లో ఆఖరి 100మీ పరుగులో తడబడ్డాడు. లండన్ ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. అమెరికా అథ్లెట్లు జస్టిన్ గాట్లిన్ (9.92 సె), క్రిస్టియన్ కోల్‌మన్ (9.94 సె) స్వర్ణ, రజత పతకాలు గెలిచి సంచలనమే రేపారు. కెరీర్‌లో బోల్ట్ కాంస్యంతో సరిపెట్టుకోవడం ఇదే తొలిసారి.



సరికొత్త పరుగు వీరుడు జస్టిన్ గాట్లిన్ (9.92 సె)

వీడ్కోలు సందర్భంగా ట్రాక్‌ను ముద్దాడుతున్న బోల్ట్

బోల్ట్ రికార్డులివీ...

ఒలింపిక్స్: 8 స్వర్ణాలు

ప్రపంచ ఛాంపియన్‌షిప్: 11 స్వర్ణాలు, 2 రజతాలు, 1 కాంస్యం

జూనియర్ ఛాంపియన్‌షిప్: 1 స్వర్ణం, 2 రజతాలు

యూత్ ఛాంపియన్‌షిప్: 1 స్వర్ణం

కామన్వెల్త్ క్రీడలు: 1 స్వర్ణం



తల్లిదండ్రులతో నిర్భయ్ ఠక్కర్

ఏడాదిలోనే ఇంజినీరింగ్ పట్టా

- 15 ఏళ్ల గుజరాత్ బాలుడి రికార్డు
- మూడేళ్లలో పది డిగ్రీలు తెచ్చుకుంటానని వెల్లడి

2లో

ఈ కొనుగోల ఎల?

- హేతుబద్ధీకరణలో భాగంగా విద్యుత్ ఒప్పందాలపై సమీక్ష
- ప్రాజెక్టులు పెంచుకున్నా... వదులుకోకపోయినా భారమే
- 8న సీఎం ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం

ఈనాడు - అమరావతి

విద్యుత్ మిగులులోకి చేరిన ఆంధ్రప్రదేశ్ దాని హేతుబద్ధీకరణపై దృష్టి పెట్టింది. వ్యయ తగ్గింపు అవకాశాలను అన్వేషిస్తోంది. మిగులును అమ్ముకోలేని కారణంగా పడబోయే భారాన్ని తగ్గించుకోవడానికి ఈ చర్యలు కొంత వరకు దోహదం చేయనుంది. అదే సమయంలో అదనపు విద్యుత్ కోసం ఇష్టానుసారంగా ఒప్పందాలు చేసుకుంటూ వెళితే అవి భవితలో గుదిబండలుగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. భారాన్ని తగ్గించుకునేందుకు కొన్ని ప్రాజెక్టులను వదులుకున్నా మరో అయిదేళ్ల వరకూ రాష్ట్రంలో విద్యుత్‌కు ఏ ఇబ్బంది ఉండబోదని అధికారుల విశ్లేషణలో వెల్లడైంది. దాంతో గతంలో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) పరిశీలననూ చేపట్టింది. పునరుత్పాదక ఇంధన వనరులు ముఖ్యంగా సౌర, పవన రంగంలోని కొన్ని ప్రాజెక్టులతో పాటు పీపీఏల కాలపరిమితి ముగిసిన కొన్ని ప్రాజెక్టులనూ వదులుకోవడానికి సిద్ధపడుతూ ఒక ప్రణాళిక తయారైంది. ఖర్చు తగ్గింపే ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఈనెల 8వ తేదీన ఉన్నతస్థాయి సమావేశం జరగబోతోంది. రాష్ట్ర అవసరాలను తీర్చే విద్యుత్ ప్రాజెక్టులు ఏవీ? చౌక విద్యుత్ వేటి నుంచి అందుతుంది? మిగులు నుంచి బయటపడడానికి తోడు అధిక ధర కలిగిన ప్రాజెక్టుల్లో వదులుకోవడానికి అవకాశం ఉన్నవి ఏవీ అనే విశ్లేషణ చేస్తున్న సమయంలో జరగనున్న ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యంగా హిందుజా నేషనల్ పవర్ ప్రాజెక్టు, దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం, ఏపీజెన్‌కో కొత్తగా చేపట్టిన యూనిట్లు, లాంకో కొండపల్లి, స్పెక్ట్రం ప్రాజెక్టులపై చర్చ జరుగుతోంది. సౌర విద్యుత్‌లో వేగం తగ్గింపు ఇందులో ఒక అంశం. పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో వదులుకునే వాటిపై కూడా దృష్టి పెట్టారు. సింహపురి ఎనర్జీ నుంచి కొనుగోలు (మిగతా 2లో)

రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ రంగ పరిస్థితి ఇదీ

వివరం	అందే విద్యుత్ (మెగావాట్లు)	యూనిట్ ధర (రూ.పై)
ఆమోదిత పీపీఏలతో కొనుగోలు చేస్తున్న విద్యుత్ ఏపీజెన్‌కో థర్మల్ స్టేషన్లు	2,810	3.50
జల విద్యుత్	1,798	రూపాయిపైన (స్థిర ఛార్జీ మాత్రమే)
★ పింఛను భారంతో కలిపి ఏపీజెన్‌కో రేటు		3.90 - 4.10
కేంద్ర విద్యుత్ కేంద్రాలు (గని-శకునాల సౌర పార్కు దృష్ట్యా కేంద్రం నుంచి కొత్తగా వచ్చే 500 మెగావాట్లు ఇందులో ఉంది)	2,100	3.20 - 3.40
ఆంధ్రప్రదేశ్ గ్యాస్ పవర్ కార్పొరేషన్	34	3.00 పైన
థర్మల్ పవర్‌టెక్	230	3.80
కెఎస్‌కె మహానది	400	3.90
బయోమాస్	400	4.16 - 6.00 పైన



చిన్నా (పాతచిత్రం)

పిడిగుద్దులకు విద్యార్థి మృతి

నిందితులు మైనర్లే

ఈనాడు, విశాఖపట్నం - గురుద్వారా, న్యూస్‌టుడే: విశాఖపట్నం నగరం మధురానగర్ ప్రాంతంలో ఉన్న జీవీఎంసీ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన స్వల్ప వివాదం ఓ విద్యార్థి మృతికి దారి తీసింది. ఈ ఘటనలో నిందితులు మైనర్లు కావడం గమనార్హం. శాంతిపురం ప్రాంతానికి చెందిన చిన్నా జీవీఎంసీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇతను 8వ తరగతి గదికి వచ్చి కొంతమంది విద్యార్థినులతో మాట్లాడుతుండేవాడు. ఇది ఆ తరగతి గదిలోని ఓ విద్యార్థికి నచ్చలేదు. ఈ విషయమై ఘర్షణ పడ్డాడు. ఇది ఉపాధ్యాయులకు (మిగతా 2లో)



కృష్ణంరాజు తోకచిచు

దుబాయ్‌లో తెలుగువ్యక్తికి భారీ లాటరీ!

- బహుమతి మొత్తం రూ.8 కోట్ల పైచిలుకే

2లో

ఉపశమనం ఎప్పుడు?



- మూడోవిడత సొమ్ముకోసం రైతుల ఎదురు చూపులు
- ఖరీఫ్ ఆరంభంలోనే ఇస్తామన్న ప్రభుత్వం
- ఆలస్యం అయ్యే కొద్దీ వడ్డీలు పెరుగుతాయనే ఆందోళన

ఈనాడు - అమరావతి

రుణ ఉపశమన పథకం మూడో విడత నిధుల కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఖరీఫ్‌లో పెట్టుబడులకు ఉపయోగపడే విధంగా ఆరంభంలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలో చెప్పింది. పంటకాలం మొదలై రెండు నెలలు గడచినా సొమ్ము ఇప్పటిదాకా బ్యాంకులకు అందలేదు. ఇవి అందుతాయనే ఆశతో రైతులు బ్యాంకు రుణాల చెల్లింపు వాయిదా వేస్తున్నారు. రెన్యువల్ చేసుకోమంటున్నా మూడో విడత సొమ్ము వచ్చాక మొత్తం చెల్లిస్తామని బ్యాంకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నిధుల విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో వడ్డీలు మరింత పెరుగుతాయనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

పదిశాతం వడ్డీతో..

రాష్ట్రంలో 57.57లక్షల ఖాతాలకు రుణమాఫీ వర్తించింది. ఇందులో ఏకమొత్త పరిష్కారం కింద రూ.50వేల లోపు ఉన్న రుణాలున్న 23.76లక్షల ఖాతాలకు 4,493కోట్లు (మిగతా 2లో)

సర్కారు డిజిటల్ సైన్యం

- పౌర సేవల్లో సర్కారు కొత్త ఒరవడి
- 'ఈ-ప్రగతి' వేదికగా కార్యక్రమాలు
- అధికారులకు ఐఎస్‌బీ నిపుణులతో శిక్షణ
- నయా నైపుణ్యాలకు సాన



ఈ-ప్రగతి శిక్షణ తరగతి

ప్రభుత్వ సేవలన్నీ ఇంట్లో కూర్చొనే ప్రజలు అందుకోగలగాలి...

సర్కారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనే ఉండకూడదు..

రకరకాల ధ్రువపత్రాలు, సేవలు అన్ని వేళల్లో ఆన్‌లైన్‌లో పొందగలగాలి...

అంతిమంగా సేవలలో ప్రజల సంతృప్తి సూచికలు మెరుగుపరచాలి...

ఇదీ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. ఇందుకు 'ఈ-ప్రగతి'ని ఒక విప్లవాత్మక వేదికగా చేసుకుంది. మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలను డిజిటలైజ్ చేసి, అన్ని శాఖలను ఈ-ప్రగతి వేదికపై సమీకృతం చేసి... వేగవంతమైన, పారదర్శకమైన ప్రజా సేవకు అంకురార్పణ చేసింది. సేవల రంగాన్ని ఆధునికీకరించి ప్రజలకు చేరువయ్యేందుకు రూపొందించిన 'ఈ-ప్రగతి' కార్యక్రమం అమలుకు ముందు ప్రభుత్వోద్యోగులను సన్నద్ధం చేస్తోంది. ఉద్యోగులను డిజిటల్ సైన్యంలా తయారు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం వారికి ప్రతిష్ఠాత్మక 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) నిపుణులతో శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ ప్రారంభానికి ముందు 'మాకు చెప్పేది ఏముంటుందిలే' అన్న అనుమానాలతో ఉన్న ఉన్నతోద్యోగులు... శిక్షణ మొదలయ్యాక 'అద్భుతం' అంటున్నారు. ఈ తర్ఫీదుతో 'ఈ-ప్రగతి' కార్యక్రమాలు అమలు చేస్తే ప్రజలకు ఎంతో సులభంగా, సక్రమంగా సేవలు అందించగలుగుతామని అంటున్నారు. దేశ, విదేశాలకు చెందిన ఐఎస్‌బీ నిపుణుల బృందం ఇస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంపై...

ప్రత్యేక కథనం 5 లో



పదవీ విరమణ రోజునే పింఛన్ పత్రం

- ఉద్యోగులు బ్యాంకుకు వెళ్లాల్సిన పనిలేదు
- అన్ని విభాగాలకు కేంద్రం ఆదేశాలు

2లో

యువతరానికి హెల్‌ఫోన్



యవ్వనం.. వేడి రక్తం ఉరకలు వేసే వయసు. కళ్లేలు లేని మనసు! గుండెల నిండా ఆవేశం.. సమాజంలో మార్పుకు బాటలు పరిచేది.. బీజాలు వేసేది యువతరమే! యుక్త వయసు.. మనిషి జీవితంలో కీలకమైన దశ. ఆ వయసుకుండే ప్రత్యేకతే వేరు. అప్పుడప్పుడే ప్రపంచాన్ని విప్పారిన నేత్రాలతో చూడటం మొదలవుతుంది. ఎగిసిపడే జలపాతం మాదిరిగా మనసు ఉవ్విళ్లూరుతూ ఉంటుంది. చుట్టుపక్కల పరిస్థితులకు, కలిసే మనుషులకు స్పందిస్తూ ఉంటుంది. స్పష్టమైన భావాలు ఏర్పడుతూ ఉంటాయి. సహాధ్యాయులు, స్నేహితులు, సన్నిహితులను కలవటం, పరస్పరం అభిప్రాయాలు పంచుకోవటం, షికార్లకు వెళ్లటం, ప్రపంచాన్ని తెలుసుకోవటం సర్వసాధారణం. సమాజంలోని అవలక్షణాలపై పోరాడేది.. మార్పు తెచ్చేది యువతరమే.

అలాంటి యువతరం ఇప్పుడు నిర్వీర్యంగా.. నిస్తేజంగా మారిపోతోందా?

ప్రస్తుత తరానికి ఇటువంటి భావావేశం లేకుండాపోతోందని నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం సెల్‌ఫోన్. మితిమీరిన సెల్‌ఫోన్ వినియోగం యువతరాన్ని సర్వనాశనం (మిగతా 2లో)

ఎప్పుడూ ఆన్‌లైన్లోనే...

- పీఈడబ్ల్యూ రీసెర్చ్ సెంటర్ విశ్లేషణ ప్రకారం యువతీ యువకుల్లో దాదాపు 24 శాతం మంది ఎప్పుడూ ఏదో ఒకటి వెతుకుతూ, చూస్తూ ఆన్‌లైన్లో ఉంటున్నారు.
- స్మార్ట్‌ఫోన్ల లభ్యత గణనీయంగా పెరిగిపోవటం, ఇంటర్‌నెట్ సదుపాయం, సోషల్ మీడియా సైట్లు ఇందుకు కారణం.
- దీనివల్ల యుక్తవయస్సులో స్వతహాగా కలిగే నైపుణ్యాలకు వారు దూరం అవుతున్నారు. చక్కగా మాట్లాడటం, ఎదుటివారిని కలవటం, తమనుతాము పరిచయం చేసుకోవటం, భావాలు పంచుకోవటం అనేది తగ్గిపోతోంది.
- మున్ముందు తమకు కలిగిన భావావేశాన్ని ముఖంలో కనబరిచే బదులు స్మార్ట్‌ఫోన్ నుంచి ఎదుటివారికి ఒక 'ఇమోజీ' పంపేవిధంగా యువత తయారవుతోంది.

ఈ కొనుగోల ఏల?

(మొదటి పేజీ తరువాయి)

అవసరమా అన్న అంశంతో పాటు ఇంకా టెండరు ఖరారుకాని పోలవరం జల విద్యుత్ కేంద్రం విషయంలో ఏమి చేయాలన్నది ప్రస్తుతం అధికారుల ముందు ఉన్న ప్రశ్న.

మిగులు పెరుగుదల

రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 12 వేల మిలియన్ యూనిట్ల మేర మిగులు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) మార్చిలోనే అంచనా వేసింది. ఇపుడు మిగులు ఇంకా పెరుగుతోంది. తెలంగాణరాష్ట్రానికి ఇచ్చే సరఫరా ఆగిపోయింది. దీని వల్ల అందుబాటులో ఉండే విద్యుత్ గతం కంటే 528 మెగావాట్లు పెరిగింది. కర్నూలు జిల్లాలోని గని-శకునాల సౌరపార్కు సాకారంతో ఎన్టీపీసీ నుంచి మరో 500 మెగావాట్లు రాష్ట్రానికి అందే అవకాశంఏర్పడింది. ఈఆర్‌సీ అంచనాలోఈ రెండూ లేవు. ఈ కారణాలవల్ల మిగులు ఇంకా పెరగనుంది.

పీపీఏలు ఉండి ఈఆర్‌సీ ఆమోదం పొందని ప్రాజెక్టులు		
కృష్ణపట్నం	1,600	4.04
హిందుజా	1,020	4.01

■ ఈ రెండు ప్రాజెక్టుల పెట్టుబడి వ్యయం ఖరారు కాలేదు. తాత్కాలిక ధరను పరిగణనలోకి తీసుకున్నారు. కృష్ణపట్నంలో ప్రస్తుతం యూనిట్‌కు రూ. 3.68 పైసలే చెల్లిస్తున్నారు. ఈఆర్‌సీ ఆమోదంతో వాస్తవ ధర వెల్లడికానుంది. కృష్ణపట్నంలో యూనిట్ ధర రూ. 5 వరకూ అయ్యే అవకాశం ఉంది. దీని పక్కనే థర్మల్ టెక్ (ప్రైవేట్) ఉంది. దాంతో పోలిస్తే యూనిట్ ధర రూపాయి పైగానే ఉంటుంది. వ్యయ అదుపు తప్పింది. దీన్ని వదులుకోవడం కష్టమైనందున ధరను విశ్లేషించి తగ్గించాలి. హిందుజా ప్రాజెక్టులో ఒక యూనిట్ (520 మెగావాట్లు) లేదా కొంత విద్యుత్‌ను వదులుకోవాలన్న వాదన సాగుతోంది. వేరే వారికి అమ్ముకునే అవకాశాన్ని చూడాలని హిందుజాను కోరాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. మరో పక్క మిగులులో దాని నుంచి విద్యుత్‌ను పూర్తిగా ఎందుకు తీసుకోవాలన్న ప్రశ్నను కొందరు లేవనెత్తుతున్నారు.

సింహపురి ఎనర్జీ	400	4.08

■ ఈ కొనుగోలుకు ఈఆర్‌సీ ఇంకా తుది ముద్ర వేయలేదు. ఈ ప్రాజెక్టు ఒప్పంద కాలపరిమితి 12 ఏళ్లు. మిగులులో ఈ విద్యుత్ ఎందుకు కొనాలి? ఇదే ప్రశ్నను ఇంజినీర్లు సంధించారు.

పవన విద్యుత్	3,700	4.84/- 4.76

■ 711 మెగావాట్ల పీపీఏలకు ఈఆర్‌సీ ఆమోదం లేదు. పీపీఏ ఆమోదం పొందిన వాటిలో 299 మెగావాట్లు సాకారం కాలేదు. ఈఆర్‌సీ నుంచి వెనక్కు తీసుకున్న 41 పీపీఏలపై తాజాగా (శుక్రవారం) తిరిగి ఒక విజ్ఞాపనను డిస్కమ్స్ సమర్పించాయి. ఈ పీపీఏలను ఆమోదించే నిర్ణయాన్ని ఈఆర్‌సీపై పెట్టాయి.

సౌర విద్యుత్	1,960	5.96/ 4.63
నిర్మాణంలో ఉన్నవి కడప (గాలివీడు-సెకి)	400	4.53
ఏపీజెన్‌కో (తలారిచెరువు)	400	3.57
వదులుకున్న సౌర విద్యుత్ కడప (ఎన్టీపీసీ)	250	3.15

■ సౌర రంగంలో వేగం తగ్గించారు. వీటి నిల్వపై దృష్టి పెట్టారు. కడపలో ఎన్టీపీసీకి 1,250 ఎకరాలు కేటాయించి కూడా ధర ఎక్కువ అనే పేరుతో దాన్ని వదులుకున్నారు. అనంతపురం, కడప సౌర పార్కుల్లో ఇంకా వెయ్యి మెగావాట్లకు అవకాశం ఉంది.

నిర్మాణం పూర్తి అయిన ఏపీజెన్‌కో కొత్త ప్రాజెక్టులు		
ఆర్టీపీపీ	600	4.-75 - 5.00
నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్	50	4.50

■ ఈ రెండింటి ధర ఖరారు కాలేదు. నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ పెట్టుబడి రూ. 293 కోట్లు. ఆర్టీపీపీలోని ఈ యూనిట్ పెట్టుబడి సుమారు రూ. 4,290 కోట్లు. దీని ఖర్చు కూడా విపరీతంగా పెరిగింది. ఇందుకు బాధ్యులపై చర్యలు మాత్రం లేవు. నీళ్లు లేని కారణంగా టెయిల్‌పాండ్ ఉపయోగం పరిమితమే అయింది.



గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు

ఈప్రాజెక్టుల సామర్థ్యం 2,700 మెగావాట్లు. ఇందులో 785 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పీపీఏల కాలపరిమితి ముగిసింది. ఇందులో పీపీఏలు అయిపోయిన వాటిలో జీవీకే-1, లాంకో, స్పెక్ట్రం ప్రాజెక్టులు ఉన్నాయి.

గోదావరి గ్యాస్ పవర్ (జీవీకే-1ను డిస్కమ్స్ కొని ఈ పేరు పెట్టాయి)	216	3.52
లాంకో కొండపల్లి	361	4.36
స్పెక్ట్రం	208	4.51

■ ఈఆర్‌సీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వీటి విద్యుత్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. వాటి ధరలు మారిపోయాయి. లాంకోలో యూనిట్ ధర రూ. 3.55 పైసలు మాత్రమేనని, స్పెక్ట్రంలో యూనిట్ రేటు రూ. 3.23 పైసలు అని డిస్కమ్స్ ఈమధ్య ఈఆర్‌సీకి ఒక విజ్ఞాపనలో తెలియజేశాయి. ఆమోదిత పీపీఏ లేని నేపథ్యంలో వీటి విద్యుత్‌ను కొనే బాధ్యత డిస్కమ్స్‌పై లేదు. అందుకే వీటిని వదులుకోవాలనే వాదనను ఇటీవల జరిగిన సమావేశాల్లో అధికారులు వినిపించారు. నిర్ణయాన్ని ఈఆర్‌సీపై వేశారు.

ఏపీజెన్‌కో కొత్త ప్రాజెక్టులు		
కృష్ణపట్నం	800	4.68
వీటీపీఎస్	800	4.68
పోలవరం	960	4.61

ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లడానికి కృష్ణపట్నం, వీటీపీఎస్‌లోని రెండు యూనిట్ల నిర్మాణం ఆపేయాలని, కనీసం వాయిదా వేయాలన్న వాదన వినిపిస్తోంది. థర్మల్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తికావడం లేదు. దీని వల్ల విద్యుత్ ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది. అంత ఎక్కువ ధర కలిగిన విద్యుత్‌ను డిస్కమ్స్ కొనలేవనే అభిప్రాయం ఉంది. నిర్మాణం మొదలైన దశలో ఆపలేమని, తొలగించబోయే పాత యూనిట్లకు ఇవి ప్రత్యామ్నాయం కాగలవని ఏపీజెన్‌కో వాదన. పోలవరం జల విద్యుత్ కేంద్రానికి టెండరు పిలిచినా ఇంకా ఖరారు చేయలేదు. ధర ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వాయిదా వేసే ఆలోచన సాగుతోంది.

ప్రాజెక్టు తీసుకోవాలనే విజ్ఞాపన		
భావనపాడు	1,320	4.50

■ రూ. 9,343 కోట్ల అంచనాతో మొదలైన ఈ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిపోయింది. రూ. 3,785 కోట్ల మేర దీనిపై ఖర్చు పెట్టారు. దీన్ని ఏపీజెన్‌కో తీసుకోవాలని పీఎఫ్‌సీ కోరుతోంది. దీనిపై ప్రభుత్వం నియమించిన కమిటీ విముఖత చూపింది. కృష్ణపట్నం కంటే తమది చౌక విద్యుత్ అని పీఎఫ్‌సీ చెబుతోంది.

తొలి పింఛను కోసం ఉద్యోగులు బ్యాంకుకు వెళ్లాల్సిన పనిలేదు

దిల్లీ: పింఛను చెల్లింపు ప్రక్రియను ప్రారంభించేందుకు ఇకపై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. సంబంధిత పింఛను చెల్లింపు ఆదేశం (పీపీవో) ప్రతిని పదవీ విరమణ సమయంలోనే వారికి అందజేయాలని అన్ని విభాగాలకూ సిబ్బంది మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. అంతేకాదు ఉద్యోగులు లేదా పదవీ విరమణ చేసినవారితో సంబంధిత దరఖాస్తును పూరించి, తొలి పింఛను జారీకి ముందే దాన్ని బ్యాంకులకు అందేలా చూడాలని ఆదేశించింది. మరోవైపు కేంద్ర పింఛను కార్యాలయం నుంచి మరో పీపీవో ప్రతి కూడా బ్యాంకులకు సకాలంలో చేరేలా చూడాలని సూచించింది. 'ప్రధాన కార్యాలయానికి దూరంగా ఉండే ఉద్యోగులు, ఏమైనా ఇతర కారణాలతో కార్యాలయానికి రాలేనివారికి బ్యాంకుల్లో పీపీవో ప్రతి తీసుకునే సదుపాయమూ కల్పించాలి. దీనికోసం ఉద్యోగులు ముందుగా ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించాలి' అని ఆదేశంలో పేర్కొంది. ఇటీవల కాలంలో పింఛనుదారుల పీపీవో ప్రతి సకాలంలో అందడం లేదని, వారు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో మంత్రిత్వ శాఖ తాజా నిర్ణయం తీసుకుంది. ఈ నెల ఒకటో తేదీ నుంచే దీన్ని అమలుచేస్తున్నట్లు పేర్కొంది. అన్ని విభాగాలు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని కోరింది.

దుబాయ్‌లో తెలుగువ్యక్తికి భారీ లాటరీ!

దుబాయ్: ఉపాధి నిమిత్తం ఇక్కడకు వచ్చి... రకరకాల కారణాలతో అప్పుల్లో కూరుకుపోయి అవస్థపడుతున్న భారతీయుడు కృష్ణంరాజు తోకచిచు ఇటీవల వచ్చిన ఒక ఫోన్‌కాల్‌తో ఉబ్బితబ్బిబ్బై పోయారు. ఒకటీ... రెండూ కాదు... ఏకంగా రూ. 8 కోట్ల పైచిలుకు మొత్తాన్ని లాటరీలో గెలుచుకున్నారంటూ నిర్వాహకులు ఫోన్‌చేసి చెప్పడంతో తెలుగువాడైన కృష్ణంరాజుకు నోటమాట రాలేదు. వెంటనే భారత్‌లో ఉన్న తన తల్లికి ఫోన్ చేసి శుభవార్త వినిపించేశారు. ఆనందాన్ని అమ్మతో పంచుకున్నారు. దుబాయ్‌లో నిర్వహించే 'బిగ్ 5 టికెట్ డ్రా డే" లాటరీ తాజా డ్రాలో కృష్ణం రాజు విజేతగా నిలిచారు. ఎప్పుడో 2008లో యుఏఈకి వచ్చిన కృష్ణంరాజు భవన నిర్మాణ రంగంలో ఏదో చిరు ఉద్యోగం చేసుకుంటున్నారు. అంతంతమాత్రం సంపాదన కావడంతో అప్పులయ్యాయి. రుణదాతల ఒత్తిళ్లూ అధికమైనాయి. అయినా సరే, అతడు లాటరీ టిక్కెట్లను కొనడం మానలేదు. నెలనెలా కొంతమొత్తం దాచి ఓ లాటరీ టిక్కెట్ కొనేవాడు. మూడేళ్లుగా ఇతర స్నేహితులతో కలిసి కొంతకొంత డబ్బు వాటాల కింద వేసుకుని లాటరీ టిక్కెట్లు కొంటూనే ఉన్నట్లు చెప్పారు. అయితే, ఈ సారి మాత్రం ఎందుకో తాను ఒక్కడినే టిక్కెట్ కొనుక్కున్నాననీ....దానికే బహుమతి రావడం అసలు నమ్మశక్యం కాకుండా ఉందనీ కృష్ణంరాజు చెప్పారు. లాటరీ మొత్తంలో కొంతభాగాన్ని తన నాలుగేళ్ల కుమారుడి చదువుకు కేటాయించి...మిగతా మొత్తంలో అప్పులవీ తీర్చేసుకుంటానని చెప్పారు.

తిరుగుబాటుదారుల దాడిలో 50 మంది అఫ్గాన్ పౌరులు మృతి

కాబూల్: ఉత్తర అఫ్గానిస్థాన్‌లో తిరుగుబాటుదారులు జరిపిన దాడుల్లో కనీసం 50 మంది పౌరులు మరణించారని అధికారులు తెలిపారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. సయాద్ జిల్లాలోని మిర్జా ఒలాంగ్ ప్రాంతంలోని ఔట్‌పోస్టుపై వారు దాడి చేశారని ప్రభుత్వ ప్రతినిధి జబీబుల్లా అమానీ తెలిపారు. ముష్కరులు దాదాపు 30 ఇళ్లకు నిప్పుపెట్టారని వివరించారు. తిరుగుబాటుదారులపై పోరు ఇంకా కొనసాగుతోందన్నారు. ఇందులో అఫ్గాన్ భద్రతా దళానికి చెందిన ఏడుగురు సైనికులు మరణించినట్లు వెల్లడించారు. చాలా మంది తిరుగుబాటుదారులు కూడా హతమైనట్లు చెప్పారు. ముష్కరుల్లో తాలిబన్, ఐఎస్‌కు చెందినవారున్నారని తెలిపారు.

ఏడాదిలోనే ఇంజినీరింగ్ పట్టా

అహ్మదాబాద్: చిన్నప్పుడే చదువులో వెనుకపడ్డాడని ఉపాధ్యాయులు తేల్చేశారు. అయితే మార్కులపై కాకుండా అభ్యాసంపైనే దృష్టి కేంద్రీకరించిన ఆ బాలుడు రికార్డు సృష్టించాడు. బీఈ (ఎలక్ట్రికల్) కోర్సును ఏడాదిలోనే పూర్తిచేసి.. గుజరాత్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ (జీటీయూ)లో అత్యంత పిన్న గ్రాడ్యుయేట్‌గా చరిత్ర సృష్టించాడు. ఇది జామ్‌నగర్‌కు చెందిన 15ఏళ్ల నిర్భయ్ ఠక్కర్ గాథ. ఏడో తరగతి వరకూ నిర్భయ్ విద్యాభ్యాసం సాధారణంగానే సాగింది. అనంతరం పరుగులు పెట్టింది. ఎనిమిది నుంచి పది తరగతులను అతడు ఆరు నెలల్లోనే పూర్తిచేశాడు. తర్వాత కేంబ్రిడ్జి ఇంటర్నేషనల్‌కు చెందిన ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐజీసీఎస్ఈ)ను మూడు నెలల్లోనే పూర్తిచేశాడు.

తొమ్మిది గంటలు కళాశాలలోనే

ఇంజినీరింగ్‌లో ప్రవేశంపై జీటీయూ వృత్తివిద్య కోర్సుల ప్రవేశాల కమిటీ (ఏసీపీసీ), అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)లను నిర్భయ్ ఆశ్రయించాడు. దీంతో ఎస్ఏఎల్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశం దొరికింది. అతడి కోసం కళాశాల ప్రిన్సిపల్ రూపేశ్ వాసని ప్రత్యేక బోధనా ప్రణాళికను సిద్ధంచేయించారు. 'రోజూ తొమ్మిది గంటలపాటు నిర్భయ్ కళాశాలలో గడిపేవాడు. జీటీయూ నిబంధనలకు అనుగుణంగా అతడికి ప్రశ్నపత్రాలు తయారుచేశాం. ఫలితాలను కూడా ప్రత్యేకంగా ప్రకటించాం'అని రూపేశ్ తెలిపారు. ఇంజినీరింగ్ ప్రాజెక్టులో భాగంగా నిర్భయ్ గాలిమరతో విద్యుత్తు ఉత్పత్తిచేసే యంత్రాన్ని అభివృద్ధిచేస్తున్నాడు. ఇది తక్కువ గాలి వీచినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయడం విశేషం.

అద్భుతంగా అనిపిస్తోంది

'చుట్టూ ఉన్న ప్రపంచం గురించి తెలుసుకోవడం చాలా అద్భుతంగా అనిపిస్తోంది. మా నాన్న ఎంతో సహకరించారు. ప్రతి సబ్జెక్టు సన్నద్ధతలోనూ ఆయన తోడ్పడ్డారు. వచ్చే మూడేళ్లలో పది ఇంజినీరింగ్ పట్టాలు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. పరిశోధన, అధునాతన పరికరాల అభివృద్ధిరంగంలో అడుగుపెట్టాలని భావిస్తున్నాను. దీంతో ఈ డిగ్రీలు చాలా ఉపయోగపడతాయి'అని నిర్భయ్ వివరించాడు. తీరిక సమయాల్లో చెస్, ఫుట్‌బాల్ ఆడతానని, స్విమ్మింగ్ కూడా చేస్తానని చెప్పాడు.

అభ్యాసంపైనే దృష్టి

'మా అబ్బాయి చదువులో వెనుకపడ్డాడని ఉపాధ్యాయులు చెప్పగానే ఆశ్చర్యం అనిపించింది. దీంతో వాడి ప్రతిభను వెలికితీసే బాధ్యతను భుజాలకెత్తుకున్నాను'అని నిర్భయ్ తండ్రి, ఇంజినీరు ధవళ్ ఠక్కర్ చెప్పారు. నిర్భయ్ విద్యాభ్యాసం కోసం ఆయన తన ఉద్యోగాన్ని వదిలేశారు. 'సంప్రదాయ పరీక్షలు విద్యార్థుల జ్ఞాపకశక్తిని పరీక్షించడంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తాయి. దీంతో మార్కులపై కాకుండా అభ్యాసానికి ప్రాధాన్యమిచ్చే విధానాలను ఆశ్రయించాం. ఫలితంగా నిర్భయ్‌కు మార్కులంటే భయం పోయింది. చదవడంతోపాటు వినడం, చూడటం, అంశాలను నిత్యజీవితంలో ఆచరణలో పెట్టడం లాంటి విధానాలతో తక్కువ సమయంలోనే తను చాలా ఎక్కువ నేర్చుకోగలిగాడు'అని వివరించారు. ఇదే విధానాన్ని మరింత మంది విద్యార్థులకూ చేరువ చేస్తానని ఆయన చెప్పారు. ధవళ్ భార్య వైద్యురాలు.

జీటీయూ చరిత్రలో అతిపిన్న ఇంజినీరింగ్ పట్టభద్రుడు నిర్భయేనని వర్సిటీ ఉపకులపతి నవీన్‌సేథ్ చెప్పారు. పదిడిగ్రీలు సంపాదిస్తానని నిర్భయ్ చెప్పడంపైనా ఆయన స్పందించారు. విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యాభ్యాస అనుమతులు ఇస్తామని వివరించారు.



తిరుమలకు చేరుకున్న వెంకయ్యనాయుడు

శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు తిరుమలకు ఆదివారం రాత్రి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. శ్రీవారికి మొక్కులు చెల్లించుకోవడానికి ఇక్కడికి వచ్చిన ఆయనకు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు.

- న్యూస్‌టుడే, తిరుమల

ఉపశమనం ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించారు. రూ. 1.50లక్షల లోపు ఉన్న ఖాతాలకు అయిదు విడతల్లో నిధులు ఇవ్వనున్నారు. వీరికి ఏడాదికి 10శాతం వడ్డీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండో విడత చెల్లింపు సందర్భంగా వడ్డీ కలిపి ఇచ్చారు. ఇప్పుడు మూడో విడతగా రూ. 3,600కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంటుందని అంచనా. దీనికి కూడా ఏడాదికి రూ. 10శాతం వడ్డీ చొప్పున రెండేళ్లకు ఇవ్వాల్సి ఉంటుంది. అంటే ఈ వాయిదాలో రూ. 30 వేలు తీసుకోవాల్సిన రైతుకు వడ్డీ రూపంలో రూ. 4,800 పైనే అదనంగా ఇవ్వాల్సి ఉంటుందని అంచనా.

ఇప్పుడిస్తే మేలు..

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులు ఏడాది లోపే చెల్లిస్తే ప్రభుత్వం ఇచ్చే సున్నా వడ్డీ రాయితీకి అర్హత సాధిస్తారు. రూ. లక్షపైన రుణం తీసుకున్న వారు పావలా వడ్డీ పొందాలన్నా ఏడాదిలోగా చెల్లించాల్సిందే. చాలామంది రైతులు సొమ్ము అందుబాటులో లేక అప్పులు చెల్లించలేదు. మూడో విడత మాఫీగా వస్తుందనే ఆశల్లోనే ఉన్నారు. ఆలస్యం చేసే కొద్దీ ఏడాది గడువు ముగిసిపోతుంది. అప్పుడు వడ్డీ రాయితీ వర్తించడం మాట అటుంచి బ్యాంకులు మోపే భారం మరింత పెరుగుతుందనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

జూన్ నుంచి..

రైతులకు త్వరలో రుణ ఉపశమన పథకం నిధులు విడుదల చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు జూన్ నుంచి చెబుతున్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకుని అయినా మిగిలిన మూడు విడతల మొత్తాన్ని ఒకే సారి ఇచ్చే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అది సాకారం కాలేదు. వాటి సంగతెలా ఉన్నా కనీసం ఎప్పుడిస్తారో ఒక స్పష్టత ఇవ్వాల్సిన అవసరాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు.

బ్రెగ్జిట్ పరిహారంగా రూ.3 లక్షల కోట్లు

చెల్లింపునకు సిద్ధమవుతున్న బ్రిటన్

లండన్: బ్రెగ్జిట్ పేరుతో ఐరోపా సమాజం (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగినందుకు 40 బిలియన్ యూరోల (47.1 బిలియన్ డాలర్లు, అంటే రూ. 3.06 లక్షల కోట్లు) పరిహారాన్ని ఈయూకి చెల్లించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు 'ది సండే టెలిగ్రాఫ్' ఒక కథనం ప్రచురించింది. పరిహారంగా 100 బిలియన్ యూరోలు చెల్లించాల్సి రావచ్చని తొలుత అంచనాలు రూపొందాయి. తర్వాత అది 60 బిలియన్ యూరోలకు తగ్గి, చివరకు చర్చల తర్వాత 40 బిలియన్ యూరోలుగా ఖాయమయింది. ఈ మొత్తాన్ని చెల్లించే విషయంలోనూ బ్రిటిష్ ప్రధాని థెరిసా మే రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవడం అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత భారీ మొత్తాన్ని చెల్లించడానికి కన్సర్వేటివ్ పార్టీ ప్రతినిధులూ ఇష్టపడడం లేదు. తాజా అంచనాల ప్రకారం 2019-21 బడ్జెట్టుపైనా గట్టి ప్రభావం పడనుంది. గత ఏడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా 52% మంది బ్రిటన్‌వాసులు ఓట్లు వేసిన విషయం తెలిసిందే.

పిడిగుద్దులకు విద్యార్థి మృతి

(మొదటి పేజీ తరువాయి)

తెలిసి ఇద్దరినీ హెచ్చరించి పంపారు. శనివారం మళ్లీ వారిద్దరి మధ్య వివాదం రేగింది. దీనిపై మధ్యాహ్న భోజన విరామ సమయంలో చిన్నా తన బావను పాఠశాల వద్దకు పిలిపించి ఆ ఎనిమిదో తరగతి విద్యార్థిని హెచ్చరించాడు. దాంతో ఆ ఎనిమిదో తరగతి విద్యార్థి తన అన్న, మరో బంధువుకు సమాచారం ఇచ్చాడు. వీరిద్దరు కూడా విద్యార్థులే. క్షణాల్లో వారు పాఠశాల వద్దకు వచ్చారు. అప్పటికే పాఠశాల నుంచి బయట కెళ్లిన చిన్నా, అతని బావను ఈ ఎనిమిదో తరగతి విద్యార్థి పిలిచాడు. వారిద్దరూ కలిసి చిన్నా ఛాతిపై పిడిగుద్దులు కురిపించగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆ వెంటనే స్పృహ తప్పాడు. భయపడిన అతని బావ పారిపోయాడు. ఇది గమనించిన విద్యార్థులు 108 వాహనానికి ఫోన్ చేశారు. చిన్నా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. సి.ఐ. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొట్టడంతో తీవ్ర ఆందోళనకు గురై గుండెపోటుతో మరణించాడు: రామచంద్రరావు, ఏసీపీ

చిన్నాపై ఒక్కసారిగా పిడిగుద్దులు కురిపించడంతో తీవ్ర ఆందోళనకు గురై గుండెపోటు వచ్చింది. కిందపడిపోవడంతో తలకు దెబ్బ తగిలింది. మెదడులోని నరాలు చిట్లి రక్తస్రావం అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తగిన చికిత్స అందించి ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. నిందితులందరూ మైనర్లే. హత్య కేసుగా మార్పు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నాం.

వెనెజులాలో సైనిక తిరుగుబాటు?

కారకస్: వెనెజులాలో మూడో పెద్ద నగరమైన వెలెన్సియాలో ఉన్న సైనిక స్థావరంపై ఆదివారం తెల్లవారుఝామున 'తీవ్రవాదులు' దాడి చేశారు. దీనిని సైనికులు సమర్థంగా ఎదుర్కొని, ఏడుగురిని అరెస్టు చేశారని అధికారవర్గాలు తెలిపాయి. దీనిపై మరో వాదనా వినిపిస్తోంది. వీరు తీవ్రవాదులు కారని, కొందరు సైనికులే ఈ చర్యకు పాల్పడ్డారని పరిశీలకులు భావిస్తున్నారు. ఇది అధ్యక్షుడు నికోలస్ మదురోకు వ్యతిరేకంగా జరిగిన సైనిక తిరుగుబాటేమోనని స్థానిక మీడియా, సామాజిక మాధ్యమాలు పేర్కొన్నాయి. ఈ విషయం ఇంకా ధ్రువపడలేదు. సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వీడియో ప్రకారం.. సైన్యం కెప్టెన్‌గా చెప్పుకొంటున్న జువాన్ చగౌరీపనౌ అనే వ్యక్తి తాము 'న్యాయమైన తిరుగుబాటు' చేస్తున్నట్టు పేర్కొన్నారు. వెంటనే తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండు చేశారు. ఇది సైనిక తిరుగుబాటు కాదని, రాజ్యాంగబద్ధ పాలనను పునరుద్ధరించడానికి మిలటరీ, పౌరులు కలిసి తీసుకున్న చర్య అని పేర్కొన్నారు.

State Economy Fame
NAGARJUNA
APPSC : Gr-2
Long Term NEW BATCH | 8-8-17
NAGARJUNA'S STUDY CIRCLE
Near RTC X Road, Opp. Labour Office, Hyd.
040-27604111 | 040-40207373

MBBS/MD in PHILIPPINES/JAMAICA/USA
● English speaking Country
● Incampus A/c Hostel Facilities with Andhra Food.
● USMLE 1 & 2 included in course
● Parents చే నడుపబడుచున్న ఏకైక సంస్థ
2.5 Lakhs per year
WAY (2) PHILIPPINE MEDICAL EDUCATION
40-3-10, Maanya side lane, M.G.Road, Near Hotel DV Manor, Vijayawada -10
Contact: 8885641144, 9494111144

యువతరానికి హెల్‌ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నట్లు శాన్‌డియాగో విశ్వవిద్యాలయానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత తరం యువత మానసిక ఆరోగ్యం మీద సెల్‌ఫోన్ చూపుతున్న ప్రభావం అంతా ఇంతా కాదని వారు వివరిస్తున్నారు. సోషల్ మీడియా కూడా యథాశక్తీ దీనికి దోహదపడుతోందని పేర్కొంటున్నారు.

మొబైల్ వచ్చింది.. మార్పు తెచ్చింది..

ప్రతిష్ఠాత్మక ఆపిల్ సంస్థ ఐ-ఫోన్‌ను 2007లో తీసుకువచ్చింది. ఇక స్మార్ట్‌ఫోన్ విప్లవం మొదలైంది. దీనికి ఇంటర్‌నెట్, సోషల్ మీడియా జత కలిశాయి. అప్పటి నుంచి యువత మీద స్మార్ట్‌ఫోన్ ప్రభావం పెరిగింది. 2011 తర్వాత స్పష్టంగా మార్పు కనిపిస్తోంది. యువతరంలో ఉండాల్సిన సంతోషం, హుషారు, ఆసక్తి ప్రస్తుత తరం యువతీయువకుల్లో కనిపించటం లేదని ప్రొఫెసర్ జీన్ ఎం ట్వెంగో పేర్కొన్నారు. బాధ్యతలను స్వీకరించటానికి వారు సిద్ధపడటం లేదు, డ్రైవింగ్ పై ఆసక్తిగా లేరు, హోమ్‌వర్క్ చేయటం తగ్గిపోయింది, ఎవరినైనా కలవాలని కూడా అనుకోవటం లేదు- అని విశ్లేషించారు.

కుంగుబాటు.. ఆత్మహత్యలు

- ఇటీవల నిర్వహించిన సర్వేలో అమెరికాలోని ప్రతి నలుగురు యువతీయువకుల్లో ముగ్గురి వద్ద ఐఫోన్ ఉన్నట్లు తేలింది. వారి సమయంలో ఎక్కువ భాగం ఫోన్‌తో కాలక్షేపం చేయటమే అధికంగా ఉంటోందని వెల్లడైంది.
- తరచుగా స్నేహితులను కలవటం, మాట్లాడుకోవటం తగ్గిపోతోంది. చాలామంది పార్టీలకు కూడా వెళ్లటం లేదు, విహార యాత్రలపై ఆసక్తి లేదు.
- తల్లిదండ్రులతో కలిసి ఎక్కడైనా బయటకు వెళ్లే సందర్భాలు దాదాపు లేనట్లే. ఒకే ఇంట్లో ఉంటున్నా తల్లిదండ్రులకు వారు మానసికంగా దగ్గర కాలేకపోతున్నారు. ఒకే ఇంట్లో విడివిడిగానే ఉండిపోతున్నారు.
- తల్లితండ్రులు ఏదైనా చెప్పబోతున్నా.. సరే సరేలే.. ఏదో ఒకటి, అని దాటవేసి సెల్‌ఫోన్‌లో లీనమైపోతున్నారు.
- యువతకు తగినంత నిద్ర కూడా ఉండటం లేదు. సెల్‌ఫోన్ స్క్రీన్ చూస్తూ, దాని స్క్రీన్‌ను స్వైప్ చేస్తూ ఎక్కువ సమయం గడిపేస్తున్నారు.
- కుంగుబాటు సర్వసాధారణ సమస్యగా మారింది. ఆత్మహత్యల సంఖ్య అధికం అయింది. అమెరికాలోని యువకుల్లో కుంగుబాటు సమస్య 2012 నుంచి 2015 మధ్యకాలంలో 21 శాతం పెరిగింది. యువతుల్లో అయితే 50 శాతం మేరకు పెరిగింది. ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా పెరిగిపోయింది. ముఖ్యంగా యువతులు ఆత్మహత్యల రేటు ఎంతోఅధికంగా ఉంది. 2007తో పోల్చితే 2015 లో 14 ఏళ్ల యువతులు ఆత్మహత్యలు చేసుకోవటం మూడు రెట్లు పెరిగింది. యువకుల్లో ఆత్మహత్యల రేటు కంటే ఇది రెట్టింపు.
- మానవ సంబంధాలు తగ్గిపోవటం ఒంటరితనానికి దారితీసి కుంగుబాటులో ఆత్మహత్య చేసుకోవాలనే తలంపు యువతీ యువకుల్లో కలుగుతున్నట్లు వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఏదీ పరిష్కారం?

ఈ సమస్యకు సులువైన పరిష్కారం ఏదీ కనిపించటం లేదు. యువతను స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల వినియోగం నుంచి దూరం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదు. సోషల్ మీడియా వ్యసనం నుంచి బయటకు తీసుకురావటం కూడా కష్టమే. కానీ కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే కొంత మార్పు రావచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై యువతీయువకులు గడిపే సమయాన్ని నెమ్మదిగా తగ్గిస్తూ రావాలని సూచించారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లపై రోజుకు గంట కంటే ఎక్కువ సమయం వెచ్చించకుండా జాగ్రత్త వహించాలి, మిగిలిన సమయంలో పుస్తకాలు చదువుకునే విధంగా, స్నేహితులను కలవటం, షికారుకు వెళ్లటం వంటి అలవాట్లవైపు వారు మొగ్గుచూపే విధంగా చేస్తే మార్పు వస్తుంది. దీనివల్ల యవతను వేధిస్తున్న కుంగుబాటు సమస్య నుంచి బయటపడవచ్చు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

గ్రహం అనుగ్రహం

7-8-2017 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
పూర్ణిమ: రా. 11-00 తదుపరి బహుళపక్ష పాడ్యమి
శ్రవణం నక్షత్రం: తె. 3-58 తదుపరి ధనిష్ఠ
అమృతఘడియలు: సా. 4-49 నుంచి 6-32 వరకు
వర్జ్యం: ఉ. 6-32 నుంచి 8-15 వరకు
దుర్ముహూర్తం: మ. 12-31 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-44; సూర్యాస్తమయం: సా. 6-28
శ్రావణ పూర్ణిమ, శ్రీ హయగ్రీవ జయంతి, రాఖీ పూర్ణిమ, పాక్షిక చంద్రగ్రహణం

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	23.6	31.8
గుంటూరు	24.0	36.0
హైదరాబాద్	24.8	33.2
అనంతపురం	24.9	36.1
ఖమ్మం	25.0	32.0
విజయవాడ	25.2	36.4
కర్నూలు	25.3	36.0
విశాఖపట్నం	25.4	35.2
రాజమహేంద్రవరం	26.0	37.0
శ్రీకాకుళం	27.0	33.0
నరసాపురం	27.0	34.6
కడప	27.0	37.0
తాడేపల్లిగూడెం	27.5	32.5
తిరుపతి	27.5	37.5
ఒంగోలు	27.9	38.3
నెల్లూరు	30.0	38.0



ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శ్రుతి అశోక్

న్యాయ విద్యలో 15 బంగారు పతకాలు ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న శ్రుతి

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు నగరానికి చెందిన విద్యార్థిని శ్రుతిఅశోక్ న్యాయ విద్యలో పదిహేను బంగారు పతకాలను సొంతంచేసుకున్నారు. ఆదివారం నగరంలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 25వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ చేతుల మీదుగా ఆమె బంగారు పతకాలు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రుతి మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి న్యాయవాది కావాలన్నది నా ఆకాంక్ష. న్యాయం కోసం తపించే నాకు స్ఫూర్తి, చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమే. ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం కల్పించేందుకు శ్రమిస్తాను. సీనియర్ న్యాయవాదులు వాదించే తీరును వీక్షిస్తూ వచ్చాను. అది కూడా నాకు చదువుకునే సమయంలో చక్కగా సహకరించింది. బి.ఎ., ఎల్.ఎల్.బి. మెరిట్ విభాగంలో పదిహేను పతకాలు దక్కించుకోవటం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.

అవినీతి పుండుకు చికిత్సేది!

- ఆర్‌జీయూకేటీలో అవకతవకలపై చర్యలు కాగితాలకే పరిమితం
- ట్రిపుల్‌ఐటీల్లో కొనుగోళ్లపై విచారణ కమిటీ నివేదిక మూలకు
- రూ. కోట్లను మింగేస్తున్నా మిన్నకుంటున్న యంత్రాంగం

ఈనాడు – అమరావతి

రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో జరుగుతున్న అవకతవకలపై చర్యలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రయోగశాలల పరికరాలు, విద్యార్థుల సౌకర్యాల కోసం కొనుగోలు చేసిన వస్తువులు, క్యాంపస్‌లో వైఫై ఏర్పాటు అధికారులు అవలంబించిన విధానం లోపభూయిష్టంగా ఉందని గతేడాది నియమించిన విచారణ కమిటీ పేర్కొంది. ట్రిపుల్‌ఐటీ ఇడుపులపాయ(ఆర్‌కేవ్యాలీ), నూజివీడుల్లో సామగ్రి కొనుగోళ్లపై వచ్చిన ఆరోపణలపై ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి విచారణకు ఆదేశించారు. గతేడాది జులై2 ఇడుపులపాయ, 14, 15న నూజివీడు క్యాంపస్‌లో పరిశీలించి నివేదిక సమర్పించింది. రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు వెల్లడించింది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, న్యాయవిచారణ జరిపించాలని, అధికంగా చెల్లించిన మొత్తాలను వసూలు చేయాలని సూచించింది. స్పందించాల్సిన ఉన్నతాధికారులు మౌనం వహించడంతో నివేదిక మూలకు చేరింది.

రూ. కోట్లలోనే అక్రమాలు..

- అవసరం లేకున్నా ఇడుపులపాయకు రూ.1.57కోట్లతో వంట సామగ్రి కొన్నారు. వాటిని ఉపయోగించకుండా మూలనపడేశారు. నిబంధనలు పాటించకుండా మరో 8వస్తువులను రూ.2.54కోట్లుకు కొన్నారు. వీటికి మార్కెట్ కంటే అధిక ధరలు చెల్లించారని కమిటీ పేర్కొంది.
- 2015లో నూజివీడులోని విద్యార్థుల కోసం యూనిఫామ్స్, బూట్లు, దుప్పట్లు, టవల్స్ తదితరాలను రూ.1.72 కోట్లతో కొనుగోలు చేశారు. ముందుగా కొనుగోళ్ల కోసం పత్రికా ప్రకటనిచ్చారు. ఇందుకు రూ.2,27,440 చెల్లించారు. కానీ, ఆ తర్వాత టెండర్లను రద్దు చేసి నిబంధనలకు విరుద్ధంగా నేరుగా హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ నుంచి కొనుగోళ్లు చేసేశారని కమిటీ పేర్కొంది.
- ఇడుపులపాయలోని బాలుర, బాలికల వసతిగృహాల్లో వైఫై సౌకర్యం ఏర్పాటు పనుల అప్పగింత వ్యవహారం అసంబద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. వైఫై ఏర్పాటుకు రూ.1.61 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. టెండర్ల విధానం ద్వారా కాకుండా.. ఎటువంటి అనుభవం లేకున్నా ఈసీ కమిటీలో హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీకి ఇవ్వాలని తీర్మానించారు. పనులు తీసుకున్న కంపెనీ మరో కంపెనీకి స్థానికంగా పనుల బాధ్యతను అప్పగించింది. ఓ ప్రైవేటు కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకే ఇలా వ్యవహరించినట్లు కమిటీ అభిప్రాయ పడింది. అధిక మొత్తాన్ని రికవరీ చేయాలని పేర్కొంది.
- నూజివీడు క్యాంపస్‌లో వైఫై సౌకర్యం అమల్లోనూ నిబంధనలు గాలికి వదిలేసినట్లు గుర్తించింది. కార్యనిర్వాహకకమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోకుండా ..ముందే పనులకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నట్లు కమిటీ పేర్కొంది. అయితే, ఆ తర్వాత జరిగిన ఈసీ సమావేశంలోనూ ఇదే సంస్థకు పనులు అప్పగించాలని తీర్మానించారు. వైఫైపై రూ.1.83కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ పనులు దక్కించుకున్న సంస్థ ఇడుపులపాయలో పనులు చేసిన సంస్థకే పనులు అప్పగించినట్లు తెలిపింది.
- భద్రత, పారిశుద్ధ్యం,వంటమనుషుల టెండర్ల సమయం ముగిసినా ఇడుపులపాయ, నూజివీడుల్లో రెండేళ్లనూ సమయం పొడిగించుకుంటూ వస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ చెల్లింపులు నెలవారీగా రూ.లక్షల్లో ఉండడం విశేషం. రికార్డులను తారుమారు చేసి, నిర్వహణ వ్యయం కింద ఇడుపులపాయ, నూజివీడుల్లో రూ.4కోట్లు వరకు చెల్లింపులు చేసినట్లు కమిటీ తననివేదికలో పేర్కొంది.

'అష్టతీర్థ రాజమహాయోగం' ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు



శ్రీముఖలింగం క్షేత్రం వద్ద భక్తుల రద్దీ

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ తీర్థం శ్రీముఖలింగంలో నిర్వహిస్తున్న 'అష్టతీర్థ రాజమహాయోగం' ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు ఆచరించి పరమేశ్వరుని దర్శించుకున్నారు. గత నెల 31న ప్రారంభమైన ఈ ఉత్సవాలకు ఎనిమిది ఘాట్‌లను సిద్ధం చేశారు. రోజుకో ఘాట్‌లో ఈ ఉత్సవాలు సాగుతున్నాయి. సోమవారంతో ఉత్సవాలు ముగియనున్న నేపథ్యంలో మరింత మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు.

రచయిత పోతుకూచి సాంబశివరావు కన్నుమూత



పోతుకూచి సాంబశివరావు (పాతచిత్రం)

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత పోతుకూచి సాంబశివరావు (92) దివంగతులయ్యారు. ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కవాడిగూడలోని తన నివాసంలో ఆయన మరణించారు. సోమవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ బన్సీలాల్‌పేటలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయి. పోతుకూచి సాంబశివరావు 1925లో తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు గ్రామంలో సూరమ్మ, నరసింహమూర్తి దంపతులకు జన్మించారు. బీఏ, ఎల్‌ఎల్‌బీ చదివారు. 1950లో హైదరాబాద్ నగరానికి వచ్చారు. న్యాయవాదిగా కొంతకాలం కొనసాగారు. ఉదయ కిరణాలు, అన్వేషణ, ఏడు రోజుల మజిలీ, చలమయ్య షష్టిపూర్తి, జీవననాదం వంటి నవలలు రచించారు. మూడు వందల వరకు కథలు రాశారు. వాటిలో చాలా కథలను పలు భాషల్లోకి అనువదించారు. ఆకాశవాణి కోసం నాటకాలు రచించారు. షిర్డీసాయిబాబా, దామోదరం సంజీవయ్య చరిత్రలు రాశారు. విశ్వసాహితీ, అఖిల భాష సాహిత్య పరిషత్‌లను స్థాపించారు. తన ఆత్మకథ తొలి భాగం ముద్రింపజేసి, ఈ నెల 2న త్యాగరాయ గానసభలో ఆవిష్కరించారు. మలిభాగం వెలువరించక ముందే తనువు చాలించారు. పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు.

క్వార్ట్జ్ అక్రమాలపై రూ.56 కోట్ల జరిమానా

- కర్నూలు జిల్లాలో 3 లీజుల్లో అక్రమాలు
- తొలుత రూ.100 కోట్ల అపరాధరుసుం
- చివరకు రూ.44 కోట్ల తగ్గింపు

ఈనాడు, అనంతపురం: కర్నూలు జిల్లా పరిధిలోని మూడు క్వార్ట్జ్ లీజుల్లో జరిగిన అక్రమ దందాలో చివరకు అపరాధరుసుమును రూ.56 కోట్లుగా ఖరారు చేశారు. వాస్తవానికి ఆరు నెలల కిందట గనుల శాఖ తనిఖీలు జరిపిన అనంతరం ఈ రుసుమును రూ.100 కోట్ల మేర వసూలు చేయాలని నిర్ణయించింది. తర్జనభర్జనల అనంతరం చివరకు అందులో రూ.44 కోట్లకు తగ్గించారు.

కర్నూలు జిల్లాలోని దేవరకొండ, కృష్ణగిరి, ఆలూరు మండలాల్లోని మూడు క్వార్ట్జ్ గనుల్లో లీజుదారులు ఇష్టానుసారం నిబంధనలను ఉల్లంఘించారు. గనుల శాఖ నుంచి తీసుకున్న పర్మిట్ల ప్రకారం లీజు పొందిన ప్రాంతాల్లో ఖనిజాలు తవ్వితీయాలి. అయితే

ఇతర ప్రాంతాల్లో తవ్విన ఖనిజాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. దేవరకొండ మండలం చెల్లెలచెలమ, కృష్ణగిరి మండలం చెంచుఎర్రగుడి, ఆలూరు మండలం హతిబెలగల్ గ్రామాల పరిధుల్లోని మూడు లీజుల్లో కలిపి 10.19 లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజం తవ్వకాలకు లీజుదారుల పర్మిట్లు తీసుకోగా... ఆ లీజుల్లో కేవలం 2.97 లక్షల మెట్రిక్ టన్నులే తవ్వితీసినట్లు గుర్తించారు. అంటే మిగిలిన 7.22 లక్షల మెట్రిక్ టన్నుల మేర క్వార్ట్జ్‌ను పర్మిట్లు పొందని చుట్టుపక్కల ప్రాంతంలో లభించినదంతా తరలించారు. వాస్తవానికి ఇక్కడ జరుగుతున్న క్వార్ట్జ్ అక్రమ తరలింపుపై ఈ ఏడాది జనవరి 10న 'ఈనాడు' ప్రధాన పత్రికలో 'కర్నూలులో క్వార్ట్జ్ మాఫియా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణలో 7.22 లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజం అక్రమంగా తరలించారని తేలింది. దాంతో రూ.100.01 కోట్ల అపరాధ రుసుమును ఆయా లీజుదారుల నుంచి రాబట్టాలంటూ విచారణాధికారి తన నివేదికలో పేర్కొన్నారు. భారీ మొత్తం కావడంతో ఉన్నతాధికారులు అపరాధరుసుమును ఆమోదించడానికి తర్జనభర్జన పడ్డారు. మరోవైపు లీజుదారులు పలు మార్గాల్లో లాబీయింగ్‌కు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. మొత్తానికి గనులశాఖ అధికారులు న్యాయ సలహా తీసుకొని చివరకు రూ.56 కోట్ల మేర అపరాధరుసుమును తాజాగా ఖరారు చేశారు. ఈ మేరకు రెండు రోజుల కిందట ఆ ముగ్గురు లీజుదారులకు తాఖీదులు అందజేశారు. ఇదిలా వుండగా ఈ క్వార్ట్జ్ అక్రమాలపై లీజుదారులకు సకాలంలో తాఖీదులు ఇవ్వకుండా జాప్యం చేయడంపై గుత్తిలోని గనులశాఖ విజిలెన్స్ విభాగ సహాయసంచాలకునిపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆయనపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు.

స్నేహరక్ష కట్టి వస్తూ అనంత లోకాలకు

చెరువులో మునిగి 8వ తరగతి విద్యార్థి మృతి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పొరుగూరిలోని తన మిత్రుడికి స్నేహరక్ష కట్టి.. తిరిగి వెళ్తూ చెరువులో దిగిన ఓ విద్యార్థి నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గన్నవరం మండలం బుద్ధవరం గ్రామానికి చెందిన తాడిపత్రి అజేయ్‌కుమార్ (13), దోనేపూడి భానుప్రసాద్, ఉంగుటూరు మండలం వెన్నూతల గ్రామానికి చెందిన కొలుసు భానుప్రకాష్ స్నేహితులు. వీరు గన్నవరం మండలం దావాజీగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా తన మిత్రుడికి స్నేహబంధం రక్ష కట్టాలని అజేయ్‌కుమార్, భానుప్రసాద్ కలిసి వెన్నూతలలోని భానుప్రకాష్ ఇంటికి వెళ్లారు. బ్యాండ్‌లు కట్టారు. తిరిగి ఇంటి ముఖం పట్టారు. దారిలో వెన్నూతల గ్రామం చెరువులో ఈతకు దిగారు. అజేయ్‌కుమార్ లోతుకు వెళ్లి ఈతకొట్టే ప్రయత్నంలో మునిగిపోయాడు. భానుప్రకాష్ కేకలు వేయడంతో కొందరు యువకులు వచ్చి అజేయ్‌కుమార్‌ను బయటకు తీసినా... అప్పటికే విద్యార్థి మృతి చెందాడు.

హైదరాబాద్‌లో 180 గ్రాముల కొకైన్ పట్టివేత

నైజీరియన్, కాకినాడ వాసి అరెస్టు

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఓ నైజీరియన్, మరో వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్, ముంబయిలను అడ్డాలుగా చేసుకున్న నైజీరియన్.. ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ కొకైన్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ లింబారెడ్డి వివరాలను వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఒగువా జాన్‌బాస్కో(37) 2016లో వ్యాపార వీసాపై ముంబయి వచ్చాడు. అక్కడ నైజీరియన్లు, దక్షిణాఫ్రికా వాసులతో కలిసి ఉంటున్నాడు. వీళ్లు భారత్‌కు వచ్చేటప్పుడు మాదకద్రవ్యాలు తీసుకొచ్చేవాళ్లు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన మహ్మద్ జహరుల్లా అలియాస్ సన్నీ, అలియాస్ ఐజాజ్(33) 2014లో హైదరాబాద్ వచ్చి యూసుఫ్‌గూడలో నివాసం ఉంటూ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈవెంట్స్ చేసే ఇతను ఎక్కువగా హోటళ్లు, పబ్‌ల్లోనే ఉండేవాడు. ఈ క్రమంలో జాన్ బాస్కోతో పరిచయం ఏర్పడి డ్రగ్స్‌పై ఒప్పందం కుదుర్చుకున్నాడు. జాన్ బాస్కో నుంచి డ్రగ్స్ తెప్పించి నగరంలో సరఫరా చేసేవాడు. 4రోజుల క్రితం 80 గ్రాముల కొకైన్‌ను టోలీచౌక్ వద్ద అందజేశాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, ఎస్సార్‌నగర్ పోలీసులు వీరిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆదివారం ఉదయం మధురానగర్ పార్కు వద్ద బాస్కో నుంచి మహ్మద్ జహరుల్లా కొకైన్ తీసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన 180 గ్రాముల కొకైన్, 4 సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ మెయిల్ కేసులో జ్యూడిష్‌రాజ్ అరెస్టు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖలోని వైద్య ఉపకరణాల తయారీ కేంద్రం (ఏఎంటీజెడ్)కు సంబంధించిన విలువైన సమాచారాన్ని నకిలీ మెయిల్ ద్వారా ఇతరులకు చేరవేసిన ఆ సంస్థ మాజీ సలహాదారు జ్యూడిష్‌రాజ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పీ.ఎం.పాలెం సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. మెడ్‌టెక్ సంస్థ డైరెక్టర్, సీఈవో జితేంద్రశర్మ పేరిట జ్యూడిష్‌రాజ్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ పార్కుకు సంబంధించిన సమాచారాన్ని నకిలీ ఈమెయిల్ సృష్టించి ఇతరులకు చేరవేయడం, సంస్థపై అవాస్తవాలు ప్రచారం చేయడం, కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో జ్యూడిష్‌రాజ్‌పై ఏఎంటీజడ్ ఫైనాన్స్ విభాగం ఉద్యోగి విపిన్‌దాస్ రామచంద్రన్ ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విశాఖపట్నం తీసుకొచ్చామన్నారు.

'అధిక ఓల్టేజీ' ట్రాన్స్‌ఫార్మర్లలో నాణ్యత లోపాలు లేవు!

- 'ఈనాడు' కథనంపై ఎస్పీడీసీఎల్ సీఎండీ వివరణ

ఈనాడు, అమరావతి: వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో భాగంగా అధిక ఓల్టేజీ విద్యుత్ పంపిణీ వ్యవస్థ (హెచ్‌వీడీఎస్) ఏర్పాటులో లోపాలు లేవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ హెచ్.వై.దొర తెలిపారు. నిర్దేశిత ప్రామాణికాలను అనుసరిస్తూ హెచ్‌వీడీఎస్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 'కోట్లు కుమ్మరించారు.. నాణ్యత తేల్చేదెవరు' శీర్షికన 'ఈనాడు'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఆదివారం ఆయన వివరణ ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ ఫ్యాక్టరీలోనే తమ సంస్థ అధికారులు తనిఖీ చేసి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఉన్న వాటినే ఎంపిక చేస్తారని తెలిపారు. ఆ తర్వాత నాణ్యత విభాగం అధికారులు మరోసారి పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు.

సమాధానాలు లేని ప్రశ్నలు ఎన్నో..

అనుమతి లేకుండా వివిధ రకాల ట్రాన్స్‌ఫార్మర్లకు స్టాండర్డ్ మార్కు వేసి ఉపయోగిస్తున్నారనే అభియోగంపై ఓ సంస్థ లైసెన్సును గత మార్చిలో 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్' రద్దు చేసింది. ఈ సంస్థే హెచ్‌వీడీఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనేది వెల్లడికాలేదు. వాడే తీగనుబట్టి 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ కంటే 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ రేటు సుమారు రూ.8 వేలు ఎక్కువ అని తేలింది. 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తూ.. వాటిపైనా 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అనే లేబుల్ వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్‌ఈసీ) రుణంతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లోనే హెచ్‌వీడీఎస్‌పై రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంచనా కంటే 4 శాతం అధికానికి ఈ టెండర్లను అప్పగించడం వల్ల కోట్ల రూపాయల అదనపు భారం పడింది. ఈ రెండు జిల్లాల్లోనే రూ.1,016 కోట్ల మేర ప్రపంచ బ్యాంకు రుణాన్ని హెచ్‌వీడీఎస్‌పై ఖర్చు చేస్తున్న నేపథ్యంలో సక్రమ సద్వినియోగానికి స్వతంత్ర సంస్థతో తనిఖీ అవసరమనే భావన వ్యక్తమవుతోంది.

నేడు శ్రీవారి ఆలయం మూసివేత

- చంద్రగ్రహణం కారణంగా ఇతర ఆలయాలు కూడా
- పలు ఆర్జిత సేవలు రద్దు

తిరుమల, అన్నవరం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా సోమవారం రాష్ట్రంలోని పలు దేవాలయాలను మూసివేయనున్నారు. తిరుమలలో శ్రీవారి ఆలయాన్ని సోమవారం సాయంత్రం 4.30 నుంచి మంగళవారం వేకువజామున 2 గంటల వరకు తితిదే మూసివేయనుంది. గ్రహణం ఘడియలు రాత్రి 10.52 ప్రారంభమై అర్ధరాత్రి 12.48 గంటలకు పూర్తవుతాయి. మంగళవారం వేకువజామున 2 గంటలకు ఆలయ తలుపులు తెరచి మందిర శుద్ధి, పుణ్యాహవచనం చేపట్టనున్నట్లు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు తెలిపారు. స్వామివారికి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలు పూర్తయిన తర్వాత ఉదయం 7 గంటలకు సర్వదర్శనం ప్రారంభించనున్నట్లు చెప్పారు. గ్రహణం సమయంలో కంపార్ట్‌మెంట్లలోకి భక్తులను అనుమతించబోమని, అన్నప్రసాద వితరణను పూర్తి స్థాయిలో నిలిపివేస్తామని స్పష్టం చేశారు. గ్రహణం కారణంగా సోమవారం పలు ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు. వరుస సెలవులు కారణంగా ఈనెల 12 నుంచి 15 వరకు రద్దీ భారీగా ఉండే అవకాశం ఉందని, ఈ రోజుల్లో సిఫారసు లేఖలు స్వీకరించబోమని తెలిపారు. తిరుమలలో వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో దాతలు స్వయంగా వస్తేనే గదులు కేటాయిస్తామని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. చంద్రగ్రహణం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం మూసి వేస్తారని ఆలయ ఇన్‌ఛార్జి ఈవో జగన్నాథరావు తెలిపారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన ఆలయాలైన విజయవాడ కనకదుర్గ దేవాలయం, శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయం, భద్రాచలం రామాలయం, యాదగిరిగుట్ట ఆలయాలతో పాటు ఇతర ఆలయాలను చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయనున్నారు.

తిరుమలలో ఇనుప మెట్లు తొలగింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుపమెట్లను తితిదే తొలగించింది. ఆగమశాస్త్రానికి విరుద్ధంగా మెట్లు ఏర్పాటు చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలువురు ఫిర్యాదులు చేశారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మెట్ల తొలగింపునకు దేవస్థానం ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మెట్ల నిర్మాణం చేపట్టకుండా ఉండాల్సిందని, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని సీఎం సూచించినట్లు తెలిసింది. దీంతో తొలగింపు చర్యలను తితిదే యుద్ధప్రాతిపదికన చేపట్టింది. గతంలో చిల్లర నాణేల తరలింపునకు పడమర ప్రాకారంపై కన్వేయర్ బెల్టును ఏర్పాటు చేశారు. దీనిపై అప్పట్లో విమర్శలు రావడంతో తితిదే తొలగించింది.

భక్తుల మనోభావాల మేరకే: ఈవో

ఇనుప మెట్లను భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తొలగించినట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలో ఆదివారం రాత్రి ఈవో విలేకరులతో మాట్లాడుతూ.. "యాత్రికుల అవసరాలు, రక్షణ కోసమే మెట్లు ఏర్పాటు చేపట్టాం. అయినా భక్తుల నుంచి వ్యతిరేకత రావడాన్ని గుర్తించాం. నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించాం. ఆగమ శాస్త్రానికి ఎక్కడా విఘాతం కలగలేదు" అని వివరించారు.



తొలగించిన ఇనుప మెట్ల సామగ్రి

LOVELY PROFESSIONAL UNIVERSITY

Transforming Education Transforming India

LAST DATE OF ADMISSION

10th AUGUST 2017

(subject to availability of seats)

There will be NO EXTENSION on the above mentioned date

HOW TO APPLY? Applicants can apply online at www.lpu.in

MEET OUR COUNSELLORS IN HYDERABAD
Ground Floor, Ameer Estate, Sanjeeva Reddy Nagar Ph: 09914755662

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU)
Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab | SMS LPU to 53030
admissions@lpu.co.in | Toll Free : 1800-102-4428

WWW.LPU.IN



ఆదివారం దిల్లీలో ప్రదర్శన నిర్వహిస్తున్న బీసీ నేతలు

డిమాండ్ల సాధనకు మిలిటెంట్ తరహా పోరాటాలు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ఈనాడు, దిల్లీ: బీసీల డిమాండ్ల సాధన కోసం మిలిటెంట్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కృష్ణయ్య నేతృత్వంలో వివిధ రాష్ట్రాల బీసీ నాయకులు ఆదివారం ఇక్కడ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హరియాణకు చెందిన బీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభల ఎన్నికల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించేంతవరకూ తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా కృష్ణయ్య తెలిపారు. హరియాణలో జాట్‌లు, రాజస్థాన్‌లో గుజ్జర్లు, గుజరాత్‌లో పటేళ్లు చేస్తున్నట్లుగా పోరాటాలు చేస్తేనే కేంద్ర ప్రభుత్వం దిగివస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలోనే తాను ఉత్తరాది రాష్ట్రాల్లో పర్యటిస్తానని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను ఎత్తేయాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు ఎర్రా సత్యనారాయణ, వరప్రసాద్‌యాదవ్, గుజ్జ కృష్ణ, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆయేషా కేసు బాధ్యతల నుంచి సవాంగ్‌ని తప్పించాలి: నన్నపనేని

విజయవాడ: ఆయేషామీరా హత్య కేసుకు సంబంధించి పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించిన అనంతరం బయటకు వచ్చిన సత్యంబాబుని సవాంగ్ ప్రధాన నిందితుడిగా పేర్కొనడం సరికాదన్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ బృందం (సిట్) పర్యవేక్షణ బాధ్యతల నుంచి సీపీని తప్పించాలని డీజీపీని కోరుతామన్నారు. గతంలో పోలీసులు అసలైన నేరస్థులను తప్పించి సత్యంబాబును దోషిగా తేల్చి జీవితం నాశనం చేశారన్నారు.

అమరజవాన్ల కుటుంబాలకు సాయం గొప్ప విషయం

- డీజీపీ సాంబశివరావు

తాడేపల్లి, న్యూస్‌టుడే: దేశం కోసం పోలీసులు, పారా మిలటరీ బలగాలు చేస్తున్న త్యాగాలను గుర్తించి మేము మీవెంటే ఉన్నామనే సందేశాన్ని ప్రజలు ఇవ్వడం చాలా గొప్ప విషయమని డీజీపీ సాంబశివరావు అన్నారు. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఇటీవల మరణించిన 25 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల కుటుంబాలను ఆదుకునేందుకు విజయవాడ క్లబ్ ముందుకొచ్చింది. క్లబ్ సభ్యుల నుంచి సేకరించిన రూ.22.50 లక్షల చెక్కును ఆదివారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ సాంబశివరావు, సీఆర్పీఎఫ్ సదరన్ ఐజీ రాజులకు అందజేసింది. వైకల్యం పొందిన, మృతి చెందిన జవాన్ల కుటుంబాల పిల్లల చదువు బాధ్యతను తీసుకుంటామని విజయవాడ క్లబ్ తెలిపింది. విజయవాడకు చెందిన యలమంచలి కృష్ణమూర్తి కూడా సీఆర్పీఎఫ్ అమర జవాన్ల కుటుంబాలకు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం డీజీపీ విలేకరులతో మాట్లాడుతూ ఆయేషా మీరా హత్యకేసు తిరిగి దర్యాప్తు చేయాలంటే కోర్టు ఆదేశాలివ్వాల్సి ఉంటుందని, ఆదేశాలొస్తే తప్పకుండా చేస్తామని తెలిపారు. ఆయేషా తల్లిదండ్రులు మాత్రం సీబీఐ విచారణ కోరుతున్నారన్నారు.



విజయవాడ క్లబ్ ప్రతినిధుల నుంచి చెక్కును అందుకుంటున్న డీజీపీ, సదరన్ సీఆర్పీఎఫ్ ఐజీ రాజు, గుంటూరు ఎస్పీ విజయరావు

చంపకుండానే చంపేసే రోగాలకు ప్రభావవంతమైన పరిష్కారం....అమృతబిందు



అమృతబిందు
సాటిలేని ఆయుర్వేద పరిష్కారం

కేరళలో 150 సంవత్సరాల ఘన చరిత్ర గల సాంప్రదాయక ఆయుర్వేద కుటుంబానికి చెందిన శంకర్ ఫార్మసీచే తయారు చేయబడిన దివ్యౌషధం 'అమృతబిందు'.

కడుపునొప్పి, గ్యాస్ ట్రబుల్, ఎసిడిటీ, అజీర్ణము, ఛాతిలో మంట, ఆకలి మందగించటం, వికారము, వెన్నునొప్పి, తీవ్రమైన కడుపునొప్పి, అమీబి యాసిస్, మొదలైనవాటికి అత్యంత ఉపయోగకరమైన అమృతబిందు ఔషధమును వాడండి.

అద్భుతమైన ఫలితాలనందించే ఈ ఔషధం కేరళ, శంకర్ ఫార్మసీలో ప్రధాన వైద్యుడు మరియు అష్టాంగరత్న అవార్డు గ్రహీత అయిన డా॥కె.ఎస్. గంగాధరన్ (97) చే తయారు చేయబడింది.

అమృతబిందు తన 65 సంవత్సరాల చరిత్రలో ఉదర రుగ్మతలతో బాధపడుతున్న లక్షలాది మందికి ఎంతో మేలు చేసింది.



Amrita Bindu
This is a Kerala Ayurveda Medicine

మధుమేహ రోగులకు సురక్షితమైనది

అన్ని ఆయుర్వేద,అల్లోపతి షాపులలో మరియు Apollo ఫార్మసీలో కూడా లభిస్తుంది.

ఇప్పుడు అమృతబిందు amazon లో కూడా లభ్యం

మరిన్ని వివరాలకు సంప్రదించండి:
9243112373, 9535846864 (తెలుగు)
89704 34463 (Hindi & English)

ఈనాడు

చేనేతకేదీ చేయూత?

భారతావని ఆత్మకు ప్రతీకగా అలనాడు బాపూజీ అభివర్ణించిన చేనేతరంగం నేడు రకరకాల సమస్యలు, సవాళ్లతో ఉక్కిరిబిక్కిరవుతోంది. నూట పన్నెండేళ్ల క్రితం స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన ఆగస్టు ఏడో తేదీనాడే ఏటా జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్న కేంద్రం, ఈ వార్షిక సంబరాలు నేతన్నల్ని పునరుత్తేజితం చేయగలవని విశ్వసిస్తోంది. 'అందరి బాగుకోసం మనం దరం' లక్ష్యంతో పర్యావరణానికి హానికరం కాని దోషరహిత (జీరో ఎఫెక్ట్- జీరో డిఫెక్ట్) వస్త్రాల ద్వారా భారత చేనేత బ్రాండుకు అంతర్జాతీయ ప్రాచుర్యం కల్పించేదాకా విశ్రమించేది లేదంటోంది. వాస్తవానికి, గతమెంతో ఘనమైన చేనేత రంగాన్ని నమ్ముకున్న ఎన్నో కుటుంబాలకు నూలిపోగులే ఉరితాళ్లుగా మారే దుర్భర దృశ్యాలు గుండెల్ని మెలిపెడుతున్నాయి. ఇందుకు సరైన విరుగుడు ఏమిటో కొత్తగా ఎవరూ అన్వేషించనక్కర్లేదు. ఊరూరా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లగలిగితే చేనేతకు తిరిగి పూర్వవైభవం ఒనగూడుతుందని ఆ రంగం విపణి, ప్రోత్సాహాలపై ఇటీవలి అధ్యయన నివేదిక విశదీకరించింది. జాతీయ స్థాయిలో సగటు వార్షిక తలసరి ఆదాయం లక్షా ముప్పావేల రూపాయలతో పోలిస్తే, నేత కార్మికుల రాబడి అందులో మూడో వంతైనా లేదు. అసోం, పశ్చిమ్ బంగ, తమిళనాడు తరవాత అత్యధికంగా చేనేత మగ్గాలున్న తెలుగు రాష్ట్రాల్లో రాట్నాలున్న ఏ ఇంటిని పరికించినా విషాద గాథలు కదిలిస్తాయి. చేనేత, మర మగ్గాల్ని అనుసంధానించి కార్మికులకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తమిళనాడు, గుజరాత్‌లు దిద్దుబాటుకు నమూనాలుగా నిలుస్తున్నాయి. పశ్చిమ్ బంగ, కశ్మీర్, రాజస్థాన్, యూపీ లాంటిచోట్ల చేనేత సమూహాలతో ప్రయోగాలు కార్మికులకు ఇతోధికంగా చేయూత అందించగలుగుతున్నాయి. వస్త్రపరిశ్రమ అభివృద్ధికి రెండేళ్ల క్రితం పంచవర్ష విధానం ప్రకటించిన ఏపీ, ఒక్క నేత కార్మికుడూ ఆత్మహత్య చేసుకునే దుస్థితి దాపురించకుండా త్రిముఖ వ్యూహంతో కాచుకొంటామన్న తెలంగాణ- సుదృఢ సంకల్ప దీక్షతో ముందడుగు వేయాలి!

ఆ మధ్య కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ వెల్లడించిన అధికారిక గణాంకాలు చేనేత ఎగుమతుల్లో భారీ క్షీణతను కళ్లకు కట్టాయి. ఏడాది వ్యవధిలోనే చేనేత ఎగుమతులు 30 శాతం మేర తగ్గడం, మొత్తం జౌళి ఎగుమతుల్లో చేనేత వాటా ఎన్నడూ లేనంతగా 10 శాతానికి పతనం కావడం- సంక్షోభ తీవ్రతకు దర్పణం పడుతున్నాయి. అమెరికా, ఐరోపాల్లో మన చేనేత వస్త్రాల నాణ్యతకు ప్రశంసలు లభిస్తున్నా- చైనా, టర్కీ, వియత్నాం ప్రభృత దేశాలకు ఉత్పత్తి ధరలో పోటీ ఇవ్వలేకపోవడం భారత బ్రాండును కుంగదీస్తోంది. ఆధునిక డిజైన్ల రూపకల్పనలో నేత కార్మికులకు సరైన మార్గదర్శకత్వం కొరవడి, గిరాకీ మందగించి, నిల్వలు పేరుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లమందికి ఉపాధి కల్పించగల సామర్థ్యం ఉన్నట్లు ప్రధానమంత్రే ప్రస్తుతించిన చేనేతపృదు పక ద్రుండి వ్యవస్థాగత తోడ్పాటు ప్రాణావసరం. గతంలో జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్‌హెచ్‌డీపీ) పేరిట సాంకేతికంగా, నైపుణ్యాలపరంగా తోడ్పాటు, మౌలిక వసతుల పరికల్పన, స్వయం సహాయ సంఘాలకు సహకారం తదితరాలపై పెద్దయెత్తున ప్రచారం జరిగినా- సరైన పురోగతి సాధ్యపడలేదు. నేటికీ నూలు వడకడం, అద్దకం, రంగులు వేయడం, ఎంబ్రాయిడరీ వంటివన్నీ చేతులతోనే చేస్తుండటంవల్ల కొత్త డిజైన్ల రూపకల్పనలో మందభాగ్యం వెక్కిరిస్తోంది. విరివిగా ఎగుమతి అవకాశాలు ఒడిసిపట్టేందుకు మార్గం సుగమమయ్యేలా, 'నిఫ్ట్' వంటి సంస్థల సాయంతో సృజనాత్మక డిజైన్ల రూపకల్పన నిమిత్తం ప్రత్యేక వ్యవస్థనొకదాన్ని సత్వరం అవతరింపజేయాలి. చేనేత ఉత్పత్తులపై యువతలో మక్కువ పెంచి, ఎగుమతుల్లోనూ విశేష వృద్ధి సాధించడానికి అది నిశ్చయంగా దోహదపడుతుంది!

గ్రామీణ భారతాన వ్యవసాయం తరవాత అత్యధికులకు జీవనాధారమై నిలిచిన అపురూప కళారంగం చేనేత. ఏళ్ల తరబడి నిరాదరణకు గురైన కీలక రంగ సముద్ధరణ కోసమంటూ శివరామన్, ఆబిద్ హుసేన్, మీరాసేత్ కమిటీల సిఫార్సుల రాబట్టి పేరబెట్టడం- మునుపటి ప్రభుత్వాల ఘోర నిర్లక్ష్యానికి నిలువెత్తు దాఖలా. ఈ దుస్థితిని చెదరగొట్టి సంప్రదాయ వృత్తికళకు కొత్త ఊపిరులూది నూతన డిజైన్లతో నవచేతన నింపుతామన్న మోదీ ప్రభుత్వం, ఇ-కామర్స్ వేదికల అనుసంధానంతో మార్కెటింగ్‌ను ఉరకలెత్తిస్తామంటోంది! దేశంలో ఆరేళ్ల క్రితం 43 లక్షలుగా నమోదైన చేనేత కార్మికుల జనాభా 38 లక్షలకు కుదించుకుపోయిందన్న అంచనాలు, మగ్గం చుట్టూ సమస్యల కోలాటాన్ని ప్రస్ఫుటీకరిస్తున్నాయి. దాదాపు మూడొంతుల కార్మికులు నూలు, రసాయనాల కాలుష్యం వల్ల అనారోగ్యం బారినపడుతున్నారు. లోగడ 290కి పైగా జిల్లాల్లో కొనసాగిన చేనేత సుమారు 80 జిల్లాలకు పరిమితమైపోయిందంటున్నారు. ఎక్కువగా చీరలు, అక్కడక్కడా దుప్పట్లు తువ్వాళ్ల తయారీ- చేనేత పునాదులే కదలబారుతున్నాయనడానికి ప్రబల సంకేతం. పర్యావరణ అనుకూలమైన అల్లికలు, అద్దకాలు, ఆకృతులకు విశ్వవ్యాప్తంగా గిరాకీకి కొదవన్నది లేదు. వినూత్న డిజైన్లతో చేనేత వస్త్రాల లభ్యత పెరిగితే దేశీయంగా, ఆన్‌లైన్‌లో విక్రయాలు జోరెత్తుతాయని మార్కెటింగ్ నివేదికలు ఢీమాగా చెబుతున్నాయి. ముద్రా బ్యాంకు ద్వారా రుణవితరణ, ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థల ద్వారా డిజైన్లు సమకూరితే చేనేత రంగం వడివడిగా పుంజుకోగలుగుతుంది. అంతర్జాతీయంగా భారీ డిమాండును చురుగ్గా సొమ్ము చేసుకోగల దక్షత చేకూరితే- చేనేత రంగాన తిష్ఠవేసిన నైరాశ్యం చెల్లాచెదురవుతుంది. తద్వారా భారత బ్రాండ్ జిగేల్మనిపించేలా ప్రభుత్వాల కార్యాచరణ ప్రణాళికలు పదునుతేలాలి!

చినుకు లేదు... కునుకు రాదు!

వాన రాకడ ప్రాణం పోకడ తెలియవంటారు. సాంకేతిక విజ్ఞానం ఎన్నో ఎత్తులకు చేరినా వర్షాల ఆగమనాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు. రుతువుల్లో కురవాల్సిన వానలూ మొహం చాటేస్తున్నాయి. వాయుగుండాలు, అల్పపీడనాలు ఏర్పడితే తప్ప వర్షాలు కురిసే పరిస్థితి లేదు. శాస్త్రవేత్తల అంచనాలు ఒక్కోసారి గురితప్పుతున్నాయి. పెరుగుతున్న కాలుష్యానికి తోడు, కొనసాగుతున్న పర్యావరణ హననం సమస్యలకు అంటుకడుతోంది. ఎల్‌నినో, లా నినా పరిస్థితులనూ పోల్చుకోలేని రీతిలో వాతావరణ మార్పులు సాగుదారులకు పరీక్ష పెడుతున్నాయి. సాంకేతికత సాయంతో ఈ సమస్యలకు పరిష్కారాలపై విస్తృత అధ్యయనం జరగాలి. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంట ప్రణాళికలను సైతం మార్చుకునేలా శాస్త్ర పరిశోధనలు సాగాలి.

వణికిస్తున్న విపత్తులు

ఎల్‌నినో, లా నినాల కారణంగానే వాతావరణ సీజన్లు గతి తప్పుతాయన్నది ఇప్పటివరకు ఉన్న భావన. ఎల్‌నినో ఏర్పడితే తీవ్ర వర్షాభావ ఛాయలు; లా నినా వల్ల పుష్కలంగా వర్షాలు కురుస్తాయన్న అంచనాలూ తలకిందులవుతున్నాయి. ప్రస్తుతం లా నినా పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు చెబుతున్నప్పటికీ, వర్షాభావం కొనసాగుతుండటమే వైచిత్రి! ప్రకృతి వనరుల విధ్వంసం కారణంగానే ఈ అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని పర్యావరణవేత్తలు స్పష్టీకరిస్తున్నారు. కురవాల్సిన సమయంలో వర్షాలు కురవకపోవడం, పడాల్సిన వర్షమంతా ఒకే నెలలో గుమ్మరించి వెళ్లడం వంటి పరిణామాలు పంటల సాగును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. నాలుగైదేళ్లుగా ఈ ధోరణి మరీ స్పష్టంగా కళ్లకు కడుతోంది. తొలకరి తరవాత వానలు మొహం చాటేయడం జులై, ఆగస్టు మాసాల్లో సరిపడా వర్షాలు లేకపోవడం; సెప్టెంబరులో కురవాల్సిన శాతం కంటే అధికంగా పడటం పరిపాటిగా మారింది. ఈ పోకడలవల్ల రైతులకు ఖరీఫ్ సాగు కలిసిరావడం లేదు. రబీ ఒక్కటే వారిని కాస్తోకూస్తో నిలబెడుతోంది. ఇందుకు ఈ ఏడాదీ మినహాయింపు కాదు. చురుగ్గా ఉండాల్సిన దశలో రుతుపవనాలు నిరుత్సాహపరుస్తున్నాయి. సరిపడా వానలు కురవక నాట్లు సాగడంలేదు. నారుమడులు పోశాక నాట్ల సమయంలో చేనుకు నీటి తడులు ఎంతో అవసరం. ఏటా సీజన్ మొదలయ్యాక నారుమడులు పోసేందుకే నీరు అందుబాటులో ఉండటం లేదు. తొలకరి వర్షాలకు నారుమడులు పోసే రైతులు, నెల రోజుల తరవాత నాట్లకు సిద్ధం కావడం సహజం. మొదట్లో మురిపించేలా కురిసే వర్షాలు, మడులు వేశాక మొహం చాటేస్తున్నాయి. వర్షాలు కొనసాగి కాలువల్లోకి నీరు వచ్చే నాటికి రైతులు నాట్లకు ఉద్యుక్తులవుతారు. కానీ కాలువల్లో నీరు పారడం లేదు. చిత్రంగా కాలువ మరమ్మతు పనులూ అప్పుడే చేస్తుండటం గమనార్హం. గోదావరి, కృష్ణల ఎగువ పరీవాహక ప్రాంతాల్లో వానలు కురిస్తేనే తెలుగు రాష్ట్రాలకు నీరు చేరుతుంది. ఏటా ఆగస్టు చివరినాటికీ ప్రాజెక్టులకు నీరందటం లేదు. గోదావరిలో బాబ్లి, వాటి ఎగువ పథకాలతో పాటు ఇటు కృష్ణలో ఆలమట్టి వంటి ప్రాజెక్టులు పూర్తిగా నిండితే కానీ దిగువకు నీరు వదలని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టుల పరిధిలోని ఉపనదులు, వాగుల నీరే తాగు, సాగునీటికి దిక్కవుతోంది. గడచిన కొన్ని సీజన్లలో జులై, ఆగస్టులలో సగటు వర్షపాతమూ నమోదు కావడం లేదు. సుమారు 40శాతం లోటు కనిపిస్తోంది. ఫలితంగా నార్లు ముదిరిపోవడం, నాట్లు ఆలస్యం కావడం కొన్నేళ్లుగా చూస్తున్నాం. ఏటా తెలుగు రాష్ట్రాల్లో జులై 20 తరవాత పడాల్సిన వరి నాట్లు ఆగస్టు 20నుంచి సెప్టెంబరు అర్ధభాగం వరకు సాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలాల్సిన ఖరీఫ్ నాలుగు నెలల్లో మూడు నెలల పాటు అత్యల్ప వర్షపాతం నమోదవుతుండటంవల్లే ఈ దుస్థితి దాపురిస్తోంది. ఉపరితల ద్రోణి లేదా అల్పపీడనాలు సంభవిస్తే తప్ప వర్షాలు కురవడంలేదు. అవి కూడా చెదురుమదురుగా పడటంతో పంటలకు కలిసిరావడం లేదు. సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటలపై దుష్ప్రభావాలు తప్పవు. నాట్లు ఆలస్యం కావడం వల్ల పంట చేతికొచ్చే కాలం మారుతుంది. దీనివల్ల తుపాన్లు, భారీ వర్షాలు సంభవిస్తాయి. ఆ పరిణామం దిగుబడుల్ని తీవ్రంగా దెబ్బకొడుతుంది. అదనులో నాట్లు పడకపోవడం, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలవల్ల చీడపీడలు పెచ్చరిల్లి సుమారు 20శాతం నుంచి 40శాతం పంట నాశనం కావచ్చు. పైగా వీటి నివారణకు ఎరువులు, క్రిమిసంహారకాలు వాడాల్సిన మోతాదు కంటే అధికంగా ఉపయోగించాల్సి వస్తుంది. దీనివల్ల రైతుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యంగా పంటలు ఎదిగే సమయంలో- అధిక ఉష్ణోగ్రతలు, అత్యల్ప వర్షపాతం వంటి వాటివల్ల దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని వివిధ అధ్యయనాల్లో తేలింది. ఈ పరిణామాలన్నీ రైతుల నికరాదాయాన్ని దెబ్బతీస్తాయి. దీనివల్ల రైతులపై అప్పుల భారం అధికమవుతోంది. వాటిని తీర్చే మార్గంలేక ఆత్మహత్యలకూ పాల్పడాల్సి వస్తోంది. అమెరికాలోని బెర్కిలే క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ విషయాన్నే ధ్రువీకరించారు. గడచిన 30 ఏళ్లలో వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో 59వేలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఇటీవలి వారి అధ్యయనంలో తేలింది. పరిస్థితులు ఇలా



భయపెడుతున్న రుతుపవన విరామం

ఉండగా- తెలుగు రాష్ట్రాల్లో మాగాణి వరికి నాట్లు వేసే సమయం మించిపోతోంది. ఇప్పటికే వరి, పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, సోయా పంటలు వేసినవి వేసినట్టే ఎండిపోతున్నాయి. ఎదిగే తరుణంలో నెలకొన్న తీవ్ర వర్షాభావంతో మొక్కలు తలవాల్చేస్తున్నాయి.

ఆగస్టు రెండో తేదీనాటికి ఆంధ్రప్రదేశ్‌లో 21.31 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా 17.54 ల.హె.(82 శాతం)లో పంటలు వేశారు. తెలంగాణలో ఇదే తేదీ నాటికి 29.91 ల.హెక్టార్లకు గాను 32.17 ల.హెక్టార్లు సాగైంది. అయితే వేసిన పంటలు చాలావరకు ఎండిపోతున్న పరిస్థితి తెలంగాణలో అధికంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో జూన్‌లో 30.7 శాతం, తెలంగాణలో 47 శాతం అదనంగా వర్షం కురిసింది. జులైలో పరిస్థితి తారుమారైంది. ఆంధ్రలో 24 శాతం, తెలంగాణలో 40 శాతం 'లోటు వర్షపాతం' నమోదైంది. సాధారణ విస్తీర్ణంతో పోల్చితే ఆగస్టు రెండో తేదీనాటికి ఆంధ్రప్రదేశ్‌లో 82 శాతం, తెలంగాణలో 74 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. చాలావరకు పంటల

తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్ ముఖ్య పంటల సాగు

(2-8-17 నాటికి లక్షల హెక్టార్లలో)

పంట	సాధారణ విస్తీర్ణం		సాగైన విస్తీర్ణం	
	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ
వరి	15.63	9.34	6.09	3.45
పత్తి	6.41	16.76	4.05	17.47
వేరుసెనగ	9.10	0.18	3.56	0.09
కంది	2.18	2.78	0.97	2.29
మొక్కజొన్న	0.92	5.28	0.60	4.28
అన్ని పంటల సాగు	40.47	43.24	17.54	32.17

ఆధారం: తెలుగు రాష్ట్రాల వ్యవసాయశాఖ నివేదికలు

సాగు జరిగింది కాబట్టి నీరందక ఎండిపోతున్న దుస్థితే ఎక్కువగా ఉంది. ఆగస్టు 15 దాటాక కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగితే, వేసిన పంటలు ఎండిపోవడంతోపాటు పంటలు వేసుకోలేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేయాల్సి ఉంటుంది. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, మెదక్, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమరం భీం, వికారాబాద్ జిల్లాలు; ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పంటలు వేయని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వర్తిస్తుంది. కొన్నేళ్లుగా ఆగస్టు నెలాఖరుకు కూడా ఈ ప్రణాళిక ఊసెత్తకుండానే సంప్రదాయ పంటల సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యంగా నాటినప్పటికీ, పంటలైతే పండుతాయి కానీ ప్రతికూల పరిస్థితుల వల్ల దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోతామన్న సంగతిని రైతాంగం గ్రహించాలి. ఇలా చేస్తే రబీ సైతం ఆలస్యమవుతుంది. అంటే మొత్తంగా రెండు సీజన్లూ ప్రభావితమవుతాయి. ఈ పరిణామాలన్నీ తెలుగు రైతులకు తీవ్ర కష్టనష్టాలు తెచ్చిపెట్టేవే!

సన్నద్ధతే ప్రధానం

ఈ ఏడాది వర్షపాతం సాధారణ స్థాయికి మించి నమోదవుతుందని, రుతుపవనాలు దేశమంతటా సమానంగా విస్తరిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. రైతులకు అత్యంత కీలకమైన జూన్-ఆగస్టు వరకు రుతుపవనాలు సాధారణంగా ఉంటాయని, ఆ తరవాత 'లా నినా' వల్ల వర్షాలు బాగా కురుస్తాయనీ ఐఎండీ అంచనా వేసింది. సీజన్‌కు కీలకమైన దశలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు వర్షపాతం దాదాపు సాధారణ స్థితిని నమోదు చేసినా తెలంగాణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఐఎండీ సూచనలే నిజమైతే- మళ్ళీ సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వరద ముప్పును కొట్టిపారేయలేం. వర్షపాతం సమంగా లేకపోవడం, ఒకేసారి కురవడం వంటి పోకడ ప్రభావమే ఇదంతా! దీనివల్ల రైతుకు మరిన్ని సమస్యలు రానున్నాయని చెప్పాలి. సెప్టెంబరు తరవాత తీవ్రంగా కురిసే వర్షాలతో పొట్ట దశలో, కోత దశలో పంట నష్టాలు పొంచి ఉన్నాయి. ఇందుకు రైతుల్ని సన్నద్ధం చేయాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. అసలు వర్షం ఏ సమయంలో, ఏయే ప్రాంతాల్లో కురుస్తుంది, ఎన్ని సెంటీమీటర్లు కురుస్తుంది, ఏ మేఘంలో ఎన్ని గ్యాలన్ల నీరు నిల్వ ఉండే అవకాశముంది వంటి కచ్చితమైన సమాచారాన్ని విశ్లేషించగల సాంకేతికత నేడు అందుబాటులో ఉంది. ఈ దిశగా ఉపగ్రహ సేవలూ అందుబాటులో ఉన్నాయి. కానీ, ఆ సాంకేతికతను రైతుల వద్దకు చేరవేసే యంత్రాంగం ఇంకా బలపడలేదు. ముందస్తు వాతావరణ సూచనలు, సన్నద్ధత ఉంటున్నా- విపత్తుల వల్ల వాటిల్లే నష్టాన్ని తగ్గించే చర్యలు కొరవడుతున్నాయి. అలాగే ఏ సీజన్‌లో ఎంత వర్షం కురవవచ్చు అనే ముందస్తు అంచనాల్లోనూ కచ్చితత్వం ఉండటం లేదు. గతంతో పోలిస్తే తుపాన్లకు ముందస్తు సన్నద్ధత ఎంతో పెరిగింది. నష్టాలను బాగా తగ్గించగలుగుతున్నారు. అయినప్పటికీ పంట నష్టాల విషయంలో అన్నదాతకు అవగాహన పెంచడం లేదు. నష్టం వాటిల్లాక అందించే తోడ్పాటుతో పాటు పరిహారం విషయంలోనూ రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ రైతులకు అప్పుల తిప్పల్ని పెంచేస్తున్నాయి.

పరిస్థితులన్నీ అనుకూలించి పంట చేతికందితే ఒక సంతోషం, ఆ పంటకు మంచి ధర దక్కితే మరింత ఆనందం. మారుతున్న వాతవరణ పరిస్థితులకు తగ్గట్లు పంటల ప్రణాళికలను మార్చుకునేలా శాస్త్రవేత్తలు లోతుగా అధ్యయనం చేయాలి. ఏటా ఇవే తరహా పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించాలి. ఆరుగాలం కష్టాన్ని వర్షార్పణం చేయకుండా, పంటకు మంచి ధర దక్కేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఆ గురుతర బాధ్యతను ప్రభుత్వాలు గుర్తించాలి. సాంకేతికతను ఉపయోగించుకుని విపత్తుల వేళ నష్టాలను పరిమితం చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. రైతులు నిలదొక్కుకునేలా వారికి చేయూత అందించాలి. ప్రకృతి విసిరే సవాళ్లను తట్టుకునేలా సరికొత్త వంగడాలు రూపొందించేలా పరిశోధనల్ని ముమ్మరం చేయాలి!

– అమిర్నేని హరికృష్ణ

బోధనతో భాషకు పదును

జంతువు నుంచి మనిషిని వేరు చేసిన గొప్ప ప్రక్రియ భాష. కీచ్ మనే శబ్దంతో ప్రారంభమైన భాష మొదట సంజ్ఞలతో, శబ్దాల కలయికతో వస్తుపదార్థాలను గుర్తిస్తూ తరతరాలుగా ముందుకు సాగింది. ఆ క్రమంలో పదాలు, వాక్యాలు ఏర్పడ్డాయి. ప్రతి తెగకు ఏర్పడిన భాష అక్షర రూపం సంతరించుకోవడానికి వేల సంవత్సరాలు పట్టింది. నేడు ప్రపంచవ్యాప్తంగా 6,909 భాషలు ఉన్నా, వాడుకలో ఉన్నవి కొన్ని మాత్రమే. అనేక భాషలు, సంస్కృతుల సమాహారం భారతదేశం. బ్రిటిష్ పాలకులు ఒకటిన్నర శతాబ్దాలు పాలించినందువల్ల ఆంగ్ల భాష మన దేశంలో బలంగా వేళ్లూనుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ముప్పై ఏళ్ల వ్యవధిలో ఆంగ్లాన్ని దేశంలో లేకుండా చేయాలని ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆకాంక్షించినా ఆచరణలో అది విఫలమైంది. అంతర్జాతీయంగా పెరిగిన ప్రాధాన్యం దృష్ట్యా దేశంలో ఆంగ్లం ఉనికి కొనసాగుతూనే వచ్చింది. అంతర్జాతీయ భాషగా ఆంగ్లం, జాతీయ భాషగా హిందీ, ప్రాంతీయ భాషగా స్థానిక మాతృభాషలు నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్లే త్రిభాషా సూత్రం తెరపైకి వచ్చింది. వాద వివాదాల నడుమ, విద్యారంగంలో మూడు భాషల బోధనకు ప్రాధాన్యం దక్కుతూ వచ్చింది.

ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాది

విద్యారంగంలో ఆంగ్లభాషను ఏ తరగతి నుంచి ప్రవేశపెట్టాలి, ఏ తరగతి నుంచి బోధన మాధ్యమంగా అమలు చేయాలన్నదానిపై దేశవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాలు తమకు అనువైన విధానాన్ని అనుసరిస్తున్నాయి. విద్యార్థులకు ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలని, అమ్మభాషపై పట్టుసాధిస్తే ఆపై మరో భాషను సులభంగా నేర్చుకోగలమన్నది భాషావేత్తల వాదన. కాని, మాతృభాష సహా ఆంగ్లాన్ని ఒకటో తరగతి నుంచే నేర్పిస్తున్న విధానమే నేడు ఎక్కువగా అమలవుతోంది. ఏక కాలంలో రెండు భాషలు నేర్పించడానికి పాఠశాలలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల బోధన పద్ధతుల్లో అనేక మార్పులు తీసుకురావాలి. మాతృభాష ఔన్నత్యాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూనే, కాలానుగుణ అవసరాల కోసం ఆంగ్లాన్ని అభ్యసిస్తున్నామన్న స్పృహ నేటి తరం విద్యార్థుల్లో కలగజేయడం ఎంతైనా అవసరం. ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని విద్యాహక్కు చట్టం(2009) సైతం సూచిస్తోంది. కానీ, చిన్నతనంలోనే తమ పిల్లవాడు ఆంగ్గంలో అనర్గళంగా మాట్లాడేయాలన్న తపనతో ఉపాధ్యాయులు, నిపుణుల సూచనలను సైతం తల్లిదండ్రులు బేఖాతరు చేస్తున్నారు.

జాతీయ విద్యావిధానం ప్రకారం దేశంలో త్రిభాషా సూత్రం అమలవుతోంది. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాతృభాష, ఆంగ్లంతోపాటు మూడోభాషగా హిందీని బోధిస్తున్నారు. హిందీ రాష్ట్రాల్లో హిందీ, ఆంగ్లంతో పాటు మరో భారతీయ భాష చదువుకోవాల్సి ఉంటుంది. నిజానికి ఈ త్రిభాషా సూత్రాన్ని మొదట విశ్వవిద్యాలయ విద్యాకమిషన్ 1948-49లో ప్రతిపాదించింది. అభ్యసన ప్రకారం ఇది భారమైన ప్రణాళిక అయినా నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో ఈ విధానం విజయవంతంగా అమలవుతోందని కమిషన్ తెలిపింది. ఉర్దూ భాషను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వం 1972లో ఐకే గుజ్రాల్ కమిటీని నియమించింది. హిందీ మాట్లాడే ప్రాంతాల్లో హిందీ, ఉర్దూ లేదా నూతన భారతీయ భాష, ఆంగ్లం లేదా ఏదైనా ఒక ఐరోపా భాష; హిందీయేతర రాష్ట్రాలకు ఒక ప్రాంతీయ భాష, హిందీ, ఉర్దూ లేదా ఏదైనా భారతీయ భాష ఉండాలని సూచించింది. ప్రస్తుతం త్రిభాషా సూత్రం తమిళనాడు, పాండిచ్చేరి మినహా దేశవ్యాప్తంగా అమలవుతోంది. ఎనిమిదో తరగతివరకు అమలుచేస్తున్న త్రిభాషా సూత్రాన్ని 9, 10 తరగతులకూ వర్తింపజేయాలని కేంద్ర మాధ్యమిక విద్యామండలి(సీబీఎస్‌ఈ) ఇటీవల కేంద్ర మానవ వనరుల శాఖకు సూచించింది. అలాగే రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులో ఉన్న భాషలను బోధించడం తప్పనిసరని తెలియజేసింది. ఈ విషయంలో పాఠశాలలపై ఒత్తిడి తీసుకురావాలన్న యోచన కేంద్రానికి లేదని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ స్పష్టీకరించారు.



ఆధునిక విధానాలు ఆవశ్యకం

నాగాలాండ్ రాష్ట్రంలో అధికార భాష ఆంగ్లం. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఆంగ్లభాష విద్యార్థులకు పరిచయమవుతోంది. దిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ్ బంగ, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటకల్లో రెండో భాషగా; బిహార్, మహారాష్ట్రల్లో మూడో భాషగా ఆంగ్లాన్ని ప్రవేశపెట్టారు. గుజరాత్‌లో అయిదో తరగతి నుంచి ఆంగ్లభాషను పరిచయం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడేళ్లుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచే విద్యార్థులకు ఆంగ్లభాష బోధిస్తున్నారు. గతంలో పదో తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల విద్యార్థులకు భిన్నమైన పాఠ్యాంశాలు ఉండేవి. 2007 నుంచి రెండు మాధ్యమ విద్యార్థులకు ఒకే పాఠ్య ప్రణాళిక విధానాన్ని ప్రవేశపెట్టారు. మండల పరిషత్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన గురుకుల, సంక్షేమ పాఠశాలల్లో అయిదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో; పురపాలక సంఘ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం, లేదా ఆంగ్ల మాధ్యమం చదివే అవకాశం ఇటీవలి కాలంవరకు ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. దీన్ని పకడ్బందీగా అమలుచేయాలంటూ పురపాలక అధికారులు ఆదేశాలు జారీచేశారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం కొనసాగుతుండగా- కొన్ని ప్రాంతాల్లో 'సక్సెస్' పాఠశాల పేరిట తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం కొనసాగుతోంది. అన్ని సంక్షేమ పాఠశాలల్లో అయిదో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టారు. ఆయా పాఠశాలల్లో సీబీఎస్‌ఈ పాఠ్యప్రణాళిక ఉండాలని ప్రభుత్వం భావించినప్పటికీ, అది 2007-08, 2008-09 సంవత్సరాలకు మాత్రమే పరిమితమైంది. గిరిజన సంక్షేమ మినీ గురుకులాల్లో ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలోనే కొనసాగనుంది. అలాగే బడికి రావడం మానేసిన పిల్లల కోసం ఉద్దేశించిన కస్తూరిబా పాఠశాలల్లో పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే పాఠాలు బోధించనున్నారు. పురపాలక సంఘ పాఠశాలల్లో ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో ఆరు నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం కొనసాగుతుంది.

వైవిధ్యంతో కొత్తదనం

కొత్త భాష నేర్చుకునే క్రమంలో అనేకమంది విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వ్యాకరణం ప్రసక్తిరాగానే తల్లడిల్లిపోయే పిల్లలు ఎందరో ఉన్నారు. దీనివల్ల అభ్యసన ప్రక్రియ భారంగా మారిపోతుంది. కొత్త భాషలో మాట్లాడటానికి పిల్లలు బిడియపడుతుంటారు. ఉపాధ్యాయుడి గొంతే తరగతి గదుల్లో ప్రతిధ్వనిస్తుంటుంది. రోజూ పిల్లలతో ఉపాధ్యాయుడు స్వయంగా కొత్త భాషలో సరళంగా సంభాషిస్తుండాలి. అప్పుడే పిల్లల్లో బెరుకు తగ్గి, భాషా పరిజ్ఞానం అలవడుతుంది. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఆ క్రమంలో పిల్లలకు బాలసాహిత్యం చదవడాన్ని అలవాటు చేయాలి. భాష ఉనికి, పెరుగుదల, ఉపయోగం అంతా సందర్భంమీద ఆధారపడి ఉంటుంది. ఒక భాష మరో భాషలోకి చొచ్చుకుపోవడం సహజం. అందువల్ల రెండు భాషల పదాలు కలగలిపి వాడటం అధికమవుతుంది. మాతృభాష స్థానంలో రెండో భాష పదాలు ప్రవేశిస్తాయి. ఈ వైవిధ్యాన్ని సమర్థంగా ఉపయోగించుకుని భాషలను అభివృద్ధి చేయవచ్చు. ఈ భావన తరగతిలోని బహుభాషత్వానికి ఒక బోధన వ్యూహంగా ఉపయోగపడుతుంది.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా భాషలను ఆడుతూ పాడుతూ అభ్యసించే విధానాలను ప్రవేశపెట్టడం ఎంతైనా అవసరం. బోధనకు సులభమైన పద్ధతులు అనుసరించాలి. బోధన పరికరాలు, పాఠ్యప్రణాళికలు, సామర్థ్యంగల ఉపాధ్యాయులు ఉన్నప్పుడు భాషా బోధన సరళతరమవుతుంది. కాలం చెల్లిన పద్ధతులను పరిహరించాలి. బోధనలో అధునాతన విధానాలను ఉపాధ్యాయులు అలవరచుకోవాలి. ఈ దిశగా ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు ప్రత్యేక శ్రద్ధ కనబరచినప్పుడే విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు వెల్లివిరుస్తాయి!

– డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి

రాఖీ పూర్ణిమ

అనురాగ బంధాల్ని, ప్రేమానురాగాల్ని బలోపేతం చేసే అపురూప పర్వదినం- రాఖీ పౌర్ణమి. శ్రావణ మాసంలో వచ్చే శుభకర వేడుకల్లో, రక్షాబంధనం రమణీయం. నిండు పున్నమివేళ సిరివెన్నెల కురిసే శ్రావణ పూర్ణిమనాడు, ఈ బంధనంలో మమతల మధురిమలు వెల్లివిరుస్తాయి. సామరస్య సంతోషాలు సోదర సోదరీమణుల మధ్య వ్యక్తమవుతాయి. ఉత్తర భారతంలో విశేష వ్యాప్తి చెందిన ఈ సంబరం, కాలక్రమంలో దేశమంతటా విస్తరించింది.

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతలకు ఓ అందమైన ఆవిష్కరణ- రక్షాబంధనం. సోదరుడి ఆరోగ్యం, శ్రేయస్సు, సంతోషాన్ని ఆకాంక్షిస్తూ- సోదరి పవిత్ర హృదయంతో అతడి చేతికి రక్షా కంకణాన్ని ధరింపజేస్తుంది. నుదుట తిలకం దిద్ది, మంగళహారతి ఇచ్చి, మధుర పదార్థాన్ని సోదరుడికి సోదరి తినిపిస్తుంది. అమ్మ కనబరచే ఆదరణ, నాన్న కలిగించే భద్రతను ప్రస్ఫుటం చేస్తూ- సోదరి తన అనురాగాన్ని సోదరుడి పట్ల ప్రకటిస్తుంది. 'నేను ధరింపజేసే ఈ రక్ష- నీ భావి జీవితమంతటా సర్వదా అండగా ఉంటుంది' అనే భావనను వ్యక్తీకరిస్తుంది. సోదరుడి కుడిచేతికి సోదరి 'మంగళ రక్షాబంధనం' చేయాలని 'వ్రతోత్సవ చంద్రిక' గ్రంథం చెబుతోంది.

రక్షాబంధనం ఉత్సవానికి అనేక పేర్లున్నాయి. రక్షికా పున్నమి, నారికేళ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి- ఇలా అనేక రీతుల్లో ఈ సందడి వ్యవహారంలో ఉంది. దీన్ని 'ధర్మబద్ధమైన వేడుక'గా పురాణాలు నిర్వచించాయి. పాండవులకు జయం సిద్ధించడానికి శ్రీకృష్ణుడు ఓ సూచన చేస్తాడు. ఆ మేరకు ధర్మరాజు తన సోదరులకు మంత్రపూర్వకంగా రక్షాబంధన మహోత్సవం నిర్వహించాడని 'మహాభారతం' చెబుతుంది. సోదరీమణులతో రక్షాబంధనం ధరింపజేసుకున్నవారికి యమకింకరుల భయం ఎన్నటికీ ఉండదని- యముడు తన సోదరి యమునకు చెప్పినట్లు 'భవిష్యోత్తర పురాణం' పేర్కొంది. దానశీలుడైన బలి చక్రవర్తికి శ్రీమహావిష్ణువు తన శక్తిని ఓ కంకణంలో నిక్షిప్తం చేయడం ద్వారా 'రక్ష'గా అందజేశాడని 'విష్ణుపురాణం' విశదపరిచింది. శత్రుభయం లేకుండా తన సుపుత్రుడు అఖండ పాలన సాగించాలని ఆకాంక్షిస్తూ, భరతుడికి తల్లి శకుంతల రక్ష కట్టిందని పురాణ కథనం.

'రాకా' అంటే- నిండుదనం, పున్నమి అనే అర్థాలున్నాయి. రాకా చంద్రుడు అంటే, పున్నమి చంద్రుడు. ఈ పున్నమినాడు ధరించే రక్ష 'రాఖీ'గా స్థిరపడింది. 'రాఖీ' అంటే, రక్షిక. అది సంవత్సర పర్యంతం సోదరుడికి రక్షగా నిలిచే మహత్తర కవచమని 'ధర్మసింధు' ప్రస్తావించింది. చారిత్రకంగానూ రక్షాబంధనం ఎంతో ప్రశస్తి చెందింది. రాజపుత్రుల యువరాణి కర్ణావతి- మొగలాయీ పాలకుడు హుమాయూన్‌కి రక్షను ధరింపజేసి, శత్రువుల నుంచి రక్షణ పొందిందంటారు. పురుషోత్తమ చక్రవర్తికి రాఖీ కట్టిన అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా, ఆయనకు ప్రాణభిక్ష కోరిందని చెబుతారు. ఛత్రపతి శివాజీ ఏటా పూర్ణిమనాడు తుల్జా భవానీ సమక్షంలో రక్షాబంధనం చేసుకుని, ధర్మనిబద్ధతకు పునరంకితమయ్యేవాడని చరిత్ర చెబుతోంది.



అంతర్యామి

మరాఠా పాలకుడు పీష్వా బాజీరావు కాలంలో, ఈ పున్నమిని సమైక్యతా దినోత్సవంగా నిర్వహించేవారంటారు. రాఖీ పండుగ ద్వారా స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'లోకమాన్య' తిలక్- భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిలించారు. 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాగూర్ రక్షాబంధన్ సందర్భాన్ని సామాజిక ఐక్యతా వారధిగా వినియోగించుకున్నారు. విభిన్న వర్గాల్ని ఏకీకృతం చేసిన ఆ కవీంద్రుడు, రక్షాబంధనాన్ని ఓ సంరంభంగా నిర్వహించారు. ఇలా రక్షాబంధన ఉత్సవం ఓ పర్వదినంగానే కాక- జాతీయ సమగ్రతకు, సామరస్యానికి ఉపకరించింది.

జైనులు ఈ పర్వాన్ని 'రక్షక్ దివస్'గా నిర్వహిస్తారు. కొబ్బరికాయల్ని సముద్రజలాల్లో వదిలి, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థిస్తారు. శ్రావణ పూర్ణిమను 'సంతోషిమాత జన్మదినోత్సవం'గానూ పరిగణిస్తారు. జ్ఞానానికి అధిష్ఠాన దైవంగా భావించే హయగ్రీవ జయంతి నేడే! సంస్కృత భాషాదినోత్సవంగానూ ఈ పున్నమి ఖ్యాతి సంతరించుకుంది. ఇలా పలు విశేషాంశాల సమాహారంగా శ్రావణ పూర్ణిమ వర్ధిల్లుతోంది!

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

నవ జగతికి ఈ-ప్రగతి!

- ప్రభుత్వ జోక్యం లేకుండా పౌర సేవలు
- డిజిటల్ సైన్యంలా ఉద్యోగులు
- ఐఎస్‌బీ నిపుణులతో శిక్షణ
- పారదర్శకతకు సాంకేతిక పునాది
- కొత్త ఉత్సాహం నింపుతున్న శిక్షణ తరగతులు

"ప్రభుత్వ ఉద్యోగులం... మాకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వాళ్లు చెప్పేదేముంటుంది? పైగా మాకు ఈ వ్యాపార పాఠాలేంటి?..."

'ఈ-ప్రగతి' శిక్షణ తరగతులకెళ్లే ముందు దేవాదాయశాఖలో విభాగాధికారి రాణా ప్రతాప్, ఎక్సైజు శాఖలో సహాయ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్యల మదిని తొలిచేసిన ప్రశ్నలివి. వారిద్దరిలోనే కాదు అక్కడ శిక్షణకు వచ్చిన 80 మంది అధికారుల్లోనూ దాదాపు ఇవే ప్రశ్నలు, అనుమానాలు. ఆ నిరాసక్తత మధ్యే శిక్షణ తరగతిలో ప్రవేశించారు.

ఎదురుగా ఉన్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) శిక్షకులు "ప్రభుత్వం వల్ల మీకు ఎదురవుతున్న ఇబ్బందులేంటి, మీరొక పౌరుడిగా జాబితా రాయండి" అనడంతో వారికి ఒక్కింత ఆశ్చర్యం కలిగింది. ఇన్నాళ్లూ తాము చేస్తున్న పనులే కొత్తగా, స్మార్ట్‌గా, సులభంగా, ఎంత అవలీలగా నిర్వహించవచ్చో నిపుణులు చెబుతుంటే ఎంతో నేర్చుకున్నామన్న సంతృప్తి, స్థైర్యం వారిలో కనిపించింది. ప్రజలకు 'డిజిటల్ పాలన' అందివ్వాలని సంకల్పించిన ప్రభుత్వం 2017-18ని 'ఈ-ప్రగతి'నామ సంవత్సరంగా పాటిస్తోంది. ఉద్యోగులకు శిక్షణ ఇప్పించి వారిని ఒక డిజిటల్ సైన్యంలా తయారు చేయాలని సంకల్పించింది. అందులో భాగమే ఈ శిక్షణ. తొలివిడతగా 33 విభాగాల నుంచి ఎంపిక చేసిన 80 మంది అధికారులకు ఐఎస్‌బీతో కలిసి ఆరు నెలల పాటు 'డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఇన్ పబ్లిక్ గవర్నెన్స్' సర్టిఫికెట్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఉద్యోగుల విధులకు ఇబ్బందులు లేకుండా నెలలో వారం రోజులు... మిగిలిన రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు.

ఎక్కడ స్మార్ట్ ఫోన్ ఉంటే అక్కడ ప్రభుత్వ కార్యాలయం ఉన్నట్టే...



ప్రభుత్వ సేవలు పొందడానికి జనం కార్యాలయానికి రావాల్సిన అవసరమేముంది? చేతిలో ఒక స్మార్ట్ ఫోన్ ఉంటే అక్కడే ప్రభుత్వ కార్యాలయం ఉన్నట్లు పౌరుడు భావించాలి. అక్కడే అన్ని సేవలు పొందాలి. ఆ దిశగానే మా ఈ-ప్రగతి ప్రయాణం సాగుతోంది. ఉద్యోగులను ఆ దిశగా సంసిద్ధం చేస్తున్న ప్రయత్నమే ఈ శిక్షణ. ఇది ఒక చిన్న తొలి అడుగు మాత్రమే. మా అంచనాలను మించి ఉద్యోగుల నుంచి వస్తున్న స్పందన మరింత ఉత్సాహాన్నిస్తోంది.

– బాలసుబ్రమణ్యం, సీఈఓ, ఈ-ప్రగతి


ఇతరుల సమస్యలు తెలిశాయి



ప్రభుత్వ ఉద్యోగంలో చేరక ముందు నేను అమెజాన్‌లో పనిచేశాను. ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో వాతావరణం చాలా తేడా ఉంటుంది. ఇక్కడ శాఖల మధ్య సమన్వయం చాలా కష్టం. ఈ తరగతుల వల్ల ఇతర శాఖల వారి సమస్యలూ తెలుస్తున్నాయి. ఆయా శాఖలకు మన శాఖ పరంగా ఏం చేయాలో కూడా తెలుస్తోంది. ఈ-ప్రగతి అన్ని శాఖలను సమీకృతం చేయనుంది. దాన్ని ఉద్యోగులుగా మేం అందిపుచ్చుకోవాలి. దానికి ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగకరం.

–శ్రావణి, ఏసీపీ, నార్త్ జోన్

పని విధానమే మారిపోతుంది...



ఒక ఆలయ భూమిని ఎవరికైనా కేటాయించాలా వద్దా అనే దానిపై సంప్రదింపులకు దాదాపు వంద పేజీల దస్త్రం తయారై నెలల తరబడి కార్యాలయాల్లో తిరుగుతుంటుంది. ఈ-కార్యాలయం, ఈ-దస్త్రాలతో పరిస్థితి మారిపోతోంది. కేవలం రోజుల్లోనే ఫైళ్లు పరిష్కారమవుతున్నాయి.

–ప్రసాద్, ఐటీ మేనేజర్, దేవాదాయశాఖ

దృక్పథంలో మార్పు



ఇక్కడికొచ్చే ముందు ఏం చెబుతారో అనుకున్నా. పాలనలో సాంకేతికత ఎలాంటి విప్లవం తెస్తుంది అనేది కళ్లకు కడుతున్నారు. దాన్ని అందిపుచ్చుకుని మెరుగైన సేవలు ఎలా అందించవచ్చో, విధుల నిర్వహణ ఎంత సులభమవుతుందో నేర్పుతున్నారు. ప్రతి తరగతి ప్రయోజనకరంగా ఉంది.

– సీహెచ్ లావణ్య, సహాయ సూపరింటెండెంట్, ఎక్సైజు అండ్ ప్రొహిబిషన్

పౌరుల సంతృప్తే మా సేవలకు కొలమానం



కోట్లాది మంది భక్తులతో ముడిపడిన శాఖ మాది. వారి సంతృప్తే మా సేవలకు కొలమానం. మా నైపుణ్యాలను పెంచడానికి ఇలాంటి శిక్షణలు ఎంతో సహాయపడతాయి. కొత్త విషయాలు నేర్చుకుంటున్నామనే సంతృప్తి కలుగుతోంది.

–రాణాప్రతాప్, విభాగాధికారి, దేవాదాయశాఖ

ఉద్యోగుల్లో ప్రతిభ పుష్కలం



'ఈ-పాలన'తో పౌరులకు మెరుగైన సేవలు ఇవ్వగలిగే నైపుణ్యం, ప్రతిభ ఉద్యోగుల్లో పుష్కలంగా ఉన్నాయి. భారం, కాలయాపన లేకుండా సాంకేతికతను ఉద్యోగులు అందిపుచ్చుకుంటే చాలు. అద్భుతమైన ఫలితాలు వస్తాయి. దానిపై అవగాహన కల్పించడమే మా పని.

–కార్తీక్, అసోసియేట్ డైరెక్టర్, ఐఎస్‌బీ

అవినీతి ఉద్యోగులకే ఇబ్బంది...

'ఈ-ప్రగతి'తో అవినీతికి అడ్డుకట్ట వేయొచ్చా? ' ఇది ఏ సామాన్యులో అడిగిన ప్రశ్న కాదు. శిక్షణ కోసం వచ్చిన ప్రభుత్వ అధికారులు కొంతమంది సంధించిన ప్రశ్నలివి. ఎందుకంటే ప్రభుత్వ కార్యాలయాల్లో నెలకొన్న అవినీతికి అడ్డుకట్ట పడాలని సామాన్యులు కోరుకుంటున్నట్లే ఉద్యోగులూ కోరుకుంటున్నారు. సాంకేతికత ద్వారా దానికి అడ్డుకట్ట వేయగలిగితే పౌరులకు మరింత మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ-ప్రగతి అమలు వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి అవినీతికి అడ్డుకట్ట పడుతుందనే విశ్వాసం ఈ తరగతుల్లో వ్యక్తమైంది.

విలువైన పాఠాలివి



ఇలాంటి నైపుణ్య పాఠాలు ఉద్యోగుల రోజువారీ విధుల నిర్వహణలో ఎంతో ఉపయోగపడతాయి. ఒక్క మాటలో చెప్పమంటే శిక్షణ అమోఘం. పౌరులకు ఎంతో చక్కగా, వేగంగా సేవలు అందించడానికి దోహదపడుతుంది.

–శారదాదేవి, డిప్యూటీ డైరెక్టర్, పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ

- ఈనాడు, అమరావతి

'ఆధార్' ఒక అద్భుతం

- వంద కోట్ల మంది డిజిటల్ సంతకాలు ఒకేచోట
- మరే ఇతర దేశాల్లోనూ లేవు
- ఆటోమేషన్‌తోనే అవినీతికి అడ్డుకట్ట
- ఐదు దేశాలే ఆదర్శం
- 'ఈనాడు'తో ఈ-పాలన నిపుణుడు నీల్ జాకబ్‌సన్



ఈనాడు, అమరావతి: ప్రపంచంలోనే 'ఆధార్' ఒక అద్భుతమని, మరే దేశం కూడా ఈ తరహా సామాజిక భద్రత కార్డును ప్రజలకు అందివ్వడం లేదని దక్షిణాఫ్రికాకు చెందిన ఈ-పాలన నిపుణులు, ఫ్యూచర్ వరల్డ్ నిర్వాహకులు నీల్ జాకబ్‌సన్ అన్నారు. ఒకే చోట వంద కోట్ల మందికిపైగా ప్రజల డిజిటల్ సంతకాలు సేకరించి వాటిని నిర్వహించడమనేది అంత సామాన్యమైన విషయం కాదని పేర్కొన్నారు. ప్రజలను కూడా ఈ దిశగా సదుపాయాలు వినియోగించుకునేలా వారి ఆలోచనా సరళిని మార్చితే అద్వితీయ ఫలితాలు సొంతమవుతాయన్నారు 'ఈ-ప్రగతి' శిక్షణలో భాగంగా ఆయన ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి విజయవాడ వచ్చిన సందర్భంగా వివిధ అంశాలపై 'ఈనాడు'తో మాట్లాడారు.

ఈ-పాలన: ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు పౌరులకు ఈ-పాలన అందివ్వడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడం (ట్రాన్స్‌ఫార్మేషన్) ఎంతో ముఖ్యం. అయితే కేవలం సేవలు అందించడంతో సరిపెట్టుకోవడం కాదు ఈ సేవలను పదిరెట్లు ఎక్కువ నాణ్యతగా అందించామా లేదా అనేది అంతకంటే ముఖ్యం.

పౌరులే కేంద్రం: ఈ-పాలనలో సేవలన్నీ పౌరులే కేంద్రంగా జరగాలి. అలాగే వారికి అందించే సేవల విషయంలో ఉద్యోగుల దృక్పథంలోనూ మార్పులు రావాలి. ఉద్యోగి ఒక ప్రభుత్వాధికారిగా కాకుండా ఒక సామాన్య పౌరుడి కోణంలోంచి ప్రతి విషయాన్ని ఆలోచించాలి. అప్పుడు అతడికే ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న అనేక ఇబ్బందులు తెలుస్తాయి. అంతిమంగా అది పరిష్కారానికి, మంచి సేవలందించడానికి దోహదపడుతుంది.

అవినీతికి అడ్డుకట్ట: భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా పలు ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న సమస్యల్లో అవినీతి ఒకటి. ఈ-పాలనలో ఆటోమేషన్ ప్రక్రియ ద్వారా దీనికి అడ్డుకట్ట వేయొచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ఆటోమేషన్ చేయడం వల్ల మానవ ప్రమేయం, దళారుల జోక్యానికి ఆస్కారం ఉండదు. ఈ విషయంలో ఉద్యోగులు తాము ఉద్యోగులుగా కాకుండా పౌరులకు సేవకులుగా భావించాలి. వారిలో ఈ భావాన్ని పెంపొందించాలి.

ఐదు దేశాలే ఆదర్శం: డిజిటల్ పాలనకు సంబంధించి ప్రపంచంలో ఈస్టోనియా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, సింగపూర్, యూకే దేశాలు ఆదర్శప్రాయం. అక్కడ పౌరులకు అన్ని సేవలు ఒకే డిజిటల్ వేదికపై అందేలా సమీకృతం చేశారు. ఒకేచోట అన్ని వివరాలు లభించడంతో యూకే పన్నుల విభాగానికి 3 బిలియన్ పౌండ్ల అదనపు పన్నుల వసూళ్లు సాధ్యమైంది. ఈస్టోనియాలో అయితే పడక గదిలోంచి కూడా మనకు అవసరమైనప్పుడు ప్రభుత్వ సేవలన్నీ పొందొచ్చు.

రెండు పుష్కరాలకు తుది తీర్పు

చెన్నై: న్యాయం కోసం కోర్టు గడపెక్కిన మహిళకు 24 సంవత్సరాల తర్వాత తీర్పు లభించింది. ఈ జాప్యంపై మద్రాసు హైకోర్టు బాధితురాలికి క్షమాపణ చెప్పింది. లారీ డ్రైవరైన తన కుమారుడు లోకేశ్వరన్ 1993 మే 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బీమా సంస్థ నుంచి పరిహారం అందలేదని బక్కియామ్ అనే మహిళ అదే సంవత్సరం హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై బాధితురాలికి, బీమా సంస్థకు మధ్య అనేక వాదప్రతివాదాలు సాగాయి. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.శేషసాయి సమక్షంలో ఈ నెల 4న మరోసారి కేసు విచారణకు రాగా.. బీమా సంస్థ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. రూ.3.47 లక్షల పరిహారాన్ని 7.5 శాతం వడ్డీతో బాధితురాలికి చెల్లించాల్సిందిగా బీమా సంస్థను ఆదేశించారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలు తయారు చేద్దాం

ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: 'గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా చేయాలి. పల్లెల్లో చెత్త ఏరుకునే వారి నుంచి వ్యర్థ ప్లాస్టిక్‌ను కిలో రూ.20 నుంచి రూ.25 వంతున గ్రామ పంచాయతీ ద్వారా కొనుగోలు చేసి వాటిని రోడ్ల నిర్మాణానికి వీలుగా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలి. ఈ అంశంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని...' రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పథకాల అమలుపై ఆదివారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం అమలులో వేగాన్ని పెంచాలన్నారు. భూగర్భ జలాల పెంపునకు కొండవాలు ప్రాంతాలలో చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించారు. అన్ని పంచాయతీలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఏపీ ఫైబర్ నెట్‌తో అనుసంధానం కావాలన్నారు. జిల్లాలో బెల్టు షాపులు, ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, జేసీ గిరిషా ప్రసంగించారు.

'హోదా' కోరుతూ ప్రధానికి రాఖీలు పంపండి: రఘువీరా

ఈనాడు, అమరావతి: ప్రత్యేక హోదాతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఇతర హామీల అమలును ప్రధానమంత్రి నరేంద్రమోదీకి గుర్తుచేస్తూ ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా రాఖీ సందేశాలు పంపాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలుగు మహిళలకు విన్నవించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, ఇతర నేతలతో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని రఘువీరా ఆందోళన వ్యక్తంచేశారు. గుడివాడ సమీప దొండపాడులో తమ ఇళ్లను ఆనుకొని రొయ్యల చెరువు వద్దని అడ్డుకున్న దళితులపై తెలుగుదేశం పార్టీ వాళ్లు విచక్షణరహితంగా దాడి చేశారని తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని, దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒకే తాను ముక్కలని రఘువీరా వ్యాఖ్యానించారు.

విజయవాడ కేంద్రంగా విశాఖ ఉక్కు కార్యకలాపాలు

- గన్నవరంలో స్టాక్‌యార్డు
- దక్షిణభారత రాష్ట్రాల విపణిపై గురి

ఈనాడు – విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణ అవసరాలను తీర్చడంతోపాటు.. విజయవాడ నుంచి విశాఖ ఉక్కును పంపిణీ చేసేందుకు విశాఖ ఉక్కు కర్మాగారం అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం గన్నవరంలో కనీసం లక్ష టన్నుల నిల్వ సామర్థ్యంతో ఒక స్టాక్‌యార్డును తీర్చిదిద్దారు. అక్కడి నుంచే విజయవాడ, అమరావతి పరిసర ప్రాంత డీలర్లకు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడలోని రైల్వేస్టేషన్ నుంచి దేశంలోని ఇతర రాష్ట్రాలకు రైల్వే అనుసంధానం ఉన్నందున అక్కడి నుంచి దక్షిణ భారత రాష్ట్రాల మార్కెట్లకు కూడా వేగంగా పంపడానికి వీలుగా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నెల 9న స్టాక్‌యార్డును ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ పరిసరాల్లో విశాఖ ఉక్కు విక్రయాలు ప్రతి నెలా రెండు వేల నుంచి మూడు వేల టన్నులు మాత్రమే ఉండేవి. రాజధాని ప్రకటన అనంతరం అక్కడ నిర్మాణ రంగం క్రమంగా అభివృద్ధి చెందుతోంది. ఫలితంగా ప్రస్తుతం ప్రతినెలా ఆరు వేల నుంచి ఏడువేల టన్నుల వరకు విశాఖ ఉక్కు ఉత్పత్తుల విక్రయాలు సాగుతున్నాయి.

పోలవరం ప్రాజెక్టుకూ విశాఖ ఉక్కు.....

రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన ఉక్కులో కొంత భాగం విశాఖ ఉక్కు నుంచి తరలివెళ్తోంది. వాస్తవానికి రాష్ట్రప్రభుత్వాల ప్రాజెక్టులకు అవసరమయ్యే ఉక్కును కేంద్రప్రభుత్వ రంగ ఉక్కు సంస్థల నుంచే కొనుగోలు చేయాలని కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటిని పక్కాగా అనుసరిస్తే మరింత ఉక్కును విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి కొనుగోలు చేయాలి. ఆమేరకు రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులను కూడా ఒప్పించి పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన ఉక్కును విశాఖ కర్మాగారం నుంచే కొనుగోలు చేయించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆన్‌లైన్లోనూ విక్రయాలు ప్రారంభం....

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎం.ఎస్.టి.సి. సహకారంతో దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో ఆన్‌లైన్ విధానాల్లో ఉక్కు విక్రయం సాగుతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో డీలర్ల వ్యవస్థ తక్కువగా ఉండడంతో ఆన్‌లైన్ విధానాల్లో విక్రయాలను గత నెల 20న ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాలకు దగ్గరలో ఉన్న స్టీల్‌ప్లాంట్ స్టాక్‌యార్డులు, డీలర్ల వద్ద నుంచి అడిగిన వారికి సరకు పంపిస్తారు. గ్రామ ప్రాంతాల్లో ఉక్కు వినియోగం పెంచేలా ప్రత్యేక రాయితీలతో 'ఆర్.డి.ఎస్.'(రూరల్ డీలర్స్ స్కీమ్) పేరిట డీలర్‌షిప్‌లు ఇస్తున్నారు. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో సైతం అవసరానికి తగినట్లుగా ఉక్కు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

డిమాండుకు దీటుగా విస్తరిస్తున్నాం....



దేశంలో పెరుగుతున్న ఉక్కు డిమాండుకు అనుగుణంగా సాధ్యమైనంత తక్కువ ధరలో వినియోగదారులకు ఉక్కు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో ఉక్కు అవసరాలు పెరుగుతుండడంతో ప్రత్యేకంగా అక్కడ స్టాక్‌యార్డ్ ఏర్పాటు చేస్తున్నాం. దక్షిణభారత రాష్ట్రాల విపణిని దృష్టిలో ఉంచుకుని ఆ స్టాక్‌యార్డ్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తున్నాం.

– పి.మధుసూదన్, సి.ఎం.డి., విశాఖ ఉక్కుకర్మాగారం

జగన్‌కు రక్తపాతమే కావాలి: మంత్రి యనమల



తుని పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నేత జగన్‌కు రాష్ట్రాభివృద్ధి ఏమాత్రం పట్టదని, ఆయన రక్తపాతమే కోరుకుంటారని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆదివారం సాయంత్రం తునిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రతిపక్ష నేత తీరును దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్ మృతిచెందిన సానుభూతి ఉండటంతో ఆ మాత్రం సీట్లను గెలుచుకోగలిగారని, 2019 ఎన్నికల్లో అవీ రావన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి కేంద్రం నుంచి నిధులు తెచ్చి నిర్మిస్తుంటే జగన్ అడ్డుపడుతున్నారన్నారు. ఈ ప్రాజెక్టుతో కడప, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల రైతులు అభివృద్ధి చెందడం జగన్‌కు ఇష్టం లేదన్నారు.

హత్యలు చేయమనే నాయకుడు అవసరమా: మంత్రి పితాని

హైదరాబాద్, న్యూస్‌టుడే: హత్యలు చేయాలంటున్న జగన్, ఆయన పార్టీ ప్రజలకు అవసరమాని ఏపీ మంత్రి పితాని సత్యనారాయణ ప్రశ్నించారు. చంద్రబాబును చంపి ముఖ్యమంత్రి కావాలనుకోవడం ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండ్రితో సమానమైన వయసున్న చంద్రబాబునాయుడికి కనీస గౌరవం ఇవ్వకుండా జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అపరిపక్వతను తెలియజేస్తున్నాయని తెలిపారు.

జగన్ మాటల్లో తప్పేముంది: బొత్స

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నంద్యాల సభలో ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి మాట్లాడిన మాటల్లో తప్పేముందని మాజీ మంత్రి, వైకాపా నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. కాకినాడలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు అరాచక పాలనపై ప్రజల్లో ఉన్న భావాలనే జగన్ వెల్లడించారన్నారు. రాజమహేంద్రవరం పుష్కరాల సందర్భంగా 29 మందిని చంద్రబాబు పొట్టన పెట్టుకున్నారని, ఆయన ఆర్భాటాలకు పోయి అమాయకులను బలి తీసుకున్నారని అన్నారు. ఏడాది గడిచినా దీనిపై ఎటువంటి విచారణ బహిర్గతం కాలేదన్నారు.

యువ ఇంజినీర్లకు సీఎం దిశా నిర్దేశం

పోలవరం ప్రాజెక్టు చెంతనే నియామకపత్రాలు

ఈనాడు, అమరావతి: జలవనరుల శాఖలోకి అడుగుపెడుతున్న యువ ఇంజినీర్లలో స్ఫూర్తి నింపి దిశానిర్దేశం చేసేలా పోలవరం ప్రాజెక్టు చెంతనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందిస్తున్నట్లు ఆ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టుని సందర్శించి, పురోగతిని పరిశీలిస్తారు. ఈ సందర్భంగానే ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన 518 మంది సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ల (ఏఈఈ)లకు నియామక పత్రాలు ఇస్తారు. ఈ విధంగా ఓ ప్రాజెక్టు స్థలంలో నియామక పత్రాలు ఇవ్వడం ఈ శాఖ చరిత్రలో ఇదే ప్రథమమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికే ఫోన్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా సమాచారమిచ్చామని, రాజమహేంద్రవరం బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచి శాఖ ఏర్పాటు చేసిన బస్ ద్వారా పోలవరం ప్రాజెక్టు దగ్గరకు చేరుకొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. అభ్యర్థులు 94400 41622, 88975 08834 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

హజ్ యాత్రికులకు రూ.20 లక్షల సాయం

గురజాల ఎమ్మెల్యే వితరణ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: హజ్‌యాత్రకు వెళ్లే 20 మంది పేద ముస్లింలకు గుంటూరు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశారు. పిడుగురాళ్లలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో హజ్ కమిటీ ఛైర్మన్ మెమిన్ అహ్మద్ ఉస్సేన్ పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మూడేళ్ల నుంచి పేద ముస్లింలకు ఇలా సహాయం చేస్తున్నారని చెప్పారు. తెదేపా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, ఎమ్మెల్సీ షేక్ అహ్మద్ షరీఫ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ షేక్ జానీమూన్, ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహ గీతిక.. సైకత వీచిక.

భారత్, చైనాల మధ్య శాంతి ఏర్పడాలని, శాంతితోనే స్నేహం పెరుగుతుందని సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన పూరీ సముద్ర తీరంలో ఆదివారం సైకత కళాఖండం రూపొందించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. భారత్, చైనా సరిహద్దులో ఉద్రిక్తతను తొలగించాలని, ఉభయ దేశాలు శాంతి నెలకొల్పాలని కళాఖండం ద్వారా కోరుతున్నానన్నారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్ అర్బన్

ఎల్‌ఎస్‌డీతో గుట్టుగా మత్తు!

ఈనాడు, హైదరాబాద్: ఎల్‌ఎస్‌డీ.. ఈ మత్తుమందు గురించి నిన్న మొన్నటి వరకూ పెద్దగా తెలియదు. మాదకద్రవ్యాల కేసు తెలుగు చిత్ర పరిశ్రమను అతలాకుతలం చేసిన నేపథ్యంలో ఇప్పుడు ఇది ప్రాచుర్యంలోకి వచ్చింది. పాధాన్యం ఏమిటన్నది ఆబ్కారీ అధికారులకు తెలిసింది కూడా ఇప్పుడే. లైసర్జిక్ యాసిడ్ డై థైలమైడ్ సంక్షిప్తనామమే ఎల్‌ఎస్‌డీ. దీని రవాణాలో ఆరితేరిన కెల్విన్ ఆబ్కారీ అధికారులకు పట్టుబడ్డప్పుడు మామూలు కేసుగానే పరిగణించారు. విచారణలో అతను చెప్పిన వాస్తవాలు తెలుగు రాష్ట్రాలను కుదిపేశాయి. మొత్తం 12 మంది సినీ ప్రముఖులతోపాటు మరో 27 మందిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. ఎల్‌ఎస్‌డీ ఎందుకు వాడుతున్నారన్న ప్రశ్న అందరినీ అడిగారు. 'ఎల్‌ఎస్‌డీని వినియోగిస్తే.. ఆ విషయం ఎవరికీ తెలియదు' అనే సమాధానమే చెప్పినట్లు తెలుస్తోంది. మిగతా మత్తుమందులు ఏవి తీసుకున్నా పక్కనవారికి తెలిసిపోతుందని, ఎల్‌ఎస్‌డీతో ఆ సమస్య లేదని వారు వెల్లడించినట్లు సమాచారం. ఎల్‌ఎస్‌డీ తీసుకున్న తర్వాత కలిగే ఉత్తేజం తాలూకు లక్షణాలూ బయటకు కనపడవని, అంతర్గతంగా కావాల్సినంత ఆనందం పొందవచ్చని.. ఈ రెండు ప్రత్యేక లక్షణాల వల్లే ఎల్‌ఎస్‌డీకి ఎక్కువ ప్రాధాన్యమిస్తారని చెప్పినట్లు తెలుస్తోంది. ఇక దీన్ని ఎక్కడికంటే అక్కడికి సులభంగా తీసుకెళ్లవచ్చు. కేవలం రెండు మూడు మిల్లీలీటర్లతో చిన్నపాటి క్యాప్సుల్ మాదిరిగా దీన్ని రూపొందిస్తారు. జేబులో దాచుకున్నా పట్టుకోవడం కష్టం. పక్కన పది మంది ఉన్నా రెండో కంటికి తెలియకుండా నోట్లో వేసుకోవచ్చు. అందుకే ఎక్కువ మంది ఎల్‌ఎస్‌డీ వాడుతున్నారని అధికారులు చెబుతున్నారు.

శాంతియుతంగానే ఆందోళనలు చేయాలి

కాపు నేతలకు మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం సూచన

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరిస్తూ ఉద్యమకారులతో తప్పుచేయించాలని చూస్తుందని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోపించారు. ఎట్టిపరిస్థితుల్లో నిగ్రహాన్ని కోల్పోవద్దని, శాంతియుతంగానే ఆందోళనలు, కొవ్వొత్తుల ర్యాలీలు చేయాలని కాపుసంఘాల నాయకులకు ఆయన సూచించారు. ఆదివారం కూడా రోజూలాగే తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో తన ఇంటి నుంచి ఐకాస, కాపు సంఘాల నాయకులతో కలిసి పాదయాత్రకు బయలుదేరిన ముద్రగడ పద్మనాభంను ఓఎస్‌డీ రవిశంకర్‌రెడ్డి అడ్డుకున్నారు. పన్నెండు రోజులుగా మేము రావడం మీరు గేటువద్ద ఆపడం, ఇది ఎంతవరకు సబబని ముద్రగడ పోలీసులను ప్రశ్నించారు. అనంతరం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, నల్ల బ్యాడ్జీలు ధరించి కాపు సంఘాల నాయకులతో కలిసి నిరసనకు దిగారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐకాస నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఉద్యమ సిద్ధాంతకర్త నల్లా విష్ణుమూర్తి, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, గుండా వెంకటరమణ పాల్గొన్నారు.



కిర్లంపూడిలో నోటికి నల్లరిబ్బను కట్టుకొని నిరసన తెలుపుతున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం, ఐకాస, కాపుసంఘాల నాయకులు

వ్యయ నియంత్రణతో రూ.2వేల కోట్ల పొదుపు

- విద్యుత్ అధికారులతో సీఎం
- ఆదా చర్యలపై నివేదిక సమర్పించనున్న అధికారులు

ఈనాడు, అమరావతి: విద్యుత్ వ్యయ నియంత్రణతో ఏటా రూ.2 వేల కోట్లమేర పొదుపు చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. తొలి తరం విద్యుత్ సంస్కరణల ఫలాలు ప్రజలకు అందుతున్న తరుణంలో రెండో తరం సంస్కరణలకు ఉద్యోగులంతా కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. ఇంధన శాఖ అధికారులకు ఆయన ఈ మేరకు సూచించినట్లు... ఇంధన, మౌలికవసతులు, సీఆర్‌డీఏ మీడియా సలహాదారు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. తొలి దశలో కరెంట్ ఛార్జీలు పైసా పెంచబోమని, మలి దశలో కరెంట్ ఛార్జీలు తగ్గించే యత్నం చేస్తామని సీఎం అభిప్రాయపడినట్టు ఆ ప్రకటనలో ఉంది. "ప్రతి ఏడాదీ ఏప్రిల్ వచ్చిందంటే కరెంట్ ఛార్జీలతో నడ్డి విరుస్తారేమోనన్న భయం పేదవాడి నుంచి పారిశ్రామిక వేత్తల వరకూ ఉండేది. 2015 నుంచి ఈ విధానం మారింది. వచ్చే ఏడాది ఇంకా మార్పు రావాలి. కరెంట్ ఛార్జీలు ఇంకా ఎంత తగ్గుతాయోనని ఆశతో ఎదురుచూసే పరిస్థితి రావాలి. ఈ దిశగా అడుగులు వేయాలి" అని సీఎం పేర్కొన్నారు. విద్యుత్ వ్యయం ఆదాపై వివిధ అంశాలతో రూపొందించిన సమగ్ర నివేదికను ఇంధన, మౌలికవసతుల ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ ఈనెల 8వ తేదీన సీఎం నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో అందించనున్నారు. రుణాల వడ్డీని తగ్గించుకోడం ద్వారా రూ.500 కోట్లు, బొగ్గు కేంద్రాల్లో వ్యయాన్ని తగ్గించుకోవడం ద్వారా రూ.702 కోట్లు ఆదాచేసే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే అంతర్ రాష్ట్ర సరఫరా భారాన్ని తగ్గించుకోవడం ద్వారా రూ.376 కోట్లు, ఏపీఈఆర్‌సీ సూచనకు అనుగుణంగా పెట్టుబడి వ్యయం తగ్గించుకోవడం వల్ల రూ.153 కోట్లు, విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గించుకోవడం ద్వారా రూ.100 కోట్లు, మిగులు విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు విక్రయించడం ద్వారా రూ.200 కోట్లు...వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,031 కోట్లు పొదుపు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

భూసేవ... భూ విజ్ఞానగని

- సర్వే నెంబర్ క్లిక్ చేస్తే సమస్త సమాచారం లభ్యం
- ఆరు నెలల్లో రెవెన్యూ శాఖ నుంచి కొత్త పోర్టల్

ఈనాడు – అమరావతి

పరిశ్రమలకు భూములు కేటాయిస్తున్నా వాటిని స్వాధీనం చేసుకోవడం ఓ ప్రహసనంగా మారింది. .. పరిశ్రమల శాఖ ఫిర్యాదు.

నా భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకం ఉంది... ప్రభుత్వ ఆస్తిగా చూపించి నిషిద్ధ ఆస్తుల జాబితాలో చేర్చారు... ఓ రైతు ఆవేదన.

ఏ భూములపై కోర్టుల్లో కేసుల్లో ఉన్నాయో లెక్క స్పష్టంగా లేదు... రెవెన్యూ శాఖలో ఆందోళన. ....ఇలాంటి గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పక్కాగా సమాచారాన్ని సిద్ధం చేసి ఇటు ప్రభుత్వ శాఖలకు... అటు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే నెంబర్‌ని క్లిక్ చేస్తే చాలు ఆ భూమికి సంబంధించిన సమస్త సమాచార, పూర్వ లావాదేవీలు కంప్యూటర్ తెరపై కనిపించేలా సిద్ధం చేస్తున్నారు. ఆ సర్వే నెంబర్‌పై ఏదైనా బ్యాంకులో రుణం పొందితే మరుక్షణం ఆ వివరాలు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. న్యాయస్థానాల్లో కేసులు నడుస్తుంటే ఆ సమాచారం కూడా చేరుతుంది. భూములకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా అందించేందుకు 'భూసేవ' పేరుతో పోర్టల్‌ను రెవెన్యూ శాఖ ఆవిష్కరించనుంది. దీనిపై ఆ శాఖ కసరత్తు చేస్తోంది.

ప్రాజెక్టు నేపథ్యం ఏమిటి?

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా రెవెన్యూ సేవల్ని పారదర్శకం చేయడంతో పాటు వివాదరహితంగా ఉన్న భూములను సులభంగా గుర్తించాలని నిర్ణయించారు. ఈ విధంగా చేస్తే పెట్టుబడిదారుల్లో సంతృప్తస్థాయి పెరుగుతుందని ఏపీఐఐసీ వర్గాలు రెవెన్యూకి సూచించాయి. కొన్ని చోట్ల భూములు కేటాయించినా వాటిపై వ్యాజ్యాలు ఉండటమో, రికార్డులు సక్రమంగా లేకపోవడమో జరుగుతోందని, ఫలితంగా ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంలో జాప్యం అవుతోందని తెలిపాయి. అలాగే అటవీ భూములకు సంబంధించిన సరిహద్దు వివాదాలు పలు ప్రాంతాల్లో ఉన్నాయి. దేవాదాయ, వక్ఫ్ ఆస్తులూ అన్యాక్రాంతమవుతున్నాయి. ఈ క్రమంలో భూములతో సంబంధం ఉన్న అన్ని శాఖల్నీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి క్లౌడ్ సాంకేతిక పరిజ్ఞానంతో పోర్టల్‌ను సిద్ధం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నిర్ణయించారు. సీసీఎల్ఏ ఆధ్వర్యంలో ఉండే ఈ పోర్టల్‌లో రెవెన్యూ, పురపాలక, సర్వే, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్ భాగస్వామ్యమవుతాయి. అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూముల వివరాల్నీ ఇందులోకి చేరుస్తారు. న్యాయశాఖ ద్వారా కోర్టు కేసుల్లో ఉన్న భూముల వివరాల్నీ, వాటి తాజా స్థితిని అనుసంధానం చేయించనున్నారు. లోన్ ఛార్జ్ క్రియేషన్ మాడ్యూల్ ద్వారా బ్యాంకుల్లో రుణాలు పొందిన మరుక్షణం ఆ వివరాలు చేరుతాయి. ఇలా చేయడం ద్వారా ఏది ప్రభుత్వ ఆస్తి, ఏది ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమి అనేది స్పష్టంగా తెలుసుకోవచ్చని రెవెన్యూ శాఖ చెబుతోంది. ఒక వేళ భూ రికార్డుల్ని తారుమారు చేసినా, ఆక్రమించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకొనే ప్రయత్నం చేసినా అప్రమత్తమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కలుగుతుంది. నేషనల్ ఇన్‌ఫర్మెటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పోర్టల్ రూపకల్పనలో పాలుపంచుకొంటుంది. ఇటీవలే ముఖ్యమంత్రికి భూసేవ ప్రాజెక్టు గురించి సీసీఎల్ఏ, ఎన్ఐసీ అధికారులు వివరించారు. ఆరు నెలల్లో దీనిని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

దేశంలోనే తొలిసారి



'ప్రతి సర్వే నెంబర్‌కి సంబంధించిన సమస్త వివరాల్నీ ఒకే పోర్టల్ ద్వారాపొందేలా చేయడం అనేది దేశంలోనే తొలి సారి అవుతుంది. దీని మూలంగా భూముల పూర్తి సమాచారం తెలుసుకోవడం సులభతరమవుతుంది. వివాదరహితమైన భూములేవో తెలిసిపోతుంది. క్రమంగా సివిల్ వివాదాలూ తగ్గుతాయి. సర్వే నెంబర్ ద్వారా ప్రతి భూభాగానికీ ఒక విశిష్ఠ సంఖ్యను కేటాయించనున్నాం. ఈ సంఖ్య ద్వారా కూడా భూచరిత్రను గుర్తించేలా ఏర్పాటు చేస్తాం'.

– అనిల్‌చంద్ర పునేఠ, భూపరిపాలన ప్రధాన కమిషనర్

మట్టిలోనూ తోడూనీడ

- సమాధులకు రిజర్వేషన్ సౌకర్యం
- అయినవాళ్ల సమాధి పక్కనే స్థలం అవకాశం
- కడపలోని ఓ శ్మశానానికి ప్రత్యేక గుర్తింపు





రిజర్వేషన్ సదుపాయం ఉన్న కడపలోని శ్మశానవాటిక ★ సమాధుల వద్ద రిజర్వేషన్ సూచికలు

ఈనాడు, కడప: మూడు ముళ్ల బంధం.. ఏడడుగుల సంబంధం.. ఏ మతమైనా, ఏ ప్రాంతమైనా స్త్రీ, పురుషుల మధ్య వివాహం జన్మజన్మల అనుబంధమే. . అలాంటి మహత్తరమైన దాంపత్యంలో మరణం వేరు చేసే వరకూ అన్యోన్యంగా జీవించేవారు ఎందరో.. భార్యపై అనురాగం, భర్తపై అభిమానంతో ఒకరికి ఒకరై కలిసిమెలిసి బతికేవారు మరెందరో. అలాంటి తోడునీడల కోసం సరికొత్తగా రూపుదిద్దుకుంది కడప నగరంలోని ఓ శ్మశానం. ఇక్కడ భార్యాభర్తలు భౌతికంగా దూరమైనా మట్టిలో మాత్రం ఒకే చోట కలుస్తారు. ఒకరికి ఒకరు అన్నట్లుగా సమాధుల రూపంలో పక్కపక్కనే జీవిస్తారు. అదెలాగను కుంటున్నారా? ఈ కథనం చదవాల్సిందే!

కడప నగర శివారులోని రిమ్స్ ఆసుపత్రికి వెళ్లే దారిలో కడప క్రైస్తవుల సమాధుల తోట ఉంది. ఇక్కడ నాలుగేళ్ల కిందట ప్రభుత్వ ప్రత్యేక నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆ క్రమంలోనే మరుభూమినీ విస్తరించగా.. చుట్టూ ప్రహరీ అదనపు వసతులు సమకూర్చారు. ఇక్కడ అడ్డదిడ్డంగా మృతదేహాలను ఖననం చేసే పద్ధతికి స్వస్తి పలికారు. ప్రతి సమాధికీ సంఖ్యను కేటాయించడంతో పాటు.. ఒక్కో వరుసలో ఎన్ని సమాధులు ఉండాలి, వాటి వద్దకు వెళ్లడానికి ఎక్కడెక్కడ కచ్చా రోడ్లు వేయాలి.. ఇలా సమగ్రంగా ఓ లేఔట్‌ను రూపొందించారు. ఆ ప్రకారం.. ఇళ్ల ప్లాట్ల మాదిరి స్థలాలకు మార్కింగ్ ఇచ్చారు. ఈ సమాధుల కేటాయింపులోనూ వైవిధ్యత చూపుతుండటం గమనార్హం.

పక్కనే కేటాయింపు

సమాధుల స్థల కేటాయింపులో ప్రస్తుతం ఇక్కడ 'రిజర్వేషన్' విధానం అవలంబిస్తుండటం ప్రస్తావనార్హం. భార్య లేదా భర్త చనిపోయిన పక్షంలో వారిని ఆ శ్మశానంలో పూడ్చడానికి దరఖాస్తు చేస్తే అవకాశమిస్తారు. అక్కడ గుంతతవ్వి పూడ్చవచ్చు. ఆ వ్యక్తి స్థాయిని బట్టి సమాధి నిర్మాణం చేసుకోవచ్చు. దాని పక్కనే ఉన్న స్థలంలో చనిపోయిన వ్యక్తి జీవితభాగస్వామి స్థలాన్ని రిజర్వు చేసుకోవచ్చు. ఇందుకు కేవలం నిర్వహణ ఖర్చులు చెల్లిస్తే సరిపోతుంది. ఎన్నేళ్లపాటైనా సదరు వ్యక్తి పేరుతో ఆ స్థలం కేటాయిస్తారు. ఇలా భార్యాభర్తలిద్దరూ చనిపోయిన తర్వాత కూడా సమాధుల రూపంలో ప్రేమబంధం పెనవేసుకునే వెసులుబాటును నిర్వాహకులు కల్పించారు. గత రెండేళ్లలో 15 మంది వరకు ఇక్కడ రిజర్వు చేసుకోగా.. తల్లిదండ్రులపై అమితాభిమానం ఉన్న పిల్లలు తమ కన్నవాళ్ల బంధం కలకాలం కొనసాగేందుకు ఇక్కడ రిజర్వు చేసుకునేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

ఇదీ అసలు కథ

ఈ తరహా ఏర్పాటుకు కారణం గురించి ఆరా తీస్తే ఆశ్చర్యకరమైన విషయం వెలుగుచూసింది. బ్రిటీష కాలంలో ఓ సివిల్ అధికారి కడపలో జరిగిన అల్లర్లలో హత్యకు గురయ్యారు. ఆయన్ను ఇదే శ్మశానంలో పూడ్చిపెట్టగా.. సరిగ్గా మరో రెండు వారాలకు ఆయన సతీమణి కూడా మరణించింది. ఆమెనూ ఇక్కడే పాతిపెట్టారు. ఇలా ఆ దంపతుల సమాధుల ఏర్పాటుతో ఇక్కడ విభిన్న సంస్కృతికి తెరతీయగా.. మరికొందరు దంపతులకు అదే రీతిలో అవకాశం దక్కింది. ఈ విషయమై చర్చి ఫాదర్ వరప్రసాద్ 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడుతూ జీవితం అనేది కేవలం భౌతిక అనుబంధం మాత్రమే కాదన్నారు. మరణానంతరం కూడా భార్యాభర్తలు మట్టిలో కలసే ఉండాలనే సదుద్దేశంతో ఈ తరహా ప్రయత్నానికి అవకాశమిచ్చినట్లు ఆయన వివరించారు.

గ్రూపు-3 పరీక్షకు 90.60శాతం మంది హాజరు

ఈనాడు, అమరావతి: గ్రూపు-3(పంచాయతీ కార్యదర్శి) పరీక్ష ఆదివారం 9జిల్లాల్లోని 135పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 35,150మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 31,847మంది పరీక్ష రాశారు. 90.60శాతంగా నమోదైంది.

మద్యం దుకాణంపై మహిళల దాడి

రాజంపేట, న్యూస్‌టుడే : జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని, ఊరికి దూరంగా తరలించాలని ఆదివారం కడప జిల్లా రాజంపేటలో మహిళలు ఆందోళనకు దిగారు. స్థానిక విద్యుత్తు డివిజన్ కార్యాలయానికి సమీపంలో నివాస గృహాల సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దుకాణం ప్రారంభ సమయంలోనే పలుమార్లు దళిత మహిళలు అభ్యంతరం వ్యక్తం చేసినా వ్యాపారులు ఖాతరు చేయలేదు. విక్రయాలు ప్రారంభించడంతో ఆగ్రహించిన మహిళలు దుకాణంపై దాడికి దిగారు. మద్యం సీసాలను బయటపడేశారు. కుర్చీలు, బల్లలను ధ్వంసం చేశారు. ఇళ్ల మధ్యనే విక్రయాలు సాగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య విలువలు పెంచే చైతన్యం కావాలి

- ఉపరాష్ట్రపతి ఊహించని వరం
- కన్నడనాడు రుణం తీర్చుకోలేను
- సన్మాన సభలో వెంకయ్యనాయుడు

బెంగళూరు సిటీ: కొత్త పదవికి న్యాయం చేస్తానని, ఊహించని ఈ వరాన్ని మనఃపూర్వకంగా స్వీకరిస్తున్నానని భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం. వెంకయ్యనాయుడు ప్రకటించారు. రాజ్యాంగ విలువలు మరింత పెంచే దిశగా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను బెంగళూరులో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు భావోద్వేగంగా ప్రసంగించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే కర్ణాటకను సందర్శించాలని భావించానని చెప్పారు. "గడచిన 18 సంవత్సరాలుగా ఈ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా సేవలందించాను. నేను ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినా భారత



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడిని ఆదివారం బెంగళూరులో సన్మానిస్తున్న కేంద్ర మంత్రి అనంత్‌కుమార్, భాజపా కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప

సమైఖ్య విధానాన్ని గౌరవించే కన్నడిగులు నన్నెంతో ప్రోత్సహించారు. వారి రుణం తీర్చుకోలేనిది. బి.డి. జత్తి తర్వాత ఉపరాష్ట్రపతిగా కర్ణాటక నుంచి ఎన్నికైన అభ్యర్థిగా నేను గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. దేశ ప్రజల జీవన విధానంలో మార్పులు రావాలంటే వారి మానసిక స్థితి మెరుగుపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ విధానాలు, ప్రజాస్వామ్య విలువల్ని కాపాడేలా ప్రజల్లో మార్పు రావాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. గతంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమైఖ్యాన్ని, ఏకత్వాన్ని అర్థం చేసుకోవడంలో కొంత గందరగోళం ఉన్నా క్రమంగా ఈ సమస్య పరిష్కారమైందని చెప్పారు. పట్టణాభివృద్ధి, అంతకు ముందు గ్రామీణాభివృద్ధి మంత్రిగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రజల్లో ఈ మార్పును గుర్తించానని తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రాల సమస్యలను పరిష్కరించేందుకు ఇన్నాళ్లూ కృషి చేశానని, పెద్దల సభకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఆ బాధ్యత మరింతగా పెరిగిందని అన్నారు. భారత రాజ్యాంగ పునఃసమీక్షకు నియమితులైన జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య ఆధ్వర్యంలోని జాతీయ కమిషన్ సమాజాన్ని ప్రగతి పథంలో పయనించేలా చేయనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప, కేంద్ర మంత్రి అనంతకుమార్, భాజపా రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు మురళీధరరావు, వెంకయ్యనాయుడు అభినందన సమితి ప్రధాన నిర్వాహకుడు ఎం.ఆర్.దొరెస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన, పురపాలక టీచర్లను ఏకీకృత సర్వీస్ నిబంధనల్లో చేర్చాలి

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్‌రూల్స్ పరిధిలోకి మున్సిపల్ ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను చేర్చాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆ సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 17న పురపాలక సంచాలకుల కార్యాలయాలను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పదోన్నతుల ప్రక్రియ ముగిసిన తర్వాత ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

విపత్తుల్లోనూ విద్యుత్తు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విపత్తులు సంభవించే సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చేసేందుకు ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని రెండు మండలాల్లో బ్యాటరీ స్టోరేజ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావ్ వెల్లడించారు. స్థానిక ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఐటీ భవనాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు.



నిర్వాసిత గ్రామంలో మోహరించిన పోలీసులు

వంశధార నిర్వాసిత గ్రామాల్లో భారీగా పోలీసులు

హిరమండలం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నిర్వాసిత గ్రామాల్లో పోలీసులను భారీగా మోహరించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 20 మంది డీఎస్పీలు, 70మంది సీఐలు, 150 మందికి పైగా ఎస్సైలు, 2వేల మంది పోలీసులు, సాయుధ దళాన్ని మోహరించారు. అదనంగా పారామిలటరీ దళాన్ని సిద్ధంగా ఉంచారు. ఎస్పీ త్రివిక్రమవర్మ హిరమండలం పోలీసుస్టేషన్‌లో ఆదివారం డీఎస్పీలు, సీఐలతో నిర్వాసిత గ్రామాల్లోని పరిస్థితిని సమీక్షించారు. ప్రధాన గ్రామాలైన తులగాం, పాడలి, దుగ్గుపురం గ్రామాల రహదారి మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులు శాంతియుతంగా అధికారులతో చర్చలు నిర్వహించి సమస్యలు పరిష్కరించుకోవాలని, ఆందోళనలు చేసినా, జలాశయం పనులు అడ్డుకున్నా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రిని కలిసేందుకు అవకాశం కల్పించాలి: హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన 19గ్రామాల నిర్వాసితులు దుగ్గుపురం నిర్వాసిత గ్రామ సామాజిక భవనంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నా అధికారులు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరారు. తాము వంశధార జలాశయం ప్రాజెక్టు పనులను ఏనాడు వ్యతిరేకించలేదని, తమ సమస్యలు పరిష్కరించాకే గ్రామాలను ఖాళీ చేస్తామని చెబుతున్నప్పటికీ అధికారులు తమను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఎంతమంది పోలీసులు వచ్చినా ప్రాణ త్యాగాలు చేసైనా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్రంలో వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: కోస్తాంధ్ర జిల్లాల్లో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. బుధవారం నుంచి రాయలసీమ వ్యాప్తంగా వర్షాలు మొదలవుతాయని తెలియజేసింది. ఝార్ఖండ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రస్తుతం సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రాయలసీమ మీదుగా అల్పపీడన ద్రోణి కూడా ఉంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పలాసలో 8 సెం.మీ వర్షపాతం నమోదైంది.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada-520002 (A.P.)
E-PROCUREMENT SHORT TENDER NOTICE (Second Call)
NIT No: 104/CRDA-13023(32)/4/2017-AEE-18-HB-APCRDA/2nd Call Dt. 05.08.2017
Name of Work: "Construction of Grievance hall in the premises of Hon'ble Chief Minister residence/Camp office near the right bank of river Krishna at Sitanagaram." Estt. Cost.Rs.5.00 Crores.
The bid can be downloaded on AP e-procurement portal from 07.08.2017 to 16.08.2017 up to 14.00 Hrs. Due date for submission of Bid 16.08.2017 upto 15.00 Hrs. Technical bid opening 16.08.2017 @16.00Hrs. For furhter details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
For further Contact Sri D.Srinivasa Rao, Executive Engineer, +91 7095599080, srinivasarao.d@apcrda.org
Sd/-Commissioner
APCRDA, Vijayawada.

ప్రభుత్వమే ఇలా చేయ తగునా..!

- బీఎస్సీ నర్సింగ్ కళాశాలల్లో స్టాఫ్ నర్సులే బోధకులు
- 'ఐఎన్‌సీ తనిఖీల'లో వారినే సిబ్బందిగా చూపిస్తున్న పరిస్థితి
- ఒక్క శాశ్వత నియామకమూ జరపని వైనం
- నాలుగేళ్లుగా ఇదే దుస్థితి
- దిగజారుతున్న ప్రమాణాలు

ఈనాడు, అమరావతి, గుంటూరు

కొన్ని ప్రైవేటు కళాశాలలు తనిఖీలు జరిగినప్పుడు బయట వారిని తీసుకొచ్చి చూపడం..మమ అనిపించడం అందరికీ తెలుసున్న విషయమే..ఇప్పుడు ప్రభుత్వం కూడా అదే తరహాలో గిమ్మిక్కులకు పాల్పడటం..'కంచే చేను మేసిన' సామెతను గుర్తుకు తెస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ పరిస్థితి ప్రభుత్వం ఆధ్వర్యాన సాగుతున్న నర్సింగ్ కళాశాలలో నెలకొంది. ఈ కళాశాలల్లో మెరుగైన బోధన ఉంటుందనే నమ్మకాన్ని వమ్ము చేస్తున్న పరిస్థితి.

గుంటూరు, నెల్లూరు, మచిలీపట్నం, శ్రీకాకుళంలో నూతనంగా ప్రభుత్వం ఆధ్వర్యాన బీఎస్సీ నర్సింగ్ కళాశాలలు ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతవరకూ ఒక్క పోస్టును కూడా మంజూరు జరగలేదు. మచిలీపట్నంలో స్టాఫ్‌నర్సుకే ప్రిన్సిపల్ బాధ్యతలు అప్పగించి రెండు సంవత్సరాలు నడిపారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన ఓ అధ్యాపకురాలిని వలసవిధానంలో నియమించారు. అనుభవం కలిగిన ఆచార్యులు చెప్పాల్సిన పాఠ్యాంశాలను స్టాఫ్‌నర్సులతోనే చెప్పిస్తున్నారు.

జరగాల్సింది ఇలా..

భారత నర్సింగ్ మండలి(ఐఎన్‌సీ) నిబంధనల ప్రకారం నర్సింగ్ కళాశాలలో ఎంఎస్సీ వంటి



ఉన్నత విద్యార్హతలు కలిగిన ప్రధాన ఆచార్యులు, ఆచార్యులు, సహాయ ఆచార్యులు నలుగురు, అధ్యాపకులు(లెక్చరర్) ఆరుగురు, ట్యూటర్స్ లేదా సహాయ అధ్యాపకులు 19 మంది తప్పనిసరిగా ఉండాలి. బోధనేతర సిబ్బంది మరో 20 మంది అవసరం. వీరున్నట్లు చూపిస్తేనే ఐఎన్‌సీ అనుమతి వస్తుంది.

జరుగుతున్నదిలా..

నూతనంగా ప్రారంభించిన కళాశాలల్లో గత నాలుగు సంవత్సరాల నుంచి ఐఎన్‌సీ నుంచి నిపుణులు తనిఖీకి వచ్చినపుడు ప్రభుత్వాసుపత్రుల్లో ఎంఎస్సీ పూర్తి చేసి స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్నవారినే ప్రొఫెసర్లు, సహాయ ఆచార్యులు, ట్యూటర్స్‌గా చూపిస్తున్నారు. ఈ కళాశాలల్లో నియామకాల ఆమోదం కోసం ఆర్థిక శాఖకు పంపిన దస్త్రం అక్కడే మరుగునపడిపోయింది. నిధుల కొరత విషయాన్ని చెప్పకుండా కొర్రీలతో దస్త్రాన్ని కదలనీయకుండా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

గతంలోని కళాశాలల్లోనూ ఇంతే..

1982లో విశాఖపట్టణం, 1983లో కర్నూలు, 2006 తర్వాత అనంతపురం, కడప, తిరుపతిలో నర్సింగ్ కళాశాలలను ప్రారంభించారు. ఇక్కడ కూడా ఐఎన్‌సీ నిబంధనల మేర బోధనానిపుణులు లేరు. గత మూడేళ్లుగా 8ఆచార్యుల పోస్టులు, 09 సహాయ ఆచార్యులు, 10 మంది అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తాత్కాలిక నియామకాల్లోనూ జాప్యం

నర్సింగ్ కళాశాలల్లో బోధనకు ఇబ్బంది లేకుండా చూసేందుకు తాత్కాలికంగా రెండు సంవత్సరాల కిందట ఎంఎస్సీ నర్సింగ్ అర్హత ఉండి ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న 80 మంది నర్సులను సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ కళాశాలల్లో నియమించారు. వీరిని మేలో రిలీవ్‌చేయగా.. కొత్తగా డిప్యుటేషన్‌పై తీసుకునేందుకు గతనెలలో కౌన్సెలింగ్ ద్వారా 120 మందిని ఎంపిక చేశారు. వీరిలో కొందరికి సబ్జెక్టులకు తగినట్లు అర్హతలు లేవన్న విమర్శలున్నాయి. పైగా.. నర్సులను డిప్యుటేషన్‌పై పంపడం వల్ల ఆసుపత్రుల్లో సేవలకు ఇబ్బంది కలుగుతుందని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు.

బాసర క్షేత్రంలో అపచారం

- కాసుల కోసం కట్టుతప్పిన ఆలయ ప్రధానార్చకుడు
- నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రైవేటుగా అక్షరాభ్యాసాలు
- ఉత్సవమూర్తిని ఆలయం దాటించిన వైనం



బాసర, న్యూస్‌టుడే: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో అపచారం జరిగింది. ఆలయ కట్టుబాట్లను పరిరక్షించాల్సిన ప్రధానార్చకుడే..కాసుల కోసం వాటిని అతిక్రమించాడు. వ్యాపార ప్రయోజనాల కోసం ఆలయ ప్రాశస్త్యాన్నే పణంగా పెట్టాడు. ప్రైవేటుగా అక్షరాభ్యాసాలు నిర్వహించడంతోపాటు.. అమ్మవారి ఉత్సవమూర్తిని పొలిమేరలు దాటించే సాహసానికి ఒడిగట్టడం తీవ్ర దుమారం రేపింది. నల్గొండ జిల్లా దేవరకొండలో పిల్లల పేరుతో ఉన్న పూర్వ ప్రాథమిక పాఠశాల, ఆంగ్ల నిఘంటువు పేరుతో ఉన్న మరో పాఠశాల యాజమాన్యాలు తమ ప్రచారంలో భాగంగా అక్షరాభ్యాసాలు నిర్వహించి తల్లిదండ్రులను ఆకట్టుకోవాలని భావించాయి. ఈ మేరకు బాసర ఆలయంలో ప్రధాన అర్చకుడిగా ఉన్న సంజీవ్‌కుమార్‌ను సంప్రదించాయి. ఈ మేరకు ప్రధాన అర్చకునికి పెద్ద మొత్తంలో ప్రతిఫలం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. అక్షరాభ్యాసాలకు ముహూర్తంగా శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని నిర్ణయించారు. ఒప్పందం మేరకు ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్, ఆలయంలో చండీహవనం నిర్వహించే రుత్వికుడు ప్రణవ్‌శర్మతో కలిసి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకుని దేవరకొండకు వెళ్లారు. జులై 28న ఆయా పాఠశాలలు నిర్దేశించిన ప్రాంతంలో ఆలయం తరహాలో తీర్చిదిద్దిన మంటపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి అక్షరాభ్యాసాలు నిర్వహించిన విషయమై అర్చకులకు నోటీసులు జారీచేశామని ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు.

సరస్వతీ పూజ మాత్రమే నిర్వహించాం: సరస్వతీ మాత ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లిన మాట వాస్తవమే. దేవరకొండలో ఎలాంటి అక్షరాభ్యాసాలు నిర్వహించలేదు. అక్కడి పాఠశాలల యాజమాన్యాల కోరిక మేరకు కేవలం సరస్వతి పూజ మాత్రమే నిర్వహించాం.

– ప్రణవ్‌శర్మ, బాసర

ప్రేమ ఫలించక యువకుడి విషాదాంతం

- జనన, మరణ తేదీలతో వాట్సప్‌లో ఫొటో
- ఆపై లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య

అనంతపురం, న్యూస్‌టుడే: ఓ యువకుడు తన చిత్రంపై జనన, మరణ తేదీలను నమోదు చేసి, దాన్ని వాట్సప్ ద్వారా మిత్రులకు పంపి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం శాంతినగర్‌కు చెందిన నాగభూషణం కుమారుడు పరమేష్ (24) డిప్లొమా పూర్తి చేశాడు. ఓ యువతిని ప్రేమించగా ఆమె అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఆదిలాబాద్‌కు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. రాత్రి 10 గంటల సమయంలో అనంతపురంలోని లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. ఆదివారం తన స్నేహితులకు జనన, మరణ తేదీలతో కూడిన ఫొటోను, ఒక మెసేజ్‌ను వాట్సప్ ద్వారా పంపాడు. అందులో... 'నేను ఆమెను ఐదేళ్లుగా ప్రేమిస్తున్నాను. కులం, మతం పేరుతో నాలుగు రోజుల కిందట ప్రేమ నాశనం అయిపోయింది. నేను ఆమెను తప్ప మరొకరిని భార్యగా ఊహించుకోలేనని...' పేర్కొన్నాడు. అనంతరం ఉరి వేసుకున్నాడు. లాడ్జి సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.



వాట్సాప్‌లో పరమేష్ తన స్నేహితులకు పంపిన చిత్రం

బాలికల గురుకుల పాఠశాలలో కలకలం

- తోటి విద్యార్థినుల జుత్తు కత్తిరించిన అయిదోతరగతి బాలిక

అల్లవరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినుల జుత్తును కత్తిరించిన సంఘటన ఆదివారం స్థానికంగా కలకలం రేపింది. ఈ చర్యకు పాల్పడింది ఇదే పాఠశాలలో చదువుతున్న తోటి ఆకతాయి విద్యార్థిని అని విచారణలో తేలింది. తోటి విద్యార్థినుల మధ్య తలెత్తిన గొడవ వల్లనే తాను ఈ చర్యకు పాల్పడినట్టు వారికి ఓ విద్యార్థిని తెలిపింది. ఆదివారం సెలవు కావడంతో పిల్లల్ని చూసేందుకు పలువురు తల్లిదండ్రులు విచ్చేశారు. ఈక్రమంలో ఓ విద్యార్థిని జుత్తును పరిశీలించిన ఆమె తల్లి ఇలా ఎందుకు కత్తిరించావని ప్రశ్నించడంతో ఈ విషయం బయటకు పొక్కింది. దాంతో అటు పోలీసులు... ఇటు మండల విద్యాశాఖాధికారి, ప్రిన్సిపాల్ సమగ్రంగా విచారణ చేసి వివరాలు సేకరించారు.

విశాఖ సముద్ర జలాల్లో అరుదైన రాయి చేప



విశాఖపట్నం(ఏయూ): రాయిచేపలో ఐదోరకం చేపను తూర్పు తీరంలోని సముద్రంలో 80 నుంచి 120 మీటర్ల లోతులో ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం, సిఐఎఫ్‌టి (సెంటర్ ఫర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ) పరిశోధకులు గుర్తించారు. 1801లో ఈ జాతిలో నాలుగో రకం చేపను కూడా తూర్పు తీరంలోనే గుర్తించగా.. ఐదోరకం కూడా ఇక్కడే దొరకడం విశేషం. దీనికి 'సూడాథియస్ వైజాగ్‌న్సిస్'గా నామకరణం చేశారు. సిఐఎఫ్‌టి పరిశోధకులు డాక్టర్ ఎన్.ముద్దులకృష్ణ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ వి.గోవిందరావు, ఏయూ మెరైన్‌లివింగ్ రిసోర్సెస్ పూర్వ విభాగాధిపతి ఆచార్య దేవర వేణుల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ కోడ్ ఆఫ్ జూలాజికల్ నామిక్లేచర్, జూ బ్యాంక్‌ల అనుమతితో ఈ నామకరణం జరిగింది. సూడాథియస్ వైజాగ్‌న్సిస్ రకాన్ని 2013లో విశాఖ హార్బర్‌లో పరిశోధకులు తొలుత గుర్తించారు. ఇవి సముద్రంలోని కోరల్ రిప్ (ప్రవాళ బిత్తికలు) ప్రాంతంలో లభ్యమయ్యాయి. గరిష్ఠంగా 94 మిల్లీ మీటర్ల పొడవు ఉన్నాయి. గులాబీ, పసుపు పచ్చ రంగుల్లో ఈ చేపపై వజ్రపు ఆకారంలో గులాబీ రంగు చుక్కలు.. తోక భాగం పూర్తిగా గులాబీ రంగులోను పసుపు పచ్చ అంచుతో చూడముచ్చటగా ఉన్నాయి. చేప అడుగు భాగం తెల్లగా ఉంది. 2013లోనే చేపలు లభ్యమైనా పరిశోధనలు పూర్తి కావడానికి దాదాపు నాలుగేళ్లు పట్టింది. 'సూడాథియస్ వైజాగ్‌న్సిస్ చేప బొంతులు చేపల్లో (గ్రూపర్స్)లో ఒక రకం. ఈ తరహా వాటిని మత్స్యకారులు రాయి చేపలుగా వ్యవహరిస్తారు.

వసుంధర



వృక్షాలకి రక్షాబంధన్!

మొక్కలకీ అనుభూతులుంటాయని చాటిన మన భారతీయ శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్.. ఇది చూస్తే ఎంత సంతోషించేవాడో! ఈ విద్యార్థులు ఆయన గురించి ఇంకా చదివారో లేదో తెలియదుకానీ తమ చుట్టూ ఉన్న వృక్షాలకి రక్షా బంధన్ కడుతున్నారు. ఊరికే కట్టేయడం కాదు.. వాటి సంరక్షణ తామే తీసుకుంటామని ప్రతిజ్ఞ కూడా చేసేస్తున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు హైదరాబాద్ జుబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు. బడి ప్రాంగణంలో ఉన్న వృక్షాల సంరక్షణ బాధ్యతని ఏడు, ఎనిమిదో తరగతుల విద్యార్థినులు ఇలా తలకెత్తుకున్నారు.



ఇది మామూలు రాఖీ కాదండోయ్! దాంతోపాటూ ఆ చెట్టు పేరూ, శాస్త్రీయ నామం, జాతి వంటి వివరాలకి సంబంధించిన లామినేషన్ చేసిన పత్రం కూడా ఉంటుంది. దాని బాధ్యత తీసుకున్న విద్యార్థిని వివరాలూ అందులో చూడొచ్చు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపల్ రమాదేవి ఆలోచన ఇది! ఆమె అమెరికా పర్యటనలో ఉండటంతో వైస్ ప్రిన్సిపల్ శశికళ విద్యార్థినుల చేత అమలు చేయించారు. ఈ పాఠశాలలో ఉన్న వివిధ రకాల వృక్షజాతులూ, మొక్కలూ, అలంకరణ మొక్కలూ, ఔషధ మొక్కల్లో ఇరవై రకాలని ఎంచుకుని శనివారం ఈ కొత్త తరహా రక్షాబంధనానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఏకంగా వంద చెట్లకి ఇలా రాఖీకడతామని శశికళ చెబుతున్నారు. విద్యార్థులకి పచ్చదనంపై మమకారం పెంచడం, చెట్లతో కొత్త అనుబంధాన్ని కుదర్చడం, వాటిపై శాస్త్రీయ అవగాహన పెంచడమే దీని లక్ష్యమని అంటున్నారామె. ఇది ఇప్పటికే ఫలితాలివ్వడం మొదలుపెట్టింది. ఈ చెట్లకి రాఖీ కడుతున్న అమ్మాయిలు ఇప్పటికే వాటిని ముద్దుపేరుతో పిలుచుకుంటున్నారు కూడా..!

నజరానా

చిన్నపాటి గాయమై రక్తం కారుతుంటే అక్కడ మొక్కజొన్న పిండి చల్లండి. రక్తం వేగంగా గడ్డకడుతుంది. తర్వాత నీళ్లతో కడిగేసుకుంటే సరి!

రాఖీ కట్టిన ఏ చెల్లెమ్మ అయినా అన్నయ్య బాగుండాలని మనసారా కోరుకుంటుంది. మంజుల కూడా తన ముగ్గురు అన్నయ్యలూ, వాళ్ల కుటుంబాలని సంతోషంగా చూడాలనుకుంది. అందులోనూ వాళ్ల పెద్దన్నయ్య రవి అంటే ఆమెకు చెప్పలేనంత అభిమానం. అంతగా ప్రేమించిన ఆ అన్నయ్య ఆమెకు దూరమయ్యాడు. కారణం... మత్తు పదార్థాలు. నిన్నటి వరకూ తెలుగు రాష్ట్రాలని కుదిపేసిన అదే మత్తుకి వ్యతిరేకంగా డీ-అడిక్షన్ సెంటర్‌ని స్థాపించి పెద్ద ఎత్తున పోరాటమే చేస్తున్నారు కిలారి మంజుల. అది ఆమె మాటల్లోనే

అన్నయ్యలా కాకూడదనే!



మా సొంతూరు తిరుపతి. ముగ్గురు అన్నయ్యలకు నేనే ముద్దుల చెల్లెల్ని. వాళ్లలో మా పెద్దన్నయ్య రవి అంటే నాకు ప్రాణం. చిన్నప్పట్నుంచి తన భుజాలపై మోసిన మా అన్నయ్య తర్వాత మద్యం, సిగరెట్లకు బానిసై పోయాడు. ఫలితం క్యాన్సర్ అతన్ని కబళించింది. దాంతో చిన్న వయసులోనే చనిపోయాడు. మా అన్నయ్య ఇద్దరాడ పిల్లలని నేను చేరదీసినా తండ్రి లేని లోటును తీర్చలేకపోయాననే అనే బాధ నన్ను వెంటాడేది. ప్రతి నిమిషం అన్నయ్య జ్ఞాపకాలే... ఆ పిల్లల భవిష్యత్తే గుర్తుకొచ్చేవి. తరచి చూస్తే నాలా బాధపడేవారు నా చుట్టూ ఇంకా చాలామందే ఉన్నారని తెలిసింది. అప్పటికే సోషియాలజీ చదివిన నేను ఓ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ని నిర్వహించేదాన్ని. దానికి తోడుగా మరో డ్రగ్ డీ ఎడిక్షన్ సెంటర్‌ను పదిహేడేళ్ల క్రితం ప్రారంభించాను. ఈ సంస్థ పేరు పీపుల్స్ యాక్షన్ ఫర్ సోషల్ సర్వీసు. సంక్షిప్తంగా పాస్. మొదట్లో అయితే చిన్నపాటి కౌన్సెలింగ్‌లతో మత్తుకు బానిసలైన వారికి చికిత్స అందించవచ్చులే అనుకునేదాన్ని. కానీ ఇదంత తేలికైన విషయం కాదని త్వరలోనే అర్థమైంది. దగ్గరుండి చికిత్స అందిస్తేనే కానీ మత్తుని వదిలించడం సాధ్యం కాదని తెలిసిపోయింది. అందుకే 12 పడకలతో డ్రగ్ డీఎడిక్షన్ కేంద్రాన్ని తిరుపతిలో నెలకొల్పాను. డీ-ఎడిక్షన్ కేంద్రం మొదలుపెట్టాక... డ్రగ్స్ బారి నుంచి బాధితులని బయటపడేయటంపై అనేక అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యాను. తర్వాత పాపులేషన్ సైన్సులో మరో ఎంఏ, పీజీ డిప్లమో ఇన్ లాంగ్ మెడిసిన్, పీజీ డిప్లొమో ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ అప్రాప్రియేట్ టెక్నాలజీ వంటి కోర్సులను చదివాను.

పిచ్చి చేష్టలు భరించాలి..

మా కేంద్రంలో మత్తుకు బానిసలైన వారిని నెల రోజుల పాటూ ఉంచుతాం. ఉచిత వైద్య సేవలతోపాటూ భోజన సదుపాయం కూడా అందిస్తాం. నెల రోజులపాటు వైద్యుల పర్యవేక్షణా, మోటివేషన్ తరగతులూ ఉంటాయి. బాధితులని చేర్చుకున్న మొదట ఐదు రోజులూ మాకు అగ్నిపరీక్షే అనాలి. వ్యసనాలకు బానిసలైన వారు కేంద్రం నుంచి పారిపోవాలని చూస్తారు. అడ్డుపడిన వారిని కొడతారు. నోటికొచ్చినట్లు తిడతారు. బూతులు మాట్లాడతారు. ఒక్కోసారి వారిని వారే గాయపర్చుకుంటారు. ఎదుటి వారిని గాయపరుస్తారు. అందుకే మొదటి ఐదు రోజులు డ్రగ్స్ బారిన పడిన వారిని కంటికి రెప్పలా చూసుకోవాలి. ఆ తర్వాత నుంచి కౌన్సెలింగ్ మొదలవుతుంది. అక్కడ నుంచి వాళ్ల దినచర్యలో మార్పు వస్తుంది. రోజంతా ఏదో ఒక పనిలో నిమగ్నం అవుతారు. అలా నెమ్మదిగా మత్తు నుంచి వారి ధ్యాస మళ్లుతుంది. నాతో పాటూ ఈ పనిచేయడానికి ముగ్గురు మానసిక వైద్యులూ, ఒక సైక్రియాటిస్టూ, ఇద్దరు కౌన్సెలర్లూ, మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎమ్ కూడా ఉంటారు. మొదట్లో అయితే తెలుగు రాష్ట్రాల నుంచే నా దగ్గరకు వచ్చేవారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి కూడా రావడంతో మా సంస్థని 27 పడకలకు విస్తరించాల్సి వచ్చింది. మూడు అంతస్థుల్లో ఈ కేంద్రం కొనసాగుతోంది. కేంద్ర సామాజిక న్యాయశాఖ నుంచి వచ్చే నిధులే మాకు ఆధారం. నాకు ఇద్దరు. పిల్లలు. అమెరికాలో ఉంటున్నారు. అక్కడికి రమ్మని ఎన్నిసార్లు అడిగినా నాకు తీరికేది చెప్పండి. ఏమాత్రం తీరిక ఉన్నా ఇక తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, పద్మావతి యూనివర్సిటీలతో పాటు ఇతర వైద్య విద్యార్థులకు నేను డీఅడిక్షన్‌పై తరగతులు తీసుకుంటూ ఉంటాను.

- **శివ మావూరి,** ఈనాడు, తిరుపతి



వందడుగుల రాఖీ!

పంజాబ్‌లోని ఇండో-పాక్ సరిహద్దు ప్రాంతం వాఘా.. రాఖీ పండుగ రోజున వర్ణభరితమైంది. యావద్దేశానికి పహారా కాస్తున్న సైనిక సోదరుల మనసు సంతోషంతో పులకించిపోయింది. దేశసరిహద్దు సైనిక సోదరులకు రాఖీ రోజున అద్భుతమైన కానుక అందించారు ఉత్తర ప్రదేశ్ మురాదాబాద్ జిల్లాకి చెందిన విద్యార్థినులు. వంద అడుగుల పొడవైన రాఖీ రూపొందించి కానుకగా పంపించారు. మనదేశానికి చెందిన విభిన్న సంస్కృతులని అందులో చక్కటి చిత్రాలుగా రూపొందించారు. ఇందుకోసం కాగితాలూ, వస్త్రాలూ, పలు రకాల లేసుల్ని ఉపయోగించారు. 'పగలూ, రాత్రీ తేడా లేకుండా, కోట్లాది మంది కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయని సైనిక సోదరులకు మా ప్రేమకానుక..' అని ఆ రాఖీపై రాశారు. విద్యార్థినులు పంపించిన అంతపెద్ద రాఖీని చూసి సైనికుల ఆనందానికి అవధుల్లేవు. మరోవైపు.. జమ్మూ, కాశ్మీర్‌కి చెందిన మహిళలు దేశాన్ని కాపాడుతున్న సైనికులకి ఒకరోజు ముందుగానే రాఖీలు కట్టి, తీపి తినిపించారు!

ఇదో కొత్త కానుక...

రక్షాబంధన్ వేడుకని సామాజిక చైతన్యానికీ వాడుకోవడం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది! తెలంగాణలో సోదరులకి రాఖీ కట్టే అమ్మాయిలందరూ వాళ్లకి హెల్మెట్‌లు కూడా అందించాలని ఓ వినూత్న వేడుకని పరిచయం చేస్తున్నారు. ఈ దిశగా మరో అడుగు ముందుకేసింది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం. సాధారణంగా రాఖీ కట్టిన అక్కచెల్లెళ్లకి అన్నదమ్ములు ఏదో కానుక ఇవ్వాలి కదా! అలా అక్కడి యువకులు తమ అక్కాచెల్లెళ్లకి మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చేలా సరికొత్త పథకం చేపట్టింది రాష్ట్రప్రభుత్వం. అమేథీ ప్రాంతంలో దీన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం శుక్రవారం దాకా తొమ్మిదివందల మంది యువకులు జిల్లా పరిశుభ్రత కమిటీలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీళ్లంతా తమ సొంత ఖర్చుతో సోదరి కుటుంబానికి మరుగుదొడ్డి నిర్మించి కానుకగా ఇస్తారు. ఈ పథకానికి 'అనోఖీ అమేథీ కా అనోఖా భాయ్' అని పేరుపెట్టారు. డెబ్భై అయిదు జిల్లాల్లో వచ్చే ఏడాదిలోపు 15.5 మిలియన్ల మరుగుదొడ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ రాఖీపండుగని అవకాశంగా చేసుకుంది. నెల ముందు నుంచే ఈ పథకానికి సంబంధించి ప్రచారాలు మొదలుపెట్టింది. అమేథీకి చెందిన అబ్బాయిలందరూ పరిశుభ్రత కమిటీ ముందు వరసకట్టారు.

email: vasundhara@eenadu.net

పార్టీ ఇస్తున్నారా...

మన సమాజంలో పార్టీల సంస్కృతి పెరుగుతోంది. ఒకప్పుడు సంపన్న, ఉన్నత మధ్యతరగతి కుటుంబాలకే పరిమితమయ్యేవి.. ఇప్పుడు మధ్యతరగతి ఇళ్లలోనూ పెరిగాయి. ఉద్యోగినిగానో, గృహిణిగానో పార్టీ ఏర్పాటుచేయాల్సిన బాధ్యత మనపై పడగానే ఆందోళనా, హడావుడీ తప్పడంలేదు మనకి. అవి లేకుండా మీరూ చక్కటి ఆతిథ్యం ఇవ్వాలంటే ఇలా చేసి చూడండి..



అందరూ ఉండండి : ఆతిథ్యమిచ్చే రోజు ఇంట్లో మీ పిల్లలూ, భాగస్వామి కూడా ఉండేలా చూసుకోండి. పార్టీ అంటే భోజనాలకే కాదు.. పరిచయాలకీ, ఆత్మీయతల కలబోతకీ చక్కటి సందర్భమనే విషయం మరిచిపోవద్దు.

పూట ముందే : ఇంటికొచ్చే ప్రతి ఒక్కరి ఇష్టాలకూ తగ్గట్టు వంటలు సిద్ధంచేయాలని అనుకోవద్దు. ఎక్కువ మందికి ఇష్టమైనవాటినే చూసుకోండి. ఓ పూట ముందే వంటకార్యక్రమాలు పూర్తిచేయాలి. ప్రతి సారీ 'మేం సాయపడమా?' అంటూ అతిథులు ముందుకు రావడం బావోదు.

వాటికి తగ్గట్టు : వంటల్ని బట్టి పాత్రలు ఎంచుకోండి. షాపింగ్ చేసినప్పుడు పాతరకం ఇత్తడీ, రాగి పాత్రల్ని తీసుకుంటూ ఉంటారుకదా! సంప్రదాయ వంటల్ని వాటితోనే వడ్డించండి. ఇదేవిధంగా కేక్‌లు, చాక్లెట్, పాస్తాలాంటివి తయారుచేస్తే ఆధునిక పింగాణీ పాత్రల్లాంటివి ఎంచుకుని చూడండి. అతిథులకి గమ్మత్తుగా అనిపిస్తుంది!

దీపాలు : భోజనం చేసే గదిలో కంటికి చల్లగా ఉండే తక్కువ వెలుగులే బాగుంటాయి. టేబుల్ చుట్టూ చక్కటి పరిమళాలు పంచే కొవ్వొత్తుల్నీ ఉంచండి. అవన్నీ కూడా ఆహారపదార్థాలు పెట్టిన పదార్థాల చుట్టూ ఉండాలి. ఆ వెలుగు చీకట్లు ఓ ఆత్మీయ వాతావరణాన్ని సృష్టిస్తాయి.

కొత్తరకం క్లేలు వచ్చేస్తున్నాయి!

చర్మం బిగుతుగా కనిపించి యౌవనంతో మెరిసిపోవడానికి క్లేలతో అనేక రకాల పూతలు వేసుకుంటాం. అయితే క్లే అంటే ముల్తానీమట్టి ఒకటే కాదు.. ఇప్పుడు అనేక రకాలు అందుబాటులో ఉన్నాయి. అవేంటో చూసేయండి.



బెంటోనైట్ క్లే: ఇది అగ్నిపర్వతం బూడిద నుంచి సేకరించింది. చర్మరంధ్రాలపై పేరుకుపోయిన భారలోహాలు పాదరసం, లెడ్ వంటి వాటిని తొలగించడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. చర్మ అలర్జీలతో బాధపడేవారు కూడా దీనిని ఉపయోగించడం వల్ల మెరుగైన ఫలితాలు అందుకోవచ్చు.

కేవోలిన్ క్లే: చూడ్డానికి తెల్లగా, మెత్తగా ఉండే ఈ క్లే ముఖంలోని సహజ నూనెలు పోకుండా చర్మాన్ని లోతుగా శుభ్రం చేస్తుంది. నీళ్లూ, పాలతో కలిపి దీన్ని వేసుకోవచ్చు.

చార్‌కోల్ క్లే: బొగ్గు నుంచి తయారుచేసిన ఈ చార్‌కోల్ క్లే చర్మంపై పొరలో ఉన్న మలినాలని లోతుగా పీల్చుకుని ఆరోగ్యంగా మారుస్తుంది.

రాసోల్ క్లే: మొరాకో పర్వతాల నుంచి సేకరించిన ఈ క్లేలో సిలికాన్, మెగ్నీషియం, ఐరన్, సోడియం, పొటాషియం, లిథియమ్ ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. దీనికి ఓట్స్ కలిపి పూతలా వేసుకుంటే చర్మం, జుట్టూ రెండూ ఆరోగ్యంగా ఉంటాయి.



గ్రీన్ క్లే: సముద్రంలోని నాచుతో తయారుచేస్తారు దీన్ని. ఈ క్లేలో ఎంజైములు, ఖనిజాలు పుష్కలం. వయసు చాయలని వెనక్కి నెట్టేస్తుంది!

ఓసారి మీ అమ్మనో, అమ్మమ్మవాళ్లనో అడిగిచూడండి. ఒకప్పుడు 'సర్వరోగ నివారణి' అని ప్రచారం చేస్తూ తైలాలు అమ్ముతుండేవారు. తలనొప్పీ, కాళ్లనొప్పీ, జలుబూ, జ్వరం ఇలా అన్నింటికీ అదొక్కటి చాలనేవారు. నేటి తల్లిదండ్రులూ మమ్మల్ని ఇలాంటివే అడుగుతున్నారు. 'మావాడికి కోపం ఎక్కువండీ! అందరితో గొడవపడుతున్నాడు. చదువులో బాగా వెనకపడిపోతున్నాడు! వీటన్నింటికో పరిష్కారం చెప్పండి!' అని. ఈ సమస్యలు వచ్చాక, వాటిని నివారించడానికి ఒకే ఒక పరిష్కారం ఉండకపోవచ్చు. కానీ అవి రాకుండా చూడటానికి మాత్రం 'సర్వరోగ నివారణి'లాంటి మందొకటుంది. అదే ఉద్వేగ ప్రజ్ఞ. అంటే ఎమోషనల్ ఇంటెలిజన్స్! దీన్నే ఈక్యూ.. ఎమోషనల్ కోషంట్ అనీ అంటారు. నిజంగానే దీనికంత శక్తి ఉందా?

ఇదొక్కటి నేర్పించండి చాలు!

అంతశక్తి ఉందనే నేటి పాశ్చాత్య ప్రపంచం భావిస్తోంది. పిల్లలకి ఉద్వేగాలపై నియంత్రణ నేర్పగలిగితే అటు కళాశాలల్లో హింసని నివారించడం, చిన్నారుల్లోని మేధోశక్తినీ వెలికితీయడం సులువని చెబుతున్నాయి. ఇందుకోసం అమెరికాలాంటి దేశాల్లో 'సోషల్ అండ్ ఎమోషనల్ లెర్నింగ్'(సెల్) పేరుతో ప్రత్యేక శిక్షణ మొదలుపెట్టారు. ఇంతకీ 'ఉద్వేగ ప్రజ్ఞ' అంటే ఏమిటీ? కోపం, అసూయా, దుఃఖం, భయం.. వీటిని గుర్తించడం, సక్రమంగా అదుపుచేయగలగడం. వీటిని ఎదుటివారిలోనూ సమర్థంగా గుర్తించి అర్థం చేసుకోగలగడం! మరి దీన్ని మరి మనదేశంలో నేర్పిస్తున్నారా? మనకి 'ఈక్యూ' అనే పదబంధం కొత్తది కావొచ్చుకానీ.. ఆ భావన ఎప్పటి నుంచో మనకుంది. 'తన కోపమే తన శత్రువు..' వంటి సుమతి శతక పద్యాలూ, పంచతంత్రం కథలు నేర్పేదంతా ఈ విషయాన్నే. గత కొంతకాలంగా మనం మార్కులపై మాత్రమే దృష్టిపెట్టి అలాంటి విలువల చదువులని పక్కనపెట్టేశాం. దాంతో వాళ్లలో విపరీతంగా పెరిగిపోతున్న ఒత్తిడి చిన్నారుల్లో విపరీతమైన పోకడలకి దారితీస్తోంది! ఇప్పట్లో విద్యావ్యవస్థ ఉన్నపళంగా మారే అవకాశం లేదుకాబట్టి.. తల్లిదండ్రులుగా మనమే పిల్లల ఉద్వేగాలని పట్టించుకోవాలి. వాటిని నియంత్రించడం ఎలాగో నేర్పాలి. అందుకేం చేయాలి?

మీరే తొలి గురువులు!

ఐక్యూ విషయం ఎలా ఉన్నా.. ఈక్యూ మాత్రం కచ్చితంగా ఇంటి నుంచే మొదలవుతుంది. తల్లిదండ్రుల్ని చూసే ఉద్వేగాలని నియంత్రించడం నేర్చుకుంటారు వాళ్లు. కాబట్టి, వాళ్ల ముందు అతికోపం ప్రదర్శించకండి. పిల్లల ముందు మీరూ, మీ భాగస్వామి పరస్పరం గౌరవంగా మెలగండి. ఏ పరిస్థితుల్లోనూ పిల్లలపై చేయిచేసుకోకండి. వాళ్ల ఉద్వేగ ప్రజ్ఞకి గొడ్డలిపెట్టు అది.

అభినందించండి : మీ చిన్నారులు ఎదుటివారిపట్ల ఏ కాస్త జాలీ, దయా, ప్రేమా చూపిస్తున్నా అభినందించండి. ఒకవేళ కోపం, అసూయలాంటివి ఉంటే వెంటనే తప్పని చెప్పొద్దు. వాటివల్ల వాళ్ల శరీరంలో ఏర్పడుతున్న మార్పుల్ని గమనించమని చెప్పండి. అవి ఎలాంటి చెడుని కలిగిస్తాయో వివరించండి.

హత్తుకోండి : పిల్లలు టీనేజీలోకి అడుగుపెట్టేకొద్దీ వాళ్లని దూరం చేస్తుంటాం మనం! అందువల్ల వాళ్లలో ఏర్పడే 'స్కిన్ హంగర్' వాళ్లలో లోలోపల తీవ్ర నిస్పృహని నింపుతుంది. అది ఉద్వేగాలపై అదుపు కోల్పోయేలా చేస్తుంది. కాబట్టి వయసుతో నిమిత్తం లేకుండా వాళ్లని దగ్గరకు తీసుకోండి.



ఇవన్నీ ఉండాలి.. : పరీక్షా భయం, ఇంకేవైనా కోపతాపాలు ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని తగ్గించే కొన్ని అలవాట్లని అందించాలి. సంగీతం వినడం, చిత్రలేఖనం, నడవడం, డైరీ రాయడం ఇవన్నీ అలాంటి అలవాట్లే. వ్యాయామం, యోగా, ధ్యానాన్ని కూడా వాళ్ల జీవితంలో భాగం చేయగలిగితే ఉద్వేగాల విషయంలో పట్టుసాధించినట్టే. ముఖ్యంగా, చిన్నప్పటి నుంచే వాళ్లని ఇంటిపనుల్లో భాగస్వాముల్ని చేయండి. ఇది వాళ్లకి ఎంతో ఆత్మవిశ్వాసాన్నిస్తుంది.

ప్రత్యేకతేమిటీ? : లెక్కలూ, ఇంగ్లిషూ, సైన్స్‌లో మీ పాప వెనకపడిందని అనుకుందాం. తెలుగులో మాత్రం అద్భుతంగా రాణిస్తోంది. ఆ సబ్జెక్టులోని ఆ నైపుణ్యమే ఆమె ప్రత్యేకత! దాన్ని మరింతగా ప్రోత్సహించండి. మిగతావాటిపై ఇంకాస్త ఎక్కువగా శ్రమించమనండి చాలు. తనలో ఫలానా ప్రత్యేకత ఉందని గుర్తించిన ప్రతి చిన్నారీ ఉద్వేగాల అదుపులో మేటిగానే ఉంటుంది.

ఇవి వద్దు..

పోల్చవద్దు : పిల్లల పెంపకానికి సంబంధించి అతి ప్రాథమిక విషయం ఇదే! ఈ పోలిక వల్ల వాళ్లలో అసూయా, నిస్పృహ, ఆత్మన్యూనతా.. అన్నీ వచ్చేస్తాయి. కాబట్టి ఏ పరిస్థితుల్లోనూ ఇతర పిల్లల విజయాలని చూపి వీళ్లని కించపరచకండి.

తప్పుపట్టొద్దు : టీనేజీలో అమ్మాయిలూ, అబ్బాయిలు ఒకరికొకరు ఆకర్షణకి గురికావడం చాలా మామూలు విషయం. హద్దులు దాటని పలకరింపులూ, చేయిపట్టుకోవడాలు వంటివి.. వాళ్ల మానసిక ఎదుగుదలకీ మంచివే. దాన్ని తప్పుపట్టి ఆంక్షలు పెట్టకండి. ఆ స్వేచ్ఛారాహిత్యం వారిలో మరింతగా ఉద్వేగాలని రాజేస్తుంది.

వాటికి దూరంగా : రంగు, ఎత్తూ, బరువు విషయంలో వాళ్లనెప్పుడూ తక్కువ చేయొద్దు. వాళ్లూ తక్కువ చేస్తుంటే చూస్తూ ఊరుకోవద్దు. ఇవే చిన్నప్పుడే ఆత్మన్యూనతకి కారణమై.. జీవితాంతం ఉద్వేగాల నియంత్రణకి దూరంగా ఉంచేస్తాయి.

అదుపు చేయొద్దు : హార్మోన్ల ప్రభావం కారణంగా, టీనేజీ పిల్లల్లోని భావోద్వేగాలు అదుపులో ఉండవు. అలాంటప్పుడు మీరెక్కడో చదివిన ఉద్వేగ ప్రజ్ఞ సూత్రాల్ని వాళ్లపై రుద్దకండి. మరి? 'ఏది జరిగినా మన మంచికే!' అనే చిన్న ఆశావాదం నేర్పించండి. అదే చాలావరకూ ఉద్వేగాల్లో తీవ్రమైన మార్పుల్ని కట్టడిచేస్తుంది.



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

మంచూరియా గ్రేవీ.. ఎలా?

ప్ర ఇంట్లో వెజ్ మంచూరియా చేయడం తెలుసు. అయితే దానికి సంబంధించిన గ్రేవీ తయారీ మాత్రం సరిగ్గా కుదరడంలేదు. ఇందుకు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి?

- వైష్ణవి, పూతలపట్టు





జ మంచూరియా గ్రేవీ కోసం సన్నగా తరిగిన ఉల్లికాడలూ, అల్లం, వెల్లుల్లీ, పచ్చిమిర్చీ, సోయా సాస్, వెనిగర్, కూరగాయలు ఉడికించిన నీరూ, మిరియాల పొడీ, తగినంత ఉప్పు తీసుకోవాలి. ప్రత్యేకమైన రుచి కావాలనుకుంటే సాధారణ వెనిగర్‌కు బదులు బాల్సమిక్ వెనిగర్ వాడుకోవచ్చు. మొదట ఉల్లికాడలు, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చిని నూనెలో వేయించుకోవాలి. తరవాత నీళ్లూ, సోయాసాస్, ఉప్పు, మిరియాల పొడీ వేసుకోవాలి. తరవాత చెంచా మొక్కజొన్న పిండిని కొద్దిగా నీళ్లలో కలిపి ఈ గ్రేవీలో వేయాలి. ఇది మనకు ఎంత చిక్కగా కావాలనుకునేదాన్ని బట్టి అంత సేపు ఉడికించుకోవాలి. గ్రేవీ రుచికరంగా రావాలంటే నీళ్లకు బదులు కూరగాయలు ఉడికించిన నీరు వాడుకోవచ్చు. ఇది చిక్కగా అయ్యాక ముందుగానే వేయించుకున్న మంచూరియా వేసి, రెండు నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఇప్పుడు చిటికెడు ఉప్పూ, పంచదారతోపాటు చెంచా వెనిగర్ వేసుకుంటే సరిపోతుంది. ఒకవేళ గ్రేవీ పలచబడినట్లు అనిపిస్తే ఇంకొంచెం మొక్కజొన్నపిండిని నీళ్లలో కలిపి అందులో వేస్తే చాలు.

అలాగే మంచూరియా ఉండల తయారీలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. సన్నగా తరిగిన కూరగాయ ముక్కలకు రెండు చెంచాల చొప్పున మైదా, మొక్కజొన్నపిండీ, ఉప్పూ, మిరియాల పొడి కలిపి 15 నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. కూరగాయల ముక్కల నుంచి వచ్చిన నీటితో చక్కగా ఉండలు చేసుకోవచ్చు. ఒకవేళ మైదా మొక్కజొన్న పిండి తక్కువైతే నీరు ఎక్కువగా వచ్చి ఉండ కట్టడానికి వీలుకాదు. అంతేకాదు ఉండలు నూనెలో వేయగానే విడిపోతాయి. అలాంటి సందేహం ఉన్నప్పుడు కోడిగుడ్డు తెల్లసొన రెండు చెంచాలు కలుపుకోవచ్చు. ఉండలను ఓ అర నిమిషం పెద్ద మంటపై ఉంచి.. తరవాత మంట తగ్గించి వేయించుకుని తీసుకుంటే చాలు.


కాస్తయినా శక్తి ఉండాలి..!

వ్యాయామాలు చేసేది శక్తిసామర్థ్యాలు పెంచుకోవడానికే కానీ.. వాటిని చేయడానికి మనకు కనీస ఓపికుండాలి కదా! చిన్నపాటి కసరత్తులకే నీరసం ఆవహించకుండా చూసుకోవాలిగా!! అందుకే ఇవి గుర్తుంచుకోండి..

- వ్యాయామం చేసే ముందుగా ఓ కప్పు కాఫీ, టీ తీసుకోవడం వల్ల మీ శరీరానికి కావాల్సిన శక్తి అందుతుంది. ఏ కసరత్తయినా ఉత్సాహంగా చేయగలుగుతారు. మరి కెఫిన్ ప్రభావమో అంటారా? మీకు దాని భయం అక్కర్లేదు. మీరు చేసే వర్కవుట్ల కారణంగా అది ఏమాత్రం మీపై దుష్ప్రభావం చూపదు. ఓసారి ప్రయత్నించి చూడండి.
- కనీసం గంట ముందు ఏదైనా ఆహారం తీసుకోండి. అందులో పిండిపదార్థాలూ, మాంసకృత్తులూ ఎక్కువగా ఉండాలి. అవి తక్షణ శక్తినిస్తాయి. తక్కువ కెలోరీలు ఉండే ప్రొటీన్ స్మూథీ వంటివీ చక్కగా ఉపయోగపడతాయి.
- వ్యాయామాల ఎంపికలోనూ కాస్త జాగ్రత్త తీసుకోవాలి. సులభంగా ఉన్నాయి కదాని కొందరు నడక, పరుగూ, ఎత్తులెక్కడం వంటి కార్డియో వ్యాయామాలు ఎక్కువగా చేస్తుంటారు. ఇవి అలసటకు గురిచేస్తాయి. అలాకాకుండా వాటితోపాటూ బరువులు మోసే స్ట్రెంగ్త్ వ్యాయామాలని జతచేసుకోండి. ఇవి కండరాలకి బలాన్నిస్తాయి. అలవాటయ్యేకొద్దీ కావాల్సినంత ఓపికనీ అందిస్తాయి.



32750 వద్ద కీలక నిరోధం!



సమీక్ష : అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో గత వారం మన మార్కెట్ స్తబ్దుగా ముగిసింది. అధిక స్థాయిల వద్ద స్థిరీకరణ చోటు చేసుకోవడం ఇందుకు మరో కారణం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రేట్లను కనీసం పావు శాతమైనా తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలతో వారాన్ని మార్కెట్ సానుకూలంగానే ప్రారంభించింది. పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తగ్గించడంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే కీలక రంగాలు, తయారీ పీఎంఐ గణాంకాలు నిరాశ పర్చడంతో ఆ తర్వాత మార్కెట్ సెంటిమెంటు డీలాపడింది. కంపెనీల త్రైమాసిక ఫలితాలకు అనుగుణంగా షేర్లలో కదలికలు కనిపించాయి. ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 21.4% వృద్ధి ఉందన్న నివేదికతో మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టింది. ఆర్‌బీఐ కీలక రేట్లను పావు శాతం తగ్గించినప్పటికీ, తటస్థ వైఖరి కొనసాగించడంతో మళ్లీ అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఫార్మా కంపెనీల భవిష్యత్ ఆదాయ అంచనాలపై ఆందోళన నెలకొనడమూ నష్టాలు కొనసాగేలా చేసింది. ఆఖర్లో ఎంపిక ఆధారంగా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కాస్త పుంజుకోగలిగాయి. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 16 (0.04%) పాయింట్లు పెరిగి 32325 వద్ద ముగిసింది. నిఫ్టీ 52 (0.5%) పాయింట్ల లాభంతో 10066 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎఫ్‌ఐఐలు నికరంగా రూ.1,525 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మ్యూచువల్ ఫండ్‌ల నికర కొనుగోళ్లు రూ.5,297 కోట్లుగా నమోదయ్యాయి. వినియోగ వస్తువులు, చమురు- గ్యాస్, లోహ రంగాల షేర్లు రాణించగా.. ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎంసీజీ, భారీ యంత్ర పరికరాల షేర్లు డీలాపడ్డాయి.

లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:3గా నమోదు కావడం.. మార్కెట్లో అప్రమత్త వాతావరణాన్ని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } సమీపకాలంలోనూ మార్కెట్ల స్థిరీకరణ కొనసాగుతుంది. సెన్సెక్స్ ఒక వేళ కిందకు వస్తే 32000 పాయింట్ల వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది. ఈ స్థాయి కంటే పైన కదలాడితే సానుకూల ధోరణి కొనసాగొచ్చని భావించొచ్చు. ముఖ్యంగా 32750 స్థాయిని మించితే సూచీ మరింత రాణించే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు } కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలు ఈవారం మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి. బ్రిటానియా, టాటా స్టీల్, ఐషర్ మోటార్స్, గెయిల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ లాంటి దిగ్గజ సంస్థలు ఈ వారంలో ఫలితాలు ప్రకటించనున్నాయి. ఈ ఫలితాల ప్రభావం ఆయా రంగాల, కంపెనీల షేర్లపై ప్రభావం ఉంటుంది. 11న వెలువడే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణ (సీపీఐ) గణాంకాలను కూడా మదుపర్లు పరిగణనలోకి తీసుకుంటారు. అదే రోజు ముగియనున్న పార్లమెంటు సమావేశాల పైనా దృష్టి సారిస్తారు. అమెరికా, చైనాకు సంబంధించి వార్తలు, గణాంకాలను కూడా గమనిస్తారు. చమురు ధరలు, రూపాయి కదలికలు, డీఐఐలు/ ఎఫ్‌ఐఐల పెట్టుబడుల ప్రభావమూ మార్కెట్‌పై ఉంటుంది.

తక్షణ మద్దతు: 32104, 31808, 31626; **తక్షణ నిరోధం:** 32686, 32850, 33250

సమీపకాలంలో సెన్సెక్స్‌కు 32750 పాయింట్ల వద్ద కీలక నిరోధం కనిపిస్తోంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ





కోడిగుడ్లు

6వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	318	విశాఖపట్నం	330
చిల్లరగా(ఒకో గుడ్డు)	3.80	వరంగల్	320
బెంగళూరు	360	చిత్తూరు	365
7న		చెన్నై	372
విజయవాడ/గోదావరి	323	నమక్కల్	360

బుల్ బుల్.. పరుగుల్!!

- ఆర్థిక ఫలితాలపై మదుపర్ల దృష్టి
- వాహన, ఐటీ షేర్లకు లాభాలొచ్చే అవకాశం
- టెలికాం షేర్లలో నష్టాల కొనసాగింపు

స్టాక్ మార్కెట్ ఈ వారం

స్టాక్ మార్కెట్లు సానుకూలంగా చలించొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా జులై ఉద్యోగ గణాంకాలు, కార్పొరేట్ ఫలితాలను మదుపర్లు పరిశీలిస్తారు. డాలరుతో పోలిస్తే రూపాయి బలపడటం; అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో బలహీనతలు; ద్రవ్యోల్బణంలో క్షీణత భారత విపణికి సానుకూలంగా కనిపిస్తున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక రంగానికి ఇవి అత్యంత సానుకూలమని విశ్లేషకులు అంటున్నారు. బ్యాంకు షేర్లలో ర్యాలీ కొనసాగినంత కాలం.. మార్కెట్లు కొత్త గరిష్ఠాలకు చేరుతూనే ఉంటాయని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. నిఫ్టీ-50 ఈ వారం 9920-10200 పాయింట్ల శ్రేణిలో కదలాడవచ్చు. టాటా స్టీల్ (సోమ), అరబిందో ఫార్మా(బుధ), టాటా మోటార్స్(బుధ), గెయిల్ ఇండియా(గురు)ల ఫలితాలపై మదుపర్లు ఓ కన్నేయవచ్చు. శుక్రవారం వెలువడే పారిశ్రామికోత్పత్తి సూచీ గణాంకాలు కూడా కీలకం అవుతాయి. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు..



వాహన: ఈ వారం ఈ రంగ షేర్లు లాభాల బాట పట్టొచ్చు. మెరుగైన రుతు పవనాలు, జులై నెల గణాంకాలు ఇందుకు దోహదం చేయొచ్చు. మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు కీలక మద్దతు స్థాయి అయిన రూ.1390ని కోల్పోతే రూ.1360 వరకు తగ్గొచ్చు. ఐషర్ మోటార్స్ రూ.32,500 వరకు పెరగవచ్చు. హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్ సైతం వరుసగా రూ.4050 దాకా; రూ.619 దాకా వెళ్లవచ్చు. మారుతీ సుజుకీ రూ.7600-7920 శ్రేణిలో చలించొచ్చు.



సిమెంటు: సిమెంట్ షేర్లు మిశ్రమ ధోరణిలో చలించొచ్చు. ఏసీసీ లాభాల్లోనూ; అల్ట్రాటెక్ సిమెంట్ చాలా తక్కువ శ్రేణిలోనూ కదలాడొచ్చు. అంబుజా సిమెంట్ రూ.282 స్థాయిని అధిగమిస్తే రూ.290 దాకా వెళ్లవచ్చు. వర్షాల కారణంగా సిమెంటు రంగానికి గిరాకీ తగ్గొచ్చు. ధరలు కూడా కొన్ని ప్రాంతాల్లో తగ్గాయి. ఏసీసీ రూ.1740-1852; అల్ట్రాటెక్ రూ.4001-4150 స్థాయిలో చలించొచ్చు.




టెలికాం: చాలావరకు టెలికాం కంపెనీల షేర్లు నష్టాల పాలు కావొచ్చు. జియో వచ్చాక పెరిగిన పోటీ ఇందుకు నేపథ్యం. ఇటీవల జియో ప్రకటించిన 'ఉచిత' ఫోన్ కూడా ఇతర కంపెనీలపై ఒత్తిడి పెంచొచ్చు. ఆర్‌కామ్ షేర్లు రూ.21.60-24.40 శ్రేణిలో కదలాడొచ్చు. ఐడియా సెల్యులార్ రూ.87.50-95.50మధ్య; భారతీ ఎయిర్‌టెల్ రూ.400-430; టాటా కమ్యూనికేషన్స్ రూ.624-660 మధ్య చలించొచ్చు.



ఐటీ: మార్కెట్ స్థిరీకరణ జరుగుతున్నందున, ఐటీ షేర్లు లాభాల బాట పట్టొచ్చు. టెక్ మహీంద్రా షేర్లు రూ.370-460 మధ్య కదలాడొచ్చు. ఇన్ఫోసిస్‌కు రూ.935 వద్ద మద్దతు లభించొచ్చు. రూ.1130 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ.830-980 మధ్య చలించొచ్చు. టీసీఎస్‌కు రూ.2400-2470 శ్రేణిలో మద్దతు; రూ.2625-2700 మధ్యలో నిరోధం కనిపించొచ్చు.



బ్యాంకింగ్: ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో కదలికలు కనిపించొచ్చు. నిఫ్టీ బ్యాంక్‌కు 24,590 వద్ద మద్దతు; 25020 వద్ద నిరోధం కనిపించొచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నారు. కొద్ది రోజుల్లో యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్ షేర్లలో ఎక్కువగా షార్ట్ పొజిషన్లు కనిపించిన కారణంగా.. వచ్చే కొద్ది రోజుల్లో ఆయా షేర్లలో లాభాల స్వీకరణకు ఆస్కారం లేకపోలేదు.




యంత్ర పరికరాలు: ఈ రంగ షేర్లు మిశ్రమ ధోరణిలో చలించొచ్చు. ఎల్ అండ్ టీ పైకి, సీమెన్స్ కిందకు పయనించొచ్చని అంటున్నారు. ఎల్ అండ్ టీ ఈ వారం రూ.1190-1210 శ్రేణిలో చలించొచ్చని అంటున్నారు. సీమెన్స్‌కు రూ.1382 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని.. రూ.1330 వద్ద మద్దతు లభించొచ్చని అంటున్నారు. మంగళ, గురు వారాల్లో ఫలితాలు ప్రకటించనున్న థెర్మాక్స్, భెల్‌లపై మదుపర్లు దృష్టి సారించొచ్చు.



ఫార్మా: సన్‌ఫార్మా(11న), సిప్లా(11న), అరబిందో ఫార్మా(9న), కేడిలా హెల్త్‌కేర్(11న) ఫలితాలు కీలకం కానున్నాయి. ఇప్పటికే ఈ రంగ ఫలితాల ప్రభావం ఆయా కంపెనీల స్క్రిప్‌లపై కనిపించిందని మరికొంత మంది అంటున్నారు. లుపిన్, సిప్లాలు వరుసగా రూ.1025; రూ.573 స్థాయికి తిరిగి చేరుకోవచ్చని అంచనా. కేడిలా హెల్త్‌కేర్ రూ.520-550; డాక్టర్ రెడ్డీస్ రూ.2190-2450 మధ్య చలించొచ్చు.



ఎఫ్ఎంసీజీ: కొత్త పన్ను విధానం అమలు నేపథ్యంలో చాలా వరకు ఎఫ్ఎంసీజీ కంపెనీలు స్థిరీకరణకు లోనుకావొచ్చు. ఈ రంగ కంపెనీల్లో ఎక్కువ భాగం అంచనాలకు మించి ఫలితాలు నమోదు చేయవచ్చన్న అంచనాల మధ్య సానుకూలతలు కనిపించొచ్చు. డాబర్‌కు రూ.300 వద్ద మద్దతు; రూ.315 వద్ద గట్టి నిరోధం ఉండొచ్చు. ఐటీసీకి రూ.275 వద్ద గట్టి మద్దతు లభించొచ్చని భావిస్తున్నారు. బ్రిటానియా స్వల్పకాలంలో రూ.4000 స్థాయిని అధిగమించవచ్చని అంచనా.





చమురు: గత కొద్ది రోజులుగా రాణిస్తున్న ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లలో లాభాల స్వీకరణ కనిపించొచ్చు. దిద్దుబాటు జరిగినా, వారం చివర్లో పుంజుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. శుక్రవారం వెలువడే బీపీసీఎల్ ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. ఇతరత్రా కీలక వార్తలేవీ లేనందున ముడి చమురు ధరలు, మొత్తం మీద మార్కెట్ స్పందనపై ఆధారపడి చమురు కంపెనీల షేర్లు చలించొచ్చు.



లోహ: నేడు వెలువడే టాటా స్టీల్ ఫలితాలు; శుక్రవారం విడుదలయ్యే హిందాల్కో గణాంకాలు ఈ రంగానికి దిశానిర్దేశం చేయొచ్చు. దేశీయ మార్కెట్లో బలహీన గిరాకీ, అధిక కోకింగ్ కోల్ వ్యయాల వల్ల టాటా స్టీల్ ఫలితాలపై ప్రభావం కనిపించొచ్చు. రాగి విక్రయాలు తక్కువ కావడం; అల్యూమినియం తయారీకయ్యే ముడి పదార్థాల వ్యయాలు అధికం కావడం.. హిందాల్కో పనితీరుపై ప్రభావం చూపొచ్చు.

కాగ్నిజెంట్ ఆఫర్‌కు 400 మంది సమ్మతి!

దిల్లీ: సంస్థ నుంచి స్వచ్ఛందంగా వైదొలగేందుకు దాదాపు 400 మంది ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లు అంగీకరించినట్లు కాగ్నిజెంట్ టెక్నాలజీస్ వెల్లడించింది. స్వచ్ఛందంగా వైదొలిగితే ఇచ్చే ప్యాకేజీ (వీఎస్‌పీ) తీసుకునేందుకు వారు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపింది. తద్వారా సంస్థకు ఏడాదికి 60 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.400 కోట్లు) వ్యయం తగ్గుతుందని వివరించింది. ఈ ప్యాకేజీకి ఒప్పుకున్న వారిలో భారత్‌లో ఎంత మంది ఉన్నారో సంస్థ వెల్లడించలేదు. వీఎస్‌పీ కింద సంస్థను వీడే ఉద్యోగులకు దాదాపు 9 నెలల జీతాన్ని ఇవ్వనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో కాగ్నిజెంట్ ఉద్యోగుల సంఖ్య 4,400 తగ్గింది. ఇదే సమయంలో సంస్థ మొత్తం మీద 10,800 మందిని నియమించుకుంది. ఏప్రిల్-జూన్‌లో వలసల రేటు 23.60 శాతంగా ఉంది. ఏడాది క్రితం ఇది 17.10 శాతమే. విశ్లేషణ, కృత్రిమ మేధ, డేటా సైన్స్, డిజిటల్ సెక్యూరిటీ విభాగాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నట్లు కాగ్నిజెంట్ అధ్యక్షుడు రాజీవ్ మెహతా పేర్కొన్నారు.

ప్రభుత్వం పట్టేస్తుంది

- నిత్యావసరాల ధరలపై రోజువారీ నివేదికలు
- అసాధారణ మార్పులు తెలిసిపోతాయ్
- సరఫరా అవరోధాల్లేవ్
- సీబీఈసీ ఛైర్‌పర్సన్ వనజా సర్నా

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చిన జులై 1 నుంచి నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం రోజూ నిశితంగా గమనిస్తోందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) ఛైర్‌పర్సన్ వనజా సర్నా తెలిపారు. అసాధారణ కదలికలుంటే, వెంటనే గుర్తించేందుకు గోధుమల నుంచి తేయాకు వరకు 2 డజన్లకు పైగా నిత్యావసరాల ధరలపై ప్రభుత్వం నిఘా పెట్టిందని వివరించారు. సరఫరా విషయంలో పెద్ద అవరోధాలు ఏర్పడలేదని అన్నారు. మొత్తం మీద జీఎస్‌టీ అమలు ప్రక్రియ సాఫీగా నడుస్తోందని తెలిపారు.

అదనపు సమయం పనిచేస్తున్నాయ్

జీఎస్‌టీ అమలు ప్రక్రియలో అవరోధాలు ఎదురుకాకుండా చూసేందుకు పన్ను విభాగంలోని బహుళ పర్యవేక్షణ విభాగాల అధికారులు అదనపు సమయం పనిచేస్తున్నారని వనజా చెప్పారు. 'నిత్యావసర వస్తువుల ధరలు, ధరల మధ్య వ్యత్యాస వివరాలను రోజూ వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాకు పంపిస్తోంది. ఇందులో మాకు అసాధారణ మార్పులేమీ కనిపించలేదు. గత 30 రోజుల్లో రోజూ మాకు నివేదిక అందింద'ని సర్నా అన్నారు. 'గోధుమలు, బియ్యం, పప్పులు, చక్కెర, తేయాకు వంటి 25- 30 వరకు ఆహారోత్పత్తుల ధరలు మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. రెవెన్యూ విభాగం, మంత్రివర్గ కార్యదర్శి కార్యాలయానికి మంత్రిత్వ శాఖ నివేదిక పంపిస్తోంద'ని చెప్పారు. ధరలు, సరఫరా స్థితిగతులను పర్యవేక్షించేందుకు 200 మందికి పైగా ఉన్నతాధికారులతో బృందాలను మంత్రివర్గ కార్యదర్శి ఏర్పాటు చేశారు. ఒక్కో అధికారికి 3-4 జిల్లాలు అప్పగించారు.



ఎంఆర్‌పీలలో మార్పుల వల్లే సరఫరా లోటు: ఒక వస్తువు రెండు లేదా మూడు రోజులకు మించి లభ్యం కాకపోయే పరిస్థితే రాలేదు. అదికూడా నూతన పన్ను విధానంలో గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ)ల్లో మార్పుల వల్ల ఏర్పడుతోంది. కొత్త ప్యాకింగ్ కోసం ఒకటి లేదా రెండు రోజుల పాటు వస్తువుల సరఫరా ఆగొచ్చు. జీఎస్‌టీకి ముందున్న ధరతో పాటు సవరించిన ఎంఆర్‌పీని వస్తువుల లేబుల్‌పై ప్రచురించాల్సిందిగా గత నెలలో కంపెనీలకు వాణిజ్య మంత్రిత్వ శాఖ సూచించింది. అప్పటికీ, ఇప్పటికీ ధరల మధ్య వ్యత్యాసాన్ని వినియోగదారులకు తెలియజేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

మార్కెట్ల నుంచి నిధులు సమీకరిద్దాం

- 12 ప్రభుత్వరంగ బ్యాంకుల సన్నాహాలు
- బాసెల్-3 ప్రమాణాలు అందుకునేందుకే

దిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులు నిధుల వేటలో పడ్డాయి. బాసెల్-3 ప్రమాణాలకు అనుగుణంగా మూలధనాన్ని పెంచుకునేందుకు దాదాపు 12 బ్యాంకులు స్టాక్ మార్కెట్ల నుంచి నిధులు సమీకరించేందుకు ప్రణాళికలు రూపొందించాయి. ఆంధ్రాబ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయా బ్యాంక్‌లు నిధుల సమీకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతులు పొందాయి. పబ్లిక్ ఆఫర్ లేదా క్యూఐపీ రూపంలో ఈ నిధులు సమీకరించనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఆంధ్రాబ్యాంక్ సహా 6-7 బ్యాంకులు నిధుల సమీకరణను పూర్తి చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మిగతా బ్యాంకులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపాయి. అలహాబాద్ బ్యాంక్ రూ.2,000 కోట్ల వరకు సమీకరించేందుకు వాటాదార్ల అనుమతి తీసుకుంది. దాదాపు రూ.3,000 కోట్లు సమీకరించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ బోర్డు అనుమతులు జారీ చేసింది. రూ.1,800 కోట్ల వరకు సమీకరించేందుకు దేనా బ్యాంక్ కూడా వాటాదార్ల అనుమతి పొందింది.

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌కు కేంద్రం తుది అనుమతులు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ (ఏపీ)లో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీ క్లస్టర్ కార్పొరేట్ సంస్థలను ఆకర్షిస్తోంది. చిత్తూరు జిల్లాలో 501 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ క్లస్టర్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ తుది అనుమతులు జారీ చేసిందని మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అజయ్ కుమార్ తెలిపారు. ఇందుకు సుమారు రూ.340 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందులో మూడు సంస్థలు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) మేనేజర్ (తిరుపతి) ఐఎల్ రామ్ వెల్లడించారు. 35కు పైగా ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ప్లాంట్ల ఏర్పాటుకు ఆరా తీసినట్లు తెలిపారు. ఈ క్లస్టర్ ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు వివరించారు. గత ఏడాది ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అనుమతులు జారీ చేయగా, తుది అనుమతులు ఇచ్చేందుకు భూమి లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది.

అంటువ్యాధి కలిగిన ప్రయాణికులపై ఏటీసీకి సమాచారం: డీజీసీఏ

దిల్లీ: ప్రయాణికుల్లో ఎవరైనా అంటువ్యాధులతో బాధపడుతున్నారనే అనుమానం వస్తే తప్పనిసరిగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) కి విధినిర్వహణలో ఉన్న పైలెట్ సమాచారం అందించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల విమానం గమ్యస్థానం చేరే సమయానికి అవసరమైన వైద్య పరికరాలు, వైద్యులను అందుబాటులో ఉంచడానికి వీలవుతుందని విమానయాన సంస్థలకు వివరించింది. ప్రయాణికులెవరైనా అకస్మాత్తుగా దగ్గు, శ్వాస తీసుకోలేకపోవడం, వాంతులు, విరేచనాలు, రక్తస్రావం వంటి వాటితో బాధపడుతుంటే పైలెట్ ఏవిధంగా సదరు ప్రయాణికుడి సమాచారాన్ని అందించాలనే దానిపై సమగ్ర విధానాన్ని ఆయా విమానయాన సంస్థలు రూపొందించాలని డీజీసీఏ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) సూచనల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశామని డీజీసీఏ అధికారి తెలిపారు. డిసెంబరు 31 నాటికి అన్ని విమానయాన సంస్థలు ఈ ఉత్తర్వులను తమ ఆపరేషన్ మాన్యువల్‌లో విధిగా చేర్చాలని డీజీసీఏ ఆదేశించింది. షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్, ప్రైవేటు విమానయాన సంస్థలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.



ఈ వారం బోర్డు సమావేశాలు

నేడు : నాట్కో ఫార్మా, అమర రాజా బ్యాటరీస్, టాటా స్టీల్, బ్రిటానియా, డాక్టర్ లాల్ పాథ్ ల్యాబ్స్, ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్, నీల్‌కమల్, ఎవరెడీ ఇండస్ట్రీస్, క్యాప్లిన్ పాయింట్ ల్యాబ్స్, మెర్క్, వెల్‌స్పన్ ఇండియా, జిందాల్ స్టెయిన్‌లెస్, వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా, పొలారిస్

రేపు : బ్యాంక్ ఆఫ్ ఇండియా, కావేరీ సీడ్, ఎన్‌సీసీ, ఆస్ట్రాజెనికా ఫార్మా, గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్జ్యూమర్, ఫ్యూచర్ రిటైల్, జిందాల్ స్టీల్, సెంచురీ టెక్స్‌టైల్స్, టాటా కెమికల్స్, సుందరం క్లేటాన్, ముత్తూట్ ఫైనాన్స్, చంబల్ ఫెర్టిలైజర్స్

9న : అరబిందో ఫార్మా, అజంతా ఫార్మా, టాటా మోటార్స్, సిటీ యూనియన్ బ్యాంక్, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎండీసీ, ఐషర్ మోటార్స్, నాగార్జునా ఫెర్టిలైజర్స్, ఇంజినీర్స్ ఇండియా, పీటీసీ ఇండియా, అజంతా పోర్ట్‌ల్యాండ్ సిమెంట్, అశోకా బిల్డ్‌కాన్, మహానగర్ గ్యాస్, వరుణ్ బెవరేజెస్, ఎంఎంటీసీ, ఐనాక్స్ విండ్, అడ్వాన్స్‌డ్ ఎంజైమ్ టెక్నాలజీస్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, థామస్ కుక్, ఫినోలెక్స్ కేబుల్స్

10న : హెరిటేజ్ ఫుడ్స్, లారస్ ల్యాబ్స్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, గెయిల్, యూనియన్ బ్యాంక్ మదర్సన్ సుమీ, అదానీ ట్రాన్స్‌మిషన్, పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్, భారత్ ఫోర్జ్, ఎస్ఎంఎల్ ఇసుజు, షిప్పింగ్ కార్పొరేషన్, జైడస్ వెల్‌నెస్, సింఫనీ, వెంకీస్, లిబర్టీ షూస్, పంజ్ లాయిడ్, శ్రీకాళహస్తి పైప్స్, డెక్కన్ సిమెంట్స్, యునైటెడ్ బ్రూవరీస్, మోయిల్, మణప్పురం ఫైనాన్స్, కజారియా సిరామిక్స్, బాంబే డైయింగ్, కాఫీ డే, కల్యాణి ఫోర్జ్

11న : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, అలహాబాద్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, బీపీసీఎల్, సన్ ఫార్మా, టీవీఎస్ మోటార్, ధనలక్ష్మి బ్యాంక్, బ్లూ స్టార్, సిప్లా, ఆల్కెమ్ ల్యాబ్స్, హిందాల్కో, గీతాంజలి జెమ్స్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్, టీవీ టుడే, టాటా గ్లోబల్ బెవరేజెస్, బాష్, ఆయిల్ ఇండియా, జీవీకే పవర్, ఇప్కా ల్యాబ్స్, బీఈఎంఎల్, ఏరోస్ ఇంటర్నేషనల్, గోద్రేజ్ ఇండస్ట్రీస్, ఓబీసీ, జీఎంఆర్ ఇన్‌ఫ్రా, సన్ టీవీ నెట్‌వర్క్, సెయిల్

12న : యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అవధ్ షుగర్, శ్రీరేణుకా షుగర్స్, జేకే సిమెంట్, అతుల్ ఆటో, వివిమెడ్ ల్యాబ్స్, టీవీఎస్ శ్రీచక్ర, బిర్లా కార్పొరేషన్, హిందుస్థాన్ కాపర్, ట్రైడెంట్, గాడ్‌ఫ్రై ఫిలిప్స్, ఆర్‌కాం, డీఎల్ఎఫ్

పసిడి బేజారు!

కమొడిటీస్ ఈ వారం

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఆగస్టు)	409.50	406.70	(0.68)
సీసం (ఆగస్టు)	148.20	149.75	1.05
అల్యూమినియం(ఆగస్టు)	121.35	121.10	(0.21)
నికెల్ (ఆగస్టు)	656.20	659	0.43
ముడిచమురు(డిసెంబరు)	3,192	3,149	(1.59)
పసుపు (ఆగస్టు)	7,344	7,656	4.25
మొక్కజొన్న (ఆగస్టు)	1,325	1,290	(2.64)

బంగారం, వెండి




పసిడి అక్టోబరు కాంట్రాక్టు గత వారం రూ.28,807 వద్ద ప్రారంభమైంది. ఆ తరవాత రూ.28,325-28,849 మధ్య చలించి, చివరకు 1.39 శాతం నష్టంతో రూ.28,406 వద్ద ముగిసింది. ఈ వారం కూడా కాంట్రాక్టు రూ.28,204 వరకు తగ్గే అవకాశం ఉంది. కాబట్టి ప్రస్తుత షార్ట్ సెల్లింగ్ పొజిషన్లతో పాటు కొత్త పొజిషన్లను రూ.28,526-28,627 దరిదాపుల్లో విక్రయించడం మంచిది. ఇందుకు రూ.28,728ను స్టాప్‌లాస్‌గా పరిగణించాలి. వెండి సెప్టెంబరు కాంట్రాక్టు గతవారం రూ.38,442 వద్ద ప్రారంభమైంది. ఆ తరవాత రూ.37,052-38,820 మధ్య చలించి చివరకు 3.07 శాతం నష్టంతో రూ.37,262 వద్ద ముగిసింది. ఈ వారం కాంట్రాక్టు రూ.37,052 కిందకు వస్తే ఆ తరవాత రూ.36,335 వరకు నష్టపోయే వీలుంది. కాబట్టి ట్రేడర్లు రూ.38,445ను స్టాప్‌లాస్‌గా పరిగణించాలి.

ప్రాథమిక లోహాలు

రాగి ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం రూ.416పైన కదలాడకుంటే రూ.400 వరకు తగ్గే అవకాశం ఉంది. సీసం ఆగస్టు కాంట్రాక్టు రూ.147 దిగువకు వస్తే, రూ.145 వరకు చేరొచ్చు. అందువల్ల నేటి ముగింపును గమనించి నిర్ణయం తీసుకోవాలి. ఈ వారం అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు రూ.120 స్థాయి వరకు నష్టపోవచ్చు. నికెల్ ఆగస్టు కాంట్రాక్టుకు ఈ వారం గరిష్ఠ స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి కొనసాగే వీలుంది. కాబట్టి గరిష్ఠ స్థాయిల వద్ద విక్రయించడమే ఉత్తమం.



ఇంధన రంగం



ముడిచమురు డిసెంబరు కాంట్రాక్టుకు ఈ వారం గరిష్ఠ స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి ఎదురు కావొచ్చు. కాబట్టి చిన్న ట్రేడర్లు రూ.3,191ను స్టాప్‌లాస్‌గా పరిగణిస్తూ రూ.3,094 దిగువన విక్రయించడం మంచిది. గత వారం నష్టపోయిన సహజ వాయువు ఆగస్టు కాంట్రాక్టుకు ఈ వారం కూడా రూ.171 స్థాయి వరకు అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాబట్టి పెరిగిన ప్రతిసారీ విక్రయించడమే మంచిది.

వ్యవసాయ ఉత్పత్తులు



పసుపు ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం కూడా సానుకూలంగా కనిపిస్తోంది. అయితే కొద్ది వారాలుగా పెరుగుతూ వస్తున్నందున గరిష్ఠ స్థాయిల వద్ద లాభాలు స్వీకరించడమే ఉత్తమం. మొక్కజొన్న ఆగస్టు కాంట్రాక్టుకు సంబంధించి ఈ వారం రూ.1,276 వద్ద షార్ట్ పొజిషన్లు తీసుకోవడం కలిసి రావొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ఈనాడు సినిమా



భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి, డి.సురేష్‌బాబు

రానాతో 'ఖైదీ'లాంటి సినిమా తీయాలనుండేది!

"నేను కొత్తగా సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు 'మీ నాన్నగారినిని మించి దూసుకెళ్తున్నావు' అనేవారు నన్ను. ఇప్పుడలా రానా నన్ను అధిగమిస్తున్నాడు. చకచకా నిర్ణయాలు తీసేసుకొంటున్నాడు. 'నేనే రాజు నేనే మంత్రి' ప్రచారం విషయంలోనూ, హిందీలో మార్కెట్ చేసే విషయంలోనూ అన్నీ తానై వ్యవహరించాడ"న్నారు డి.సురేష్‌బాబు. ఆయన భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డితో కలిసి నిర్మించిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. రానా కథానాయకుడిగా నటించారు. కాజల్, కేథరిన్ కథానాయికలు. తేజ దర్శకుడు. ఈ నెల 11న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్మాతలు ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. డి.సురేష్‌బాబు మాట్లాడుతూ "రానాకి సినిమా అంటే ఓ తపన. మా నాన్నగారికీ అంతే. కానీ నేను మాత్రం భయం భయంగానే అడుగులు వేస్తుంటా. రానాని కథానాయకుడిగా పరిచయం చేయాలనుకొన్నప్పుడు తనతో 'ఖైదీ'లాంటి సినిమా తీయాలనుండేది. రానా నటనలో శిక్షణ పూర్తి చేసుకొని వచ్చేలోపే శేఖర్ కమ్ముల 'లీడర్' కథ చెప్పాడు. వెంకటేష్‌తో చేయమంటే ఆయన మాత్రం నాకు రానానే కావాలన్నాడు. ఆ తర్వాత కూడా రానాతో ఒక సూపర్ హీరో కథో, లేదంటే సూపర్ విలన్ కథో చేయాలనే ఆలోచనలు నన్ను వెంటాడేవి. 'కృష్ణమ్ వందే జగద్గురుమ్' తర్వాత రాజమౌళి కలిసి 'బాహుబలి' అవకాశాన్నిచ్చాడు. ఆ సినిమాతో రానాకి ఎంతో మేలు జరిగింది. 'ఘాజీ' ఎంతో పేరు తెచ్చింది. వీటిమధ్యలోనే తేజ కలిసి 'అహం' పేరుతో ఓ విలన్ కథని నాకు వినిపించాడు. నాకూ, రానాకి బాగా నచ్చింది. ఆ తర్వాత నిర్మాణంలో మేమూ భాగం పంచుకొంటామని భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి వచ్చారు. అలా మా కలయికలో ఆరంభమైన 'అహం' కొన్ని మార్పులతో 'నేనే రాజు నేనే మంత్రి'గా ఓ క్లాసిక్ హీరో సినిమాగా రూపాంతరం చెందింది. ఇది రాజకీయ నేపథ్యంతో కూడిన కథే కాకుండా, ఒక మంచి భార్యాభర్తల కథ కూడా. రాధాజోగేంద్రల మధ్య బంధం, వాళ్ల ప్రయాణం బాగుంటుంది. రానా కొన్ని సన్నివేశాల్లో ఏడిపించేశాడు. నటన విషయంలో చాలా సంతృప్తిగా అనిపించింది. 'నాయగన్', 'గాడ్‌ఫాదర్' లాంటి సినిమా ఇది. తేజ మరో మంచి సినిమా తీశార"న్నారు. 11న మూడు సినిమాలు విడుదలవుతున్నాయి కదా అన్న ప్రశ్నకు సురేష్‌బాబు బదులిస్తూ "ఇలా ఒకే రోజు మూడు నాలుగు సినిమాలు విడుదలవడం మంచిది కాదు. థియేటర్ల సమస్య ఉత్పన్నమవుతుంది. మా సినిమా తమిళంలోనూ విడుదలవుతోంది. తమిళంలో అజిత్ సినిమా 11న విడుదలయ్యుంటే మా సినిమాని ఆగస్టు 25న విడుదల చేసేవాళ్లం" అన్నారు. వెంకటేష్ కథానాయకుడిగా జంతువుల నేపథ్యంతో విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సినిమాని తీసే ఆలోచనలో ఉన్నట్టు సురేష్‌బాబు తెలిపారు. కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ "సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసి సినిమా చేయడం సంతోషంగా ఉంది. 'నేనే రాజు నేనే మంత్రి' అందరినీ అలరించే ఓ మంచి సినిమా అవుతుంది" అన్నారు. "కథే హీరోగా భావించి చేసిన సినిమా ఇది. దర్శకుడు తేజ చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం ప్రేక్షకుల్ని తప్పక మెప్పిస్తుంది" అన్నారు భరత్ చౌదరి.



అల్లరి నరేష్

మేడ మీద దర్శకుడు

'కెమెరా.. యాక్షన్.. కట్' - నిద్రలోనూ ఇలానే పలవరిస్తుంటాడు ఆ కుర్రాడు. ఎప్పటికైనా ఓ పెద్ద దర్శకుడైపోవాలన్నది అతని కల. 'బాహుబలి' లాంటి సినిమా కాకపోయినా దానికి అటూ ఇటూగా ఓ సినిమా తీసేయాలని ఆశ పడుతుంటాడు. ప్రభాస్, రామ్‌చరణ్‌ల కోసం కథలు సిద్ధం చేశాడు. ఇక వాళ్లు పిలవడమే ఆలస్యం అన్నట్టు ఎదురుచూస్తుంటాడు. అలాంటి కుర్రాడి జీవితంలోకి ఓ అందమైన అమ్మాయి ప్రవేశించింది. ఆ తరవాత ఏమైంది? అతని జీవితం ఎలాంటి మలుపు తిరిగింది? ఈ విషయాలు తెలియాలంటే 'మేడమీద అబ్బాయి' సినిమా చూడాల్సిందే. అల్లరి నరేష్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. నిఖిల విమల్ కథానాయిక. జి.ప్రజిత్ దర్శకుడు. ఇటీవల టీజర్ విడుదల చేశారు. నరేష్ మాట్లాడుతూ "చాలా రోజుల తరవాత కథాబలం ఉన్న ఓ సినిమా చేశా. ఆద్యంతం నవ్విస్తుంది. ఉత్కంఠ రేపే అంశాలూ ఈ కథలో ఉన్నాయ"న్నారు. ఈ నెలలో పాటల్ని, సెప్టెంబరులో సినిమానీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు నిర్మాత. సంగీతం: షాన్ రెహమాన్

అల్లాయే దిగి వచ్చి
ఆయ్‌మియా ఏమి కావాలంటే
మిద్దెలొద్దూ మేడలొద్దూ
పెద్దలెక్కే గద్దెలొద్దంటాను
ఉన్ననాడు లేనినాడు
ఒకే ప్రాణమై నిలిచే
ఒక్క దోస్తే చాలంటాను
ఒక్క నేస్తం కావాలంటాను

గీతం: స్నేహమే నా జీవితం...
చిత్రం: నిప్పులాంటి మనిషి
రచన: సి.నారాయణరెడ్డి

\- పంపినవారు: కె.బాబురావు, కొత్తపేట

గీతోపదేశం



తమన్నా

అనుష్క

వీళ్ల సంగతేంటో!

ఏంటో... తెలుగు చిత్రసీమలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోందిప్పుడు. 'కథానాయికలు కావలెను' అని బోర్డు పట్టుకొని తిరుగుతోంది చిత్రసీమ. 'అవకాశాలు కావలెను' అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు కొంతమంది కథానాయికలు.

నాయికల కొరత చిత్రసీమలో ఉన్న మాట వాస్తవం. చాలా సినిమాలకు కథానాయికలు ఖరారు కాలేదు. కొత్తమ్మాయిలు ఎంత మంది వచ్చినా సరిపోవడం లేదు. సరిగ్గా ఇదే సమయంలో కొంతమంది కథానాయికలు సినిమాల్లేక కాస్త ఖాళీగా ఉన్నారు. మరీ 'జీరో అవకాశాలు' అని చెప్పలేం గానీ, ఇది వరకటితో పోలిస్తే వాళ్ల జోరు బాగా తగ్గిపోయింది. అవకాశాలు లేక కొంత మంది, వచ్చినా ఒప్పుకోక మరికొంతమంది! పారితోషికం, షరతులు పేరుతో నిర్మాతల్ని భయపెట్టి అవకాశాలు చేజార్చుకొన్నవాళ్లు ఇంకొంతమంది. మొత్తంమీద అవరోహణ క్రమంలో సాగుతున్న కథానాయికల కెరీర్‌ని ఒక్కసారి పరిశీలిస్తే..!

'గ్యాప్ తీసుకోవడం' అనే మాట చిత్రసీమలో తరచూ వింటుంటాం. వరుసగా సినిమాలు చేసీ, చేసీ అలసిపోయి విరామం కోరుకొంటుంటారు నాయికలు. అలాంటప్పుడు కెరీర్‌లో బ్రేక్ వస్తుంది. మరో వర్గం ఉంది. దాదాపుగా అందరు కథానాయకులు, దర్శకులతో పనిచేసిన తరవాత.. 'మళ్లీ ఈ కథానాయిక ఎందుకులే' అని సదరు హీరోలు, దర్శకుడు వాళ్లని పక్కన పెడుతుంటారు. కొత్త కథానాయికల ధాటిని తట్టుకోలేక వెనుకంజ వేస్తుంటారు సీనియర్లు. వీళ్లు మరో టైపు. అలా కథానాయికల అవకాశాలు క్రమంగా తగ్గిపోతుంటాయి.

అనుష్క ఇప్పటికీ అగ్ర కథానాయికే. ఆమెపై కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు నిర్మాతలు సిద్ధమవుతున్నారు. కథానాయిక నేపథ్యంలో ఓ కథ తయారైతే.. మొదటి ఎంపిక కచ్చితంగా అనుష్కనే. అలాంటి అనుష్క చేతిలో ఇప్పుడు ఒకే ఒక్క సినిమా ఉంది. అదే.. 'భాగమతి'. ఇది తప్ప అనుష్క మరో సినిమాపై సంతకం చేయలేదు. 'సాహో'లో అనుష్క పేరు పరిశీలించారని, కానీ చివర్లో ఆమెను పక్కన పెట్టాల్సివచ్చిందని చెప్పుకొంటున్నారు. 'బాహుబలి 2' తరవాత అనుష్క కొత్త సినిమాలేం ఒప్పుకోలేదు. బహుశా అనుష్క తన కెరీర్‌లో కాస్త విరామం కోరుకొంటోందేమో! శ్రుతి హాసన్ పరిస్థితీ అంతే. 'కాటమరాయుడు' తరవాత తెలుగులో మరో సినిమా ఒప్పుకోలేదు. గత రెండేళ్లుగా శ్రుతి కెరీర్ మరీ నత్త నడక నడుస్తోంది. 'కాటమరాయుడు' పరాజయం ఆమె కెరీర్‌పైనా ప్రభావం చూపించినట్టు అనిపిస్తోంది.

'హ్యాపీడేస్' నుంచి తమన్నా కెరీర్ ఆగకుండా పరుగులు పెడుతూనే వచ్చింది. అయితే అనుకోకుండా తమన్నా కెరీర్‌కీ బ్రేకులు పడిపోయాయి. 'బాహుబలి' సిరీస్ అంతటి ఘన విజయం సాధించినా తమన్నాకి ఏ విధంగానూ కలసిరాలేదు. 'బాహుబలి 2' తరవాత తమన్నా నటించిన సినిమా ఏదీ విడుదలవ్వలేదు. సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఓ చిత్రంలో తమన్నా కథానాయికగా ఎంపికైంది. అది మినహా తమన్నా చేతిలో తెలుగు సినిమా లేదు. హన్సిక కెరీర్ ముందు నుంచీ ఆటుపోట్లతో సాగుతోంది. ఓ దశలో టాప్ 5 కథానాయికల్లో ఒకరిగా నిలిచిన హన్సిక. . ఆ జోరు కొనసాగించలేకపోయింది. 'గౌతమ్ నంద'తో తన కెరీర్ మళ్లీ గాడిలో పడుతుందని ఆశించింది హన్సిక. అయితే ఆ అవకాశాలూ కనిపించడం లేదు. యువ కథానాయకుల సినిమాలు ఒప్పుకొంటూ, ఏడాదికి కనీసం రెండు మూడు సినిమాలు చేస్తూ హడావుడి చేసే రెజీనా కూడా బాగా నెమ్మదించింది. ఎన్నో ఆశలు పెట్టుకొన్న 'నక్షత్రం' నిరాశపరచడంతో ఆ ప్రభావం రెజీనా కెరీర్‌పై పడేలా ఉంది. నిత్యమేనన్ పరిస్థితీ ఇలానే ఉంది. ఒక దశలో జోరుగా సినిమాలు చేసింది నిత్య. కథానాయిక ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో రాణించి, నటిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకొంది. 'సౌందర్య తరవాత నిత్యమేననే' అనేలా రాణించింది. ఒక్కసారిగా నిత్య కనిపించకుండా పోయింది. కేరళ నుంచి కొత్తమ్మాయిలు రావడం, వాళ్లూ తమ నటనతో ఆకట్టుకోవడం, ప్రత్యామ్నాయాలు ఎక్కువైపోవడం నిత్యమేనన్‌పై ప్రభావం చూపించాయి. వీళ్లే కాదు ఒకట్రెండు సినిమాల్లో మెరిసి, ఆ వెంటనే కనుమరుగైన కథానాయికలు చాలామందే ఉన్నారు. వాళ్లందరికీ కావల్సింది ఓ నిఖార్సయిన పాత్ర.. ఓ మంచి సినిమా. అది దక్కితే మళ్లీ విజృంభించడం ఖాయం. ప్రతిభావంతులైన కథానాయికల్ని తెలుగు చిత్రసీమ, ప్రేక్షక వర్గం ఎప్పటికీ వదులుకోదు. మేల్కోవాల్సింది కథానాయికలే.



శ్రుతి హాసన్



హన్సిక

నిత్యమేనన్

రెజీనా

తీరం తరలొచ్చింది

రామ్‌చరణ్ 'రంగస్థలం.. 1985' కోసం గోదావరి తీరం హైదరాబాద్‌కి తరలొచ్చింది. ఇసుక తిన్నెలు, నదీతీరాన కనిపించే గ్రామాల్ని పోలిన ఓ ఊరు సెట్‌ని హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. అక్కడే ప్రస్తుతం 'రంగస్థలం' చిత్రీకరణ సాగుతోంది. రామ్‌చరణ్, జగపతిబాబులపై ఇసుక తిన్నెల నేపథ్యంలో వచ్చే కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 1985 కాలంలోని ఓ పల్లెటూరు నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన సమంత నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా అక్టోబరు నెలాఖరులోపు పూర్తి కానున్నట్టు సమాచారం. ఇందులో రామ్‌చరణ్ కొత్త అవతారంలో కనిపించబోతున్నారు. గుబురు గెడ్డం, లుంగీతో ఆయన గెటప్పు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: రత్నవేలు.



రామ్‌చరణ్

దెయ్యాలు భయపడితే



షకలక శంకర్, మహి.వి రాఘవ్, శ్రీనివాసరెడ్డి, విజయ్ చిల్లా

తాప్సి, శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, షకలక శంకర్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. భయానికి నవ్వొంటే భయం అనేది ఉపశీర్షిక. మహి.వి రాఘవ్ దర్శకత్వం వహించారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈనెల 18న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ "'గీతాంజలి' తరవాత హారర్ కథలు చాలా విన్నా. కానీ ఒప్పుకోలేదు. 'ఆనందో బ్రహ్మ' కూడా చేయకూడదనుకొన్నా. కానీ కథ విన్న తరవాత 'ఈ సినిమా వదులుకోకూడదు' అనిపించింది. దెయ్యం సినిమాల్లో ఇదో కొత్త ట్రెండ్ సృష్టిస్తుంద"న్నారు. "నాలుగు పాత్రల చుట్టూ నడిచే కథ ఇది. సౌండ్ ట్రాక్, విజువల్స్ విషయంలో శ్రద్ధ తీసుకొన్నాం. ప్రచార చిత్రాలకు వస్తోన్న స్పందన బాగుంద"న్నారు దర్శకుడు. "అమెరికాలోనూ పెద్ద ఎత్తున ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామ"ని నిర్మాత తెలిపారు.

ఎంతమంది ఉన్నారనేది కాదు ముఖ్యం... ఎవడు ఉన్నాడనేది ముఖ్యం!
చిత్రం: కాటమరాయుడు
- పంపినవారు: మద్దాల శోభాదేవి, మియాపూర్, హైదరాబాద్

పంచ్ డైలాగ్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



భూమి పడ్నేకర్

పల్లెటూరి పాత్రని వదులుకోలేను!

'దమ్ లగా కే హైసా'తో మంచి గుర్తింపు తెచ్చుకుంది భూమి పడ్నేకర్. ఇందులో ఆమెది ఓ పల్లెటూరి అమ్మాయి పాత్ర. ఇప్పుడు అక్షయ్‌కుమార్‌తో నటిస్తున్న 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్‌కథ'తో పాటు 'శుభ్ మంగళ్ సావ్‌ధాన్'లోనూ పల్లెటూరు నేపథ్యంగా సాగే పాత్రలే పోషిస్తోంది భూమి. వరుసగా మూడు చిత్రాల్లోనూ పల్లెటూరి పాత్రలంటే మీపై ఓ ముద్ర పడిపోతుందేమో? అంటే "నేను పల్లెటూరి అమ్మాయి పాత్రలే చేయగలనని ప్రేక్షకులు అనుకుంటారేమో అనే భయంతో మంచి పాత్రలను వదులుకోలేను. అయినా ఈ మూడు చిత్రాల్లోని పాత్రలకు నేపథ్యం పల్లెటూరు కావచ్చు కానీ మూడూ పూర్తి భిన్నంగా ఉంటాయి. దానికి తగ్గట్టుగానే నా నటన ఉంటుంది. నాకు కొంచెం సామాజిక స్పృహ ఎక్కువ. అలాంటి వాతావరణంలోనే పెరిగాను. అందుకే అలాంటి పాత్రలు నా వద్దకు వస్తే కాదనలేను"అని చెప్పింది భూమి.

నారింజ కనపడిందంటే... మూడినట్లే!



ఇది విన్నారా!

ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పొలా తెరకెక్కించిన చిత్రం 'ది గాడ్ ఫాదర్'. అందులో కొప్పొలా దర్శకత్వ ప్రతిభ అప్పటి కొత్తతరం దర్శకులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆ సినిమాలో కొప్పొలా నైపుణ్యానికి మచ్చుతునకగా నిలిచిన ఓ విషయం గురించి సినీ పండితులు ఇప్పటికీ చెబుతుంటారు. ఆ సినిమాలో మృత్యువుకు సంకేతంగా నారింజ రంగును చూపించారు. ఏదైనా సన్నివేశంలోని నేపథ్యంలో నారింజ రంగు కనిపించిందంటే... ఏదో ఒక పాత్ర మృత్యువు బారిన పడుతుంటుంది. డాన్ కార్లియోన్‌ను ప్రత్యర్థులు కాల్చి చంపడానికి ముందు రెండు నారింజ పళ్లు కొంటాడు. కాల్పుల నుంచి తప్పించుకునే క్రమంలో బుట్టకు తగిలి నారింజ పళ్లన్నీ చెల్లాచెదురుగా పడతాయి. మరో సన్నివేశంలో సినీ దర్శకుడి పాత్ర జాక్ వుల్ట్జ్, టామ్ హెగెన్ పాత్రతో కలసి భోంచేస్తున్నప్పుడు డైనింగ్ టేబుల్ మీద నారింజ పళ్ల బాస్కెట్ ఉంటుంది. ఆ తర్వాతి సన్నివేశంలో జాక్ వుల్ట్జ్ పెంపుడు గుర్రాన్ని చంపేస్తారు. ఓ సన్నివేశంలో ప్రధాన పాత్రలైన కార్లియోన్, టట్టాగ్లియా, బార్జినీ కలుసుకున్నప్పుడు కూడా నారింజ రంగు బాస్కెట్లు కనిపిస్తాయి. సినిమా ముగిసేసరికి ఈ మూడు పాత్రలూ మరణిస్తాయి.

● ప్రస్తుతం వంద మీటర్ల పరుగులో టాప్-3 అత్యుత్తమ టైమింగ్స్ బోల్ట్ సాధించినవే కావడం విశేషం. ఆ ప్రదర్శనలు.. 2009లో 9.58 సెకన్లు, 2012లో 9.63 సెకన్లు, 2008లో 9.69 సెకన్లలో అతను రేసు ముగించాడు.



"నేను నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చే ప్రయత్నం చేశాను. ఫలితం పట్ల నిరాశ చెందాను. నా చివరి రేసును స్వర్ణంతో ముగించలేకపోయినందుకు అభిమానులకు క్షమాపణ చెబుతున్నా. కానీ ఇన్నేళ్లుగా నాకు వాళ్లిచ్చిన మద్దతుకు ధన్యవాదాలు"
– ఉసేన్ బోల్ట్



● 2008 నుంచి ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో జమైకా గెలిచిన పతకాల్లో 40 శాతం బోల్ట్ గెలిచినవే కావడం విశేషం.

9.95 తన చివరి 100 మీటర్ల రేసులో బోల్ట్ టైమింగ్. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో బోల్ట్ 100 మీ.ని పూర్తి చేయాడనికి తీసుకున్న అత్యధిక సమయమిదే.

1 జూనియర్ స్థాయి నుంచి బోల్ట్ పోటీ పడ్డ ప్రపంచ స్థాయి రేసుల్లో అతను కాంస్యంతో సరిపెట్టుకోవడం ఇదే తొలిసారి.

50 వంద మీటర్ల పరుగును బోల్ట్ 10 సెకన్లలోపు పూర్తి చేసిన రేసులు.



పూర్తి పేరు: ఉసేన్ సెయింట్ లియో బోల్ట్
ఎత్తు: 6 అడుగుల 5 అంగుళాలు
బరువు: 94 కిలోలు, దేశం: జమైకా
పుట్టిన తేదీ: 21 ఆగస్టు 1988

ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు

2008 బీజింగ్
100 మీ- 9.69 సెకన్లు
200 మీ- 19.30 సెకన్లు

2012 లండన్
100 మీ- 9.63 సెకన్లు
200 మీ- 19.32 సెకన్లు
4×100 మీ- 36.84 సెకన్లు

2016 రియో
100 మీ- 9.81 సెకన్లు
200 మీ- 19.78 సెకన్లు
4×100 మీ- 37.27 సెకన్లు

ఉసేన్ గోల్డ్!

ఈనాడు క్రీడావిభాగం

అతడు..

బీజింగ్ ఒలింపిక్స్‌లో చిరుతలా వచ్చాడు
లండన్ ఒలింపిక్స్‌లో మెరుపులా మెరిశాడు
రియో ఒలింపిక్స్‌లో వీరుడిలా వెనుదిరిగాడు!
అతడి వేగాన్ని ప్రత్యర్థులెవరూ తట్టుకోలేకపోయారు
అతడి జోరుకు కోట్లాది హృదయాలు ఉప్పొంగాయి
అతడి ప్రతిభకు ప్రపంచమే అభిమానిగా మారిపోయింది
అతడి విన్యాసాలతో ట్రాక్ అండ్ ఫీల్డ్‌కే ఒక కళ వచ్చింది

11 సార్లు అతడు ప్రపంచ ఛాంపియన్.. 8 ఒలింపిక్ స్వర్ణ పతకాలు, మూడు ప్రపంచ రికార్డులు అతడి సొంతం!

బోల్ట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎంత పొగిడినా వెలితే. ఎన్ని విశేషణాలు రాసినా లోటే!

వేగానికి చిరునామా.. వేగానికి నిర్వచనం.. వేగానికి పర్యాయపదం.. అసలు అతనంటేనే వేగం!

పరుగుకే పరుగులు నేర్పిన ఆ మేరునగధీరుడు 100 మీటర్ల పరుగులో తొలిసారి (ఇదే ఆఖరి సారి కూడా!) వెనుకబడ్డాడు. చిరకాల ప్రత్యర్థి జస్టిన్ గాట్లిన్ (అమెరికా) స్వర్ణం గెలిచిన వేళ.. మానవ చిరుత కాంస్యానికి పరిమితమయ్యాడు. గాయాలో.. అలసటో.. ఏమరుపాటో.. కారణమేదో కానీ స్ప్రింట్ రారాజు జైత్రయాత్రకు ఆఖరి మజిలీ దగ్గర తెరపడింది. వచ్చే శనివారం 4×100 మీటర్ల పరుగులో బోల్ట్ పాల్గొంటున్నా.. 100 మీ పరుగు సంగతి ఏంటన్న చర్చ అప్పుడే మొదలైంది! అతని తర్వాతేంటి? అతని తర్వాత ఎవరు? అన్నవి ట్రాక్ అండ్ ఫీల్డ్‌ను కుదిపేస్తున్న అసలైన ప్రశ్నలు!

మహ్మద్ అలీ, పీలే, మైకెల్ జోర్డాన్, డాన్ బ్రాడ్‌మన్... యావత్ క్రీడారంగానికే దిగ్గజ క్రీడాకారులు. తమ ఆటతో.. నైపుణ్యంతో ఆయా క్రీడల్ని అత్యున్నత స్థానానికి చేర్చిన ఘనత వాళ్ల సొంతం. వ్యక్తిగతంగా శిఖర స్థాయికి చేరుకుని.. ఆటను మరో స్థాయికి తీసుకెళ్లిన ఘనులు వారు. వీరి స్ఫూర్తిగా వచ్చిన తర్వాతి తరాల క్రీడాకారులు ఆయా క్రీడల్ని మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లారు.. తీసుకెళ్తున్నారు! కానీ బోల్ట్ పరిస్థితి భిన్నం. ట్రాక్ అండ్ ఫీల్డ్ పరిస్థితి ఇంకా భిన్నం. దిగ్గజ క్రీడాకారుల్ని ఎప్పుడో దాటేసిన బోల్ట్.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌ను సమున్నత స్థానానికి చేర్చాడు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్ వంటి క్రీడల్ని సైతం వెనక్కినెట్టి ట్రాక్ అండ్ ఫీల్డ్‌ను అందలమెక్కించాడు. ఇప్పుడు అథ్లెటిక్స్ అంటే బోల్ట్. ఒలింపిక్స్ అంటే బోల్ట్. విశ్వక్రీడా సంబరంలో ఎన్ని ఈవెంట్లు జరిగినా స్ప్రింట్‌కు ఉండే ఆకర్షణే వేరు. అందుకు బోల్టే కారణం. దశాబ్దం పాటు వినోదం పంచిన బోల్ట్.. 100 మీ పరుగులో శాశ్వత సెలవు తీసుకోనున్నాడు. మరి స్ప్రింట్ భవిష్యత్తేంటి? అతడిలా అభిమానులకు వినోదాన్ని పంచే అథ్లెట్ ఎవరు? అంటే సమాధానం లేదనే చెప్పాలి! ఇప్పటికే 35 ఏళ్లొచ్చిన గాట్లిన్.. బోల్ట్‌తో పాటే పరుగెత్తుతున్న యొహాన్ బ్లేక్ (జమైకా)ల రిటైర్మెంట్ ఎప్పుడన్నట్లే ఉన్నారు. శనివారం నాటి 100 మీ పరుగులో రజతం సాధించిన 21 ఏళ్ల క్రిస్టియన్ కోల్‌మన్ (అమెరికా)లో నిలకడ ఎంతన్నది ఇప్పుడే చెప్పలేం! వయసు, నైపుణ్యం ఉన్న కోల్‌మన్ మున్ముందు ఇదే జోరు కొనసాగించినా.. బోల్ట్ ఆకర్షణను అందుకోవడం అసాధ్యమే!



ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు

100 మీ- 9.58 సెకన్లు (బెర్లిన్- 2009)
100 మీ- 9.77 సెకన్లు (మాస్కో- 2013)
100 మీ- 9.79 సెకన్లు (బీజింగ్ - 2015)
200 మీ- 19.19 సెకన్లు (బెర్లిన్- 2009)
200 మీ- 19.40 సెకన్లు (డేగు - 2011)
200 మీ- 19.66 సెకన్లు (మాస్కో- 2013)
200 మీ- 19.55 సెకన్లు (బీజింగ్- 2015)
4×100 మీ- 37.31 సెకన్లు (బెర్లిన్- 2009)
4×100 మీ- 37.04 సెకన్లు (డేగు- 2011)
4×100 మీ- 37.36 సెకన్లు (మాస్కో- 2013)
4×100 మీ- 37.36 సెకన్లు (బీజింగ్- 2015)

బోల్ట్ కంటే ముందు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మెరిసిన వాళ్లు లేకపోలేదు. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో బెన్ జాన్సన్, 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో లిన్‌ఫోర్డ్ క్రిస్టీ, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో జస్టిన్ గాట్లిన్, 2007 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో టైసన్ గే.. 100 మీ పరుగులో అద్భుత ప్రదర్శన చేశారు. అభిమానుల నీరాజనాలందుకున్నారు. కానీ డోపింగ్ మరకలతో వారంతా అప్రతిష్ఠ పాలయ్యారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌కే చెడ్డ పేరు తెచ్చారు. ఆ సమయంలో వచ్చిన తూటానే బోల్ట్. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన బోల్ట్.. అథ్లెటిక్స్‌లో ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగాడు. ఏనాడూ నిషిద్ధ ఉత్ప్రేరకాల జోలికి వెళ్లలేదు. 20 ఏళ్లుగా పరుగునే శ్వాసగా మలుచుకున్న బోల్ట్ ఎప్పుడూ గీత దాటలేదు. అడ్డదారులు తొక్కలేదు. డ్రగ్స్‌ను దరిచేరనీయలేదు. క్రమశిక్షణ, పట్టుదల, కష్టంతో స్ప్రింట్‌లో అత్యున్నత శిఖరాలకు చేరుకున్నాడు. వరుసగా మూడు ఒలింపిక్స్‌లలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నాడు. రియో ఒలింపిక్స్‌కు ముందు డ్రగ్ ఉదంతాలు క్రీడా ప్రపంచాన్ని కుదిపేశాయి. లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ (టూర్ డి ఫ్రాన్స్), రష్యా అథ్లెట్లు డోపింగ్ కుంభకోణంలో చిక్కుకోవడం క్రీడా ప్రపంచానికే తలవంపులు తెచ్చిపెట్టింది. ఇలాంటి సమయంలో రియోలో బోల్ట్ పరుగు.. డోపింగ్ భూతాన్ని తరిమికొట్టింది. సహజ సిద్ధమైన దేహదారుఢ్యానికి క్రమశిక్షణ, అంకితభావం, లక్ష్యం తోడైతే ఉత్ప్రేరకాల అవసరం లేదని నిరూపించాడు ఉసేన్.

ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో కార్ల్ లూయిస్ (అమెరికా)లా నిఖార్సైన అథ్లెట్‌గా నిరూపించుకున్న బోల్ట్.. చివరి పరుగులో వెనుకబడి ఉండొచ్చు. స్వర్ణంతో వీడ్కోలు పలకాలన్న అతని కల నెరవేరకపోయి ఉండొచ్చు. కానీ పరుగుకు వన్నె తెచ్చింది అతడే. ట్రాక్ అండ్ ఫీల్డ్‌కు ఆకర్షణ తెచ్చింది అతడి పరుగే. భవిష్యత్తులో బోల్ట్ పరుగు (4×100 మీ మినహాయిస్తే) చూసే అవకాశం లేకపోయినా.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై అతను వేసిన ముద్ర చెరిగిపోదు!

ఫైనల్లో బోల్ట్‌కు షాక్ ● స్వర్ణం ఎగరేసుకుపోయిన గాట్లిన్

ఉసేన్ బోల్ట్ వంద మీటర్ల కథకు తెరపడింది! కానీ ఈ కథలో పతాక సన్నివేశమే నిరాశపరిచింది! అది ఎవ్వరూ ఊహించనిది! అంచనాలకు అందనిది! ఆ 'హీరో' అభిమానుల్ని నివ్వెరపరిచేది! ఆరంభంలో తన ఆగమనాన్ని ఘనంగా చాటి.. ఆ తర్వాత ప్రతి పోరాటంలోనూ తనకు ఎదురొచ్చిన వాళ్లందరినీ కొట్టేస్తూ ఏకఛత్రాధిపత్యం సాధిస్తున్న 'కథానాయకుడు'.. క్లైమాక్స్‌లో మాత్రం తడబడ్డాడు. తన ప్రత్యర్థుల్ని గెలవలేకపోయాడు! మొత్తానికి తిరుగులేని ఆధిపత్యంతో.. వీరోచిత విన్యాసాలతో.. రోమాలు నిక్కబొడుచుకునేలా సాగిన 'బోల్ట్' సినిమా.. ఆఖర్లో మాత్రం 'యాంటీ క్లైమాక్స్'తో తీవ్ర నిరాశకు గురి చేసింది.

లండన్

ఏదో అనుకుంటే ఇంకేదో అయ్యింది! దాదాపు దశాబ్ద కాలంగా 100 మీటర్ల పరుగులో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూ సాగిపోయిన ఉసేన్.. తన చివరి 100 మీ. పరుగులో మాత్రం స్వర్ణం గెలవలేకపోయాడు. లండన్ వేదికగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్ 100 మీటర్ల పరుగులో కాంస్యానికే పరిమితమయ్యాడు. అతను 9.95 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకున్నాడు. డోపీగా తేలి, నాలుగేళ్ల పాటు నిషేధం ఎదుర్కొని.. ఆపై మళ్లీ ట్రాక్‌లోకి అడుగుపెట్టి బోల్ట్‌కు గట్టి పోటీ ఇస్తూ వస్తున్న అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్ 9.92 సెకన్లలో రేసు పూర్తి చేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు. బోల్ట్‌తో పోలిస్తే క్షణంలో వందో వంతు తేడాతో రేసు ముగించిన కోల్‌మన్ (9.94 సెకన్లు) రజతం సాధించాడు. అతనూ అమెరికావాడే. బోల్ట్ సహచరుడు యొహాన్ బ్లేక్ (9.99 సె), సింబైన్ (దక్షిణాఫ్రికా-10.01 సె), వికాట్ (ఫ్రాన్స్-10.08 సె), ప్రెస్కాడ్ (బ్రిటన్-10.17 సె), బింగ్టెన్ సు (చైనా-10.27 సె) తర్వాతి స్థానాల్లో నిలిచారు. బోల్ట్ పోటీపడ్డ మేజర్ ఫైనల్స్‌లో (ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్) ఇప్పుడు నమోదు చేసిందే అత్యల్ప టైమింగ్ కావడం గమనార్హం. అంతకుముందు సెమీఫైనల్లోనే బోల్ట్ కొంచెం ఇబ్బంది పడ్డాడు. 10.07 సెకన్ల టైమింగ్‌తో తాను పోటీపడ్డ రేసులో రెండో స్థానంలో నిలిచాడు.

ఇదొక థ్రిల్లర్ రేసు..: పదే పది క్షణాలు.. గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలేంత సమయం! ఆ పది క్షణాల్లో ఎంత వినోదమో.. ఎంత ఉత్కంఠో.. ఎంత నాటకీయతో.. ఎన్ని భావోద్వేగాలో..! మామూలుగానే 100 మీటర్ల పరుగు క్రీడాభిమానులకు కనువిందంటే.. బోల్ట్ వచ్చాక ఆ వినోదం మరెన్నో రెట్లు పెరిగింది! ఇక బోల్ట్ చివరి రేసు మరింతగా ఉత్కంఠ రేకెత్తించింది.. అనూహ్య మలుపులతో సాగింది. ఊహించని ముగింపుతో అందరికీ దిమ్మదిరిగిపోయేలా చేసింది. ప్రపంచమంతా మెచ్చిన ఉసేన్ గెలవకపోవడం నిరాశ కలిగించినప్పటికీ.. ఈ రేసు సాగిన తీరు మాత్రం అమోఘం. థ్రిల్లర్ సినిమాను తలపించిన ఈ రేసు ఎలా సాగిందో.. బోల్ట్ ఎలా మొదలుపెట్టాడో.. ఎలా ముగించాడో.. అసలెక్కడ తేడా జరిగిందో.. ఆ పది క్షణాల్లో అసలేం జరిగిందో.. చూద్దాం!

ఆరంభం ఎప్పట్లాగే..: ఆరేళ్ల కిందట డేగులో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ (2011) 100 మీటర్ల పరుగులో ఏం జరిగిందో బోల్ట్ అభిమానులందరికీ గుర్తే! తుపాకీ మోత పూర్తి కాకముందే రేసును మొదలుపెట్టేసి అనర్హత వేటుకు గురయ్యాడు బోల్ట్. రేసును ఆరంభించడంలో బోల్ట్ ఎప్పుడూ కొంచెం ఒత్తిడికి గురవుతుంటాడు. 2011 అనుభవంతో అతడిపై ఒత్తిడి మరింత పెరిగింది. తొందరపడి ఎక్కడ వేటుకు గురవుతానో అన్న భయంతో.. అప్పట్నుంచి ప్రతిసారీ మిగతా పోటీదారుల కన్నా కొంచెం ఆలస్యంగానే రేసు మొదలుపెడుతున్నాడు ఉసేన్. తాజా రేసులోనూ అలాగే చేశాడు. ప్రధాన పోటీదారుల కంటే ఆలస్యంగా రేసు ఆరంభించాడు. దీంతో ఆరంభంలో వెనుకబడ్డాడు.

మధ్యలో పుంజుకున్నా...: ఐతే రేసును ఎలా ఆరంభించినా.. తర్వాత అద్భుతంగా పుంజుకోవడం.. రేసులో సగం దూరం వచ్చేసరికి ముందున్న ప్రత్యర్థుల్ని సమీపించి.. ఆ తర్వాత నుంచి అందరినీ వెనక్కి నెట్టి ముందుకు దూసుకెళ్లిపోవడం.. రేసు చివరికి వచ్చేసరికి పక్కకు, వెనక్కి తిరిగి వెనుకబడ్డ ప్రత్యర్థుల్ని చూడటం.. ఫినిషింగ్ లైన్ దాటాక సింహనాదాలు చేయడం.. బోల్ట్ రేసుల్లో సర్వసాధారణంగా కనిపించే దృశ్యం. శనివారం రాత్రి కూడా బోల్ట్ సగం దూరం వచ్చేసరికి పుంజుకున్నాడు. ప్రత్యర్థుల్ని సమీపించాడు. కానీ ఆ తర్వాత ప్రత్యర్థులందరినీ వెనక్కి నెట్టడంలో మాత్రం విఫలమయ్యాడు. ముఖ్యంగా బోల్ట్ పక్కనే ఉన్న కోల్‌మన్ అతడికి గట్టి సవాలు విసిరాడు. బోల్ట్ అతడిని అందుకోవడానికి విపరీతంగా శ్రమించాడు. సర్వశక్తులూ ఒడ్డాడు. గెలుపు గీతకు అత్యంత చేరువగా వచ్చిన సమయంలో బోల్ట్ దాదాపుగా కోల్‌మన్‌ను దాటేసినట్లే కనిపించాడు. కానీ..

అందరి కళ్లూ అక్కడుంటే..: పతాక సన్నివేశం దగ్గర ఉత్కంఠ అంతా ఇంతా కాదు. బోల్ట్ తన పక్కనున్న కోల్‌మన్‌ను దాటినట్లే ఉంది. కానీ అతనే విజేతా అన్న విషయంలో స్పష్టత లేదు. బోల్ట్ అడుగులైతే కోల్‌మన్ కన్నా ముందున్నట్లు కనిపించింది. కానీ శరీరంలో ముందు భాగం మాత్రం అలా లేదు. దీంతో ఆ ఇద్దరిలో ఎవరు విజేత అన్నదానిపై సందిగ్ధత.. అందరిలోనూ ఒకటే ఉత్కంఠ! ఐతే బోల్ట్ పోటీపడే రేసుల్లో అందరి కళ్లూ అతడి మీదే నిలిచి ఉండటం సహజం. ఈ రేసు విషయంలోనూ అదే జరిగింది. బోల్ట్.. కోల్‌మన్‌ను అధిగమించాడా లేదా అంటూ అందరూ ఉత్కంఠగా చూస్తున్నారు. కానీ అందరి దృష్టీ బోల్ట్, కోల్‌మన్ మీద ఉండగా.. ఇవతల ఏడో వరుసలో మెరుపు వేగంతో దూసుకొచ్చిన గాట్లిన్ సంగతి అందరూ మరిచిపోయారు. తన శక్తి సామర్థ్యాలన్నింటినీ కూడగట్టుకుని.. 35 ఏళ్ల వయసులో ఇంకే స్ప్రింటర్‌కూ సాధ్యం కాని అసాధారణ వేగంతో బుల్లెట్‌లా ఫినిష్ లైన్ దగ్గరికి దూసుకొచ్చి 0.03 క్షణాల తేడాతో బోల్ట్‌ను, 0.02 సెకన్ల తేడాతో కోల్‌మన్‌ను వెనక్కి నెట్టి 100 మీటర్ల ప్రపంచ టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు గాట్లిన్. ఫలితం ప్రకటించాక రీప్లే చూశాక కానీ.. రేసులో అసలేం జరిగిందో.. గాట్లిన్ ఎలా దూసుకొచ్చాడో అర్థం కాలేదు వీక్షకులకు!


బోల్ట్ ప్రపంచ రికార్డులు

100 మీ - 9.58 సెకన్లు
ప్రపంచ ఛాంపియన్‌షిప్ (బెర్లిన్- 2009)

200 మీ - 19.19 సెకన్లు
ప్రపంచ ఛాంపియన్‌షిప్ (బెర్లిన్- 2009)

4×100 మీ- 36.84 సెకన్లు
ఒలింపిక్స్ (లండన్- 2012)





● ప్రపంచంలో వేగవంతమైన అథ్లెట్ ఉసేన్ బోల్ట్ గతంలో వెన్ను వంకర సమస్యతో ఇబ్బందిపడ్డాడు. వెన్నును బలంగా ఉంచుకోవడం కోసమే అతడు అథ్లెటిక్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు.

● చిన్నప్పుడు బోల్ట్ బద్ధకంగా వ్యవహరించేవాడు. 400 మీటర్ల పరుగు కోసం చాలా శ్రమించాల్సి వస్తుందని.. అతడు 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుపై ఎక్కువగా ఆసక్తి ప్రదర్శించాడు. బద్ధకం కారణంగా తీసుకున్న ఆ నిర్ణయం అతడిని దిగ్గజ అథ్లెట్‌గా మార్చేసింది.

అందరూ వెక్కిరిస్తుంటే..

గాట్లిన్‌ను విజేతగా ప్రకటించగానే స్టేడియంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా రేసును చూస్తున్న కోట్లాది మందిలో విస్మయం! కొన్ని క్షణాల పాటు నిశ్శబ్దం! అసలేం జరిగిందో తెలియని అయోమయం! బోల్ట్ విజేత కాదన్న వాస్తవాన్ని జీర్ణించుకోవడానికి అతడి అభిమానులకు కొంత సమయం పట్టింది! ఈలోపు స్టేడియంలోని వీక్షకులు గాట్లిన్‌ను గేలి చేయడం మొదలుపెట్టారు. గాట్లిన్ డోపింగ్ చరిత్రను దృష్టిలో ఉంచుకుని హీట్స్, సెమీస్‌తో పాటు ఫైనల్లోనూ అతణ్ని హేళన చేశారు అభిమానులు. ఐతే తానే విజేతనని తెలియగానే గాట్లిన్ 'షటప్' అంటూ సంజ్ఞ చేస్తూ, కొన్ని క్షణాల పాటు గెలుపు సంబరాలు చేసుకున్నాడు. తర్వాత బోల్ట్‌ను సమీపించి.. వంగి, మోకాళ్లపై నిలబడి అతడికి సలాం చేశాడు. ఇది ప్రపంచ స్ప్రింట్ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే దృశ్యం! డోపింగ్ మరకలు పడ్డా గాట్లిన్ కూడా పేరున్న స్ప్రింటరే. బోల్ట్ కన్నా అతను అనుభవజ్ఞుడు, అలాంటి వాడు బోల్ట్ ముందు మోకరల్లి.. అతడికి సలాం చేయడం విశేషం!

మూడో టెస్ట్ నుంచి జడేజా సస్పెన్షన్

కొలంబో: ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు ఐసీసీ సస్పెన్షన్ విధించడంతో శ్రీలంకతో మూడో టెస్టుకు రవీంద్ర జడేజా దూరమయ్యాడు. ప్రవర్తన నియమావళిని తప్పినప్పుడు ఐసీసీ ఇచ్చే అయోగ్యత పాయింట్లు 24 నెలల్లో మొత్తం 6కు చేరడంతో జడేజా ఓ మ్యాచ్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. మూడో రోజు ఆట సందర్భంగా తాను బౌలింగ్ చేస్తున్నప్పుడు క్రీజులో ఉన్న కరుణరత్నెపై బంతి విసరడం తాజాగా జడేజా చేసిన తప్పు. జడేజా బంతిని ప్రమాదకరంగా విసిరాడని అంపైర్ తేల్చాడు. దీంతో జడేజా ఖాతాలో మూడు అయోగ్యత పాయింట్లు చేరాయి. ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ జడేజా మ్యాచ్‌లో ఫీజులో 50 శాతాన్ని జరిమానాగా కూడా విధించాడు.

చాంపియన్



ఇంకేం కావాలి?

ఒకసారి డోపింగ్ మరక పడ్డాక.. నేరం రుజువై శిక్ష అనుభవించాక.. ఇక ఆ అథ్లెట్ కథ ముగిసినట్లే! అతడి ప్రతిష్ఠ మసకబారినట్లే! ప్రపంచం అతణ్ని మోసగాడిగానే చూస్తుంది. అంత సులువుగా క్షమించదు! ఆ అథ్లెట్ పునరుజ్జీవం అన్నది అసాధ్యం! ఐతే అమెరికా యోధుడు జస్టిన్ గాట్లిన్ ఒక్కడు ఇందుకు మినహాయింపు! డోపింగ్ నేరానికి నాలుగేళ్ల పాటు శిక్ష అనుభవించి, మళ్లీ స్ప్రింట్‌లోకి పునరాగమనం చేయడం అన్నదే ఆశ్చర్యమంటే.. తిరిగొచ్చాక మళ్లీ ఒకప్పటి తన పతాక స్థాయిని అందుకోవడం.. ప్రత్యర్థులకు సవాలు విసరడం.. బోల్ట్ లాంటి అసామాన్య స్ప్రింటర్‌తో పోటీపడి స్వర్ణం గెలవడం.. అనూహ్యమే! ఒకప్పుడు గాట్లిన్ సాధించిన ఘనతలన్నీ డోపింగ్ ఊబిలో కొట్టుకుపోయాయి. గాట్లిన్ ముమ్ముందు ఏం సాధిస్తాడో.. ఇప్పటికే 35వ పడిలో ఉన్న అతను ఎంత కాలం పరుగులో కొనసాగుతాడో తెలియదు! అతడి భవిష్యత్ ఎలా ఉన్నా.. లండన్‌లో ఇప్పుడు సాధించిన పతకం మాత్రం అతడికి అపురూపం! మామూలుగా సాధించే విజయం కన్నా.. ఒక గట్టి ఎదురు దెబ్బ తిన్నాక.. పుంజుకుని సాధించే విజయం ఇచ్చే ఆనందం ఎక్కువ! గాట్లిన్ నిషేధిత ఉత్ప్రేరకాలు వాడి తప్పు చేసిన మాట వాస్తవం. ఐతే అందుకతను శిక్ష అనుభవించాడు. నాలుగేళ్ల పాటు ట్రాక్‌కు దూరమయ్యాడు. ఐతే పునరాగమనం తర్వాత అతను అనేక అవమానాలు ఎదుర్కొన్నాడు. గాట్లిన్ పోటీ పడే రేసుల్లో వీక్షకులు అతణ్ని పలుమార్లు హేళన చేశారు. తాజా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ గాట్లిన్ ప్రేక్షకుల నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. హీట్స్ దగ్గర్నుంచి అతడిని గేలి చేస్తూనే ఉన్నారు. ఐతే ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణం గెలిచి అందరి నోళ్లూ మూయించాడు జస్టిన్. ఇక తన గెలుపు సంబరాలు అయ్యాక తనకంటే చిన్నవాడైన బోల్ట్‌కు మోకాళ్లపై నిలబడి సలాం చేసిన తీరు గాట్లిన్ మీద అథ్లెటిక్స్ ప్రియుల్లో ఉన్న వ్యతిరేకతను తగ్గించి ఉంటుందనడంలో సందేహం లేదు. తనపై పడ్డ డోపింగ్ మరకల్ని ఈ విజయంతో తొలగించుకున్న గాట్లిన్.. అభిమానుల దృష్టిలో తనపై ఉన్న అభిప్రాయాల్ని కూడా మార్చాడనడంలో సందేహం లేదు. పునరాగమనంలో గాట్లిన్ ఇంతకంటే ఇంకేం కోరుకుని ఉంటాడు?

"కెరీర్లో ఎన్నో విజయాలు సాధించాను. ఓటములూ ఎదుర్కొన్నాను. ఇది అద్భుతమైన సందర్భం. ఎందుకంటే ఇది బోల్ట్ చివరి రేసు. బోల్ట్ నన్ను అభినందిస్తూ అభిమానులు నన్ను గేలి చేయడం తగదని అన్నాడు. బోల్ట్ స్ఫూర్తి ప్రదాత" – గాట్లిన్

జడేజా చుట్టేశాడు

● శ్రీలంక 386 ఆలౌట్ ● రెండో టెస్టులో భారత్ ఇన్నింగ్స్ విజయం ● సిరీస్ కైవసం

ఫాలో ఆన్‌లో పడ్డా కాస్త పోరాడామన్న సంతృప్తి తప్ప శ్రీలంక స్థితిలో ఎలాంటి మార్పూ లేదు. టీమ్ఇండియా తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన వేళ.. అదే తడబాటు, అదే నగుబాటు. నాలుగు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో కోహ్లీసేన ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఎడమచేతివాటం స్పిన్నర్ రవీంద్ర జడేజా కెరీర్‌లో 9వసారి ఐదు వికెట్ల ఘనత సాధించడంతో టీ సమయానికి లంక పోరాటానికి భారత్ తెరదించింది.

కొలంబో

టీమ్ఇండియాది అదే జోరు. స్పిన్‌తో లంకను ఉక్కిరిబిక్కిరి చేసిన భారత్.. రెండో టెస్టులో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. సిరీస్‌లో 2-0తో తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. ఆదివారం, నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 209/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక, జడేజా (5/152) ధాటికి 386 పరుగులకు ఆలౌటైంది. కరుణరత్నె సెంచరీ (141) పూర్తి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 439 పరుగుల ఆధిక్యం సాధించిన సంగతి తెలిసిందే. మ్యాచ్‌లో బ్యాట్‌తోనూ రాణించిన జడేజాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. చివరిదైన మూడో టెస్టు 12న పల్లెకెలెలో ఆరంభమవుతుంది.

72కే ఆ ఆరు: ఫాలో ఆన్‌లో పడ్డాక మూడో రోజు గొప్పగా పోరాడిన శ్రీలంక.. చాలా ఆసక్తి మధ్య నాలుగో రోజు బరిలోకి దిగింది. కానీ జడేజా స్పిన్‌కు దాసోహమై త్వరగానే పోరాటాన్ని చాలించింది. మూడో రోజు ఆఖరి రెండు సెషన్లలో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయిన జడేజా.. ఆదివారం లయను దొరకబుచ్చుకున్నాడు. మంచి లెంగ్త్‌లో బంతులేస్తూ బ్యాట్స్‌మెన్‌ను తిప్పలు పెట్టాడు. ఓవర్‌నైట్ స్కోరు 209/2తో లంక ఇన్నింగ్స్ ఆరంభించగా.. నైట్‌వాచ్‌మన్ పుష్పకుమార (16)తో కలిసి కరుణరత్నె (ఓవర్‌నైట్ 92) ప్రతిఘటన కొనసాగించాడు. ఐతే వ్యక్తిగత స్కోరు 95 వద్ద జడేజా బౌలింగ్‌లో రాహుల్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన కరుణరత్నె.. శతకం (224 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 73వ ఓవర్లో అశ్విన్ బౌలింగ్‌లో పుష్పకుమార పేలవంగా రివర్స్‌స్వీప్‌కు యత్నించి బౌల్డ్ కావడంతో నాలుగో రోజు భారత్‌కు తొలి వికెట్ దక్కింది. కరుణరత్నెతో మూడో వికెట్‌కు అతడు 40 పరుగులు జోడించాడు. తర్వాతి ఓవర్లోనే చండిమాల్‌ను ఔట్ చేసి లంకను జడేజా గట్టి దెబ్బతీశాడు. స్లిప్‌లో రహానె అందుకున్న చురుకైన క్యాచ్‌కు చండిమాల్ నిష్క్రమించాడు. అప్పటికి స్కోరు 241. ఐతే మాథ్యూస్ (36; 66 బంతుల్లో 3×4, 1×6)తో కలిసి జాగ్రత్తగా ఆడిన కరుణరత్నె లంచ్ సమయానికి స్కోరును 300 దాటించాడు. భారత్ మళ్లీ బ్యాటింగ్ చేసే అవకాశాలు పెరిగిన సందర్భమది. కానీ ఐదో వికెట్ భాగస్వామ్యం విడిపోయాక లంక పోరాటం ఎంతోసేపు సాగలేదు. ఏమాత్రం ఆడడానికి వీల్లేని బంతితో కరుణరత్నెను ఔట్ చేశాడు జడేజా. అనూహ్యమైన బౌన్స్‌తో దూసుకొచ్చి, కరుణరత్నె గ్లోవ్స్‌ను తాకుతూ వెళ్లిన బంతిని రహానె అలవోకగా అందుకున్నాడు. జడేజా తన తర్వాతి ఓవర్లో మాథ్యూస్‌నూ వెనక్కి పంపాడు. జడేజా బంతిని కట్ చేయబోయిన మాథ్యూస్.. వికెట్‌కీపర్ సాహా అందుకున్న కళ్లు చెదిరే క్యాచ్‌కు నిష్క్రమించాడు. అప్పటికి స్కోరు 315/6. ఆ తర్వాత లంక ఓటమి కేవలం లాంఛనమే. శ్రీలంక 76 పరుగులకే తన చివరి 6 వికెట్లు చేజార్చుకుంది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/9 డిక్లేర్డ్; **శ్రీలంక తొలి ఇన్నింగ్స్:** 183

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: కరుణరత్నె (సి) రహానె (బి) జడేజా 141; తరంగ (బి) ఉమేశ్ 2; మెండిస్ (సి) సాహా (బి) పాండ్య 110; పుష్పకుమార (బి) అశ్విన్ 16; చండిమాల్ (సి) రహానె (బి) జడేజా 2; మాథ్యూస్ (సి) సాహా (బి) జడేజా 36; డిక్వెలా (సి) రహానె (బి) పాండ్య 31; దిల్రువన్ పెరీరా (స్టంప్డ్) సాహా (బి) జడేజా 4; డిసిల్వా (సి) రహానె (బి) జడేజా 17; హెరాత్ నాటౌట్ 17; ఫెర్నాండో (సి) ధావన్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (116.5 ఓవర్లలో ఆలౌట్) **386**

వికెట్ల పతనం: 1-7, 2-198, 3-238, 4-241, 5-310, 6-315, 7-321, 8-343, 9-384; **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 13-2-39-1; అశ్విన్ 37.5-7-132-2; షమి 12-3-27-0; జడేజా 39-5-152-5; హార్దిక్ పాండ్య 15-2-31-2



జడేజా (5/152)



సెమీస్‌లో నిర్మల

లండన్: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 400 మీ. పరుగులో భారత అమ్మాయి నిర్మల షెరాన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. హీట్స్‌లో 52.01 సెకన్లలో నాలుగో స్థానంలో నిలిచిన ఆమె.. ఆరుగురు ఉత్తమ ఫినిషర్ల జాబితాలో స్థానం సంపాదించి సెమీస్‌లో అడుగుపెట్టింది. పురుషుల మారథాన్‌లో గోపి 28వ ర్యాంకులో నిలవగా, పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తింగలయ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు. అతను 13.64 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 31వ స్థానంలో నిలిచాడు.



యూపీ, బెంగాల్ మ్యాచ్‌లో ఓ దృశ్యం

యూపీపై బెంగాల్‌దే పైచేయి

ప్రొ కబడ్డీ లీగ్

నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ లీగ్‌లో యూపీ యోధకు ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 40-20తో యూపీపై విజయం సాధించింది. వినోద్ కుమార్ (8 పాయింట్లు), జంగ్ కున్ లీ (7), మణిందర్‌సింగ్ (6) బెంగాల్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. యోధ తరఫున సురేందర్‌సింగ్ (5 పాయింట్లు) రాణించినా జట్టును గెలిపించలేకపోయాడు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 46-32తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. గొప్పగా రాణించిన ప్రదీప్ నర్వాల్ (15) పట్నా విజయంలో కీలకమయ్యాడు. అర్ధభాగం ముగిసే సమయానికి పట్నా 23-11తో ఆధిక్యంలో నిలిచిందంటే కారణం అతనే. ద్వితీయార్ధంలో బుల్స్ పోటీ ఇచ్చినా.. ఫలితం లేకపోయింది.



ఇంగ్లాండ్ 224/8

మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో చివరి టెస్టులో దక్షిణాఫ్రికాకు ఇక కష్టమే! ఆ జట్టు సిరీస్‌పై ఆశలు వదులుకోవాల్సిందే! మూడో రోజు, ఆదివారం ఆట ఆఖరుకు రెండో ఇన్నింగ్స్‌లో 224/8తో నిలిచిన ఇంగ్లాండ్.. మొత్తంగా 360 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఆలివీర్ (3/38), మోర్నీ మోర్కెల్ (2/39), రబాడ (2/37)ల ధాటికి ఇంగ్లాండ్ ఓ దశలో 153/7కు చేరుకోవడంతో దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో పోటీలోకి వచ్చింది. ఐతే మొయిన్ అలీ (67 బ్యాటింగ్) అద్భుతంగా పోరాడి ఇంగ్లాండ్ ఆధిక్యాన్ని 350 దాటించాడు. రూట్ 49 పరుగులు చేశాడు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 226 పరుగులకు ఆలౌటవడంతో ఇంగ్లాండ్‌కు 136 పరుగుల ఆధిక్యం లభించింది.

పన్నుల వడ్డనకు వేగంగా సర్వే

- **పంచాయతీల్లో ఇంటింటి సమాచారం సేకరణ**
- **రెండు నెలల్లో పూర్తయ్యేలా కార్యాచరణ**

ఈనాడు అమరావతి: పంచాయతీల్లో పన్నుల సవరణ కోసం రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికీ దస్త్రాల్లోకి రాని ఇళ్లను పన్ను పరిధిలోకి తీసుకురాబోతున్నారు. పన్ను విధింపులో లోపాలను సవరించి పెంచే అవకాశాలున్నాయి. గ్రామాల్లో కొద్ది రోజులుగా ఇంటింటి సర్వే, ఇళ్ల కొలతల లెక్కింపు, ఫొటోలు తీయడం వంటి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఐదు వేల మందికిపైగా సిబ్బంది ప్రస్తుతం ఇదే పనిలో ఉన్నారు. రెండు నెలల్లో ఈ ప్రక్రియను ముగించి తదుపరి పంచాయతీ తీర్మానం చేసి ఇళ్ల పన్నులు సవరించే అవకాశాలున్నాయి. కేవలం కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్), 14వ ఆర్థిక సంఘ నిధులపై ఆధార పడక పంచాయతీలు స్థానికంగా వనరులు సమకూర్చుకొని స్వయం సమృద్ధి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు సూచిస్తోంది. ఈ మేరకు పంచాయతీలకే అధికారాలు దఖలు పరచడంతో పన్నుల సవరణ తెరపైకి వచ్చింది.

ఇతర జిల్లాల్లో గోదావరి జిల్లాల ప్రయోగం....

పంచాయతీల్లో ఐదేళ్లకోసారి చేపట్టాల్సిన ఇళ్ల పన్నుల సవరణ 2012 తరువాత వివిధ కారణాలతో నిలిచిపోయింది. 2001 నుంచి అప్పటికే అమలులో ఉన్న పన్నుపై ఏటా ఐదు శాతం పెంచుతూ వచ్చారు. ఈ విధానంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో 2012లో తాత్కాలికంగా నిలిపివేశారు. రెండేళ్ల క్రితం పన్నుల సవరణ కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడినా మార్గదర్శకాలు వెలువడకపోవడంతో అత్యధిక జిల్లాల్లో తదుపరి చర్యలు తీసుకోలేదు. ఉభయ గోదావరి జిల్లాల్లో అధికారులు చొరవ తీసుకొని మార్గదర్శకాలు రూపొందించి ఏడాది క్రితం పన్నులు సవరించారు. పన్నుల ఆదాయం 50 శాతానికిపైగా పెరిగింది. పెంపుపై ఈ జిల్లాల్లో 28 శాతానికిపైగా పంచాయతీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పెంచిన పన్నులు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలివ్వాలని ఆయా పంచాయతీలు తీర్మానం చేశాయి. ఇప్పుడు 12 జిల్లాల్లో ఉభయ గోదావరి జిల్లాల ప్రయోగం అమలుకు చర్యలు మొదలయ్యాయి. అక్కడ మాదిరే పన్నుల సవరణతోపాటు ప్రతి పంచాయతీకో వెబ్‌సైట్‌ను తీసుకొచ్చే యోచనతో ప్రభుత్వ వర్గాలున్నాయి. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ కొద్ది నెలలుగా విజయవాడ కేంద్రంగా పని చేస్తోంది.



విజయనగరం జిల్లా రామభద్రపురంలో ఇంటి కొలతలు తీస్తూ ఫొటో తీస్తున్న సర్వే సిబ్బంది

పంచాయతీల స్వరూపం...

గ్రామ పంచాయతీలు:	12,858
గ్రామాలు:	18,658
ఆవాస ప్రాంతాలు:	47,398
గ్రామీణ ప్రజలు:	4.09 కోట్లు
వార్షిక ఇళ్ల పన్ను ఆదాయం:	రూ.570 కోట్లు
పన్నులేతర ఆదాయం:	రూ.490

సర్వే వాస్తవం... పేదలపై భారం ఉండదు

–లోకేశ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి

పంచాయతీల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న విషయం వాస్తవమే. ఇప్పటికే 30 శాతానికిపైగా పూర్తయ్యింది. అలాగని పేదలపై పన్నులు విధించే యోచన ప్రభుత్వానికి లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పన్నుల పెంచాలా? తగ్గించాలా? అనే విషయమై నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం నుంచి సర్పంచులకు స్పష్టమైన సూచనలు చేశాం. 3 నుంచి 90 శాతం వరకు పెంచుకోవచ్చని చెప్పాం. దీన్ని అసరాగా చేసుకొని చాలామంది ప్రతిపక్ష సర్పంచులు ఆయా పంచాయతీల్లో భారీగా ఇళ్ల పన్నులు పెంచుతున్నారని తెలిసి ఒక విధానం ఉండాలని సూచించి ఆన్‌లైన్ చేయాలని నిర్ణయించాం. ఇందులో పారదర్శకతకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం.

మమతానురాగాలకు ప్రతీక రాఖీ పండగ

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- తెలుగువారికి రక్షాబంధన్ శుభాకాంక్షలు


ఈనాడు, అమరావతి: మమతానురాగాలకు, ప్రేమానుబంధాలకు రాఖీ పండగ నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారికి ఆయన రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడికి రాఖీ కట్టి తన భర్తను రక్షించాలని వేడుకున్న విషయాన్ని గుర్తు చేశారు. "ఆడబిడ్డలకు మా ప్రభుత్వం రక్షక కవచంలా ఉంటుంది. మహిళల కోసం అభయహస్తం యాప్‌ను రూపొందించాం. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే, మహిళలను వేధించే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళలపై గౌరవం పెరిగేలా అమ్మకి వందనం కార్యక్రమం చేపడతాం. ఆరోగ్య పరిరక్షణకు మా ప్రభుత్వం అనేకపథకాలు చేపట్టింది. శ్రావణమాసంలో వచ్చే రాఖీపౌర్ణమి ఎంతో విశిష్టమైనది. వ్రతాలు, పూజలతో ఆంధ్రప్రదేశ్‌లో సందడి నెలకొంది. వ్రతాలు చేస్తున్న మహిళలకు అభినందనలు.. ." అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి 'రాఖీ' శుభాకాంక్షలు

దిల్లీ: రాఖీ పండుగ సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి హమిద్ అన్సారీ శుభాకాంక్షలు తెలిపారు. "అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య నిబద్ధతతో కూడిన బంధం గొప్పతనాన్ని రాఖీ పండుగ చాటుతుంది. ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకాలకు ప్రతీకగా నిలుస్తుంది. దేశ ప్రజలందరికీ ఈ పండుగ సంతోషం, సౌభాగ్యాలను కలిగించాలని కోరుకుంటున్నా." అని కోవింద్ తన సందేశంలో పేర్కొన్నారు.

ఆ స్టెరాయిడ్‌తో కిడ్నీ రోగుల్లో తీవ్ర దుష్ప్రభావాలు

దిల్లీ: ఓ స్టెరాయిడ్ వల్ల కిడ్నీ రోగుల్లో తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. మూత్రంలో అతిగా ప్రోటీన్‌ను కోల్పోవడం, ఐజీఏ నెఫ్రోపతి లాంటి కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారు మిథైల్‌ప్రిడ్నిసోలాన్ స్టెరాయిడ్ మాత్రల చికిత్స తీసుకున్నప్పుడు కలుగుతున్న ఫలితాలను తెలుసుకునేందుకు.. జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ సంస్థ ఈ అధ్యయనం నిర్వహించింది. ఈ స్టెరాయిడ్ కారణంగా రోగులు ఇన్‌ఫెక్షన్లు, పేగు, ఎముక సంబంధిత సమస్యలకు గురయ్యే ముప్పు ఎక్కువగా ఉందని గుర్తించింది. రోగుల్లో తీవ్ర సమస్యలు తలెత్తడంతో ప్రయోగ పరీక్షలను మధ్యలోని ఆపివేసినట్లు తెలిపింది. 20 మంది (14.7 శాతం) రోగుల్లో తీవ్ర దుష్ప్రభావాలు కనిపించాయని.. ఇద్దరు మరణించారని పరిశోధకులు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లోని ఎనిమిది కేంద్రాల్లో.. తక్కువ మోతాదులో ఈ ఔషధాన్ని ఇస్తూ ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ భారత విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేకానంద్ ఝా తెలిపారు.




కీళ్లవాతానికి చెక్‌పెట్టే 'సిల్క్ మ్యాట్'

దిల్లీ: కీళ్లవాతవ బాధితుల్లో ఎముక కణాల పెరుగుదలకు తోడ్పడే సిల్క్ మ్యాట్‌లను ఐఐటీ గువాహటి పరిశోధకులు అభివృద్ధిచేశారు. దెబ్బతిన్న కీళ్లనూ ఇవి బాగుచేయగలగడం విశేషం. సిల్క్-ప్రోటీన్లు, జీవ గ్లాస్ ఫైబర్ల సాయంతో వీటిని తయారుచేశారు. మోకాలు, తుంటి, చేతులు, పాదం, వెన్నెముక కీళ్లకు కీళ్లవాతం సోకుతుంది. దీంతో బాధితుల్లో మృదులాస్థి దెబ్బతింటుంది. దీన్ని ఇలానే వదిలేస్తే విపరీతమైన నొప్పి, వాపు, అవయవాలను కదిలించడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రస్తుతం మృదులాస్థికి ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఎముక ఆరోగ్యానికి తోడ్పడే కృత్రిమ పదార్థంపై పరిశోధకులు దృష్టిసారించారు. ఈ పరిశోధనలో బ్రిటన్‌లోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్‌కు చెందిన నిపుణులూ పాలుపంచుకున్నారు. మృదులాస్థిని జాగ్రత్తగా పరిశీలించి, దీన్ని ప్రయోగశాలలో అభివృద్ధి చేసేందుకు వారు ప్రయత్నించారు. 'గాయాలను నయంచేసే గుణమున్న ముగా(అసోం) సిల్క్‌లోని ప్రోటీన్ల సాయంతో ఎలక్ట్రోస్పిన్ ప్రక్రియలో మ్యాట్లను తయారుచేశాం. వీటికి జీవ గ్లాస్ ఫైబర్లను జతచేశాం. వీటిని దెబ్బతిన్న కీళ్లలో అమరిస్తే సరిపోతుంది. ఇవి ఎముక కణజాలంతో కలిసి కృత్రిమ మృదులాస్థిని సృష్టిస్తాయి. అనంతరం శరీరంలో కలిసిపోతాయి'అని పరిశోధనలో పాలుపంచుకున్న బిమన్ బి మండల్ తెలిపారు. ఈ మ్యాట్లను ప్రయోగశాలలో పరీక్షించామని, రెండు వారాల్లోనే కృత్రిమ కణజాలాన్ని ఇవి చక్కగా ఉత్పత్తి చేయగలిగాయని వివరించారు.



స్వేద గ్రంథులను ఉద్దీపనం చేసే పరికరం

వాషింగ్టన్: శాస్త్రవేత్తలు సరికొత్త సెన్సర్‌ను అభివృద్ధి చేశారు. రోగి శరీరం నుంచి చెమట విడుదలకాని సమయంలోనూ స్వేద గ్రంథులను ఉద్దీపనం చేసి.. వైద్యపరీక్షలకు అవసరమైన మోతాదును సేకరించడం ఈ పరికరం ప్రత్యేకత. ప్రస్తుతం ఉన్న పరికరాలు రోజంతా రోగి చెమటను లెక్కగడితేగానీ రీడింగ్‌ను తీసుకోలేకపోతున్నాయి. కానీ, తాము అభివృద్ధి చేసిన పరికరం.. ఇందుకు భిన్నమని అమెరికాలోని సిన్సినటీ వర్సిటీ పరిశోధకులు స్పష్టంచేస్తున్నారు. రోగి భౌతికంగా కదిలే స్థితిలో లేనప్పటికీ వారి నుంచి స్వేద గ్రంథులు సేకరించేలా చిన్న పట్టీ లాంటి పరికరాన్ని తాము రూపొందించామని వెల్లడించారు. ఈ పరికరంతో స్వేద గ్రంథులను ఉద్దీపనం చేయడం ద్వారా ఫలితాలు రాబట్టొచ్చని తెలిపారు. హార్మోన్ల గురించి అధ్యయనం చేసేందుకు ఎంత మోతాదులో చెమట అవసరమో ఇది కచ్చితంగా అంచనా వేయగలదని పరిశోధకులు చెబుతున్నారు. కొన్ని సార్లు రక్తానికి బదులు చెమటను పరీక్షించడం ద్వారా జీవక్రియల గురించి తెలుసుకోవచ్చని. . ఇందుకు ఈ పరికరం బాగా ఉపయోగపడుతుందని అధ్యయనకర్తల్లో ఒకరైన జసన్ హెకెన్‌ఫెల్డ్ తెలిపారు. వైద్య పరీక్షలకు చెమటను పరిశీలించే అంశానికి తమ పరికరంతో గుర్తింపు వస్తుందని చెప్పారు.



ఆమీర్‌ఖాన్ దంపతులకు స్వైన్‌ఫ్లూ

- **పుణె కార్యక్రమానికి ఆమీర్ బదులు హాజరైన షారూఖ్**

ముంబయి, పుణె: బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమీర్ ఖాన్, ఆయన సతీమణి కిరణ్‌రావులకు స్వైన్‌ఫ్లూ సోకింది. ప్రస్తుతం ఇద్దరికీ వారి నివాసంలోనే చికిత్స అందిస్తున్నారు. దీంతో ఆదివారం సాయంత్రం పుణెలో ఆమీర్‌కు చెందిన పానీ ఫౌండేషన్ నేతృత్వంలో నిర్వహించిన 'సత్యమేవ జయతే వాటర్ కప్ 2017' బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఆయన హాజరుకాలేకపోయారు. ప్రత్యక్ష ప్రసార సదస్సు ద్వారా పాల్గొన్నారు. 'ఇటీవల వైద్య పరీక్షలో నాకు స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు తేలింది. ఇతరులకు వ్యాపించకూడదనే ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు' అని ఆమీర్ పేర్కొన్నారు. పుణెలో జరిగిన కార్యక్రమానికి ఆమీర్‌ఖాన్ బదులుగా షారూఖ్ ఖాన్ హాజరయ్యారు. దీనిపై ఆమీర్ స్పందిస్తూ.. "ఈ రోజు స్నేహితుల దినోత్సవం. నా బదులుగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని స్నేహితుడు షారూఖ్‌ను కోరా. దానికి ఆయన సంతోషంగా సమ్మతించారు' అని పేర్కొన్నారు. 'సత్యమేవ జయతే వాటర్ కప్ 2017' బహుమతుల ప్రదాన కార్యక్రమానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నీతా అంబానీ, పారిశ్రామికవేత్త రాజీవ్ బజాజ్ తదితరులు హాజరయ్యారు.



ప్రధాని మోదీ.. వస్తు సేవల పన్ను(జీఎస్టీ), స్వచ్ఛభారత్ ప్రచార చిత్రాలతో కూడిన పతంగులు జమ్ము కశ్మీరులో బాగా అమ్ముడుపోతున్నాయి. రక్షా బంధన్ సమయంలో జమ్ము కశ్మీర్‌లో సోదర సోదరీమణులు కలిసి గాలిపటాలు ఎగురవేస్తూ పండుగ జరుపుకొంటారు. మోదీ చిత్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార నినాదాలతో కూడిన రంగురంగుల పతంగులను వినియోగదారులు ఆసక్తిగా కొంటుండంతో వాటికి బాగా గిరాకీ పెరిగింది.

మాజీ సీఎం పన్నీర్‌సెల్వంపై దాడికి యత్నం?

- **తిరుచ్చి విమానాశ్రయంలో కలకలం**

చెన్నై, న్యూస్‌టుడే: తిరుచ్చి విమానాశ్రయంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం పై ఓ వ్యక్తి దాడి చేసేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం సృష్టించింది. తన వెంట కత్తి తెచ్చుకున్న ఆ వ్యక్తి పన్నీర్‌ను కలిసేందుకు నాలుగైదు సార్లు ప్రయత్నించాడు. అతణ్ని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. పన్నీర్‌సెల్వం ఆదివారం తన మద్దతుదారులతో సమావేశం అయ్యేందుకు చెన్నై నుంచి విమానంలో తిరుచ్చి చేరుకున్నారు. విమానాశ్రయం ప్రాంగణంలో తిరుచ్చి విల్వనగర్‌కు చెందిన చోళరాజన్ అనే వ్యక్తి ఫొటో దిగడానికి అనుమతించాలని కోరుతూ పన్నీర్‌సెల్వాన్ని సమీపించడానికి ప్రయత్నించాడు. మూడుసార్లు ఆయన్ను పన్నీర్‌సెల్వం వ్యక్తిగత భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. నాలుగోసారి కూడా రావడంతో బలవంతంగా దూరంగా నెట్టేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో సదరు వ్యక్తి నడుం వద్ద నుంచి ఓ కత్తి కింద పడింది. కార్యకర్తలు అతడిపై దాడికి పాల్పడ్డారు. భద్రతా సిబ్బంది అతడిని పోలీసులకు అప్పగించారు. పన్నీర్‌సెల్వంపై దాడి చేయడానికి రాలేదని, పన్నీర్ మద్దతుదారుడినని నిందితుడు తెలిపాడు.

అమెరికాలో భారత వైద్యుడి అరెస్టు

- **విమాన ప్రయాణంలో బాలికను లైంగికంగా వేధించాడని ఆరోపణలు**

న్యూయార్క్: లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలతో అమెరికాలో విజకుమార్ కృష్ణప్ప అనే 28 ఏళ్ల భారత వైద్యుడిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. జులై 23న న్యూజెర్సీకి పయనమైన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానంలో.. తాను నిద్రించి ఉండగా పక్క సీట్లో ఉన్న కృష్ణప్ప పలుమార్లు అసభ్యంగా తాకాడని 16 ఏళ్ల బాలిక ఆరోపించింది. విమాన సిబ్బందికి ఈ విషయం చెప్పి.. తన సీటు మార్పించుకున్నట్లు పేర్కొంది. ఇటు ప్రయాణ అనంతరం ఆమె కుటుంబం ఈ ఘటనపై ఫిర్యాదు చేసింది. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ కృష్ణప్పపై కేసు నమోదు చేసింది. మైనర్‌పై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలతో కృష్ణప్పను అరెస్టు చేసినట్లు నెవార్క్ ఫెడరల్ కోర్టు రికార్డులు పేర్కొన్నాయి. బాండుపై ఆయనను విడుదల చేసి.. ఎలక్ట్రానిక్ పర్యవేక్షణలో ఉంచినట్లు తెలిపాయి. ఇటు కృష్ణప్ప తరఫు న్యాయవాది ఈ ఆరోపణలను తోసిపుచ్చారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) ప్రకటన వెలువడింది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సంస్థలతోపాటు, దాదాపు అంతటి అత్యున్నత కళాశాలల్లో ఎంబీఏలో చేరటానికి క్యాట్‌లో మంచి స్కోరు సాధించాల్సి ఉంటుంది. ప్రణాళిక ప్రకారం చదివితే ఈ పరీక్షలో విజయానికి ఆస్కారం ఉంటుంది!

నమూనా పరీక్షలే క్యాట్‌కు కీలకం



క్యాట్‌లో పేర్కొన్న అంశాల పఠనానికి వెళ్లే ముందు, అభ్యర్థులు స్వయం విశ్లేషణ చేసుకోవాలి. రోజుకు ఎంత సమయం వెచ్చించగలరనే పరిశీలనతో ఇది ప్రారంభం కావాలి. ఎందుకంటే ఉద్యోగం చేస్తున్నవారు, పూర్తిస్థాయి సమయం క్యాట్‌కే సిద్ధమవుతున్నవాళ్లు కూడా ఉంటారు. ఎంత సమయం నిత్యం వెచ్చించగలరన్నది కీలకం. తదనుగుణంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి.



పి. గోపాలకృష్ణ
డైరెక్టర్, కౌటిల్య కెరియర్స్

క్యాట్‌లో రాతపరీక్ష, బృంద చర్చ, మౌఖికపరీక్షలు ఉంటాయి. రాతపరీక్షలో మొత్తం మూడు సెక్షన్లుంటాయి. అవి: 1. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ 2. డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ 3. క్వాంటిటేటివ్ ఎబిలిటీ

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

గణితంపై అంతగా పట్టులేని అభ్యర్థులు, ముందుగా ఆ అంశం నుంచే తమ సన్నద్ధతను ప్రారంభించాలి. మూడో సెక్షన్‌లోని క్వాంటిటేటివ్ ఎబిలిటీ సరైన ఎంపిక. ఇందులో నంబర్ సిస్టమ్స్, అరిథ్‌మెటిక్‌తోపాటు జామెట్రీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నంబర్స్, బైనామియల్ థీరమ్, ప్రోగ్రెషన్స్ తదితర అంశాలుంటాయి. వీటిల్లో నంబర్ సిస్టమ్‌తో సన్నద్ధత ప్రారంభించాలి. ఎందుకంటే గణిత సమీకరణాల సూక్ష్మీకరణ ఇందులో ప్రధానాంశం. మిగతా ఏ అంశాల్లో అయినా సరే, దీని ఉపయోగం ఉంటుంది. ఇందులో షార్ట్‌కట్స్ కూడా ఉంటాయి. అయితే వేగంగా సూక్ష్మీకరించాలంటే సాధనే మార్గం. నిత్యం కనీసంగా 100 లెక్కలను పరీక్ష పూర్తయ్యేవరకు కొనసాగించడం ద్వారా వేగం బాగా పెరుగుతుంది. మిగతా అంశాలకు సంబంధించి పూర్తిగా కాన్సెప్టులే కీలకం. అవసరం అయితే, పాఠశాల స్థాయి పుస్తకాలను తిరగేయడం ద్వారా పట్టు లభిస్తుంది. ఇప్పుడు చేయాల్సిందల్లా వాటికి అనువర్తనాన్ని చేయడమే. ఒక అంశాన్ని ఎంచుకుని దానిని వివిధ రకాలుగా ప్రశ్నలు వేస్తూ, పరిష్కరించాలి. ఫలితంగా ప్రశ్న కోణం అలవడుతుంది.

డేటా ఇంటర్‌ప్రిటేషన్

క్వాంటిటేటివ్ ఎబిలిటీ తర్వాత సిద్ధం కావాల్సిన అంశమిది. అరిథ్‌మెటిక్‌లో నేర్చుకున్న నిష్పత్తులు, శాతాలు, సరాసరి ఇక్కడ కూడా ఉపయోగపడతాయి. అలాగే సూక్ష్మీకరణాలు ఎలాగూ నిత్యం సాధన చేస్తుంటాం కాబట్టి ఈ సెక్షన్ సన్నద్ధతకు పెద్దగా సమయం కేటాయించాల్సిన పనిలేదు. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో పట్టికలు, గ్రాఫ్‌లు, చార్ట్‌లు ఉంటాయి. ఇచ్చిన దత్తాంశాన్ని (డేటా) అభ్యర్థి అర్థం చేసుకుని ఎలా విశ్లేషించగలడో ఇందులో పరిశీలిస్తారు.

లాజికల్ రీజనింగ్

క్యాట్‌లో ఉన్న ఇతర అంశాలన్నీ అకడమిక్ చదువులో ఎప్పుడో ఒకప్పుడు సిలబస్‌లో భాగంగా ఉంటాయి. పూర్తిగా కొత్త అంశం ఇదే. అయితే వ్యక్తుల తార్కిక పరిజ్ఞానం, సమయస్ఫూర్తికి సంబంధించింది ఇది. ఇందులో నంబర్, లెటర్ సిరీస్, వెన్ డయాగ్రమ్స్, బైనరీ లాజిక్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజం, లాజికల్ మ్యాచింగ్, లాజికల్ సీక్వెన్స్, లాజికల్ కనెక్టివ్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్ తదితర అంశాలు ఉంటాయి. ఇందులో బ్లడ్ రిలేషన్స్ నుంచి ప్రారంభించి తర్వాత సీటింగ్ అరేంజ్‌మెంట్, ఫజిల్స్‌కు వెళ్లాలి. ఇందులో ప్రాథమికాంశాలు అంటూ ఉండవు. నేరుగా సాధన పేపర్లను చేస్తూ వెళ్లాలి. క్రమం తప్పకుండా ఈ విభాగానికి సమయం కేటాయించాలి. పరీక్ష జరిగే వరకూ కూడా నిత్యం ఒక పేపర్ పూర్తిచేయాలి. ఈ విభాగంలోనే క్లాక్స్, క్యాలెండర్ ఆధారిత అంశాలు కూడా ఉంటాయి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో భాగంగా నేర్చుకుంటారు. కాబట్టి, సాధనకు పరిమితం అయితే చాలు.

వెర్బల్ ఎబిలిటీ

ఇంగ్లిష్ భాషపై పట్టును అడిగే అంశంగా దీనిని చెప్పుకోవచ్చు. వ్యాకరణంతోపాటు పదాల వాడకం ఎలా ఉంటుందన్న అంశంపై లోతుగా ప్రశ్నలు అడుగుతారు. సమాన, వ్యతిరేకార్థాలు (సిననిమ్స్, యాంటనిమ్స్), సెంటెన్స్ కరెక్షన్, జంబుల్డ్ పారాగ్రాఫ్, క్లోజ్‌టెస్ట్, రీడింగ్ కాంప్రహెన్షన్ తదితర అంశాలు ఇందులో భాగంగా ఉంటాయి. ఇన్ఫరెన్సెస్, జడ్జిమెంట్ అంశాలు కూడా ఇందులో భాగమే. ఇంగ్లిష్ భాషపై పరిజ్ఞానాన్ని మాత్రమే కాకుండా అభ్యర్థులు ప్యాసేజ్‌ను అర్థం చేసుకుని విశ్లేషించడం, అన్వయ రీతిని కూడా పరీక్షిస్తున్నారు. అందుకే, కొత్త ప్యాసేజీలు లేదా ఇంగ్లిష్ భాషలో కొత్త సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు చదువుతూ ప్రతి అంశాన్నీ విశ్లేషించుకోవాలి. ఎందుకు, ఏమిటి... ఇలా ప్రశ్నల పరంపరను వేసుకుంటూ వెళితే సమర్థంగా విశ్లేషణ సామర్థ్యం పెరుగుతుంది.

ఇందులో వ్యాకరణానికి సంబంధించి ప్రాథమికాంశాలకు సిద్ధం కావాలి. అయితే అకడమిక్ తరహాలో కాకుండా ప్రతి వ్యాకరణ నియమం, నిత్యం వాడుక భాషలో ఎలా ఉపయోగపడుతుందో పరిశీలించుకుంటూ వెళ్లాలి. అలాగే పరీక్ష జరిగే వరకూ కూడా ప్రతిరోజూ 50 నుంచి 100 వరకు కొత్త పదాలను నేర్చుకుంటూ ఉండాలి.

సమయపాలన కీలకం

ఈ ఏడాది నవంబర్ 26న క్యాట్ నిర్వహించనున్నారు. అంటే సుమారు 110 రోజుల సమయం పరీక్షకు అందుబాటులో ఉంది. ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు లేదా పూర్తిస్థాయి వెచ్చించలేనివాళ్లు కనీసంగా రెండు నెలల్లో ప్రాథమికాంశాలను పూర్తిచేయాలి. ఆ తర్వాత ప్రతిరోజూ ఒక పరీక్ష రాస్తూ వెళ్లాలి. ఎక్కువ తప్పులు చేస్తున్న అంశాలను గుర్తించి, వాటిలోనే ఎక్కువ సంఖ్యలో సాధన చేయడం మంచిది. సన్నద్ధతకు పూర్తి సమయం కేటాయించినవాళ్లు 15-20 రోజుల వ్యవధిలో ప్రాథమికాంశాలను పూర్తిచేయాలి. నిత్యం ఒక నమూనా పరీక్షను రాయడంతోపాటు ఒక్కో అంశంలో విడిగా పరీక్ష రాస్తూ వెళ్లాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ సాధన మరవకూడదు. క్యాట్‌కు ఈ మాక్ పరీక్షలే కీలకం. ఎంత ఎక్కువ సాధన చేస్తే అంత మంచిది. మంచి పర్సంటైల్ సాధించడం ద్వారా అత్యుత్తమ కళాశాలల్లో సీటును దక్కించుకోవచ్చు.

పరీక్షహాలులోనూ సమయపాలన చాలా కీలకం. మొత్తం ప్రశ్నపత్రంలో 100 ప్రశ్నలు ఉంటాయి. కేటాయించిన సమయం 180 నిమిషాలు. అయితే, ప్రతి అంశానికి సంబంధించి నిర్ణీత సమయం ఉంటుంది. ఆ విభాగంలోనే మరో ప్రశ్నకు వెళ్లవచ్చు కానీ, మరో విభాగానికి వెళ్లే ఆస్కారం ఉండదు.

1. డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్: 32 ప్రశ్నలు - 60 నిమిషాలు

2. క్వాంటిటేటివ్ ఎబిలిటీ: 34 ప్రశ్నలు - 60 నిమిషాలు

3. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్: 34 ప్రశ్నలు - 60 నిమిషాలు

అభ్యర్థికి ఏ స్లాట్ వస్తుందో ఇప్పుడు తెలియదు. కాబట్టి, రెండు స్లాట్లలో కచ్చితంగా పరీక్ష సమయాన్ని పాటిస్తూ నిజమైన పరీక్షను రాస్తున్నట్టే భావించాలి. దీనివల్ల అసలు పరీక్షలో ఒత్తిడి దూరం అవుతుంది.

రీడింగ్ కాంప్రహెన్షన్

ఇచ్చిన అంశాలపై అభ్యర్థి అర్థం చేసుకోగల సామర్థ్యాన్ని ఈ అంశంలో పరీక్షిస్తారు. ఇంగ్లిష్ భాషపై ఎంత పట్టు ఉందో కూడా ఈ విభాగంలో తెలుస్తుంది. సందర్భానుసారంగా పదాలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ఇందుకు రోజూ ఆంగ్లపత్రికలో వచ్చే సంపాదకీయాలు చదవాలి. రాజకీయాలు, బిజినెస్, పాలన, శాస్త్ర సాంకేతిక అంశాలు, సాహిత్యానికి సంబంధించినవి చదవాలి. అంతర్జాతీయ స్థాయి దినపత్రికలు కూడా ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లభ్యం అవుతున్నాయి. వాటిని చదువుతూ అదే ప్యాసేజ్ పరీక్షలో వస్తే ఏ తరహా ప్రశ్నలు అడగవచ్చో ఊహిస్తూ జవాబులను రాబట్టాలి. ఇలా చేయడం ద్వారా ఈ అంశంపై పట్టు లభిస్తుంది.

దరఖాస్తు ప్రారంభం: ఆగస్టు 9

ముగింపు: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్: అక్టోబరు 18 నుంచి

పరీక్ష: నవంబర్ 26 (రెండు స్లాట్లలో)

క్యాట్‌ను రాయడానికి కనీసం 50% మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులు అయ్యి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 45% మార్కులను కలిగి ఉండాలి. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నవాళ్లు, గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవాళ్లు అర్హులే. అయితే వారి ఎంపిక నిబంధనలకు లోబడి ఉంటుంది.

అపోహ- వాస్తవం

ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థుల్లో చాలా అపోహలున్నాయి. వాటిని ఒక్కసారి పరిశీలిస్తే..

అపోహ	వాస్తవం
క్యాట్ చాలా కఠినం	ఈ ప్రవేశపరీక్ష అభ్యర్థుల మానసిక సామర్థ్యాన్ని పరిశీలించేలా ఉంటుంది. సరైన సన్నద్ధత లేకపోతేనే కఠినమనిపిస్తుంది. కాబట్టి ఈ పరీక్షకు తగిన విధంగా సంసిద్ధమైతే ఈ భావన ఉండదు.
గణిత నేపథ్యం ఉన్న వారికి అనుకూలం	పదో తరగతిలో ఉండే అంశాలే ఉంటాయి. అవి అందరూ చదివినవే కదా! కాకపోతే, విశ్లేషణాత్మక సామర్థ్యం, వేగంగా సూక్ష్మీకరించడంపై దృష్టి సారించాలి.
ఈ పరీక్షలో నెగ్గటానికి కోచింగ్ తప్పనిసరి	శిక్షణ వల్ల కొంత ఉపయోగం ఉండవచ్చు. కానీ మంచి ర్యాంకు తెచ్చుకోవటానికి ఇది తప్పనిసరి కానే కాదు. పక్కాగా వ్యూహం, దాన్ని అమలు చేయగలిగితే చాలు. సాధ్యమైనన్ని నమూనా పరీక్షలు రాయాలి.
షార్ట్‌కట్స్‌కు పరిమితమైతే చాలు	కాన్సెప్టులేని షార్ట్‌కట్స్ ఏమీ ఉపయోగపడవు. అన్ని అంశాలకూ సంబంధించి ప్రాథమికాంశాల్లో పట్టు తప్పనిసరి.
ప్రాథమికాంశాలను చూసుకుంటే సరిపోతుంది.	ప్రాథమికాంశాల అనువర్తనం, విశ్లేషణ తప్పనిసరి. నమూనా పరీక్షలు (మాక్ టెస్టులు) విధిగా రాయాలి.



చదువు

చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు కష్టమైనదనే భావన ఇప్పటికే చాలామందిలో ఉంది. చిత్తశుద్ధితో, శ్రద్ధగా కష్టపడి చదివితే సీఏ క్లిష్టమేమీ కాదని నిరూపించాడు గుంటూరు విద్యార్థి పవన్ కుమార్. జీవితంలో త్వరగా స్థిరపడాలనీ, తద్వారా కుటుంబానికి ఆర్థిక చేయూతను ఇవ్వాలనీ నిర్ణయించుకున్నాడు. దానికోసం సీఏను కెరియర్‌గా ఎంచుకున్నాడు. కృషి చేసి, సీఏ ఫైనల్‌లో ఏకంగా అఖిలభారత స్థాయిలో 22వ ర్యాంకు సాధించాడు. సీఏ కోర్సు చదవడానికి తనకు ప్రేరణ ఏమిటి? సన్నద్ధత ఎలా సాగింది? అతడి మాటల్లోనే తెలుసుకుందాం!

సహనంతో శ్రమిస్తే... సీఏ



పేరు: తిరుమలశెట్టి పవన్ కుమార్
పదోతరగతి: 9.2 గ్రేడ్ పాయింట్లు
ఇంటర్మీడియట్: 971 మార్కులు (రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు)
సీఏ-సీపీటీ: 184 మార్కులు
సీఏ-ఐపీసీసీ: 479/700 మార్కులు
సీఏ ఫైనల్: అఖిల భారత 22వ ర్యాంకు

గుంటూరు శివారులోని తురకపాలెం మా గ్రామం. నాన్న తిరుమలశెట్టి శ్రీనివాసరావు గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్లో సెక్యూరిటీ గార్డు; అమ్మ రమాదేవి గృహిణి. పదో తరగతి వరకు గుంటూరు నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో చదివాను.

పదోతరగతిలో ఉన్నప్పుడు మా ఫిజిక్స్ మాస్టర్ మూర్తి గారి ద్వారా సీఏ కోర్సు గురించి తెలిసింది. ఇది తక్కువ సమయంలో పూర్తిచేయగల కోర్సు అనీ, జీవితంలో త్వరగా స్థిరపడవచ్చనీ చెప్పారాయన. అంతే కాదు; సీఏలకు మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని కూడా తెలిపారు. ఇదే విషయం మా అమ్మానాన్నలకు చెప్పాను. వారు నా ఇష్టాన్ని గౌరవించి సీఏ చదవడానికి ప్రోత్సహించారు.

సీఏ కోర్సు చదవడానికి ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపు తీసుకుని చదవడమే సరైన విధానమని సీనియర్లు చెప్పారు. మాస్టర్ మైండ్స్ శిక్షణ సంస్థలో ఎంఈసీ, సీఏ కోర్సుల్లో చేరాను. ఇంటర్ ఎంఈసీ, సీఏ- సీపీటీ ఏకకాలంలో చదివాను. ఇంటర్‌లో 971 మార్కులతో రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు తెచ్చుకున్నాను. సీఏ-సీపీటీలో 200 మార్కులకుగానూ 184 మార్కులు వచ్చాయి. సీపీటీలో కేవలం ఒక్క మార్కుతో అఖిల భారతస్థాయి పదో ర్యాంకు చేజారింది. దాంతో సీఏ కోర్సు ఇంకా బాగా చదవాలన్న కసి నాలో పెరిగింది.

సీఏలోని రెండోదశ ఐపీసీసీ సైతం మొదటి ప్రయత్నంలో 700 మార్కులకు 479 సాధించి, పూర్తిచేశాను.

ఆర్టికల్‌షిప్ పూర్తిచేసిన తర్వాత సీఏ ఫైనల్ మొదటి ప్రయత్నంలో పూర్తిచేశాను. అది కూడా అఖిలభారత స్థాయిలో 22వ ర్యాంకులో నిలవడం సంతోషంగా అనిపిస్తోంది. మంచి సీఏగా రాణించాలన్నదే నా లక్ష్యం!

విజయ రహస్యాలు

ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపు తీసుకుని చదవడం వల్ల ప్రాథమికాంశాలపై మంచి పట్టు సాధించగలిగాను. కాబట్టి సీఏ చదవాలనుకునేవారు ఇంటర్‌లో ఎంఈసీ ఎంచుకోవడం సరైనదని నా ప్రగాఢ విశ్వాసం.

సీఏ కోర్సులోని ఏ దశలోనూ ఎటువంటి ఒత్తిడులకూ గురికాలేదు. అన్ని దశల్లోనూ ప్రశాంతతతో ఆలోచించి చదివి పూర్తిచేశాను.

నన్ను నేను నమ్మాను. నాకు ఆత్మవిశ్వాసం ఎక్కువే. అదే నా విజయానికి సోపానమైందని నమ్ముతున్నాను.

జీవితంలో త్వరగా స్థిరపడాలనే లక్ష్యం ఉంది కాబట్టి సీఏ పూర్తిచేసేవరకూ అనవసర విషయాలపై దృష్టి సారించలేదు. అందుకే అనుకున్నట్లుగానే సీఏ కోర్సు పూర్తి చేయగలిగాను.

సీఏ చదువుతున్న సమయంలోనే సెమినార్లు, వక్తృత్వ పోటీలు వంటి వాటిల్లో పాల్గొనగలిగితే ఈ నైపుణ్యాలను పెంచుకోవచ్చు.

ఆర్టికల్‌షిప్‌లో లభించే ప్రాక్టికల్ విజ్ఞానం సీఏ ఫైనల్ కోర్సుకూ, సీఏ పూర్తయ్యాక చేయబోయే ప్రాక్టీస్‌కూ, ఉద్యోగానికీ అవసరం. కాబట్టి ఆర్టికల్‌షిప్‌ను శ్రద్ధగా చేయాలి.

కొన్నిరోజులు కష్టపడి వదిలేస్తే సీఏ లాంటి కోర్సుల్లో విజయం కష్టం. ఈ కోర్సు కోసం నిరంతరం హార్డ్‌వర్క్ చేయవలసి ఉంటుంది.

వ్యక్తిగత బలాలపై దృష్టి

సీఏ లాంటి ప్రొఫెషనల్ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఎంతో ఓపిక, కఠోర శ్రమ, సమయపాలన అవసరం. సీఏ పరీక్షలను కఠినంగా భావించి కొంతమంది కోర్సును మధ్యలోనే వదిలేస్తారు. దీనికి కారణం విద్యార్థిలో అంతర్లీనంగా ఉండే భయం. ఆ భయాన్ని వీడి, తమ బలాలపై దృష్టిసారిస్తే ఈ కోర్సు పూర్తి చేయడం కష్టమేమీ కాదు.

సబ్జెక్టులు- ప్రాధాన్యాంశాలు

- సీఏ కోర్సులోని లా పేపర్‌కు బేర్ యాక్ట్ చదివితే లా-లోని ప్రొవిజన్స్‌ను బాగా అర్థం చేసుకోవచ్చు.
- ఆర్టికల్‌షిప్ చేసేటప్పుడు అవగతమయ్యే ప్రాక్టికల్ నాలెడ్జ్ ఆడిటింగ్ పేపర్లకు చాలా అవసరం. కాబట్టి దీనికి కూడా ప్రాధాన్యమివ్వాలి. పుస్తకాల్లోని సమాచారానికి ఆచరణాత్మక జ్ఞానం జోడించి చదవాలి.
- ఫైనాన్షియల్ రిపోర్టింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, కాస్టింగ్ వంటి పేపర్లకు సన్నద్ధమయ్యేటప్పుడు చదవడం కన్నా పెన్, పేపర్ విధానంలో సాధన చేయడం తప్పనిసరి.
- ఇన్‌కం టాక్స్‌కు సంబంధించిన పేపర్లను చదివేటప్పుడు చట్టంలో వచ్చిన సవరణల గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలి. సవరణలు, చట్టాల్లో వస్తున్న సరికొత్త మార్పులను తెలుసుకుంటూ సన్నద్ధత కొనసాగించాలి.

పునశ్చరణ తప్పనిసరి

సీఏ ఇన్‌స్టిట్యూట్ వారు ఇచ్చే ప్రామాణిక మెటీరియల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. దీనివల్ల పరీక్షలు బాగా రాయవచ్చు. ఏది చదివినా ప్రణాళికబద్ధంగా చదవాలి. కోచింగ్ పూర్తయ్యాక ఆరు నెలల సమయాన్ని అధ్యయనానికీ, పునశ్చరణకూ కేటాయించాలి.

సీఏ లాంటి ప్రొఫెషనల్ కోర్సులో ప్రశ్నల కఠినత్వ స్థాయి ఎక్కువ. కాబట్టి చదివిన అంశాలనే కనీసం మూడుసార్లు పునశ్చరణ చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

విజయం సాధించడం ఎంత అవసరమో భావవ్యక్తీకరణ నైపుణ్యాలూ అంతే అవసరం. కాబట్టి సీఏ చదువుతున్న సమయంలోనే సెమినార్లు, వక్తృత్వ పోటీలు వంటి వాటిల్లో పాల్గొనగలిగితే ఈ నైపుణ్యాలను పెంచుకోవచ్చు.

కోచింగ్ సమయంలోనూ, పునశ్చరణలోనూ ఒక్కమాటలో చెప్పాలంటే సీఏ కోర్సు పూర్తయ్యేవరకూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండటం మంచిది.

ఆర్టికల్‌షిప్‌లో లభించే ప్రాక్టికల్ విజ్ఞానం సీఏ ఫైనల్ కోర్సుకూ, సీఏ పూర్తయ్యాక చేయబోయే ప్రాక్టీస్‌కూ, ఉద్యోగానికీ చాలా అవసరం. కాబట్టి ఆర్టికల్‌షిప్‌ను సరదాగా కాకుండా శ్రద్ధగా, సీరియస్‌గా చేయాలి.

చదవాల్సిన పుస్తకాలు

- విద్యాసంస్థ ఇచ్చే మెటీరియల్‌తోపాటు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వారి మెటీరియల్ చదవడం కూడా తప్పనిసరి.
- సీఏ ఇన్‌స్టిట్యూట్ వారి ప్రాక్టీస్ మాన్యువల్స్, రివిజన్ టెస్ట్ పేపర్స్, మాక్ టెస్ట్ పేపర్స్ విధిగా చదవాలి. సాధన చేయాలి.
- పాత ప్రశ్నపత్రాలు ముఖ్యంగా గత పదేళ్లవి, వాటికి సరిపోయే సూచన, సమాధానాలను (సజెస్టెడ్ ఆన్సర్స్) చదవాలి. వీటిని సరిగా చదివితే పరీక్షల్లో సులువుగా ఉత్తీర్ణత సాధించవచ్చు.

ప్రోగ్రామింగ్ లాంగ్వేజీల్లో సర్టిఫికేషన్ కోర్సులు

చదువుతున్నప్పుడే ప్రోగ్రామింగ్‌లో ప్రావీణ్యం ఉంటే, దానికి గుర్తింపుగా సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ను సాధించడం మేలు. ఇది క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో, డిగ్రీ తర్వాత ఉద్యోగాన్వేషణలో విద్యార్థికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



Ch.A.S. మూర్తి
జాయింట్ డైరెక్టర్
C-DAC

ముందుగా సి లాంగ్వేజీలో ఉన్న సర్టిఫికేషన్లను పరిశీలిస్తే..

1. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీ అసోసియేట్- డెవలపర్ ప్రోగ్రామ్: విద్యార్థి ప్రోగ్రాం నైపుణ్యాలు, కాన్సెప్టులను అభివృద్ధిచేయగల సామర్థ్యాలను పరీక్షిస్తూ వివిధ డెవలప్‌మెంట్ టూల్స్‌పై ఉన్న అవగాహనను పరిశీలిస్తుంది. వివరాలకు-

https://www.microsoft.com/en-in/learning/mta-developer-certification.aspx

2. సి++ సర్టిఫైడ్ అసోసియేట్ ప్రోగ్రామర్: ఇది కూడా సి++ నైపుణ్యాలను పరీక్షించి సర్టిఫికెట్‌ను ఇస్తుంది. దీనిలో కంప్యూటర్ ప్రోగ్రామింగ్ యూనివర్సల్ కాన్సెప్టుల మీద సి++, సింటక్స్, సెమాంటిక్స్, డేటా టైప్స్, ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ ఇన్ సి++, ఇంప్లిమెంటేషన్‌పై పరీక్షించే అవకాశం ఎక్కువ. వివరాలకు-

https://cppinstitute.org/cpa-c-certified-associate-programmer-certification

3. ఒరాకిల్, జావా కాన్సెప్టుల మీద సర్టిఫికేషన్: ముఖ్యంగా మూడు విభాగాల్లో- అసోసియేట్, ప్రొఫెషనల్, మాస్టర్ లెవెల్స్‌లో అందుబాటులో ఉంది. ఈ మూడు విభాగాల్లో జావా 6/ 7/ 8 ఎడిషన్లలో విద్యార్థి సామర్థ్యాన్ని బట్టి అసోసియేట్, ప్రొఫెషనల్ లేదా మాస్టర్ అవడానికి అవకాశాలుంటాయి. వివరాలకు-

https://education.oracle.com/pls/web_prod-plq-dad/db_pages.getpage?page_id=654&get_params=p_id:154

ఈ ప్రోగ్రామింగ్ లాంగ్వేజీలతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీలను నేర్చుకుంటే కెరియర్‌కు ఢోకా ఉండదు. వీటిని ఆన్‌లైన్‌లో ప్రపంచ ప్రసిద్ధ ప్రొఫెసర్ల నుంచి ఇంటిదగ్గరే నేర్చుకోవచ్చు. ఐఐటీ, ఎన్ఐటీ లాంటి ప్రఖ్యాత సంస్థల్లో చెప్పే లెక్చర్లను కూడా ఆన్‌లైన్‌లోనే నేర్చుకోవచ్చు. ఈ కోర్సులన్నీ ఉచితమే. వీటిని పూర్తిచేస్తే క్రెడిట్లను దక్కించుకునే అవకాశమూ ఉంది.

ప్రొఫెసర్ టోమీ జాక్కోల మెషీన్ లెర్నింగ్ ఎంఐటీ ఓపెన్ కోర్సు-

https://ocw.mit.edu/courses/electrical-engineering-and-computer-science/6-867-machine-learning-fall-2006/index.htm

ప్రొ. ఫిలిప్ రిగోలెట్ ఓపెన్ లెర్నింగ్ కోర్సు-



https://ocw.mit.edu/courses/mathematics/18-657-mathematics-of-machine-learning-fall-2015/index.htm

ప్రొ. పాట్రిక్ హెన్రీ విన్స్టన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఓపెన్ కోర్సు-

https://ocw.mit.edu/courses/electrical-engineering-and-computer-science/6-034-artificial-intelligence-fall-2010/index.htm

ప్రొ. సుదేషన ఉ సర్కార్, ఐఐటీ ఖరగ్‌పూర్ కోర్స్‌వేర్-

https://onlinecourses.nptel.ac. in/noc17_cs26/preview

ప్రొ. బలరాం రవీంద్రన్ ఐఐటీ మద్రాస్ కోర్స్‌వేర్-

https://onlinecourses.nptel.ac.in/noc17_cs17/preview.

ఈ ఆన్‌లైన్ కోర్సుల్లో వచ్చిన టాప్ 5% పూర్తి చేసినవారికి సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కలుగుతుంది.

స్పెషల్ ఎడ్యుకేషన్లో
ఉపాధ్యాయ శిక్షణ

హెలన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడప డీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ శిక్షణ కోర్సులను నిర్వహిస్తోంది. రెగ్యులర్ విధానంలో నిర్వహించే ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లు. వీటిలో 4 సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో ఓసీ, బీసీలు 50%, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లు 45% మార్కులను కలిగి ఉండాలి. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు బీఏ/ బీఎస్సీ/ బీకాంల్లో ఓసీ, బీసీలు 50%, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లు 45% మార్కులను కలిగి ఉండాలి. బీటెక్ చదివినవారికి కూడా అర్హత ఉంటుంది. వీరు 55% మార్కులను కలిగి ఉండాలి.

ఈ కోర్సులను చేసినవారికి బధిర బాలబాలికల ప్రత్యేక పాఠశాలలు, సాధారణ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరడానికి, డీఎస్సీ రాయడానికి, సర్వశిక్షా అభియాన్ వారు నిర్వహించే భవిత కేంద్రాలు, మండలాల్లో నిర్వహించే ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబుల్డ్ చిల్డ్రన్ కార్యక్రమాల్లో రిసోర్స్ టీచర్ల పోస్టులకు అర్హులు.

దరఖాస్తు: ఈ కోర్సుల్లో చేరాలనుకునేవారు హెలన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడప నుంచి రూ.300 చెల్లించి దరఖాస్తు ఫారాన్ని పొందాలి. పోస్టు ద్వారా పొందాలనుకునేవారు హెలన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడప పేరుతో రూ.300 డీడీ తీసి, అభ్యర్థన పత్రం, రూ.10 విలువ గల స్టాంపులతోపాటు సొంత చిరునామా ఉన్న ఏ4 కవరును జతచేసి పోస్టు ద్వారా పంపించాల్సి ఉంటుంది.

చిరునామా: ప్రిన్సిపల్, హెలన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, రాజీవ్ గృహకల్ప రోడ్, రామాంజనేయపురం, చిన్నచౌక్, కడప-516002.

దరఖాస్తు చివరి తేదీ: 20.8.2017

ఇంటర్న్‌షిప్ అనుభవాల పోటీ

వార్షిక ఇంటర్న్‌షిప్ పోటీ- 2017ని ఇంటర్న్‌శాల నిర్వహిస్తోంది. దీనిలో ఆసక్తి ఉన్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ విద్యా నేపథ్యంతో సంబంధం లేకుండా తమ ఆసక్తికర ఇంటర్న్‌షిప్ అనుభవాన్ని పంచుకోవాల్సి ఉంటుంది. ఇందులో గెలుపొందినవారికి నగదు బహుమతి కూడా ఉంటుంది. 2016లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బాగా స్పందన రావడంతో ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు.

అర్థవంతమైన ఇంటర్న్‌షిప్‌లు విద్యార్థి కెరియర్‌ను మలచడంలో కీలకపాత్ర పోషిస్తాయనే ఉద్దేశంతో ఈ పోటీని నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

గెలిచిన మొదటి ముగ్గురికి బహుమతులతోపాటు ఎంపికైన మొదటి 100 ఎంట్రీలను ప్రచురిస్తారు, పార్టిసిపెంట్ సర్టిఫికెట్, ఇంటర్న్‌శాల టీషర్ట్ లభిస్తాయి. పాల్గొన్నవారందరికీ సర్టిఫికెట్‌తోపాటు ఇంటర్న్‌శాల శిక్షణలో 25% రాయితీ కూడా లభిస్తుంది.

అభ్యర్థులు పంపే ఎంట్రీల్లో ఇతరులకు ఉపయోగపడేలా/ ఉత్తేజపరిచేలా కథనం ఉందా లేదా? ఇంటర్న్‌షిప్‌కు పడిన కష్టం, ఇంటర్వ్యూ అనుభవం, ఇంటర్న్‌షిప్ అనుభవం, ఇతరులతో పోల్చినపుడు ఎంత విభిన్నంగా ఉంది, రాసిన తీరు, వ్యాకరణాంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

ఎంట్రీని పంపడానికి చివరి తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: http:// bit/ ly/YIS-2017

ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్‌లో..

1. గ్రాఫిక్ డిజైన్

సంస్థ: టెక్ మహీంద్రా
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.10,000
లింకు: internshala.com/ i/4929
గడువు: ఆగస్టు 15, 2017
అర్హులు: అడోబ్ ఫొటోషాప్, కోరెల్‌డ్రా, అడోబ్ ఇలస్ట్రేటర్, అడోబ్ ప్రీమియర్ ప్రో, అడోబ్ క్రియేటివ్ సూట్, అడోబ్ ఇన్ డిజైన్, అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్ నైపుణ్యాలు ఉన్నవారు.

2. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: IODevOps services
ప్రదేశం: విశాఖపట్నం, హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.10,000
లింకు: internshala.com/ i/4930
గడువు: ఆగస్టు 16, 2017
అర్హులు: జావా, పైథాన్, స్ప్రింగ్ ఎంవీసీ, సి++ ప్రోగ్రామింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీబీఎంఎస్) నైపుణ్యాలు ఉన్నవారు.

3. లా/ లీగల్

సంస్థ: సి-క్వెల్
ప్రదేశం: చెన్నై, దిల్లీ, గుడ్‌గావ్, వడోదర, హైదరాబాద్, ముంబయి, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.15,000 నుంచి రూ.20,000
లింకు: internshala.com/ i/4931
గడువు: ఆగస్టు 15, 2017
అర్హులు: ఎంఎస్ ఆఫీస్ నైపుణ్యాలు ఉన్నవారు.

4. కంటెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: బీటలెక్టిక్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.2000
లింకు: internshala.com/ i/4932
గడువు: ఆగస్టు 16, 2017
అర్హులు: ఎంఎస్ ఆఫీస్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

5. మొబైల్ ఆప్ డెవలప్‌మెంట్

సంస్థ: Steinmetz ILS
ప్రదేశం: విజయవాడ
స్టైపెండ్: నెలకు రూ.3000
లింకు: internshala.com/ i/4933
గడువు: ఆగస్టు 14, 2017
అర్హులు: ఎక్స్‌ఎంఎల్, ఆండ్రాయిడ్ నైపుణ్యాలు ఉన్నవారు.



6. ఆనిమేషన్

సంస్థ: కాన్‌స్ట్రక్ట్ హెచ్‌ఆర్ అడ్వైజర్స్
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.1000
లింకు: internshala.com/ i/4934
గడువు: ఆగస్టు 17, 2017
అర్హులు: సంబంధిత రంగంలో నైపుణ్యాలు, ఆసక్తి ఉన్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

7. ఆపరేషన్స్

సంస్థ: టీఈపీ సోలార్ ఇండియా
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5000 నుంచి రూ.6000
లింకు: internshala.com/ i/4935
గడువు: ఆగస్టు 15, 2017
అర్హులు: సంబంధిత రంగంలో ఆసక్తి, నైపుణ్యాలు ఉన్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

8. బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ఇలియాస్ పవర్
ప్రదేశం: కోయంబత్తూరు, విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడ
స్టైపెండ్: నెలకు రూ.10,000 నుంచి రూ.15,000
లింకు: internshala.com/ i/4936
గడువు: ఆగస్టు 16, 2017
అర్హులు: సోషల్ మీడియా మార్కెటింగ్, ఎంఎస్ ఆఫీస్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

9. వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: గ్రేట్‌ఫోర్ సిస్టమ్స్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.15,000
లింకు: internshala.com/ i/4937
గడువు: ఆగస్టు 16, 2017
అర్హులు: సి++, డాట్ నెట్ నైపుణ్యాలు ఉన్నవారు.

10. కంటెంట్ రైటింగ్

సంస్థ: ఎంకేఎస్ టెక్నాలజీస్
ప్రదేశం: గుంటూరు, హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.6000
లింకు: internshala.com/ i/4938
గడువు: ఆగస్టు 15, 2017
అర్హులు: వర్డ్‌ప్రెస్, వీడియో ఎడిటింగ్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

(మరిన్ని ఇంటర్న్‌షిప్‌ల కోసం ww.eenadupratibha.net)

రెండు తెలుగు రాష్ట్రాల్లో విలువైన పని అనుభవం పొందేలా తోడ్పడటంతోపాటు స్టైపెండ్‌ను కూడా అందిస్తున్నాయి వివిధ సంస్థల ఇంటర్న్‌షిప్‌లు. విద్యార్థులు తగిన విచారణ చేసుకుని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి!

- http://internshala.com



జవాబులను మెరిపించే గణాంకాలు

గ్రూప్-I మెయిన్స్ పరీక్షలో ఎస్సే, ఆర్థిక వ్యవస్థ విభాగాల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలంటే ఎలా? పేజీలు నింపటమే లక్ష్యంగా నిర్దిష్ట విషయం లేకుండా ఏది పడితే అది రాస్తే మార్కులు రావటం అసంభవం. మరి ఏకైక మార్గం ఏమిటంటే... విషయానికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలిసివుండాలి. అవసరమైనచోట సమాధానాల్లో కచ్చితమైన, తాజా గణాంకాలను ఉదాహరిస్తుండాలి!



అడిగిన ప్రశ్నలో ఆ సమస్య/ సంబంధిత ఆర్థికాంశానికి చెందిన గణాంకాలు ముందుగా సిద్ధం చేసుకోవాలి. అయితే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, రాజ్యాంగం వంటి అంశాల్లో గణాంక సంబంధిత అంశాల ఉపయోగం, ప్రాధాన్యం తక్కువ. జనరల్ స్టడీస్, జనరల్ ఎస్సే, ఆర్థిక వ్యవస్థ వంటి విభాగాల్లో గణాంక సమాచారం కీలక పాత్ర పోషిస్తుంది. వాటి ఆధారంగా రాసే సమాధానాలు గరిష్ఠ మార్కులు సాధించేలా దోహదం చేస్తాయి.



దాసరి రాజేందర్

సమాధానాలు రాసే సందర్భంలో వాటిని ఎక్కడ, ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలిసి ఉండాలి. గణాంకాలను ఏయే సందర్భాల్లో ఉదాహరించాలో పరిశీలిద్దాం.

✤ సమస్య ప్రస్తావన, దాని తీవ్రత

జనరల్ స్టడీస్, వ్యాసం, ఆర్థిక వ్యవస్థ విభాగాల్లో పట్టణ జనాభా అభివృద్ధిపై ప్రశ్నను ఈ విధంగా రాయవచ్చు. 'అభివృద్ధి జరుగుతున్న సమయంలో పట్టణ జనాభా పెరుగుదల తప్పనిసరిగా ఉంటుంది. ఇది ఆర్థికాభివృద్ధికి సూచికగా చెప్పవచ్చు. దేశంలో 1951లో 6.24% గా ఉంది. ఇది నాలుగు దశాబ్దాల తర్వాత ఆర్థిక సంస్కరణలు ప్రారంభించే కాలానికి 21.7% కు పెరిగింది. 2001 నాటికి 28.5%, 2011 నాటికి 37.7% పెరిగింది'.

✤ అంశాల ధోరణులు, హెచ్చుతగ్గులు

ఒక సమస్య/ అంశానికి సంబంధించి పెరుగుదల, తగ్గుదల ఉంటాయి. ప్రధానంగా ధోరణులు వివరించి, వాటి మార్పులు తెలపటానికి గణాంకాలను ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు 'భారతదేశ గ్రామీణ జనాభా, పేదరికం' వంటి ప్రశ్నలకు ఈ విధంగా జవాబు రాయవచ్చు. దేశంలో NSSO 27 వ రౌండ్ ప్రకారం 1973-74 లో గ్రామీణ పేదరికం 56.4% గా ఉంది. 1999-2000 నాటికి 27.1% కు తగ్గింది. కానీ 2004-05 నాటికి గ్రామీణ పేదరికం 28.3%, 2009-10 నాటికి 33.8 శాతానికి తగ్గింది. అది 2011-12 (68వ రౌండ్) ప్రకారం 25.7% కు తగ్గింది' అని వివరించవచ్చు.

✤ అర్థం, వివరణ

'ఆహార వృథా- సమస్య' అనే ప్రశ్నకు భారతదేశం ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముఖ్యమైనది. అంతరిక్ష రంగంలో ప్రపంచంలోనే చౌకైన వ్యయంతో ఉపగ్రహాలు పంపుతున్న దేశం. పారిశ్రామిక రంగంలో మొదటి పది దేశాల్లో ఒకటి. ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మొదటి 4 దేశాల్లో ఒకటి. ఇంతటి ప్రఖ్యాతి చెందినా ఆకలితో అలమటించే దేశాల్లో మన స్థానం 63. ప్రతిరోజూ ఆకలితో బాధపడేవారు 19.4 కోట్ల జనాభా. దేశంలో సరైన ఆహారం లేక చనిపోతున్న పిల్లల సంఖ్య ప్రతిరోజు 3000 మంది అని అంచనా. 5 సం॥ పిల్లల్లో పోషకాహార లోపంతో ఉన్నవారు 30.7% గా చెప్పవచ్చు. ఇన్ని సమస్యలున్న దేశంలో ఏటా వృథాగా పడవేస్తున్న ఆహారం సుమారు 6.7 కోట్ల టన్నులు. భూక్ సంస్థ అంచనా ప్రకారం దేశంలో ఆకలితో బాధపడుతున్న వారి సంఖ్య దాదాపు 20 కోట్ల మంది' ఈ విధంగా సమస్యను విశ్లేషించి సమాచారం రాస్తే ప్రభావశీలంగా ఉంటుంది. మార్కులూ ఎక్కువ వస్తాయి.

✤ సమస్య స్థితి తెలిపే తాజా గణాంకాలు

ప్రశ్నకు సంబంధించి జవాబులో కచ్చితంగా తాజా గణాంకాలు రాయాలి. ఉదా॥ ప్రస్తుతం 2017లో గ్రూప్ పరీక్షలు రాస్తూ 2001, 2010 సం॥లో గణాంకాలు రాయవచ్చు. కానీ కొన్ని అంశాలు ముఖ్యంగా జనాభా, పేదరికం వంటి అంశాల్లో 2011 అంశాలు తాజాగా పరిగణించాలి. గణంకాలు నిత్యం అప్‌డేట్ చేసుకోవటం వల్ల జవాబుకు తాజాదనం వస్తుంది. ఉదాహరణకు కాగ్ 2016-17 ఆర్థిక ప్రగతిపై గణాంకాలు 25 మే 17 న విడుదల చేసింది. దాని ఆధారంగా 'ఆదాయ అభివృద్ధిలో పన్నుల పాత్ర' వంటి ప్రశ్నలో ఈ విధంగా జవాబు రాయవచ్చు- ' ఆదాయ అభివృద్ధిలో పన్నులు అత్యంత కీలకమైనవి. దేశంలో ఆదాయ అభివృద్ధిలో తెలంగాణకు ప్రథమ స్థానం దక్కింది. ప్రధాన పన్నులైన అమ్మకం పన్ను, అబ్కారీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు వంటి ప్రధాన పన్నుల్లో 17.82 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2016-17 నాటికి రూ॥ 39,183 కోట్లు వసూలు చేసింది. అన్ని పన్నుల రూపంలో 17.81 శాతం వృద్ధిలో రూ॥ 42,564 కోట్లు వసూలు చేసింది. వృద్ధి రేటు 17.80 శాతంగా ఉండి దేశంలో మొదటిస్థానం చేరింది' అని తాజా గణాంకాలతో రాయవచ్చు.

✤ అనుకూల, ప్రతికూల వాదనలు

జనరల్ స్టడీస్, ఎస్సేల్లో వర్తమాన అంశాలకు సంబంధించి అనుకూల, ప్రతికూల వాదనలు తెలిపే సందర్భంలో గణాంకాల ఆధారంగా వాటిని సమర్థించటం ద్వారా మెరుగైన సమాధానం తయారవుతుంది. ఉదాహరణకు 'రైతు ఆత్మహత్యలు-నివారణ' వంటి ప్రశ్నల్లో రైతు ఆత్మహత్యలు ప్రధానంగా చిన్నకారు, సన్నకారు రైతులు, రైతు కూలీల్లో ఎక్కువ అని వివరించి, దీనికి ప్రధానంగా అప్పులు, వ్యవస్థాపరమైన, కుటుంబ సమస్యలు కారణాలు అని చెప్పవచ్చు. దీనికి అనుకూల వాదనకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో- 2015 ప్రకారం రైతు ఆత్మహత్యలకు అప్పులు 38.7%, వ్యవస్థాపర కారణాలు 19.5%, కుటుంబ సమస్యలు 11.7% అని గణాంకాలు జోడిస్తే సమర్థమైన, సమగ్రమైన జవాబు రాయవచ్చు.

❖ విషయ వర్ణనకు భాషతో పాటు...

'భారతదేశంలో మత అసమానతలు' వంటి ప్రశ్న వస్తే దీనిలో గణాంకాలతో పాటు విషయం వర్ణన అవసరం. 'భారతదేశం విభిన్న మతాలకు పుట్టినిల్లు. ప్రధానంగా అలౌకిక శక్తులను ప్రగాఢంగా నమ్మడమే మతం. ఈ భావనలో సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, అలవాట్లు, మానవ అతీత శక్తుల నమ్మకాల మేలు కలయికగా చెప్పవచ్చు. దేశంలో 79.80% శాతంగా హిందూమతం ఒక మతంగా కాక జీవన విధానంగా ఉంది' అని రాయవచ్చు. ఇదే ప్రశ్న జనరల్ స్టడీస్‌లో వస్తే జవాబుకు నేరుగా గణాంకాలు జోడించాలి.

❖ విషయ సమగ్రత, విశ్లేషణ

'నిరుద్యోగిత'కు సంబంధించిన ప్రశ్నకు సమగ్రంగా జవాబు రాయాలంటే దానికి అన్ని కోణాల నుంచి గణాంకాలు ఇవ్వాలి. నిరుద్యోగిత నిర్వచనం, రకాలు, కారణాలు, నివారణ చర్యలు, గ్రామీణ, పట్టణ, స్త్రీ, పురుషుల్లో నిరుద్యోగిత శాతం మొదలైనవి రాయటం ద్వారా సమగ్రతకూ, విశ్లేషణకూ అవకాశం ఉంటుంది.

❖ భూత, భవిష్యత్, వర్తమాన పరిస్థితులు

నిర్దిష్ట సమస్య సంపూర్ణ అవగాహన కోసం దానికి చెందిన భూత, భవిష్యత్, ప్రస్తుత స్థితిగతులు తెలిపే గణాంకాలు అవసరం. తద్వారా దాని పట్ల పూర్తి అవగాహన ఏర్పరుచుకోవచ్చు. ఉదాహరణకు పారిశ్రామిక రంగంలో ఉక్కు పరిశ్రమకు సంబంధించిన ప్రశ్నకు ఇలా రాయవచ్చు- 'భారతదేశ సత్వర పారిశ్రామికాభివృద్ధికి ఉక్కు పరిశ్రమ అత్యంత కీలకమైనది. అంతేకాక మేకిన్ ఇండియా విజయానికి ఉక్కు అత్యంత ముఖ్యమైనది. 1991-92లో దేశ ఉక్కు ఉత్పత్తి కేవలం 2.2 కోట్ల టన్నులు. 2015-16 నాటికి 9.1 కోట్ల టన్నులకు పెరిగింది. కేంద్రం ఇటీవల జాతీయ ఉక్కు విధానం-2017 ను ఆమోదించింది. దీని ప్రకారం 2030-31 నాటికి 30 కోట్ల టన్నులకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించింది'.



❖ అధికారిక/సాధికార గణాంక సమాచారం

జవాబు రాసే సందర్భంలో గణాంక సమాచారపు ఆధారం తప్పనిసరిగా తెలిపాలి. అది సాధికారకమై ఉండాలి. వివిధ ప్రభుత్వ నివేదికలు, కమిటీలు, బడ్జెట్లు, సర్వేలు, ఐరాస తదితర సంస్థల నివేదికలు అధికారికమని చెప్పవచ్చు. 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 ప్రకారం 2005-06లో శిశు మరణాల రేటు ప్రతి వేయికి 57 ఉండగా, 2015-16 నాటికి ఈ రేటు 41కి పడిపోయిందని 2017 ఫిబ్రవరి 28న విడుదలైన ఆ నివేదిక తెలిపింది' అని రాస్తే సమాధానం విశ్వసనీయంగా ఉంటుంది.

ఈ విధంగా తాజా గణాంకాలను లోపరహితంగా సందర్భానుసారం జోడించగలిగితే పరీక్షల్లో జవాబులు సమగ్రంగా రూపొందుతాయి. ఫలితంగా గరిష్ఠ మార్కులు సాధించి అవలీలగా విజయతీరం చేరుకోవచ్చు.

To be in a dog house అర్థం తెలుసా?

ఇంగ్లిష్‌లోకి వాడుకలోకి వస్తున్న వ్యక్తీకరణలను గమనిస్తూ, వాటి ప్రయోగాన్ని తెలుసుకోవడం విద్యార్థులకు చాలా అవసరం. ఈవారం అలాంటి కొన్ని Expressions ను ఉదాహరణలతో నేర్చుకుందాం!



ఎం. సురేశన్

Sitaram: I did not know what happened to me last evening. The minute I heard the news I was in a state of confusion (నిన్న నాకేం జరిగిందో నాకే తెలీదు. ఆ మాట విన్న క్షణం నేను గందరగోళ పడిపోయా).

Lakshman: What was the news and why did you get confused? (ఆ వార్త ఏంటి? నువ్వెందుకు గందరగోళ పడిపోయావు?)

Sitaram: We were to start for a function at 6 in the evening and my sister arrived fifteen minutes late. That sent me into a tizzy (సాయంత్రం ఆరు గంటలకు మేమొక వేడుకకు వెళ్లాల్సి వచ్చింది. మా చెల్లేమో పావుగంట ఆలస్యంగా వచ్చింది. అది నన్ను ఉద్రేకంతో గందరగోళ పరిచింది).

Lakshman: What is there to go into a tizzy? Where were you planning to go? How did her late arrival upset you? (అందులో గందరగోళంతో ఉద్రేకపడాల్సింది ఏముంది? ఆమె ఆలస్యంగా రావడంవల్ల నువ్వెందుకు గందరగోళ పడాలి?)

Sitaram: She was really in a dog house, and that upset me (ఆమెకెందుకో కోపం వచ్చింది, అది నాకు కోపం తెప్పించింది).

Lakshman: You are beating about the bush. Where exactly did you plan to go? How did her delay upset you? (అసలు విషయానికి రాకుండా ఏదో చెప్తున్నావు. మీరసలు ఎక్కడికి వెళ్లాలనుకున్నారు? ఆమె ఆలస్యం నిన్నెందుకు చిరాకు పెట్టించింది?)

Sitaram: There was a shotgun wedding, and we were the important guests. The bride's father insisted on our presence (నిన్న బలవంతపు పెళ్లి జరిగింది, దానికి మేము ముఖ్యమైన అతిథుల్లో ఒకరం. పెళ్లి కూతురు తండ్రి మేము రావాలని గట్టిగా పట్టు పట్టాడు).

Lakshman: Why had it to be a shotgun wedding? (అది ఎందుకు బలవంతపు పెళ్లి?)

Sitaram: The bride got pregnant and the father felt that his prestige would be at stake, so he forced the groom to marry her (ఆ పెళ్లికూతురు గర్భం దాల్చింది, అందువల్ల ఆమె తండ్రి పరువు పోతుందని పెళ్లికొడుకుతో బలవంతంగా తాళి కట్టించాడు).

Lakshman: Any way you attended the wedding, didn't you? All is well that ends well (ఏదేమైనా పెళ్లికి వెళ్లావు కదా? అంతం మంచిదైతే అన్నీ మంచివైనట్టే కదా?)

Now look at the following sentences from the dialogue above:

1. Send somebody into a tizzy = be in a state of excitement and confusion (ఉద్రేకం, గందరగోళం కల్పించడం)

a) Avinash: He is all right but I am afraid he might harm us a lot. He bears a grudge against us (వాడు మంచివాడే, కానీ, మనకు కీడు తలపెట్టవచ్చు. మనమీద వాడికేదో కోపం ఉంది).

Vinayak: You are sending me into a tizzy. You say in one breath he is all right and then again you say he seeks revenge against us. What am I to understand? (నన్ను గందరగోళ పెడుతున్నావు నువ్వు. ఒకేసారి అతను మంచివాడంటావు, మళ్లీ అదే నోటితో మనమీద పగ తీర్చుకోవచ్చంటావు. నేనెలా అర్థం చేసుకోవాలి నిన్ను?)

b) Narayana: She lost her pen yesterday, and it was not a very expensive one. That upset her (ఆమె తన పెన్ను పోగొట్టుకుంది. అది కూడా పెద్ద ఖరీదైంది కాదు. దానికేదో పెద్ద గందరగోళ పడిపోయింది).

Vedadri: That is always the trouble with her. Even minor things send her into a tizzy (అదే ఆమెతో వచ్చిన చిక్కు. చిన్న చిన్న విషయాలు కూడా ఆమెను కలవరపెడతాయి).


2. Beat around the bush = Talk about unnecessary things without coming to the point (అసలు సంగతి చెప్పకుండా అనవసర విషయాలతో కాలయాపన చేయడం)

a) Venkatesh: I am bunking that teacher's class. I dislike his teaching (నేను ఈ టీచర్ క్లాసు ఎగ్గొడుతున్నాను. ఆయన బోధన నాకు నచ్చలేదు).

Pradyumna: I know why you say that. He beats around the bush without coming to the important points of the lesson (ఆ మాట నువ్వెందుకు అంటున్నావో నాకు తెలుసు. పాఠంలో ముఖ్యమైన విషయాలను చెప్పకుండా ఇతర విషయాలన్నీ చెబుతుంటాడు).

b) Narasimha: You know what happened yesterday? I went to college at 9 and there were all our friends. They were chit-chatting (నిన్నేం జరిగిందో తెలుసా? నేను తొమ్మిదింటికి కళాశాలకు వెళ్లాను. మన స్నేహితులందరూ అక్కడున్నారు. అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు).

Doraswamy: Will you stop beating around the bush and come to the point? What exactly happened? (అనవసర విషయాలు చెప్పకుండా అసలు సంగతి చెప్పు. ఏం జరిగింది?)



వాడుక-వేడుక
Modern English Usage

3. To be in a dog house = To be annoyed / angry with someone because they have done something wrong (చిరాకు పడు/ ఎదుటివారు తప్పు చేసినందుకు వారిపై కోపంతో ఉండటం).

a) Amruth: Why was the teacher angry with you yesterday? (టీచర్ నిన్న నీమీద ఎందుకు కోపంగా ఉన్నారు?)

Mallesh: I can't figure it out even now. I asked the next to me for a scale and the teacher was in a dog house (దానికి గల కారణమేంటో నాకిప్పటికీ అర్థం కాలేదు. నా పక్కన ఉన్నతన్ని స్కేలు అడిగాను, దానికే టీచర్ నాపై చిరాకు పడ్డారు).

b) Alankar: There is no reason for you to be upset over a minor thing like that (అంత చిన్న విషయానికి నువ్వు కలవరపడాల్సిన అవసరం లేదు).

Bhanu: You don't know what he does on the sly. He stole my money and that put me in the dog house (వాడెంత జిత్తులమారో నీకు తెలియదు. వాడు నా డబ్బు దొంగిలించాడు, అది నాకు కోపం కలిగించే విషయం).

విజయ సాధన సూత్రాలు



జీవితంలో మంచి విజయాలు సాధించాలంటే విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సక్రమంగా చదవాలి. విద్యాపరంగా చక్కటి పునాదులు వేసుకోవాలి. అసలు పిల్లలు చదువుల్లో ఎందుకు వెనకబడతారు, వాళ్లు సమర్థంగా చదివి మంచి మార్కులు ఎలా సాధించుకోవాలి, కొంతమందికి లెక్కలంటే ఎందుకు భయం ఉంటుంది, పిల్లలు విజయం సాధించాలంటే తల్లిదండ్రులు ఏం చేయాలి, పోటీ పరీక్షల్లో సక్సెస్ ఎలా పొందాలి ఇలాంటి పలు ముఖ్యమైన అంశాలపై విడివిడిగా 'ఎమెస్కో' పుస్తకాలను విడుదల చేసింది. విద్యలోనూ, ఉద్యోగ సాధనలోనూ, జీవితంలోనూ విజయం సాధించడానికి అనుసరించాల్సిన పలు సూత్రాలను శాస్త్రీయంగా వివరించే ప్రయత్నం ఈ పుస్తకాల ద్వారా జరిగింది.

1) పిల్లలు చదువుల్లో విజయం సాధించడం ఎలా?
పేజీలు: 86, రూ. 50

2) పిల్లలు చదువుల్లో ఎందుకు వెనకబడతారు?
పేజీలు: 103, రూ. 50


3) పిల్లలు లెక్కల్లో ఎందుకు వెనకబడతారు?
పేజీలు: 78, రూ. 50

4) పిల్లల విజయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం
పేజీలు: 103, రూ. 50

5) పోటీ పరీక్షలలో విజయం సాధించడం ఎలా?
పేజీలు: 128, రూ. 60

6) మీరు సక్సెస్ సాధించగలరు!
పేజీలు: 102, రూ. 50

పరీక్షల అధ్యయన సమాచారం



తెలుగు రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఆధ్వర్యంలో వివిధ రకాల పరీక్షలు జరుగుతున్నాయి. ఇటీవల ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బీల్లో ఉద్యోగాలకు భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఈ అభ్యర్థులందరి కోసం 'విజేత కాంపిటీషన్స్' కొన్ని పుస్తకాలను ప్రచురించింది. ఇందులో తెలంగాణలో త్వరలో ప్రకటన వెలువడుతుందని భావిస్తున్న వీఆర్వో ఉద్యోగ పరీక్ష కోసం ప్రాక్టీస్ బిట్లు; ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న పలు పరీక్షల్లో ఒక ముఖ్యభాగమైన పర్యావరణం-సుస్థిరాభివృద్ధికి మెటీరియల్, తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే - 2017 సమాచారం ఉన్నాయి. వీటితోపాటు ఏపీపీఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ మెయిన్స్‌కి టాప్ 34 మోడల్ పేపర్లు, టీఎస్‌పీఎస్సీ అభ్యర్థుల కోసం టాప్ 32 ప్రీవియస్ పేపర్లు, ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బీ పరీక్షార్థుల కోసం టాప్ 32 మోడల్ పేపర్లు కూడా అందించారు. అభ్యర్థులు తమ అధ్యయనానికి వీటిని ఉపయోగించుకోవచ్చు.

1) వీఆర్వో ప్రాక్టీస్ బిట్స్,
పేజీలు: 352, రూ. 189

2) పర్యావరణం మరియు సుస్థిరాభివృద్ధి (ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీలకు వేర్వేరుగా), పేజీలు: 256, రూ. 139

3) తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే–2017
పేజీలు: 208, రూ. 119

4) ఏపీపీఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ మెయిన్స్ టాప్ 34 మోడల్ పేపర్స్,
పేజీలు: 272, రూ. 199

5) టీఎస్‌పీఎస్సీ జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ టాప్ 32 ప్రీవియస్ పేపర్స్, పేజీలు: 240, రూ. 139

6) ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బీ– టాప్ 32 మోడల్ పేపర్స్
పేజీలు: 288, రూ. 179

చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
హయత్‌నగర్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ –501 512
edc@eenadu.net

సెమీఫైనల్లో భాజపాదే పైచేయి!

- రాబోయే శాసనసభల ఎన్నికల్లో కమలనాథులకే అవకాశాలు
- వర్గాల పోరుతో తేరుకోలేకపోతున్న కాంగ్రెస్
- కర్ణాటకలో మాత్రం ఉత్కంఠభరిత సమరం

ఈనాడు - దిల్లీ

వచ్చే సార్వత్రిక ఎన్నికలకంటే ముందు వివిధ రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికల్ని అన్ని రాజకీయ పార్టీలూ సెమీ ఫైనల్ పోటీగానే తీసుకుంటున్నాయి. ఇప్పటి వరకు ఉన్న పరిస్థితుల్ని చూస్తే ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పై భాజపా పైచేయి సాధించే అవకాశాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు చావుదెబ్బ తగిలినా 2015 చివర్లో జరిగిన బిహార్ శాసనసభ ఎన్నికల్లో మాత్రం కాస్త ఊరట లభించింది. లౌకిక మహాకూటమి పేరుతో మిత్రపక్షాల ద్వారా అక్కడ అధికారం దక్కించుకున్నా 20 నెలల్లోపే ఆ కూటమి కుప్పకూలిపోయింది. ఎన్డీఏ గూటికి జేడీ(యు) చేరిపోయింది.

రాబోయే కాలంలోనూ సవాళ్లే

గత మూడేళ్లుగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే రెండేళ్లూ సవాళ్లు తప్పేలా లేవు. దేశంలో ప్రస్తుతం 18 రాష్ట్రాల్లో భాజపా గానీ, ఎన్డీఏ మిత్రపక్షాలు గానీ అధికారంలో ఉన్నాయి. కాంగ్రెస్ కేవలం 5 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోనే అధికారంలో ఉంది. రాబోయే 18 నెలల్లో ఎన్నికలకు వెళ్లబోతున్న గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో భాజపా నుంచి కాంగ్రెస్‌కి గట్టి సవాల్ ఎదురవుతోంది. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లలో శాసనసభ ఎన్నికలు ఈ ఏడాది చివర్లోనే జరగనున్నాయి. కర్ణాటకలో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో, మిగిలిన మూడు రాష్ట్రాల్లో 2018 చివర్లో ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్‌లో 29, కర్ణాటకలో 28, గుజరాత్‌లో 26, రాజస్థాన్‌లో 25, ఛత్తీస్‌గఢ్‌లో 11, హిమాచల్‌ప్రదేశ్‌లో 4 చొప్పున ఈ ఆరు రాష్ట్రాల్లో కలిపి 123 లోక్‌సభ స్థానాలున్నాయి. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో విజయం సాధించే విషయంలో భాజపా పూర్తి విశ్వాసంతో ఉంది. కేంద్రంలో మోదీ సర్కారు అమలు చేస్తున్న ప్రజానుకూల పథకాలు, కాంగ్రెస్ పార్టీలో స్థానికంగా ఉన్న విభేదాలు ఈ అంచనాకు ప్రధాన కారణం. హిమాచల్‌ప్రదేశ్‌లో వీరభద్రసింగ్ సర్కారుకు వ్యతిరేకంగా వీస్తున్న పవనాలపైనా భాజపా ఆశలు



పెట్టుకుంది. రాజస్థాన్‌లో వసుంధర రాజె సర్కారుపైనా కొంత వ్యతిరేకత ఉన్న విషయాన్ని పార్టీ వర్గాలు గుర్తించాయి. కర్ణాటకలో మాత్రం అధికార కాంగ్రెస్, విపక్ష భాజపా మధ్య ఫలితం నువ్వా-నేనా అన్నట్లుగా ఉంది.

గుజరాత్‌లో కాంగ్రెస్ చీలికలు పీలికలు

గుజరాత్‌లో కాంగ్రెస్‌కు రెండు దశాబ్దాలుగా అధికారం దూరమయింది. విపక్ష నేత శంకర్‌సింగ్ వాఘేలా కాంగ్రెస్ పార్టీని వీడడం; ఆయన వర్గీయులకు, అహ్మద్ పటేల్ విధేయులకు మధ్య వర్గపోరు ముదరడంతో కాంగ్రెస్ అవకాశాలకు మరింత గండి పడుతోంది. రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన కాంగ్రెస్ శాసనసభ్యులు ఇప్పుడు అహ్మద్ పటేల్‌ను రాజ్యసభకు పంపే విషయంలోనూ కలవరపాటు కలిగిస్తున్నారు. పటేల్ రిజర్వేషన్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్‌ను బుజ్జగించాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలూ పెద్దగా ఫలితాన్ని ఇవ్వడం లేదు.

హిమాచల్‌లో హస్తం ఆధిక్యానికి గండి

హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన సిమ్లా నగరపాలక సంస్థ ఎన్నికల్లో కమలం వికసించింది. 15 ఏళ్లుగా హస్తగతమైన కార్పొరేషన్‌ను భాజపా తన ఖాతాలో వేసుకొంది. ముఖ్యమంత్రి వీరభద్రసింగ్‌కు, పీసీసీ అధ్యక్షుడు సుఖ్వీందర్ సుఖుకు మధ్య ఉన్న విభేదాలను రాష్ట్ర పార్టీ బాధ్యుడు సుశీల్‌కుమార్ శిందే పరిష్కరించలేకపోతున్నారు. అది కాకుండా ముఖ్యమంత్రిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఉచ్చు బిగిస్తుండడంతో కాంగ్రెస్ గుక్క తిప్పుకోలేకపోతోంది.

కర్ణాటకలో ఆసక్తికర పోరు

కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏకైక పెద్ద రాష్ట్రమైన కర్ణాటకలో అధికారాన్ని దక్కించుకునేందుకు భాజపా పావులు కదుపుతోంది. మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం.కృష్ణ ప్రస్తుతం భాజపాలో ఉన్నారు. వొక్కళిగ సామాజిక వర్గాన్ని ఆయన ప్రభావితం చేస్తారని పార్టీ అంచనా. ఎక్కువ కాలం పాటు లింగాయత్‌లు, లేకా వొక్కళిగలు రాష్ట్రాన్ని పాలిస్తున్న నేపథ్యంలో ఇతర వర్గాలవారిని ఆకట్టుకోవడంపై ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య దృష్టి సారించారు. కాంగ్రెస్‌నే జేడీ(ఎస్) ఎక్కువగా దెబ్బతీయనున్న దృష్ట్యా విజయావకాశాలు భాజపా వైపే ఉండవచ్చని పరిశీలకుల అంచనా.

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు జోగి బ్రేకులు

ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగి తన మాజీ పార్టీ అయిన కాంగ్రెస్‌కి వీలైనంత చావుదెబ్బ తినిపించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. జనతా కాంగ్రెస్ పేరుతో ఆయన సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. దళితుల్ని పార్టీ గూటికి తెచ్చేందుకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు పి.ఎల్.పునియా ప్రయత్నిస్తున్నా జోగి దానికి గండి కొడుతున్నారు. కాంగ్రెస్ సామాజిక అంచనాల కంటే కూడా ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు ఉన్న మంచిపేరే సత్ఫలితాన్ని ఇస్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మధ్యప్రదేశ్‌లో సిగపట్లు

కాంగ్రెస్ సీనియర్ నేతలు జ్యోతిరాదిత్య సింధియా, కమల్‌నాథ్, దిగ్విజయ్‌సింగ్‌ల సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను సిగపట్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అధిష్ఠానం విశ్వాసాన్ని దిగ్విజయ్ కోల్పోయారు. సింధియా, కమల్‌నాథ్‌లు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యారు. 52% ఉన్న ఓబీసీ ఓటర్లపై భాజపా సీఎం శివరాజ్‌సింగ్ చవాన్‌కు ఉన్న పట్టుకు గండి కొట్టలేక కాంగ్రెస్ తంటాలు పడుతోంది. కాంగ్రెస్‌లోని వేర్వేరు వర్గాల మధ్య సమన్వయం సాధించడం పెద్ద సవాల్‌గా మారింది. ఇటీవల రాష్ట్రంలో రైతులు ఆందోళన చేసినప్పుడు కూడా ఆ అవకాశాన్ని కాంగ్రెస్ అందిపుచ్చుకోలేకపోయింది. వ్యాపం కుంభకోణంలో చవాన్ ప్రతిష్ఠను దెబ్బతీయాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నమూ బెడిసికొట్టింది.

రాజస్థాన్‌పై కాంగ్రెస్ ఆశలు

ఆరు రాష్ట్రాల్లో రాజస్థాన్‌పై కాంగ్రెస్ ఎక్కువ ఆశలు పెట్టుకొంది. అక్కడ కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, పీసీసీ అధ్యక్షుడు సచిన్ పైలట్ భుజం భుజం కలిపారు. భాజపా సీఎం వసుంధర రాజె ఒంటెద్దు పోకడపై ఉన్న అసంతృప్తిని కాంగ్రెస్‌కి అనుకూలంగా మార్చుకునేందుకు పార్టీ వర్గాలు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాయి. భాజపాలో అసంతృప్త వర్గాలనూ కాంగ్రెస్ బుజ్జగించి, అక్కున చేర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది.

మొత్తం రాష్ట్రాలు: 31 (29 + శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలు 2)

ఎన్డీఏ/భాజపా-18, కాంగ్రెస్-6, ఇతరులు-7

రాష్ట్ర శాసనసభలు లేకుండా కేంద్రం సాయంతో పాలన సాగించే కేంద్ర పాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలు...

అండమాన్-నికోబార్‌దీవులు-1, చండీగఢ్-1, దాద్రానగర్-1, దమణ్‌దీవ్-1, లక్షద్వీప్-1

భాజపా, కాంగ్రెస్, ఇతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు.. వాటిలో లోక్‌సభ స్థానాలు..

రాష్ట్రం	స్థానాలు	పార్టీ
1) హరియాణా	10	భాజపా
2) ఉత్తరాఖండ్	5	భాజపా
3) ఉత్తర్‌ప్రదేశ్	80	భాజపా
4) రాజస్థాన్	25	భాజపా
5) మధ్యప్రదేశ్	29	భాజపా
6) ఛత్తీస్‌గఢ్	11	భాజపా
7) గుజరాత్	26	భాజపా
8) ఝార్ఖండ్	14	భాజపా
9) అరుణాచల్‌ప్రదేశ్	2	భాజపా
10) అసోం	14	భాజపా
11) మహారాష్ట్ర	48	భాజపా+శివసేన
12) గోవా	2	భాజపా+ఎంజీపీ
13) జమ్ముకశ్మీర్	6	ఎన్డీఏ (భాజపా+పీడీపీ)
14) ఆంధ్రప్రదేశ్	25	ఎన్డీఏ (టీడీపీ+ భాజపా)
15) బిహార్	40	ఎన్డీఏ (జేడీయూ+భాజపా)
16) సిక్కిం	1	ఎన్డీఏ (ఎస్‌డీఎఫ్+భాజపా)
17) మణిపూర్	2	ఎన్డీఏ
18) నాగాలాండ్	1	ఎన్డీఏ (ఎన్‌పీఎఫ్+ భాజపా)
19) హిమాచల్‌ప్రదేశ్	4	(కాంగ్రెస్)
20) పంజాబ్	13	(కాంగ్రెస్)
21) కర్ణాటక	28	(కాంగ్రెస్)
22) పుదుచ్చేరి	1	(కాంగ్రెస్)
23) మిజోరం	1	(కాంగ్రెస్)
24) మేఘాలయా	2	(కాంగ్రెస్)
25) కేరళ	20	(వామపక్ష కూటమి)
26) తమిళనాడు	39	(ఏఐఏడీఎంకే)
27) తెలంగాణ	17	(తెరాస)
28) ఒడిశా	21	(బీజేడీ)
29) బెంగాల్	42	(తృణమూల్ కాంగ్రెస్)
30) దిల్లీ	7	(ఆప్)
31) త్రిపుర	2	(వామపక్ష కూటమి)

ఇక మంత్రివర్గ విస్తరణపై ప్రధాని దృష్టి!

దిల్లీ: రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గ విస్తరణపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టి సారించారు. దక్షిణాది, తూర్పు రాష్ట్రాల్లో ఉన్న 189 లోక్‌సభ స్థానాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి విస్తరణ, పునర్వ్యవస్థీకరణలను చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలపై స్పష్టమైన దార్శనికతతో ఈసారి విస్తరణ ఉంటుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. రక్షణ మంత్రిగా ఉన్న మనోహర్ పారికర్‌ను గోవా ముఖ్యమంత్రిగా పంపించాల్సి రావడం, పట్టణాభివృద్ధి-గృహనిర్మాణం- పేదరిక నిర్మూలన శాఖల మంత్రి ఎం.వెంకయ్యనాయుడును ఉప రాష్ట్రపతిని చేయడం, పర్యావరణ శాఖ మంత్రిగా ఉంటూ అనిల్ మాధవ్ దవే కన్ను మూయడం వల్ల మంత్రివర్గంలో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని భర్తీ చేయడంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయాల్సి ఉందని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా భావిస్తున్నారు. అందువల్ల ఈసారి విస్తరణలో ఆ రాష్ట్రాలకు కొంతమేర పెద్దపీట లభించే అవకాశాలున్నాయి.

ఏపీ, తెలంగాణలకూ ప్రాధాన్యం!


'పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 2014లో పెద్ద ఎత్తున పాగా వేసి, ప్రయోజనం సాధించాం. పార్టీకి ప్రజామోదం ఉన్నా, తగినన్ని స్థానాలను దక్కించుకోలేకపోతున్న రాష్ట్రాలపై ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం...' అని పార్టీ నేత ఒకరు చెప్పారు. ఈ కోణంలో ఈసారి తెలంగాణ (17 లోక్‌సభ సీట్లు), ఒడిశా (21 సీట్లు), పశ్చిమ బెంగాల్ (42), తమిళనాడు (39), ఆంధ్రప్రదేశ్ (25), కేరళ (20), ఏడు ఈశాన్య రాష్ట్రాలకు (25) మంత్రివర్గ విస్తరణలో ప్రాధాన్యం లభించవచ్చని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమే విజయం సాధిస్తుందనే గట్టి విశ్వాసంతోనే 2022 నాటికి మార్గసూచీని సయితం ప్రధాని రూపొందించిన విషయం తెలిసిందే. 2017 నుంచి రాబోయే అయిదేళ్లూ దేశానికి కీలకమని శనివారం ఎన్డీఏ ఎంపీల సమావేశంలోనూ ప్రధాని పేర్కొన్నారు. భాజపా నుంచి ఎన్నికైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి 2022 వరకు అధికారంలో ఉంటారు.

భాజపా, సంఘ్ శిబిరాల్లో ఉత్సాహం

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్... ప్రప్రథమంగా ఈ నాలుగు ఉన్నత పదవుల్లోనూ ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారే కొలువుదీరడంపై భాజపా, సంఘ్ శిబిరాలు అత్యంత ఉత్సాహంతో ఉన్నాయి. అవసరమైతే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలంటూ రాజ్యసభ సభ్యులుగా ఉన్న కొంతమంది కేంద్ర మంత్రులు, మరి కొందరు రాజ్యసభ సభ్యులకు పార్టీ సంకేతాలు ఇచ్చింది. కేంద్ర మంత్రులు- ధర్మేంద్ర ప్రధాన్, ప్రకాశ్ జావడేకర్, నిర్మలా సీతారామన్ వంటివారిని లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించే అవకాశాలున్నాయి. 2014లో విజయం సాధించిన స్థానాల్లో కొన్నిచోట్ల కొత్త ముఖాలకు అవకాశం కల్పించాలని పార్టీ ప్రయత్నిస్తోంది. పశ్చిమ బెంగాల్, గుజరాత్, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్‌లలో కొందరు సినీతారల్నీ బరిలో దించే అవకాశాలున్నాయి. సంస్థాగతంగానూ భారీ మార్పులు చేపట్టబోతున్నట్లు సమాచారం. నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడిగా అరవింద్ పనగడియా స్థానంలో ఆర్థికవేత్త రాజీవ్‌కుమార్‌ను నియమించిన విషయం తెలిసిందే. అమెరికాలో పాఠాలు చెప్పేందుకు వెళ్లిపోతున్నట్లు పనగడియా చెబుతున్నా, ఆయన పనితీరుపై ప్రభుత్వం పెద్ద సంతృప్తితో లేదన్నది వాస్తవం.

సంగీతంతో నేరాల అదుపు!

- ఫలితాల పట్ల స్కాట్‌లాండ్‌యార్డ్ పోలీసుల సంతృప్తి



లండన్: నేరాలు, ఘోరాలను అరికట్టేందుకు.... సమర్థంగా నివారించేందుకు శాస్త్రీయ సంగీతాన్నే తాజా అస్త్రంగా స్కాట్‌లాండ్ యార్డ్ పోలీసులు ఎంచుకున్నారు. నేరాలు అధికంగా చోటు చేసుకునే జనావాసాల్లో స్పీకర్ల ద్వారా మనసును సాంత్వన పరచే శాస్త్రీయ సంగీతం ఆయా ప్రాంతాల్లో వినిపించేలా చూస్తున్నారు. ముఖ్యంగా మొజార్ట్ సంగీతాన్ని వినిపిస్తున్నారు. సామాజిక వ్యతిరేక పోకడలు విశృంఖలంగా స్వైరవిహారం చేస్తున్న లండన్‌లోని 40 ప్రాంతాల్లో ప్రయోగాత్మక ప్రాతిపదికన ప్రవేశపెట్టిన సంగీత శ్రవణ కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. తరచూ ఏదో ఒక కారణంతో అదేపనిగా తిట్టుకోవడం.... తన్నుకోవడం.. దౌర్జన్యానికి పాల్పడటం వంటి సంఘటనలు తగ్గుముఖం పట్టాయని అడం వెబర్ అనే కానిస్టేబుల్ చెప్పారు. సంగీతానికి ఉన్న మహత్తు అలాంటిదని పేర్కొన్నారు.

ప్రపంచబ్యాంకులో ఈడీగా ఐఏఎస్ అధికారిణి అపర్ణ

దిల్లీ: గుజరాత్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఎస్.అపర్ణ ప్రపంచబ్యాంకులో కార్యనిర్వాహక సంచాలకులు(ఈడీ)గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపానికి ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈడీ హోదాలో ఆమె భారత్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకలకు ప్రపంచబ్యాంకులో ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రపంచబ్యాంకు ఈడీగా ఆమె మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు.

భారతీయ వ్యాపారవేత్తకు యూఏఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం

దుబాయి: నిస్సహాయస్థితిలో జైళ్లలో మగ్గుతున్న ఖైదీలను విడిపించడంలో ప్రత్యేక చొరవ చూపిన భారతీయ వ్యాపారవేత్త ఫిరోజ్ మర్చెంట్(59)ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించింది. ఇటీవల యూఏఈ ఉపప్రధాని హెచ్‌హెచ్ షేఖ్ చేతులమీదుగా 'కమ్యూనిటీ సర్వీస్ మెడల్'ను ఫిరోజ్ స్వీకరించారు. ఫిరోజ్ 'ప్యూర్ గోల్డ్ జువెల్లర్స్' అనే సంస్థకు వ్యవస్థాపక ఛైర్మన్. యూఏఈలో రుణాలు కట్టలేని నిస్సహాయ స్థితిలో జైలు శిక్ష అనుభవిస్తున్న వారిని విముక్తుల్ని చేయడం కోసం కృషిచేస్తున్నారు. ఇలా 2008 నుంచి సుమారు 4 మిలియన్ డాలర్లు వెచ్చించి 10940 మందికి కారాగారం నుంచి విముక్తి కల్పించారు. ఈ పురస్కారాన్ని భారతీయులకు అంకితమిస్తున్నట్లు ఫిరోజ్ ప్రకటించారు. ఓ విదేశీయుడిని ఈ పురస్కారం వరించడం ఇదే తొలిసారి.

పుత్రుడి నిర్వాకంతో హరియాణా భాజపా నేతకు ఇరకాటం

చండీగఢ్: అర్ధరాత్రి పూట ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె ఒంటరిగా కారు నడుపుతుంటే వేరే వాహనంతో వెంటపడి, ఆమెను తీవ్ర భయాందోళనకు గురిచేసిన హరియాణా భాజపా అధ్యక్షుడి తనయుడి ఉదంతం ఆ నేతకు ఇరకాట పరిస్థితిని తీసుకువచ్చింది. ఇటీవల జరిగిన ఈ ఘటనపై ఆ ఐఏఎస్ అధికారి ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ- మహిళలపై జరుగుతున్న ఇలాంటి నేరాలపై పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దోషుల్ని చట్టం ముందు నిలబెట్టకపోతే ఇలాంటి ఘటనలు మరిన్ని జరగవచ్చని పేర్కొన్నారు. కారును ఢీకొట్టినంత పనిచేస్తూ.. పదేపదే దారికి అడ్డం పడుతూ నిందితులు ప్రవర్తించిన తీరుతో భయభ్రాంతురాలైన తన కుమార్తె... దాని నుంచి బయటపడడానికి చాలా సమయం పడుతుందని చెప్పారు. పోలీసులు సకాలంలో స్పందించిన తీరును అభినందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ఉదంతంలో ప్రధాన నిందితుడితో పాటు అతని స్నేహితుడినీ అరెస్టు చేసి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. చట్టం తనపని తాను చేసుకుని వెళ్తుందని హరియాణా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ చెప్పారు. జరిగిన ఘటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఘటనను కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్విటర్లో ఖండించారు. నిందితుల్ని శిక్షించాలన్నారు.



అందమంతా తోకలోనే ఉన్నది..

పొడవైన తోక ఉన్న ఈ అరుదైన పక్షి శేషాచలం అడవుల్లో కనిపించింది. గాలిలో ఎగిరేటప్పుడు తెల్లని కాగితం పైకి దూసుకెళ్లినట్లుండే ఈ పక్షి తోక 30 సెంటీమీటర్లు పైనే ఉంటుంది. దీనిపేరు ఏసియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్ అని.. వీటిలో తెలుపు రంగులో ఉన్నవి మగ పక్షులని, ఎరుపు రంగులో ఉన్నవి ఆడ పక్షులని.. తోక పొడవు కారణంగానే ఇది ఆకాశంలో దూసుకెళ్లగలుతుందని తిరుపతిలోని శేషాచలం జీవ వైవిధ్య పరిశోధనశాలకు చెందిన పక్షి శాస్త్రవేత్త కె.కార్తిక్‌సాయి తెలిపారు. **-ఈనాడు, తిరుపతి**

ఏఐజేఎస్ ఏర్పాటుకు హైకోర్టుల విముఖత

- దిగువ కోర్టులపై తమ ఆధిపత్యం కొనసాగాలని భావిస్తున్న న్యాయస్థానాలు

దిల్లీ: కింది స్థాయి న్యాయస్థానాల్లో న్యాయాధికారుల భర్తీకి అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను చాలా హైకోర్టులు వ్యతిరేకిస్తున్నాయి. దేశంలోని మొత్తం 24 హైకోర్టుల్లో మెజారిటీ కోర్టులు కింది న్యాయస్థానాలపై తమ ఆధిపత్యం కొనసాగాలని భావిస్తున్నాయి. ఇంతవరకు కేవలం రెండు హైకోర్టులే ఈ ప్రతిపాదనను సమర్థించాయి. తొమ్మిది హైకోర్టులు పూర్తిగా వ్యతిరేకిస్తుండగా, ఎనిమిది హైకోర్టులు మార్పులు చేయాలని సూచించాయి. మిగిలిన హైకోర్టుల నుంచి ఇంకా ఎలాంటి స్పందనా రాలేదు. న్యాయ మంత్రిత్వ శాఖ రూపొందించిన విధాన పత్రంలో పై విషయాలు వెల్లడయ్యాయి. ఈ పత్రాన్ని న్యాయ శాఖపై ఏర్పాటయిన పార్లమెంటరీ సలహా సంప్రదింపుల సంఘానికి పంపించారు.

దిగువ న్యాయస్థానాల్లో న్యాయాధికారుల భర్తీకి అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఏఐజేఎస్) ఏర్పాటు చేయాలని కార్యదర్శుల కమిటీ సిఫార్సు చేసింది. దీన్ని సిక్కిం, త్రిపుర హైకోర్టులు సమర్థించాయి. ఆంధ్రప్రదేశ్, బాంబే, దిల్లీ, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పట్నా, పంజాబ్-హరియాణ హైకోర్టులు వ్యతిరేకించాయి. అలహాబాద్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మణిపూర్, మేఘాలయ, ఒరిస్సా, ఉత్తరాఖండ్ హైకోర్టులు మార్పులు చేయాలని సూచించాయి. కనీస వయసు, విద్యార్హతలు, శిక్షణ, రిజర్వేషన్లు తదితర అంశాల్లో సవరణలను ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు ఝార్ఖండ్, రాజస్థాన్ హైకోర్టులు తెలిపాయి. కలకత్తా, జమ్ము-కశ్మీర్, గువాహతి హైకోర్టుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

దేశవ్యాప్తంగా కేటాయించిన మొత్తం జడ్జీల పోస్టుల సంఖ్య 20,502 కాగా, 2015 డిసెంబరు నాటికి 4,452 జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భిన్నాభిప్రాయాలు వచ్చిన నేపథ్యంలో కింది కోర్టుల్లో జడ్జీల భర్తీకి నీట్ తరహా పరీక్ష నిర్వహించాలని ఇటీవల సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. యూపీఎస్సీ ఆధ్వర్యంలో కేంద్రీకృత పరీక్ష నిర్వహించినా బాగుంటుందని తెలిపింది. హైకోర్టులతో సంప్రదింపులు జరిపిన అనంతరం పరీక్షల నిర్వహణపై విధివిధానాలు రూపొందించవచ్చని పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్లు, హైకోర్టులు కలిపి జడ్జీల ఎంపికకు పరీక్షలు నిర్వహిస్తున్నాయి.

కాసులు కురిపించనున్న ఖరీఫ్

- గత ఏడాదికి మించి దిగుబడులు వచ్చే అవకాశం: కేంద్ర వ్యవసాయ కార్యదర్శి

దిల్లీ: ప్రస్తుత (2017-18) ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో పంట దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. వరుసగా రెండో ఏడాది కూడా రుతుపవనాలు బాగుండడం, సాగు విస్తీర్ణం పెరగడంతో గత ఏడాదికి మించి అధిక దిగుబడులు రానున్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి శోభన కె పట్టనాయక్ చెప్పారు. గత ఏడాదితో పోల్చితే సాగులో దాదాపు 3 శాతం వృద్ధి కనిపిస్తోందని తెలిపారు. ఆదివారం ఇక్కడ ఓ వార్తా సంస్థతో ఆమె మాట్లాడారు. ఇంతవరకు 80 శాతం సాగు పూర్తయిందని, కొన్ని ప్రాంతాల్లో వచ్చే నెలవరకు నాట్లు వేయడం కొనసాగుతుందని చెప్పారు. దేశంలో వరదల కారణంగా 19 లక్షల హెక్టార్లు దెబ్బతిన్నాయని, నీటి ముంపు తగ్గిన తరువాత పాడైన పంటల స్థానంలో ఇతర పంటలు వేస్తారని తెలిపారు. దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో కరవు నెలకొందని, ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడ కూడా పరిస్థితి మెరుగుకావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. నూనె గింజల సాగు ప్రస్తుతానికి తక్కువగా కనిపిస్తున్నా, విత్తేందుకు ఇంకా సమయం ఉండడంతో లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. పప్పుదినుసుల్లో కంది తప్ప మిగిలినవి బాగున్నాయని అన్నారు. పత్తి, చెరకు సాగు విస్తీర్ణం బాగా పెరిగిందని, దిగుబడులు కూడా అధికంగా ఉండే అవకాశం ఉందని వివరించారు. పత్తి ధరలు బాగుండడం, చెరకు రైతులకు మిల్లులు సకాలంలో సొమ్ము చెల్లిస్తుండడంతో ఆ రెండు పంటలపై రైతులు మళ్లీ మొగ్గు చూపారని అన్నారు. గుజరాత్‌లో వరదల కారణంగా పత్తి పంట నష్టపోయిందని, అక్కడ ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు వేస్తారని తెలిపారు.

ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం ఇలా..(లక్షల హెక్టార్లలో)

పంట	2017–18	2016–17
వరి	280.03	266.93
పప్పుదినుసులు	121.28	116.95
నూనె గింజలు	148.88	165.49
పత్తి	114.34	96.48
చెరకు	49.71	45.64
మొత్తం	878.23	855.85

2016-17 ఖరీఫ్‌లో దిగుబడులు (లక్షల టన్నుల్లో)

పంట	దిగుబడి
ఆహార ధాన్యాలు	1,380
వరి	960
తృణధాన్యాలు	320
పప్పులు	91
నూనెగింజలు	228
పత్తి (లక్షల బేళ్లు)	305

జీఎస్టీతో ఆరోగ్య సేవలు ప్రియమే

దిల్లీ: మూత్రపిండ రోగులకు చేసే డయాలిసిస్, హృద్రోగులకు అమర్చే పేస్‌మేకర్, దివ్యాంగులకు ఊతమిచ్చే కృత్రిమ పరికరాలు... వీటన్నిటి ధరలూ 'వస్తు-సేవల పన్ను' (జీఎస్టీ) కారణంగా పెరగనున్నాయి. వీటితో పాటు కేన్సర్ చికిత్స ధరలూ ప్రియం కానున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. జీఎస్టీ, ఆరోగ్య రంగంపై అది చూపే ప్రభావాల గురించి తలెత్తే సందేహాలకు సమాధానాలను మంత్రిత్వ శాఖ తమ వెబ్‌సైట్లో పొందుపరిచింది. డయాలిసిస్ (5 నుంచి 12%), పేస్‌మేకర్ (5.5 నుంచి 12-18%), దివ్యాంగుల కృత్రిమ ఉపకరణాలు (5 నుంచి 12%), రక్త కేన్సర్ మినహా ఇతర కేన్సర్లకు వాడే సహాయ పరికరాలు (5 నుంచి 7-12%) వంటివాటిపై జీఎస్టీతో పన్ను భారం పెరిగిందని దానిలో పేర్కొంది. హెపటైటిస్ మినహా ఇతర రోగాలను నిర్ధరించే పరికరాలు, రేడియాలజీ యంత్రాలు 28% పన్ను పరిధిలోకి రానున్నాయి. అందువల్ల రోగ నిర్ధరణ పరీక్షలు ఖరీదయ్యే అవకాశాలున్నాయి. జీఎస్టీ ప్రభావం, దానికి సంబంధించిన అంశాలపై సమాచారాన్ని చేరవేయడానికి ఆరోగ్యశాఖ ఒక సమన్వయ అధికారిని నియమించింది.

అమర్‌నాథ్ యాత్రికులపై దాడి లష్కరే పనే

అనంతనాగ్: అమర్‌నాథ్ యాత్రికులపై గత నెల పదో తేదీన జరిగిన దాడి లష్కరే తోయిబా పనేనని కశ్మీర్ రేంజి పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ మునీర్ ఖాన్ చెప్పారు. కుట్ర పన్నిన ముగ్గురు వ్యక్తులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసిందని ఆదివారం తెలిపారు. ఈ దాడికి పాల్పడ్డ నలుగురు ఉగ్రవాదులకు వారు సహకారం అందించారని తెలిపారు. దాడి చేసిన నలుగురులో ముగ్గురు..ఇస్మాయిల్, మవీయ, ఫర్ఖాన్‌లు పాకిస్థాన్ జాతీయులు కాగా, యవార్ బషీర్ స్థానికుడు. భద్రతా దళాల నుంచి ఆయుధాన్ని లాక్కొని పారిపోయిన బషీర్ గత ఫిబ్రవరిలో ఉగ్రవాదుల్లో చేరాడు.

ఇద్దరు ఐపీఎస్‌లకు ముందస్తు పదవీవిరమణ

దిల్లీ: విధి నిర్వహణలో అసమర్థత ఆరోపణల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు ఎ.ఎం.పూరి, కేసీ. అగర్వాల్‌లను కేంద్రం ముందస్తుగానే పదవీవిరమణ చేయించింది. పని విషయంలో అంతగా శ్రద్ధ పెట్టని.. సమర్థత చూపని ఐపీఎస్ అధికారులతో ముందుగానే పదవీవిరమణ చేయించడం ఇది రెండోసారి. గత రెండేళ్లలో పనితీరు విషయంలో ఉపేక్ష చూపిన 130 మంది అధికారుల చేత ముందస్తు పదవీవిరమణ చేయించారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇటీవల రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలియచేశారు.

అఫ్గాన్‌లో 30 మందిని చంపిన తాలిబన్లు

కాబూల్: అఫ్గానిస్థాన్‌లోని సారి పుల్ ప్రావిన్సులో 30 మందిని తాలిబన్ ఉగ్రవాదులు బలి తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో ఎక్కువ మంది సాధారణ పౌరులని పేర్కొన్నాయి. శనివారం సాయద్ జిల్లాలోని మీర్జావలాంగ్ ప్రాంతాన్ని నియంత్రణలోకి తెచ్చుకున్న అనంతరం తాలిబన్లు జరిపిన కాల్పుల్లో ఈ మరణాలు సంభవించినట్లు ప్రావిన్సు గవర్నర్ తెలిపారు. కాబూల్‌లో 16 టన్నులకు పైగా పేలుడు పదార్థాలున్న ఓ ట్రక్కును శనివారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఉత్తర కొరియాపై ఆంక్షలకు ఆమోదం

ఐరాస: ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలను విధిస్తూ అమెరికా రూపొందించిన ఒక తీర్మానానికి ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనివల్ల ఉత్తర కొరియాకు ఏటా 100 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్ని ఇచ్చే ఎగుమతులపై నిషేధం అమలవుతుంది.

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక.. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా చేపట్టిన మొదటి చర్య ఇదే. దీనికి. . ఉత్తర కొరియా మిత్రపక్షం చైనా కూడా మద్దతు తెలపడం విశేషం. గత నెల 4న ఉత్తర కొరియా తన తొలి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. తాజా తీర్మానంపై అప్పటి నుంచి అమెరికా.. చైనాతో చర్చలు జరుపుతోంది. గత నెల 28న ఉత్తర కొరియా మళ్లీ క్షిపణి పరీక్షకు దిగింది.

ఇప్పటికే తీవ్రంగా నిధుల కొరతను ఎదుర్కొంటున్న ఉత్తర కొరియాకు తాజా ఆంక్షల శరాఘాతం కానున్నాయి. వీటివల్ల ఆ దేశం.. బొగ్గు, ఇనుము, ఇనుప ఖనిజం, సీసం, ముడి సీసం, చేపలు, ఇతర సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు చేయడానికి వీల్లేదు. ఫలితంగా ఆ దేశ ఎగుమతి ఆదాయంలో మూడో వంతు మేర కోత పడుతుంది. ఉత్తర కొరియా ఎగుమతులు ఏటా 300 కోట్ల డాలర్ల మేర ఉన్నాయి. ఆ దేశానికి ప్రధాన ఆర్థిక భాగస్వాములుగా ఉన్న చైనా, రష్యాలు ఈ ఆంక్షలను పూర్తిగా అమలు చేస్తే.. ఉత్తర కొరియా చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకుంటుంది. విదేశాలకు పంపే కార్మికుల సంఖ్యను పెంచుకోకుండా కూడా తాజా తీర్మానం ఆ దేశాన్ని నిరోధిస్తుంది. వీరి ద్వారా వచ్చే ఆదాయం కూడా అక్కడి ప్రభుత్వానికి మరో ప్రధాన వనరుగా ఉంది. ఉత్తర కొరియాకు చెందిన 9 మంది అధికారులను, ఆ దేశ ప్రధాన విదేశీ మారకద్రవ్య బ్యాంకు సహా నాలుగు సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చింది. ఉత్తర కొరియా చమురు దిగుమతులపై మాత్రం ఆంక్షలు పెట్టలేదు. అది చేసి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎదురు దెబ్బ తగిలి ఉండేది. 2006లో తొలిసారి అణు పరీక్షను నిర్వహించాక ఉత్తర కొరియాపై ఐరాస ఆంక్షలు విధించడం ఇది ఏడోసారి. ఉత్తర కొరియా వాణిజ్యంలో 90 శాతం వాటా చైనాదే. తాజా ఆంక్షల ప్రభావం కూడా చైనా సహకారంపైనే ఆధారపడి ఉంది.



అమెరికాలోని ఓక్లహోమా రాష్ట్రంలో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. తుల్సా పట్టణంలో గాలుల ధాటికి పలు ఇంటి పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00